www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★

సంపుటి 28, సంచిక: 167 | ఆదివారం | 07-12-2025 | హైదరాబాద్

Published from: Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar

పేజీలు: 12 | వెల రూ. 5.00

రాజ్యాంగం ప్రమాదంలో...

మరో 400 ఇండిగో విమానాలు రద్దు

విమాన ప్రయాణానికి మంగళం

05



## సుప్రీంకోర్టు ‘సామాన్యుల కోసమే’

- భారత ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్
- ‘హిందుస్థాన్ టైమ్స్ లీడర్‌షిప్’ సమావేశంలో కీలక ప్రసంగం
- డిజిటల్ అరెస్ట్, సైబర్ నేరాల విషయంలో న్యాయవ్యవస్థ సరికొత్త సవాళ్లను ఎదుర్కొంటోందని వెల్లడి

**న్యూఢిల్లీ :** ‘సుప్రీంకోర్టు సామాన్యుల కోసమే’ అనే బలమైన సందేశాన్ని భారత ప్రధాన న్యాయమూర్తి (సిజెఐ) సూర్యకాంత్ అందించారు. ఆయన మాట్లాడుతూ ‘పెండింగ్ కేసుల ముందస్తు నిర్ణయం ఆధారంగా ఊహించదగిన కాలక్రమం, ఏకీకృత జాతీయ న్యాయవిధానం తన ప్రాధాన్యత’ అని అన్నారు.శనివారం ఇక్కడ ‘హిందుస్థాన్ టైమ్స్ లీడర్‌షిప్’ శిఖరాగ్ర సమావేశంలో సూర్యకాంత్ మాట్లాడుతూ న్యాయాన్ని పొందడం గురించి ప్రధాన న్యాయమూర్తి ప్రస్తావించారు. వ్యాజ్యాల ఖర్చును తగ్గించడం, విషయాలు నిర్ణయించబడే సహేతుకమైన కాలక్రమాన్ని ఎలా సూచించాలో నిర్ధారించడం తన ప్రాధాన్యతగా సిజెఐ సూర్యకాంత్ వెల్లడించారు. న్యాయవ్యవస్థ స్వతంత్రత గురించి తరువాయి 12లో

# ఎస్‌ఎల్‌బిసి పూర్తిచేస్తాం

బిఆర్‌ఎస్ హయాంలో డబుల్ బెడ్రూమ్‌ల పేరుతో పదేళ్లు కాలం గడిపారు. ఏ ఒక్క ఊళ్లో కూడా ఇండ్లు ఇవ్వలేదు. కెసిఆర్, కెటిఆర్, హరీశ్‌రావులు మాత్రం గడీలు నిర్మించుకున్నారు. పేదల పట్ల బిఆర్‌ఎస్‌కు చిత్త శుద్ధి లేదు. లంబాడీలకు రిజర్వేషన్లు కల్పించింది ఇందిరమ్మ అంటూ గిరిజనుల మధ్య పంచాయితీ పెట్టాలని చూస్తున్నారు. ప్రజా పాలనలో అలాంటి ఆటలు సాగవు. రైతులకు రెండు లక్షల రుణమాపీ చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదే. బిఆర్‌ఎస్ కాలంలో రుణమాఫీ కేవలం వడ్డీలకే సరిపోయింది.

– సిఎం రేవంత్‌రెడ్డి

## దేవరకొండ, మునుగోడు ప్రాంతాలను సస్యశ్యామలం చేస్తాం



- ఎస్‌ఎల్‌బిసిని పదేళ్లపాటు పడావు పెట్టారు
- గతంలో మంత్రులు, ఎమ్మెల్యేలను కెసిఆర్ కలవలేదు
- ప్రజాపాలనలో అభివృద్ధి, సంక్షేమం జోడెడ్ల వలే సాగుతోంది
- దేవరకొండలో ప్రజాపాలన విజయోత్సవ సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

ప్రజాపక్షం/దేవరకొండ

రాష్ట్రంలో గడీల పాలనను అంతం చేసి ప్రజాపాలన తీసుకువచ్చిన ప్రజలకు కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ప్రజా ప్రభుత్వంలో అభివృద్ధి సంక్షేమం జోడెద్దుల వలె పాలన సాగుతుందని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి అన్నారు. ‘గతంలో మంత్రులు, ఎమ్మెల్యేలను కూడా కెసిఆర్ కలవలేదు. ప్రగతి భవన్, ఫామ్‌హౌస్‌లోకి మంత్రులు సహా ఎవరినీ రానివ్వలేదు. ఇప్పుడు ఫామ్‌హౌస్‌లో సర్పంచ్‌లు, వార్డు మెంబర్లను కూడా కెసిఆర్ కలుస్తున్నారు. కెటిఆర్ ఒక్కడు చాలు కెసిఆర్‌ను నాశనం చేయడానికి. కాంగ్రెస్ ప్రభుత్వం మంజూరు చేసిన ఎస్‌ఎల్‌బిసి ప్రాజెక్టును పదేళ్లపాటు పట్టించుకోలేదు. నల్లగొండ జిల్లా ప్రజల మీద పగబట్టి ఎస్‌ఎల్‌బిసి ప్రాజెక్టును పడావు పెట్టారు. ఎస్‌ఎల్‌బిసి పనులు మేం ప్రారంభించగానే సొరంగంలో దురదృష్టవశాత్తు ప్రమాదం జరిగింది. ప్రమాదం జరిగితే బిఆర్‌ఎస్ నేతలు సంబరపడ్డారు. ఏదేమైనా టన్నెల్‌ను పూర్తి చేసి నీరు అందిస్తాం. ఈ ప్రభుత్వ హయాంలోనే ఎస్‌ఎల్‌బిసి ప్రాజెక్టును పూర్తి చేస్తాం’ స్పష్టంచేశారు. శనివారం ముఖ్యమంత్రి నల్లగొండ జిల్లా దేవరకొండ నియోజకవర్గంలో పర్యటించారు. నియోజకవర్గంలో రూ.23 కోట్ల విలువైన పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం ప్రజాపాలన ప్రజా విజయోత్సవ సభలో తరువాయి 2లో



# ధరలపై పరిమితి

## ఇండిగో సంక్షోభంతో రంగంలోకి కేంద్రం

500కి.మీ వరకు రూ.7,500లు

1500కి.మీ.దాటితే రూ.18,000గా ఖరారు

**న్యూఢిల్లీ :** దేశీయ విమానయాన సంస్థ ఇండిగో సేవల్లో అంతరాయం వల్ల ప్రయాణికులు గమ్యస్థానాలు చేరుకోలేక ఇబ్బంది పడుతున్నారు. ఈ పరిస్థితిని కొన్ని విమానయాన సంస్థలు ఆసరాగా తీసుకోవడంతో టికెట్ ధరలు ఆకాశన్నంటుతున్నాయి. ధరల పెంపు విషయం తన దృష్టికి రావడంతో శనివారం కేంద్రం రంగంలోకి దిగింది. ప్రయాణికులను అధిక ఛార్జీల భారం నుంచి రక్షించేందుకు చర్యలు చేపట్టింది. ధరల నియంత్రణను తీసుకువచ్చామని, వాటిని పాటించాలని ఆదేశించినట్లు పౌర విమానయాన మంత్రిత్వ శాఖ వెల్లడించింది. ఎకానమీ క్లాస్‌లో కి.మీ. వారీగా గరిష్ఠ ఛార్జీలను పరిశీలిస్తే... 500కి.మీ వరకు రూ.7,500. 500–1000కి.మీలకు రూ.12,000, 1000–1500కి.మీ రూ.15,000, 1500కి.మీ. దాటితే రూ.18,000గా విధించారు. ‘అంతరాయాల సమయంలో అసాధారణంగా ఛార్జీలను పెంచడాన్ని తీవ్రంగా పరిగణిస్తున్నాం. ఈ తరహా అవకాశవాద ప్రవర్తన నుంచి ప్రయాణికులను రక్షించేందుకు చర్యలు చేపడుతున్నాం. ప్రభావిత మార్గాల్లో న్యాయబద్ధమైన ఛార్జీలను నిర్ధరించేందుకు మంత్రిత్వశాఖ తన నియంత్రణ అధికారాలను ఉపయోగించుకుంది. కార్యకలాపాలు సాధారణ స్థితికి చేరుకునేవరకు కొత్తగా సూచించిన పరిమితులను కచ్చితంగా పాటించాలి. వందల సంఖ్యలో విమాన సర్వీసులు రద్దయిన నేపథ్యంలో సీనియర్ సిటిజన్లు, విద్యార్థులు, వైద్యసాయం అందాల్సిన ప్రయాణికులు సీట్లు దొరక్క ఇబ్బంది పడుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ధరలపై నియంత్రణ ఉండేలా, దోపిడీని నిరోధించాల్సిన అవసరం ఉంది’ అని మంత్రిత్వశాఖ వెల్లడించింది. ఆర్‌సిఎస్‌యుడిఎఎన్ విమానాలు, బిజినెస్ క్లాస్‌కు ఈ ఛార్జీలు వర్తించవని కేంద్రం వెల్లడించింది. ధరల స్థిరీకరణ జరిగేవరకు లేక తదుపరి సమీక్ష జరిగేవరకు ఈ పరిమితులు అమల్లో ఉంటాయని వెల్లడించింది. ఈ నిబంధనలను ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని పేర్కొంది. కేంద్ర విమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్ నాయుడు అధికారులతో తరువాయి 12లో



# గ్లోబల్ సమ్మిట్‌తో ఆర్థిక ప్రయోజనాలు

- ఈనెల 8, 9 తేదీలలో ‘తెలంగాణ గ్లోబల్ రైజింగ్ - 2025 ఎకానమిక్’ సమ్మిట్
- హాజరుకానున్న 6 ఖండాలు 44 దేశాలు 154 మంది ప్రతినిధులు
- సమ్మిట్‌ను ప్రారంభించనున్న రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ
- మీడియా సమావేశంలో సమ్మిట్ వివరాలు వెల్లడించిన డిప్యూటీ సిఎం భట్టి

ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణ రాష్ట్రాన్ని 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ‘తెలంగాణ గ్లోబల్ రైజింగ్ 2025 ఎకానమిక్’ సమ్మిట్‌ను ఈ నెల 8, 9 తేదీల్లో భారత్ ఫ్యూచర్ సిటీలో నిర్వహిస్తోందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. ఇది పూర్తిగా రాష్ట్ర భవిష్యత్తు, ఆర్థిక ప్రయోజనాలకు ఉద్దేశించిన సమ్మిట్ అని ఆయన చెప్పారు. హైదరాబాద్ మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో శనివారం మంత్రులు డి.శ్రీధర్ బాబు, మహ్మద్ అజారుద్దీన్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావులతో కలిసి భారత్ ఫ్యూచర్ సిటీలో నిర్వహించనున్న తెలంగాణ గ్లోబల్ రైజింగ్ 2025 ఎకనమిక్ సమ్మిట్‌కు సంబంధించిన వివరాలు వెల్లడించారు. 2047 నాటికి తెలంగాణ 3 ట్రిలియన్ల ఆర్థిక వ్యవస్థను సాధించడమే లక్ష్యంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. నీతి అయోగ్, ఐఎస్‌బి హైదరాబాద్ సలహాలు సూచనలతో విజన్ డాక్యుమెంట్ రూపొందించామని తెలిపారు. ఈనెల 8న మధ్యాహ్నం 1:30 గం.లకు తెలంగాణ గ్లోబల్ రైజింగ్ 2025 సమ్మిట్‌ను రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ ప్రారంభిస్తారన్నారు. ముఖ్యమంత్రి రేవంత రెడ్డి నాయకత్వంలోని మొత్తం కేబినెట్ అంతా కలిసి ఆలోచనలు చేసి విజన్ డాక్యుమెంట్ రూపొందించినట్లు తరువాయి 2లో

# పార్ బాయిల్డ్ రైస్ అదనపు కోటా ఇవ్వండి



ప్రజాపక్షం/హైదరాబాద్

- మరో 12 లక్షల మెట్రిక్ టన్నులు కేటాయించండి
- ఎఫ్‌సిఐ చైర్మన్‌కు మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి విజ్ఞప్తి

ఈ ఏడాది రబీ (2024–25)కు సంబంధించి పార్ బాయిల్డ్ రైస్ కోట అదనపు కేటాయింపులు ఇవ్వాలని పౌర సరఫరాల శాఖమంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్‌రెడ్డి ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ఆష్ తోష్ అగ్నిహోత్రికి విజ్ఞప్తి చేశారు. శనివారం సచివాలయంలోని తన కార్యాలయంలో మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి ఎఫ్‌సిఐ చైర్మన్‌తో మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పలు అంశాలపై ఇరువురు చర్చించారు. ప్రధానంగా పార్ బాయిల్డ్ రైస్ (కెఎంఎస్ 2024–25 రబీ) అదనపు కేటాయింపు కోసం విజ్ఞప్తి చేశారు. కెఎంఎస్ 2024–25 (ఖరీఫ్ , రబీ) కోసం కేంద్ర ప్రభుత్వం 30 లక్షల మెట్రిక్ టన్నుల బాయిల్డ్ రైస్ లక్ష్యాన్ని కేటాయించిందని అయితే 2024–25 రబీ నుండి ఇప్పటి వరకు 17.06 లక్షల మెట్రిక్ టన్నుల పార్ బాయిల్డ్ 0.8 లక్షల మెట్రిక్ టన్నులముడి బియ్యం సరఫరా చేయడం జరిగిందని వివరించారు. ఇంకా 2.34 లక్షల మెట్రిక్ టన్నుల పార్ బాయిల్డ్ ,14.26 లక్షల మెట్రిక్ టన్నుల ముడి బియ్యం సరఫరా చేయాల్సి ఉందని తెలిపారు. ఫిబ్రవరి 2026 నాటికి ప్రభుత్వం 18 లక్షల టన్నులు తీసుకోవాల్సి ఉన్నందున, 24–25 గాను 10 నుండి 12 లక్షల టన్నుల బాయిల్డ్ రైస్ అదనపు కోటా ఇవ్వాలని మంత్రి కోరారు. పార్ బాయిల్డ్ రైస్ తరలింపు కోసం అదనపు రేక్‌ల అవసరం ఉంటాయని ప్రస్తుత సంవత్సరం రేక్ తరలింపు గత సంవత్సరం (జనవరి నవంబర్) తో పోలిస్తే 13.5 లక్షల మెట్రిక్ టన్నుల కొరత ఉందని మంత్రి ఫుడ్ ఎఫ్‌సిఐ సిఎండికి వివరించారు. ఎఫ్‌సిఐ గోడౌన్లలో పార్‌బాయిల్డ్ బియ్యం నిల్వలు పేరుకుపోయాయని, దీంతో సిఎంఆర్ డెలివరీలు ఆలస్యం అవుతుందని మంత్రి పేర్కొన్నారు. తెలంగాణలోని ఎఫ్‌సిఐ డిపోల నుండి పార్ బాయిల్డ్ బియ్యం తరలింపును వేగవంతం చేయడానికి అదనపు రేక్‌లను వెంటనే కేటాయించాలని మంత్రి విజ్ఞప్తి చేశారు. అలాగే ఖరీఫ్ 2024–25కు సంబంధించి సిఎంఆర్ బియ్యం డెలివరీ సమయం గత నెల11తో ముగియడంతో సరఫరా వ్యవధి తరువాయి 2లో

## ఘనంగా గుమ్మడి నర్సయ్య బయోపిక్ సినిమా ప్రారంభం

03





# అంబేద్కర్‌కు సిపిఐ ఘన నివాళి

ప్రజాపక్షం/హైదరాబాద్

డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా ఆయనకు పలువురు సిపిఐ నాయకులు ఘనంగా నివాళి అర్పించారు. సిపిఐ రాష్ట్ర కార్యాలయం మఖ్దూం భవన్ శనివారం సిపిఐ జాతీయ కార్యదర్శి కె. రామకృష్ణ, సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి, రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈటి నరసింహ, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు ఛాయాదేవి, తెలంగాణ దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్ కుమార్,సిపిఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి స్టాలిన్, ఎస్ టి యు రాష్ట్ర అధ్యక్షుడు సదానంద గౌడ్ , ఎఐవైఎఫ్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు ఎన్. శ్రీకాంత్, ఎఐటియుసి నాయకులు బొడ్డుపల్లి కిషన్, వెంకటయ్య, ఆఫీస్ కార్యదర్శి గోవింద్, బోయ శ్రీరాములు, మన్నె రాజేందర్,శివకుమార్, సత్తిబాబులు అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు.

# నిర్మల్‌లో మెడికల్ మాఫియా

## డ్రగ్ ఇన్‌స్పెక్టర్ నిర్లక్ష్యంపై తీవ్ర ఆరోపణలు

ప్రజాపక్షం/నిర్మల్



నిర్మల్ జిల్లా కేంద్రంలో ప్రజారోగ్య వ్యవస్థ ప్రమాదంలో పడింది.ఒకవైపు మెడికల్ షాపుల యజమానుల ఇష్టారాజ్యం, మరోవైపు డ్రగ్స్ కంట్రోల్ అధికారుల పర్యవేక్షణ లోపం కలగలిసి జిల్లాను అక్రమాల అడ్డాగా మార్చేశాయి. జిల్లా డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ నిరంకుశత్వం, నిర్లక్ష్యం కారణంగానే స్థానిక మెడికల్ మాఫియా శక్తిగా ఎదిగి, బడా డాన్ దావూద్ శీనుగా మారిపోయిందని పలువురు డ్రగ్స్ అధికారిపై తీవ్ర స్థాయిలో ఆరోపణలు గుప్పిస్తున్నారు. డ్రగ్స్ అధికారిని చూసి మెడికల్ షాపుల యజమానులు ఏమాత్రం భయం లేకుండా చట్టాలను తుంగలో తొక్కుతున్నారు.జిల్లా కేంద్రంలోని మెడికల్ షాపులపై డ్రగ్ ఇన్స్పెక్టర్ ఏనాడు కూడా తనిఖీలు చేసిన సందర్భాలు లేకపోవడం ఈ మాఫియాకు అక్రమ కార్యకలాపాలు సాగించడానికి లైసెన్స్ ఇచ్చినట్టే ఉందని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.మెడికల్ యూనియన్ల నుంచి భారీగా ముడుపులు అందుకుని,కనీసం ఆ వైపు కన్నెత్తి కూడా చూడడం లేదనే విమర్శలు తీవ్రమవుతున్నాయి. జిల్లా కేంద్రంలోని డ్రగ్స్ కంట్రోల్ కార్యాలయం ఎప్పుడూ తాళం వేసే ఉంటుందని, ఇన్‌స్పెక్టర్ ఏనాడు అందుబాటులో ఉండరని ఫిర్యాదుదారులు వాపోతున్నారు. ఫిర్యాదు చేసేందుకు వెళ్ళిన ప్రతిసారీ కార్యాలయానికి తాళం వేసి ఉండడంతో, తరువాయి 2లో

# ‘శాంతి’ భారం రష్యాదే

## ఫ్లోరిడా చర్చల్లో అమెరికా–ఉక్రేన్ ఉమ్మడి పిలుపు



**ఫ్లోరిడా:** శాంతి సాధన నిర్ణయం ఇక రష్యాదేనని, భారమంతా పుతిన్‌పైనే ఉందని ఫ్లోరిడాలో జరిగిన చర్చల్లో అమెరికా–ఉక్రేన్ ప్రతినిధులు ప్రకటించారు. ఉక్రేన్‌లో దీర్ఘకాలిక శాంతి సాధనకు చిత్తశుద్ధి చూపించాలని రష్యాకు వారు ఉమ్మడి పిలుపు ఇచ్చారు. రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో ట్రంప్ ప్రత్యేక దూత స్టీవ్ విట్‌కాఫ్, అల్లుడు కుష్నెర్ డిసెంబరు రెండో తేదీన మాస్కోలో ఐదు గంటలు చర్చల తర్వాత తిరిగివెళ్ళి డిసెంబరు 4,5,6 తేదీల్లో ఫ్లోరిడాలో ఉక్రేన్ ప్రతినిధులతో సంభాషణలు జరిపారు. ఈ సంభాషణల్లో ట్రంప్ అల్లుడు జారెడ్ కుష్నెర్ కూడా పాల్గొన్నారు. రష్యా వైఖరి కారణంగా మాస్కో చర్చల్లో శాంతి ఒప్పందం ముందుకు వెళ్ళకుండా స్తంభించిందని బ్రిటన్ మీడియా విమర్శించగా, చర్చలు విఫలం కాలేదని, తమకు ఆమోదయోగ్యం కాని కొన్ని అంశాలు ఇందులో ఉన్నాయని, ట్రంప్ ప్రతిపాదించిన ప్రణాళికలోని ప్రతి అంశంపైన, పదజాలం–వాక్య నిర్మాణంపైన క్షుణ్ణంగా పరిశీలన చేయాల్సి ఉందని, ముసాయిదా ప్రణాళికపై ఎలాంటి రాజీ పరిష్కారం కుదరలేదని మాత్రమే పుతిన్ చెప్పారని రష్యా అధికార మీడియా ప్రకటించింది. కానీ ఫ్లోరిడా చర్చల్లో పాల్గొన్న విట్‌కాఫ్, ఉక్రేన్ జాతీయ భద్రతా మండలి కార్యదర్శి రస్టెమ్ ఉమ్రోవ్ శనివారం ఉమ్మడి ప్రకటన చేస్తూ, యుద్ధ పరిష్కారానికి రష్యా చిత్తశుద్ధి చూపించాలని తరువాయి 12లో

## రిలయన్స్ పవర్, మరో పది అనుబంధ సంస్థలపై ఇడి ఛార్జిషీటు

**న్యూఢిల్లీ:** నకిలీ బ్యాంకు గ్యారంటీలు ఇచ్చారన్న కేసులో వ్యాపారవేత్త అనిల్ అంబానీ గ్రూప్‌కు చెందిన రిలయన్స్ పవర్ లిమిటెడ్, దానికి అనుబంధంగా ఉన్న మరో పది సంస్థలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇ డి) పటియాలా హౌస్ కోర్టులో ఛార్జిషీటు దాఖలు చేసింది. లెక్కలో చూపించకుండా ధనాన్ని అక్రమంగా ఇతర అవసరాలకు మళ్ళించారన్న ఆరోపణలపై ఈ ఛార్జిషీటు దాఖలు చేసినట్లు శనివారం ఇడి అధికారులు చెప్పారు. ఒక టెండరు సంపాదించేందుకు రూ.68 కోట్ల మేరకు నకిలీ బ్యాంకు గ్యారంటీలు చూపించారు.. ఈ కేసులో రిలయన్స్ వపర్‌కు అనుబంధంగా ఉన్న ఎలాంటి పెట్టుబడులూ లేని డొల్ల కంపెనీ బిస్వాల్ ట్రేడ్‌లింక్ ప్రైవేట్ లిమిటెడ్, రిలయన్స్ పవర్, రిలయన్స్ ఎన్‌యు బెస్ లిమిటెడ్, రోసా పవర్ సప్లయ్ కంపెనీ లిమిటెడ్ మాజీ సిఎఫ్ఓ అశోక్ కుమార్ పాల్, ఒడిశా కేంద్రంగా పనిచేస్తున్న తరువాయి 2లో



# ప్రపంచం
WORLD NEWS

## దక్షిణాఫ్రికాలో కాల్పులు : 11 మంది మృతి

**ప్రిటోరియా:** దక్షిణాఫ్రికాలోశనివారంజరిగిన సామూహిక కాల్పుల దాడిలో 11మంది మరణించారు. మరో 14మంది గాయపడ్డారు.దేశరాజధాని ప్రిటోరియాకు పశ్చిమంగా ఉన్న సెత్ విల్లే పట్టణంలో ఒక హాస్టల్‌లోకి శనివారం తెల్లవారుజామున గుర్తుతెలియని దుండగులు చొరబడి లోపల కూర్చుని ఉన్న ఒక బృందంపై విచక్షణారహితంగా కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో మరణించినవారిలో ఒక బాలుడు, ఒక టీనేజ్ బాలిక కూడా ఉన్నారు. పోలీసు ప్రతినిధి బ్రిగేడియర్ అథ్లెండా మాథే ఈ విషయం చెప్పారు. ఈ కాల్పులు ఎవరు జరిపారో, ఎందుకు జరిపారో, దీని వెనుక గల కారణం ఏమిటో తెలియరాలేదు. కానీ ఇటీవలికాలంలో దేశంలో కాల్పుల సంఘటనలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. ఈ పరంపరలో ఇది మరో తాజా సంఘటన. ఈ హాస్టల్ అక్రమ మద్యం కార్యకలాపాలకు కేంద్రంగా ఉందని, ఇటీవల అనేక ఘటనలు ఇలాంటివే ఈ హాస్టల్‌పై జరిగాయని మాథే చెప్పారు. ప్రజలు కూడా కాల్పుల్లో మరణిస్తున్నారన్నారు. ఐక్యరాజ్యసమితి డ్రగ్స్‌–క్రైమ్స్ నివేదిక ప్రకారం ప్రతి ఏటా దక్షిణాఫ్రికాలోనేఎక్కువగా హత్యలు జరుగుతున్నాయి.

# పాక్–అఫ్గాన్ సరిహద్దుల్లో మళ్లీ కాల్పులు

### ఐదుగురు పౌరులు మృతి

**కాబూల్:** పాకిస్తాన్‌–ఆఫ్ఘనిస్తాన్ మధ్య కీలకమైన ఉమ్మడి ఛామన్ సరిహద్దుల్లో సైన్యాలమధ్య మళ్ళీ కాల్పులు యుద్ధం చెలరేగింది. పాకిస్తాన్ దాడుల్లో తమ దేశ పౌరులు ఐదుగురు మరణించినట్లు ఆఫ్ఘనిస్తాన్ శనివారం ప్రకటించింది. గాయపడినవారిని జిల్లా ఆసుపత్రికి తరలించారు. సౌదీ అరేబియాలో రెండు దేశాల ప్రతినిధులమధ్య జరుగుతున్న చర్చలు ఫలోగతి లేకుండా ప్రతిష్టంభనతో విఫలమయ్యాయి. తాజా కాల్పులు కప్పంపులకు మీరంటే మీరే కారణమని రెండు దేశాల సైన్యాలూ పరస్పర ఆరోపణలు చేసుకుంటున్నాయి. ఛామన్ సరిహద్దు ప్రదేశాన్ని ఫ్రెండ్‌షిప్‌గేట్ అని కూడా పిలుస్తారు. ఆఫ్ఘనిస్తాన్ కాందహార్‌కు వెళ్ళే మార్గంలో పాకిస్తాన్ బలూచిస్తాన్ రాష్ట్రానికి ఇది ప్రధాన రహదారిగా ఉంది. సరిహద్దులో కాల్పులకు మీరంటే మీరే మొద టి కారకులని రెండు దేశాలూ మొదటినుండీ ఆరోపణలు చేసుకుంటున్నాయి. ఇప్పుడు కూడా అవే ఆరోపణలు పునరావృతమయ్యాయి. బలూచిస్తాన్ రాష్ట్రం వద్ద సరిహద్దుల్లో శుక్రవారం అర్ధరాత్రి ఈ కాల్పులు ప్రారంభమయ్యాయి. ఆఫ్ఘనిస్తాన్ సైన్యాలు బదిలీ ప్రాంతంపై మోర్టార్ షెల్స్‌ను ప్రయోగించాయని పాకిస్తాన్ అధికారులు ఆరోపించారు. కాని స్పిన్ బొల్డాక్‌పై దాడులు ప్రారంభించడంతో తమ సైన్యాలు ప్రతిస్పందించాల్సి వచ్చిందని అఫ్ఘనిస్తాన్ తాలిబన్ అధికార ప్రతినిధి జబిహుల్లా ముజాహిదీన్ చెప్పారు.



ఆఫ్ఘనిస్తాన్ సైన్యాల దురాక్రమణ చర్యలను తిప్పికొట్టేందుకే తమ సైన్యాలు ప్రతిస్పందించాయని పాకిస్తాన్ అధికార వర్గాలు చెబుతున్నాయి. ఛామన్‌–కాందహార్ జాతీయ రహదారిపై కూడా ఘర్షణలు జరిగాయి. ఐతే వీటిని ఇంకా ధృవీకరించలేదు. పాకిస్థాన్ విరామం లేకుండా నిరంతరం అఫ్గానిస్థాన్‌పై ఆరోపణలు చేస్తోంది. దీంతో ప్రతీకార దాడులు కూడా తరచు జరుగుతున్నాయి. తెహ్రీక్‌–ఎ–తాలిబన్ పాకిస్థాన్ ఉగ్రవాదులకు అఫ్గానిస్థాన్ ఒక స్వర్గథామంలా మారిందని, వారంతా తమ దేశంలోకి వచ్చి దాడులు చేసి అఫ్ఘాన్ భూభాగంలోకి పారిపోతున్నారని పాకిస్తాన్ ఆరోపిస్తున్నది. గతనెలలో తీవ్ర ఉద్రిక్తతలు చెలరేగడంతో రెండు దేశాలమధ్య కాల్పు విరమణ ప్రాతిపదికపై ఒక అంగీకారం కుదిరింది.

### తొమ్మిదిమంది భారత్ ప్రేరేపిత ఉగ్రవాదులు హతం

భారత్ ప్రేరేపిస్తున్న తొమ్మిదిమంది అఫ్గానిస్తాన్ ఫిత్నా అల్‌ఖవారిజ్ ఉగ్రవాదులను హతమార్చినట్లు పాకిస్తాన్ ఇంటర్ సర్వీసెస్ పబ్లిక్ రిలేషన్స్ విభాగం శనివారం ప్రకటించింది. ఖైబర్‌పఖ్తూంఖ్వారాష్ట్రంలోని తాంక్, లక్కీ మార్వాత్ జిల్లాలో జరిగిన దాడుల్లో శుక్రవారం ఈ ఉగ్రవాదులను మట్టుపెట్టినట్లు పేర్కొంది. పాకిస్తాన్‌లో నిషేధించిన తెహ్రీక్‌–ఎ–తాలిబన్ పాకిస్తాన్ ఉగ్రవాద సంస్థను పాక్ సైన్యాలు "ఫిత్నా అల్ ఖవారిజ్"గా నామకరణం చేశాయి. ఆ పేరుతోనే దానిని పిలుస్తున్నారు. కాగా భద్రతా దళాలలపై ఉగ్రవాదుల దాడిని పాకిస్థాన్ అధ్యక్షుడు ఆసిఫ్ అలీ జర్దారీ ఖండించారు.

## వినోదరంగంలో మహాశక్తిగా ఎదిగిన నెట్‌ఫ్లిక్స్

### వేలంపాటలో 'వార్నర్ బ్రదర్స్' స్వాధీనం

### ఇక 25 శాతం సినిమాలు గల్లంతు

**హాలీవుడ్:** వారంరోజులుగా జరిగిన వేలంపాట పోరులో ప్రపంచ ప్రఖ్యాత ఆన్‌లైన్ వేదిక 'నెట్‌ఫ్లిక్స్' వార్నర్ బ్రదర్స్ డిస్కవరీని స్వాధీనం చేసుకుంది. దీంతో నెట్‌ఫ్లిక్స్ వినియోగదారుల సంఖ్య ఒక్కసారిగా అనేక లక్షలు పెరిగిపోయింది. హెచ్‌బిఓకు చెందిన 128 మిలియన్ల సబ్‌స్క్రైబర్లు దీనికి జతకలుస్తారు. ఇప్పటికే నెట్‌ఫ్లిక్స్‌కు ప్రపంచవ్యాప్తంగా 300 మిలియన్లపైగా సబ్‌స్క్రైబర్లు ఉన్నారు. ఈ ఒప్పంద ప్రక్రియ పూర్తి కావడానికి 18 నెలల పడుతుందని నెట్‌ఫ్లిక్స్ అంచనావేసింది. దీంతో హాలీవుడ్‌లో, అమెరికా, అంతర్జాతీయసినిమా, సబ్‌స్క్రిప్షన్లలోమహాశక్తిగా ఎదిగింది. మొత్తం 72 బిలియన్ డాలర్లకు వేలంపాటలో దీనిని నెట్‌ఫ్లిక్స్ స్వాధీనం చేసుకుంది. దీంతో హాలీవుడ్ సృజనాత్మక కళాకారులు, వృత్తినిపుణులు, కార్మికులలో భయాలు పెరుగుతున్నాయి. ఉద్యోగాల్లో కోతలు పెడతారని కార్మికులు ఆందోళన చెందుతున్నారు. ఒప్పందంపై పూర్తిస్థాయిలోసంతకాలు జరిగితే ఇక థియేటర్లలో విడుదలయ్యే సినిమాల సంఖ్య గణనీయంగా తగ్గుతుందని కార్మికులు ఆందోళన చెందుతున్నారు. ఇక ప్రతి సంవత్సరం దాదాపు 25 బాక్సాఫీస్ చిత్రాలకు కాలం చెల్లినట్లే అవుతుంది. ప్రతి సంవత్సరం అంతర్జాతీయ 26,000 సినిమాలకు, అమెరికాలో 30,000 సినిమాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న ట్రేడ్ గ్రూపు 'సినిమా యునైటెడ్' శనివారం ఈ విషయం ప్రకటించింది. ఐతే నెట్‌ఫ్లిక్స్ మాత్రం ఈ వాదనలను కొట్టిపారేసింది.

# ఇక ఏటేటా 'నోబెల్'కు పోటీ

## ట్రంప్‌కు 'ఫిఫా–2025 తొలి శాంతి బహుమతి

**వాషింగ్టన్ డిసి:** నోబెల్ శాంతి బహుమతికోసం ట్రంప్ఎంతగా తహతహలాడినప్పటకీ ఆ అవార్డు – 2025 ట్రంప్‌కు దక్కలేదు. కానీ' 'ఫిఫా' (ఇంటర్నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఫుట్ బాల్ అసోసియేషన్) నెలకొల్పిన మొట్టమొదటి శాంతి బహుమతి మాత్రం ట్రంప్‌కే దక్కింది. ఫిఫా–2026 ప్రపంచ కప్ పోటీల నిమిత్తం వాషింగ్టన్ డి.సి కెన్నడీ సెంటర్‌లో డ్రా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఫిఫా ట్రోఫీని ఆవిష్కరించిన కార్యక్రమంలో పాల్గొన్న ట్రంప్‌కు ఈ శాంతి బహుమతి ఇచ్చి సత్కరించారు. ట్రంప్‌కు శాంతి బహుమతి ఇస్తున్నట్లు ఈ సభలో 'ఫిఫా' అధ్యక్షుడు గియాని ఇన్‌ఫాంటినో ప్రకటించి ఆయనకు బహుమతిని ఇచ్చి సత్కరించారు.ప్రపంచవ్యాప్తంగా ఉన్న వందల కోట్లమంది ఫుట్‌బాల్ అభిమానుల గౌరవానికి చిహ్నంగా, పిఫా కీర్తి ప్రతిష్ఠలను ఇనుమడింపజేసేలా ఇకమీదట ప్రతి సంవత్సరం ఈ శాంతి బహుమతిని ప్రకటిస్తామని ఇన్‌ఫాంటినో చెప్పారు. ప్రనపంచంలో శాంతి సాధనకు ట్రంప్ ఎంతగానో పరితపించి సేవలు అందించారని, ఆయన ఈ బహుమ



తికి తగిన అర్హుడని ఇన్‌ఫాంటినో ప్రశంసించారు. వచ్చే ఏడాది జూన్ 11 నుండీ ప్రారంభం కానున్నఫుట్ బాల్‌కప్–2026 పోటీ లకు ఈసారి అమెరికా, మెక్సికో, కెనడా దేశాలు ఆతిథ్యం ఇస్తున్నాయి. ట్రంప్ మాట్లాడుతూ, ఇది తనకు దక్కిన గొప్ప గౌరవమని అన్నారు.

### ఫిఫా–25 పై విమర్శలు

ట్రంప్‌కు ఫిఫా–2025 శాంతి బహుమతి ప్రకటించడంపై అప్పుడే విమర్శలు ప్రారంభమయ్యాయి. అసలీశాంతి బహుమతికి ఉన్న చెల్లుబాటు ఏమిటని పలువురు ప్రశ్నించారు. నామినేషన్లు కోరకుండా, ఎవరికీ బహిరంగ ప్రకటనలు చేయకుండా, న్యాయ నిర్ణేతలు సమావేశమైన చర్చించి నిర్ణయం తీసుకోకుండా ఫిఫా–2025 శాంతిబహుమతి ఇవ్వడం హాస్యాస్పదమని మానవహక్కుల సంఘం హ్యూమన్ రైట్స్ వాచ్ సంస్థ విమర్శించింది. ఈ శాంతి బహుమతి ప్రకటించడంలో ఒక ఆచరణాత్మక విధానం, కార్యాచరణ లేదని విమర్శించడంతో ఈ బహుమతి ట్రంప్ పట్టుదలతో రూపుదిద్దుకునందనే రాజకీయరంగు పులుముకుంది. ప్రపంచంలో అనేకచోట్ల దాదాపు ఏడు యుద్ధాలు జరగకుండా నివారించినందుకుగాను తనకు ఈ ఏడాది నోబెల్ శాంతి బహుమతి రావాలని డోనాల్డ్ ట్రంప్ నెలరోజులు ముందునుండీ రాగం అందుకున్నారు. ఆయనఆశ నెరవేరలేదు.వెనిజులా ప్రజాస్వామ్య ఉద్యమ నాయకురాలు మారియా కోరినా మఛాడోకు ఈ అవార్డు లభించడంతో ట్రంప్ భంగపాటుకు గురయ్యారు. ఈ అవార్డు 2024లో చేసిన కృషికి చిహ్నంగా మఛాడోకు లభించిందని ఆయనతనకుతాను సర్దిచెప్పుకున్నారు. 2025లో శాంతికోసం జరిగిన కృషికి 2026లో తనకు శాంతి బహుమతి లభించగలదన్నఆశాభావం వ్యక్తం చేశారు. ఐతే మఛాడోకు నోబెల్‌శాంతి కమిటీ అవార్డు ప్రకటించిన తర్వాత ట్రంప్ మాట్లాడుతూ, నోబెల్ కమిటీ సభ్యులతో మాట్లాడాననీ, వారు, ''ఉక్రేన్‌యు మీరు యుద్ధాన్ని ఆపండి, అప్పుడు ఆలోచిస్తాం''అని చెప్పారని అన్నారు. ట్రంప్‌శాంతిఒప్పందంకుదిర్చిఉక్రేన్‌లో కాల్పుల విరమణ అమలులోకి తెచ్చే పనిలోతలమునకలై ఉన్నారు.

## అంబేద్కర్ ఆశయాలను బిజెపి ప్రభుత్వం కాలరాస్తోంది



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** అంబేద్కర్ ఆశయాలను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కాల రాస్తోందని సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ అన్నారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ 69వ వర్ధంతి సందర్భంగా సిపిఐ(ఎం) తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో శనివారంహైదరాబాదు ట్యాంక్‌బండ్ వద్ద అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి, నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జాన వెస్లీ మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగాన్ని బలహీనపరిచి, మనుధర్మ శాస్త్రాన్ని అమలు చేస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రజాస్వామిక, లౌకిక, ప్రజాతంత్ర, సామాజిక న్యాయం కోరే శక్తులన్ని ఏకమై పోరాడాలని సిపిఐ(ఎం) పిలుపునిస్తుందని. అలాంటి పోరాటాల్లో అగ్రభాగాన నిలబడుతుందని ఆయన తెలిపారు.తెలంగాణలో బిసిలకు 42శాతం రిజర్వేషన్స్ అమలుకు అన్ని పార్టీలతో పాటు, రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నం చేసినప్పటికీ, కేంద్రం దీన్ని అడ్డుకుంటుందన్నారు. రిజర్వేషన్ల అమలుపై నిరాశ చెంది ఈశ్వరచారి ఆత్మహత్య చేసుకున్న దుర్ఘటనకు పూర్తి బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదే బాధ్యత అన్నారు. ఎవరూ ఆత్మహత్యలకు పూనుకోవద్దని సిపిఐ(ఎం) విజ్ఞప్తి చేస్తోందనిఆత్మహత్యలకు పాల్పడంఅది పూలే, అంబేద్కర్ ఆశయాలకు విరుద్ధమని ఆయన పేర్కొన్నారు.. ఈ కార్యక్రమంలోసిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బండారు రవికుమార్, ఎండీ అబ్బాస్, రాష్ట్ర కమిటీ సభ్యులు స్కైలాబ్‌బాబు, నగర నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## 21న జాతీయ లోక్‌అదాలత్

### జస్టిస్ పి.సామ్ కోషి




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** న్యూఢిల్లీలోని నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ సూచనల మేరకు రాష్ట్రంలో ఈనెల 21న జాతీయ లోక్ అదాలత్‌ను తెలంగాణ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి, తెలంగాణ రాష్ట్ర లీగల్ సర్వీసెస్ అథారిటీ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ జస్టిస్ పి.సామ్ కోషి తెలిపారు. జాతీయ లోక్ అదాలత్‌ను ఏర్పాట్లకు సంబంధించి శనివారం తెలంగాణ రాష్ట్ర లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యాలయంలోజస్టిస్ పి. సామ్ కోషి అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈసమావేశంలో డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ డి.శివధర్ రెడ్డి, అదనపు డిజిపి మహేశ్ భగవత్, అడిషనల్ డిజిపి చారు సిన్హా,హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ పోలీస్ కమిషనర్లు, జాయింట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ (ట్రాఫిక్), ఎక్సైజ్ కమిషనర్, డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్‌తో పాటు ఆర్‌టిసిఅధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జస్టిస్ పి.సామ్ కోషి మాట్లాడుతూ పెద్ద సంఖ్యలో ఉన్న అన్ని కేసులను పరిష్కరించడం వల్ల కోర్టులపై భారం తగ్గించడమే లక్ష్యంగా . జాతీయ లోక్ అదాలత్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పెండింగ్‌లో ఉన్న క్రిమినల్ కాంపౌండబుల్ కేసులు, ఎక్సైజ్ కేసులు, ఆర్‌టిసి కేసులు, చెక్ బౌన్స్ కేసులను పరిష్కరించనున్నట్లు జస్టిస్ పి.సామ్ కోషి వెల్లడించారు. టిఎస్ఎల్ఎస్ఎసభ్య కార్యదర్శి పంచాక్షరి, ఎఒఎం.రాజు పాల్గొన్నారు.

## ఇడి ఛార్జిషీటు

(మొదటి పేజీ తరువాయి)

రిలయన్స్ గ్రూపు కార్యనిర్వాహకుడు పునిత్ నరేంద్ర గార్గ్, దాని ఎండి పథసారథి బిస్వాల్, ట్రేడ్ ఫైనాన్సింగ్ కన్సల్టెంట్ అమర్‌నాథ్ దత్తలు ఈ ఛార్జిషీటులో నిందితులుగా ఉన్నారు. ఇ డి అధికారుల సమాచారం ప్రకారం, బయోథాన్ కెమికల్స్ ప్రైవేట్ లిమిటెడ్, రవీంద్ర పాల్ సింగ్ ఛధా, మనోజ్ భయాసాహెబ్, పొంగ్డే కూడా ఛార్జిషీటులో నిందితులుగా ఉన్నారు. ధనాన్ని లెక్కల్లో చూపించకుండా అక్రమంగా ఇతర అవసరాల నిమిత్తం మళ్ళించేందుకు ప్రయత్న ం చేసినందుకు పిఎంఎల్ఏ (ప్రివెన్షన్ ఆఫ్ మనీ లాండరింగ్ యాక్ట్)లోని నిబంధల కింద ఈ ఛార్జిషీటును దాఖలు చేశారు. సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ఎస్ఇసిఐ) నుండి టెండరు సంపాదించేందుకు రూ.68.2 కోట్ల మేరకు బ్యాంకు గారంటీలను సమర్పించడంకోసం నకిలీ పత్రాలు సమర్పించారు. రిలయన్స్ ఎన్‌యు బెస్ లిమిటెడ్ తరపున ఈ పత్రాలు సమర్పించారు. ఈ కంపెనీ గతంలో మహారాష్ట్ర ఎనర్జీ జనరేషన్ లిమిటెడ్ పేరుతో ఉండేది. ఇది నకిలీ పత్రాలు సమర్పించారని రిలయన్స్ కార్పొరేషన్‌అధికారులకు బాగా తెలుసుననే విషయాన్ని ఇడి అధికారులు తమ దర్యాప్తులో గుర్తించారు. ఆ తర్వాత కంపెనీ వాస్తవ ప్రాతిపదికపై ఎలాంటి మోసం లేకుండా ఐడిబిఐ నుండి బ్యాంకు గ్యారంటీలు తీసుకువచ్చినప్పటికీ కూడా సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఆ గ్యారంటీని అంగీకరించేందుకు తర్వాత తిరస్కరించింది.

## అదనపు కోటా ఇవ్వండి

(మొదటి పేజీ తరువాయి)

మరో 60 రోజులు పొడిగించాలని, వివిధ కారణాల వల్ల ఇప్పటికీ 2.27 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం పెండింగ్‌లో ఉందని మంత్రి తెలిపారు. అలాగె తెలంగాణలో ప్రస్తుతం ఎస్‌డబ్లూసి, సిడబ్లూసిలనిల్వ సామర్థ్యం 65.00 లక్షల మెట్రిక్ టన్నులుగా ఉందని వివిధ ప్రభుత్వ సంస్థలు పూర్తిగా వీటిని ఉపయోగించుకుంటుడడంతో కింద ఎఫ్‌సిఐ ద్వారా అదనంగా 15 లక్షల మెట్రిక్ టన్నులల నిల్వ సామర్థ్యాన్ని మంజూరు చేయాలని మంత్రి కోరారు. మరింత పెంచాలని కోరారు. మిల్లర్లు ప్రస్తుత ధాన్యం సేకరణ విషయంలో వెనుకాడుతుండటం, మిల్లుల వద్ద స్థలం లేకపోవడం వల్ల కొత్త ధాన్యం సేకరణ మీద ప్రభావం చూపుతుందని అన్నారు. 78 సంవత్సరాల హామీతో ప్రైవేట్ భాగస్వామ్యం ద్వారా రాష్ట్రం మరిన్ని గోడౌన్లను నిర్మాణం చేయడానికి PEG పిఇజి పథకాన్ని పునరుద్ధరించాలని మంత్రి సూచించారు. రాష్ట్రం రెండేళ్లు, ఎఫ్‌సిఐ 6 ఏళ్ల హామితో ప్రైవేట్ భాగస్వామ్యంతో ఇస్తే నిలువ సామర్థ్యము పెంచుకోవచ్చని అన్నారు. తదుపరి 4 నెలలకు నెలకు 0.5 లక్షల బాయిల్డ్ రైస్ తరలించవచ్చు అని అన్నారు.

## ఆర్థిక ప్రయోజనాలు

(మొదటి పేజీ తరువాయి)

చెప్పారు. ఈ కార్యక్రమంలో అంతర్జాయ స్థాయి లో పేరొందిన ఎకనమిస్టులు ప్రసంగిస్తారని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చెప్పారు. ఈ తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2025 అనేది తెలంగాణ భవిష్యత్తును నిర్మించేదిగా, రా ష్ట్రానికి భారీ పెట్టుబడులు రాబట్టేదిగా, ప్రపంచ దృష్టిని రాష్ట్రంపై నిలిపేదిగా భట్టి విక్రమార్క అభివర్ణించారు. ఈ ఎకనమిక్ సమ్మిట్ రాష్ట్ర ప్రయోజనాలకు ఎతంగానో ఉపయోగ పడుతుందన్నారు. ఎవరి స్థాయిలో వాళ్ళు సమ్మిట్ విజయవంతానికి సహకరించాలని భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు.

### హాజరు కానున్న ప్రముఖులు..

సమ్మిట్ మొదటిరోజున నోబెల్ పురస్కార గ్రహీత అభిజిత్ బెనర్జీ, శిశు హక్కుల కార్యకర్త కైలాశ్ సత్యార్థి, బిజినెస్ లీడర్ కిరణ్ మజుందార్, అమెరికా నుండి ట్రంప్ మీడియా అండ్ టెక్నాలజీస్ గ్రూప్ డైరెక్టర్ ఎరిక్ స్వేడర్, కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డి.కె. శివకుమార్, కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డితో పాటు రాష్ట్ర మంత్రులు పాల్గొని ప్రసంగిస్తారన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, తాను, మంత్రి శ్రీధర్ బాబు ప్రసంగిస్తామని చెప్పారు.

### 27 ప్రత్యేక సెషన్లు..

గ్లోబెల్ సమ్మిట్‌లో పలు శాఖలకు సంబందించిన మొత్తం 27 సెషన్లు జరుగనున్నాయని తెలిపారు. వీటిలో విద్యుత్, సెమీకండక్టర్లు, గ్రీన్ ఎనర్జీ, ఎరో స్పేస్, ఎడ్యుకేషన్ వంటి కీలక రంగాలపై చర్చలు జరుగుతాయని భట్టి విక్రమార్క చెప్పారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి 4 వరకు సెషన్‌లు ప్రారంభమవుతాయన్నారు. సెషన్ అంశానికి సంబంధించిన శాఖ మంత్రి, ఆ శాఖ ముఖ్యకార్యదర్శులు పాల్గొంటారన్నారు. 9వ తేదీ కూడా ఇలాగే సెషన్స్ ఉంటాయని చెప్పారు. ఉదయం 9 గంటలకు కార్యక్రమాలు మొదలవుతాయని, సాయ ంత్రం 6 గంటలకు ముగింపు కార్యక్రమం ఉంటుందన్నారు. ముగింపు కార్యక్రమంలో ఎవరెవరు పాల్గొంటారో తరువాత చెప్పుతామన్నారు.

### 6 ఖండాల నుంచి ప్రతినిధులు..

44 దేశాల నుండి 154 మంది ప్రతినిధులు పాల్గొంటున్నారని ఉప ముఖ్యమంత్రి వివరించారు. అందులో అమెరికా నుంచే 46 మంది రా వడం ప్రాధాన్యతను చాటుతోందన్నారు. రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీలను ఈ కార్యక్రమానికి ఆహ్వానిస్తున్నామని చెప్పారు. స్వయంగా అధికారులే వెళ్లి వారిని ఆహ్వానించడం జరుగుతుందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, తాను, సహచర మంత్రులు అందరం స్వయంగా వెళ్లి ముఖ్యులను ఆహ్వానించడం జరిగిందన్నారు. అన్ని రాష్ట్రాలకు సమాచారం ఉండాలని, అందరిని పిలవడం జరిగిందన్నారు.

### ఇండిగో సమస్యకు ప్రత్యామ్నాయాలు

ఎయిర్‌లైన్స్ సమస్యల నేపథ్యంలో ప్రతినిధులకు ఇబ్బంది లేకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు, అవసరమైతే ప్రత్యేక విమానాలు కూడా సిద్ధం చేస్తున్నామని భట్టి విక్రమార్క వెల్లడించారు. ఎయిర్ లైన్స్ సమస్యకు వెసులుబాటు కలుగుతుందనే ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు.

## మెడికల్ మాఫియా

(మొదటి పేజీ తరువాయి)

ఎక్కడికి వెళ్ళి తమ గోడు వెళ్లబోసుకోవాలి అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ పూర్తి లోపించడంతోనే ఈ మెడికల్ మాఫియా డాన్ దావూద్ శీనుగా మారి, తమ ఇష్టారాజ్యాన్ని కొనసాగిస్తూ, ప్రజల జీవితాలలో చెలగాటం ఆడుతోందని ఆరోపిస్తున్నారు. డాక్టర్ ప్రిస్కిప్షన్ లేకుండా మందులు అమ్మకూడదనే ప్రాథమిక నియమం కూడా ఇక్కడ అమలు కావడంలేదు. దీనివల్ల నిస్సహాయ ప్రజలు తప్పుడు వైద్యంతో ప్రాణాలు కోల్పోయే ప్ర మాదం ఏర్పడింది.ఇప్పటికైనా రాష్ట్ర డ్రగ్స్ కంట్రోల్ ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని,జిల్లా అధికారిపై చర్యలు తీసుకుని,మెడికల్ మాఫియాను అరికట్టాలని ప్రజలు డిమా ండ్ చేస్తున్నారు.

### కార్యాలయానికి తాళం.. మాఫియాకు అడ్డా..!

నిజానికి,ఈ పరిస్థితికి మూల కారణం డ్రగ్స్ కంట్రోల్ అధికారుల నిర్లక్ష్యమే మెడికల్ షాపుల యజమానులు తమ షాపులకు మందులు కొనుగోలు చేసేందుకు వచ్చే కస్టమర్లను కేవలం వ్యాపార దృష్టితో చూస్తూ,రోగిని మోసం చేసే విధంగా వ్యవహరించడం అలవాటుగా మార్చుకున్నారు.పర్యవేక్షణ లేకపోవడంతో ప్రిస్కిప్షన్ ఉన్న మందులను కూడా డాక్టర్ రాసినంత మోతాదులోనే అమ్మాలనే నిబంధనను కూడా పాటించడం లేదు. మందులు విక్రయించేటప్పుడు తప్పనిసరిగా రసీదు ఇవ్వాలనే చట్టాన్ని కూడా గాలికి వదిలేశారు.

### అనధికారిక వైద్యం.. ప్రజారోగ్యంతో చెలగాటం

ఈ ఉల్లంఘనల పరంపరలో అత్యంత ప్రమాదకరమైన విషయం ఏమిటంటే,అర్హత లేని వ్యక్తులు సైతం మెడికల్ షాపులు నడుపుతూ,డాక్టర్ మాదిరిగా రోగులకు మందులు ఇచ్చి చికిత్స అందిస్తున్నారు.వారికి తోచిన విధంగా రోగులకు మందులు ఇచ్చి,అమాయక రోగులను తప్పుదోవ పట్టిస్తున్నారు.దీనివల్ల చాలామంది అనారోగ్యం పాలవుతున్నారు.ప్రిస్కిప్షన్ లేకుండానే యేథేచ్ఛగా యాంటీ బయాటిక్స్,నిద్రమాత్రలు,గర్భనిరోధక మందులు వంటి అత్యంత కీలకమైన మందులను సైతం అమ్ముతున్నారు.

### నకిలీ మందుల దందా..!

### ఆర్.పి.లేకుండానే వ్యాపారం..

కొంతమంది యజమానులు కంపెనీల నుంచి వచ్చే శాంపిల్స్‌ను,నాణ్యత లేని మందులను అధిక ధరలకుఅమ్ముతున్నారు.నాణ్యత లేని మందులను విక్రయిస్తున్నారసీదులు పనిచేయకపోతే రోగి ఎవరిని నిందించాలో తెలియని గందరగోళం ఏర్పడుతోంది.ముఖ్యంగా రిజిస్టర్డ్ ఫార్మసిస్ట్(ఆర్.పి) లేకుండానే కొన్ని షాపులు నడుస్తుండగా లెసెన్స్ ఒకరి పేరుపైఉండి, షాపును వేరొకరు నడుపుతున్నారు.


### ప్రజల డిమాండ్ .. తనిఖీలు చేపట్టాలి

డాక్టర్ ఫీజులు భరించలేక మెడికల్ షాపులను ఆశ్రయిస్తున్నపేదప్రజలఆరోగ్యం ఈ మాఫియా చేతిలో ప్రమాదంలో పడింది.ఇప్పటికైనా జిల్లా డ్రగ్స్ అధికారి వెంటనే తనిఖీలు చేసి,ఈ మెడికల్ మాఫియాను ఆరికట్టాలని, ప్రజారోగ్యాన్ని కాపాడాలని నిర్మల్ ప్రజలు తీవ్ర ఆవేదనతో వాపోతూ డిమాండ్ చేస్తున్నారు.

## ఎస్ఎల్‌బిసి పూర్తిచేస్తాం

(మొదటి పేజీ తరువాయి)

మాట్లాడారు. ఓటును ఆయుధంగా మార్చి గడీల పాలనను అంతమొందించి ప్రజా పాలన తీసుకొచ్చిన ప్రజానీకానికి ప్రజా ప్రభుత్వం అండగా ఉంటుందని అన్నారు. నిజాం నవాబు ప్రజలను పీడిస్తూ దోపిడీకి పాల్పడుతుంటే మట్టి మనుషులే మర ఫిరంగులై భూమి కోసం, భుక్తి కోసం,వెట్టిచారికి విముక్తి కోసం సాయుధ రైతాంగ పోరాటం చేసి నిజాంను తరిమికొట్టిన చరిత్ర నల్గొండ జిల్లా ప్రజలదని ఆయన అన్నారు. రావి నారాయణరెడ్డి, ఆరుట్ల కమలాదేవి, రామచంద్రారెడ్డి, దొడ్డి కొమురయ్య, చాకలి ఐలమ్మ, మల్లు స్వరాజ్యం లాంటి వ్యక్తుల జీవితం స్ఫూర్తిదాయకంఅనిఆయన అన్నారు. సోనియా గాంధీ త్యాగం, అంబేద్కర్ స్ఫూర్తితో ఆర్టికల్ 3 ప్రకారం తెలంగాణ సాధించామని సంక్షేమం అభివృద్ధి ప్రజాపాలనలో జోడెద్దుల వలె పాలన సాగుతుందని అన్నారు. పదేళ్ల బిఆర్ఎస్ కాలంలో రాష్ట్రంలో నూతనంగా ఏ ఒక్కరికి రేషన్ కార్డు ఇవ్వలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక రాష్ట్రంలో నూతన రేషన్ కార్డులు ఇచ్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదని అన్నారు. పేదలకు 200యూనిట్ల ఉచిత కరెంట్, సన్న బియ్యం, మహిళలకు వడ్డీ లేని రుణాలు, రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదని సిఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. గతంలో దొడ్డు బియ్యం ఇవ్వడం ద్వారా ప్రజలకు ఉపయోగంలేకుండా పోయి దళారులకు అమ్ముకునే వారని అలాంటి పేదల ఆకలి తీర్చేందుకు సన్నబియ్యం పథకం దేశానికి ఆదర్శం అని అన్నారు. ప్రధాని మోదీ బిజెపి ప్రభుత్వ రాష్ట్రాల్లో సైతం ఎక్కడ సన్న బియ్యం పథకం అమలు చేయడం లేదని అన్నారు.



2004 నుండి 2014 వరకు స్వర్గీయ వైఎస్ రాజశేఖర్ రెడ్డి హాయంలో 25 లక్షల ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వడం జరిగిందని, ప్రస్తుతం ప్రజా పాలనలో ప్రతి నియోజవర్గానికి 3500 ఇందిరమ్మ ఇండ్లు పేదలకు అందించడం జరగిందని, పేదల ఆత్మగౌరవానికి ఇందిరమ్మ ఇండ్లు ప్రతీక అని ఈ సందర్భంగా గుర్తు చేశారు. బిఆర్ఎస్ సమయంలో డబుల్ బెడ్రూం ఇండ్ల పేరుతో పదేళ్ల కాలాన్ని గడిపారే తప్పా ఏ ఒక్క ఊళ్లో కూడా ప్రజలకు డబుల్ బెడ్రూం ఇండ్లు ఇవ్వలేదని, కేసిఆర్, కేటీఆర్, హరీష్‌లు మత్రం గడీలను నిర్మించుకున్నారని, పేదల పట్ల బిఆర్ఎస్ ప్రభుత్వానికి చిత్త శుద్ధి లేదని ఆయన అన్నారు. లంబాడీలకు రిజర్వేషన్లు కల్పించింది ఇందిరమ్మ అని గిరిజనుల మధ్య పంచాయతీ పెట్టే ఆలోచన కొందరు చేస్తున్నారని ప్రజా పాలనలో అలాంటి ఆటలు సాగవని అన్నారు. రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేసినగణతకాంగ్రెస్ ప్రభుత్వానిదని బిఆర్ఎస్ కాలంలో కేవలం వడ్డీలకే సరిపోయే విధంగా రుణమాఫీ చేసిందని కాంగ్రెస్ పార్టీ పూర్తి స్థాయిలో రుణమాఫీ చేసిన రైతు ప్రభుత్వంగా చరిత్ర సృష్టించిందని అన్నారు. కాంగ్రెస్ వస్తే కరెంట్ ఉండదని కేసీఆర్ అన్నారని రాష్ట్రంలో ఎక్కడ ఏ ఇంట్లో కూడా కరెంట్ పోవడం లేదని అది కాంగ్రెస్ పార్టీ కమిట్‌మెంట్ అని అన్నారు. కేసీఆర్ మాటలుములుగుడు మునపటవలె మందు మత్రం ఎప్పటిలాగే అన్న చందంగా ఉన్నాయని ప్రజలు కేసీఆర్‌ను ప్రజలు ఎప్పుడో మరిచిపోయారని అన్నారు. రాష్ట్రంలో 8లక్షల కోట్ల అప్పులు బిఆర్ఎస్ అప్పు చేసిందని ప్రజలకు అర్థమై కేసీఆర్‌ను సాగనంపారని, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో సైతం బిఆర్ఎస్‌ను బండకేసి కొట్టారని కేటీఆర్‌ఉన్నన్నిరోజులుబిఆర్ఎస్‌కు గుదిబండెనని అన్నారు. ఆడబిడ్డలకు ఆర్టిసిలో ఉచిత ప్రయాణం, పావలా వడ్డీ, అద్దె బస్సులు, పెట్రోల్ బంకులు ఇచ్చి మహిళల ఆత్మగౌరవానికి ప్రజా పాలన అద్దం పడుతుందని అన్నారు. దేవరకొండలో ప్రభుత్వ జూనియర్ కళాశాల, పాఠశాలకు అవసరమైననిధులుకేటాయిస్తానని, వెంకటేశ్వర స్వామి గుడికి నిధులు ఇస్తానని, నియోజకవర్గానికి నర్సింగ్ కళాశాల ఏర్పాటుకు హామీ ఇచ్చారు. నియోజకవర్గ అభివృద్ధికి మరిన్ని నిధుల కోసం త్వరలోనే మంత్రి సీతక్క, అట్లూరి లక్ష్మ ణ్, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిలతో సమీక్ష చేసి నియోజకవర్గ అభివృద్ధికి రోడ్ల నిర్మాణానికి, 200పడుకల ఆసుపత్రి అప్డేట్ కోసం సమీక్షించనున్నట్లు తెలిపారు. మద్దిమడుగులో గిరిజనుల ఆరాధ్య దైవం సేవాలాల్ విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. దేవరకొండ మునిసిపాలిటిలో 13 కోట్ల వ్యయంతో వివిధ వార్డులలో సిసి రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. మునిసిపాలిటిలోని 7,9,10 వార్డులలో రెండున్నర కోట్లతో మిగిలిపోయిన అండర్ గ్రౌండ్ డ్రైనేజి పనులకు శంకుస్థాపన చేశారు. 1నుండి 20 వార్డుల వరకు 50 లక్షల వ్యయంతో చేపట్టనున్న సిసి డ్రైన్లకు, రెండు కోట్ల వ్యయంతో ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో ట్రాక్‌తో సహా అభివృద్ధి పనులకు, మరో రెండు కోట్ల వ్యయంతో 19వ వార్డులో బిఎన్ఆర్ పార్క్ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి 11కోట్ల 33లక్షల46వేల విలువ గల బ్యాంక్ లింకేజి చెక్కులను మహిళ సంఘాలకు అందజేశారు. రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి , ఎంఎల్‌ఏ బాలునాయక్, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి, ఎంఎల్‌ఏలు జయవీర్‌రెడ్డి, సామేలు, మధుసూధన్‌రెడ్డి, వంశీకృష్ణ, ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం, సిపిఐ రాష్ట్ర నాయకులు పల్లా నర్సింహారెడ్డి, అంజయ్యానాయక్, అమిత్‌రెడ్డి, సంస్కృతిక శాఖ సలహామండలి సభ్యులు పల్లె నర్సింహా, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు కైలాష్, నర్సింహారెడ్డి, సిరాజ్‌ఖాన్, పార్టీ ప్రజా ప్రతినిధులు, మండల అధ్యక్షులు, యువజన కాంగ్రెస్ నాయకులున్నారు.



# జనరల్
STATE & REGIONAL NEWS

## కేంద్రంపై కలిసికట్టుగా బిసి రిజర్వేషన్ల కోసం కొట్లాడుదాం

సాయి ఈశ్వరాచారి మృతి దురదృష్టకరం : మంత్రి పొన్నం ప్రభాకర్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** కేంద్రం మీద అందరం కలిసి బిసి రిజర్వేషన్ కోసం కొట్లాడుదామని, ఛలో ఢిల్లీ కార్యక్రమం ద్వారా కేంద్ర ప్రభుత్వం దద్దరిల్లేలా 50 శాతం కోటా ఎత్తివేసేలా ఉద్యమించాలని మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు. సాయి ఈశ్వరాచారి మృతి దురదృష్టకరమని, ఇలాంటి బలిదానాలు ఎవరూ చేసుకోవద్దని సూచించారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ద్వారా ఆదుకుంటామని చెప్పారు. కుల గణనకి కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని, 50 శాతం రిజర్వేషన్ దాటరాదన్న కృష్ణమూర్తి కేసును కూడా సుప్రీంకోర్టులో సవాల్ చేయబోతున్నామని తెలిపారు. బల హీన వర్గాల సోషల్ జస్టిస్ విషయంలో కాంగ్రెస్ పార్టీ ఛాంపియన్ అని, తప్పని సరి పరిస్థితిల్లో గ్రామపంచాయతీ ఎన్నికలకి వెళ్లామని వివరించారు. ఎవరు ప్రేరేపించినా బిసిలు బలిపశువులు కావద్దన్నారు.

## అభివృద్ధి చెందిన దేశాలతో తెలంగాణ పోటీ

మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఈనెల 8, 9 తేదీల్లో భారత్ ఫ్యూచర్ సిటీ వేదికగా నిర్వహించబోతున్న గ్లోబల్ సమ్మిట్ ప్రపంచంలోనే రోల్ మోడల్‌గా నిలుస్తుందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఫ్యూచర్ సిటీలో గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లను మంత్రి శనివారం పరిశీలించారు. అనంతరం మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ ఈ సమ్మిట్‌కు దేశవిదేశాల నుంచి అనేక రంగాల్లో విశేష గుర్తింపు పొందిన దిగ్గజాలను ఆహ్వానించడం జరిగిందన్నారు. గడిచిన రెండేళ్లలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో పాటు 2037 విజన్, 2047 విజన్ ఈ రెండు సెక్టార్లకు సంబంధించిన ప్రభుత్వ లక్ష్యాలు, ఆలోచనలను ఈ సమ్మిట్‌లో వివరించబోతున్నామని తెలిపారు. తెలంగాణ రాష్ట్రాన్ని భారత దేశంలోనూ, ప్రపంచ స్థాయిలో అగ్రస్థానంలో నిలిపేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో తెలంగాణ రైజింగ్ 2047 విజన్‌తో ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. 2035 నాటికి తెలంగాణ ఆర్థిక వ్యవస్థను ఒక ట్రిలియన్ డాలర్ ఎకానమీగా వృద్ధి సాధించాలనే లక్ష్యంతో పనిచేస్తున్నామని, 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల లక్ష్యం సాధించాలని ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తుందన్నారు. సమ్మిట్‌పై ఇండిగో విమానాల రద్దు ప్రభావం ఏమాత్రం చూపదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దీనిపై ఎప్పటికప్పుడు వచ్చే అతిధులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పరిశీస్తున్నారని చెప్పారు.

## సమ్మిట్‌కు పలు రాష్ట్రాల సిఎంలకు ఆహ్వానం





తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌కు గవర్నర్‌కు ఆహ్వానం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** హైదరాబాద్ భారత్ ఫ్యూచర్ సిటీలో ఈ నెల 8, 9 తేదీలలో నిర్వహించనున్న 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్–2025'కు రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆహ్వానించింది. హైదరాబాద్ లోక్‌భవన్‌లో శనివారం గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు కలిసి గ్లోబల్ సమ్మిట్ ఆహ్వాన లేఖను అందించారు. ఈ సందర్భంగా సమ్మిట్ నిర్వహణ లక్ష్యాలను డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క గవర్నర్‌కు వివరించారు. కార్యక్రమంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణరావు పాల్గొన్నారు.

**మధ్యప్రదేశ్ సిఎం మోహన్ యాదవ్‌ను ఆహ్వానించిన మంత్రి తుమ్మల**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం భారత్ ఫ్యూచర్ సిటీలో ఈ నెల 8వ తేదీ నుంచి అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌లో పాల్గొనాల్సిందిగా రాష్ట్ర ప్రభుత్వం తరుపున వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్‌కు ఆహ్వానం అందజేశారు. మధ్యప్రదేశ్ సిఎంను ఆయన కార్యాలయంలో శనివారం మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలంగాణ రాష్ట్రం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, పెట్టుబడి అవకాశాలు, వివిధ రంగాల్లో రాష్ట్రం సాధించిన పురోగతిని మధ్యప్రదేశ్ సిఎంకు వివరించారు. దేశ–విదేశాల నుండి అనేక పరిశ్రమలు, పెట్టుబడిదారులు, నిపుణులు పాల్గొనబోతున్న ఈ గ్లోబల్ సమ్మిట్‌లో మధ్యప్రదేశ్ పాల్గొనడం రెండు రాష్ట్రాల మధ్య సహకార అవకాశాలను మరింత విస్తరిస్తుందని తెలిపారు. తెలంగాణ, మధ్యప్రదేశ్ రాష్ట్రాల అభివృద్ధి ప్రయాణంలో పరస్పర సహకారం కీలకమని, ఈ సమ్మిట్ ఆ దిశగా మంచి వేదిక కానుందని మంత్రి తుమ్మల పేర్కొన్నారు.

**పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీకి ఆహ్వానం**



ప్రభుత్వం ఈనెల 8, 9 తేదీల్లో నిర్వహించనున్న తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ కార్యక్రమం ఆహ్వానానికి గాను తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ ఆహ్వానం అందుకోవడం ఎంతో గౌరవప్రదమైనదని ఆమె పేర్కొన్నారు. అయితే గ్లోబల్ సమ్మిట్ నిర్వహిస్తున్న తేదీల్లో తనకు ముందుగానే నిర్ణయించిన జిల్లా పర్యటనలు ఉండటం వల్ల, కార్యక్రమానికి హాజరు కాలేకపోతున్నట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి తోడ్పడే విధంగా ఈ గ్లోబల్ సమ్మిట్ సార్థక చర్చలకు వేదికగా నిలిచి, రాష్ట్ర ఆర్థిక పురోగతికి కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశంగా మారాలని ఆమె ఆకాంక్షించారు. తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ కార్యక్రమం ఘన విజయం సాధించాలని మమతా బెనర్జీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఆహ్వాన పత్రిక అందుకున్న అనంతరం మమతా బెనర్జీ తెలంగాణ ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతూ లేఖ పంపారు. ఈ సందర్భంగా తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ కార్యక్రమం ఘన విజయం సాధించాలని ఆమె ఆకాంక్షించారు.

## రైతులకు రక్షణ కల్పించేలా విత్తన చట్టం

ఆ దిశగా కేంద్రం కొత్త చట్టం రూపొందించాలి : రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** విత్తన చట్టమంటే కేవలం మల్టీనేషనల్ కంపెనీలకు ఉపయోగపడే విధంగా కాకుండా రైతులకు రక్షణ కల్పించే చట్టమై ఉండాలని ఆ దిశగా కేంద్రం విత్తన చట్టం రూపొందించాలని తెలంగాణ వ్యవసాయ రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ ఎం.కోదండరెడ్డి డిమాండ్ చేశారు. ఇటీవల కేంద్రం విడుదల చేసిన విత్తన చట్టం 2025 ముసాయిదాపై శనివారం రైతు కమిషన్ కార్యాలయంలో విత్తన కంపెనీలతో సమీక్ష సమావేశం జరిగింది. రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి అధ్యక్షతన రిగిన ఈ సమావేశంలో హాజరైన కమిషన్ సభ్యులు కెవిఎన్ రెడ్డి, రాములు నాయక్, భవాని రెడ్డి, హార్టికల్చర్ యూనివర్సిటీ విసి రాజిరెడ్డి, సీడ్ కంపెనీల ప్రతినిధులు, వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ అధికారులు. వ్యవసాయ రంగ నిపుణులు, కమిషన్ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్ర విత్తన చట్టంలోని చేర్చిన అంశాలతో రైతులకు లాభనష్టాలు ఆలోచనలపై సమీక్షించడంతోపాటు విత్తన కంపెనీల ప్రతినిధుల అభిప్రాయాలను కమిషన్ సేకరించారు. ఈ సందర్భంగా రైతు కమిషన్ కోదండరెడ్డి మాట్లాడుతూ కేంద్రం తెస్తున్న విత్తన చట్టం రైతులకు ఏమాత్రం ఉపయుక్తంగా లేదని కేవలం మల్టీనేషనల్ విత్తన కంపెనీల కోసమే అన్నట్లుగా వుందని, సీడ్ కంపెనీలు సైతం ఇదే అభిప్రాయం వ్యక్తం చేశారన్నారు. ఇప్పటికే ఈనెల 2వ తేదీన వివిధ రాజకీయ పార్టీల నేతలు, వ్యవసాయ రంగ నిపుణులు, అధికారులు, శాస్త్రవేత్తలు, రైతు సంఘాల నాయకులు, రైతులతో నిర్వహించిన సమావేశంలో కేంద్రం తెస్తున్న చట్టంపై చాలావరకు అభ్యంతరాలు వ్యక్తమయ్యాయని తెలిపారు. దేశంలోనే విత్తనోత్పత్తికి తెలంగాణ కేంద్రంగా వుంది ప్రపంచదేశాలకు తెలంగాణ విత్తనం ఎగుమతి అవుతోందన్నారు. కేంద్రం తీసుకువస్తున్న విత్తన చట్టంలో మార్పులు చేర్పులు చేయాల్సిందేనన్నారు. తెలంగాణలో విత్తన కంపెనీల తీరుపై సమావేశంలో చర్చకు రాగా సీడ్ కంపెనీలు కూడా వారి లోపాలను సవరించుకుంటామని హామీ ఇచ్చారన్నారు. రైతుకు నష్టం లేకుండా చట్టం ఉండాలని, కంపెనీలు కూడా చెబుతున్నాయన్నారు. ఆర్గనైజర్ల వ్యవస్థ వల్ల రైతులకు కంపెనీలకు కూడా నష్టమేనని నిర్ధారణకు వచ్చారని, కానీ లక్షలాది మంది రైతుల వద్దకు నేరుగా కంపెనీ వెళ్లలేని పరిస్థితుల్లో ఈ ఆర్గనైజర్లు వచ్చారని తెలిపారు. నకిలీ విత్తనం విషయంలో రైతులకు నష్టపరిహారం అందించకుండా ఈ కేంద్రం తెస్తున్న చట్టంలో స్పష్టత లేదని, రైతులు కోర్టులను ఆశ్రయించాలంటే.. వారికీ ఎప్పుడు న్యాయం జరుగుతుందో తెలియదని పేర్కొన్నారు. విత్తన కంపెనీలకు అనుమతులు ఇవ్వడం, ధర నిర్ధారణ అంత రాష్ట్ర పరిధిలోనే ఉండాలని, కానీ కేంద్రం తెస్తున్న చట్టం ప్రకారం కేంద్రం చేతుల్లోనే ఉండనుందన్నారు. ఈనెల 11న వరకు కేంద్రం విత్తన చట్టంపై అభ్యంతరాలు తెలపడానికి గడువు ఉండడంతో కమిషన్ తరుపున.. కేంద్రానికి, రాష్ట్రానికి విత్తన చట్టంపై అభ్యంతరాలను పంపనున్నట్లు కోదండరెడ్డి తెలిపారు.

## మోదీ దేశ చరిత్రను మార్చేలా కుట్రలు

టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ తూర్పు జయప్రకాష్ రెడ్డి (జగ్గారెడ్డి)



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రధాని మోదీ దేశ చరిత్రను మార్చే కుట్రలు చేస్తున్నారని, అందులో భాగంగానే దేశంలో నెహ్రూ, గాంధీ కుటుంబాల త్యాగాలు ఉండొద్దని విషపూరిత ప్రచారం చేస్తున్నారని టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ తూర్పు జయప్రకాష్ రెడ్డి (జగ్గారెడ్డి) ఆగ్రహం వ్యక్తం చేశారు. మంచిని మంచి అనలేని వ్యక్తి ప్రధానిగా ఉండడం దురదృష్టకరమన్నారు. గాంధీభవన్‌లో శనివారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశ స్వతంత్రం కంటే ముందు రాజకీయాలు లేవని, బానిసలుగా ప్రజలు ఉండొద్దు అనేది సింగిల్ అజెండాగా స్వతంత్ర ఉద్యమం నిర్వహించారన్నారు. స్వతంత్రం వచ్చిన తర్వాత పుట్టిన పార్టీ బిజెపి, మోడీ ప్రధాని కావడానికే పని చేశారని, కానీ నెహ్రూ ప్రధాని కావడానికి స్వంతంత్ర పోరాటం చేయలేదని, మోదీ అబద్ధాలు చెప్పి నెహ్రూ చరిత్రను మార్చలేరన్నారు. నెహ్రూ, రాహుల్ గాంధీ కుటుంబం ఉనికి రాజకీయాల్లో ఉండకూడదని మోదీ దుర్మార్గమైన ఆలోచన చేస్తున్నారన్నారు. నెహ్రూ, ఇందిరా గాంధీపై ప్రధాని మోదీ ఎన్ని సార్లు విమర్శ చేసినా, వారికి ఉన్న చరిత్ర బిజెపికి లేదని, భవిష్యత్‌లో రాదని అన్నారు. నెహ్రూ పరిపాలనలో అందించిన మంచి పనిని మంచి అనే చెప్పే గుణం బిజెపికి లేకపోవడం దురదృష్టకరమన్నారు. దేశ ప్రజలకు 56 ఏళ్ళ కాంగ్రెస్ పరిపాలనలో చేసిన వందల అభివృద్ధి పనులు తాము చెప్పగలమని, 11 ఏళ్ల ప్రధాని మోదీ ఏం అభివృద్ధి చేశారో చెప్పగలరా? అని ఆయన ప్రశ్నించారు. మోదీ మాదిరాగా చోరీ ఓట్లతో నెహ్రూ ప్రధాని కాలేదని, ప్రజల మద్దతుతో ప్రధాని అయ్యారన్నారు. దేశ భద్రతకు ఆహార భద్రత ఇచ్చిన గొప్ప నాయకుడు నెహ్రూ అని, దేశ ప్రజలకు మూడు పూటల అన్నం పెట్టడమే కాదు పొరుగు దేశాలకు కూడా ధాన్యం అందించిన చరిత్ర నెహ్రూదన్నారు. స్వాతంత్ర ఉద్యమంలో మోదీ, బిజెపి పాత్ర ఏముందని ప్రశ్నించారు. బిజెపి సింగిల్ అజెండా రామాలయమని, కానీ రాముడు మాదిరిగా బిజెపి ఆదర్శవంతమైన పాలన చేయడంలేదన్నారు. అయోధ్యలో రామాలయం నిర్మించామని చెప్పడం తప్పితే మోదీ దేశానికి ఏం చేయలేదన్నారు.

## గ్లోబల్ సమ్మిట్‌లో పాల్గొనండి

హర్యానా సిఎం, కేంద్రమంత్రికి ఆహ్వానం





**ప్రజాపక్షం/హైదరాబాద్/కరీంనగర్ :** తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్– 2025కు ఆహ్వానాల కార్యక్రమంలో భాగంగా, రాష్ట్ర ఎస్‌సి, ఎస్‌టి, దివ్యాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్ శనివారం హర్యానా, పంజాబ్ రాష్ట్రాలను సందర్శించారు. తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌కు రావాల్సిందిగా హర్యానా ముఖ్యమంత్రి నయాబ్ సింగ్ షైనీ, పంజాబ్ రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి హర్‌పాల్ సింగ్‌కు మంత్రి అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్ ఆహ్వానాలను అందజేశారు. ఈ సందర్భంగా సమ్మిట్ ప్రాముఖ్యత, తెలంగాణ భవిష్యత్ అభివృద్ధి పథం, పెట్టుబడుల అవకాశాలు, రాష్ట్రాల మధ్య సహకార వేదిక వంటి కీలక అంశాలపై ఇరు రాష్ట్రాల నాయకులతో విస్తృతంగా చర్చించారు. తెలంగాణ అభివృద్ధి వేగం, పెట్టుబడులను ఆకర్షించే దూరదృష్టి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో వెలుగు చూస్తున్న కొత్త అవకాశాలను హర్యానా సిఎం ఈ సందర్భంగా ప్రశంసించారు.

**కేంద్ర మంత్రి సంజయ్‌కి మంత్రి పొన్నం ప్రభాకర్ ఆహ్వానం**

రాజకీయాలకు అతీతంగా అన్ని పార్టీలు అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని, తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌కు హాజరు కావాలని కోరుతూ కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కి రాష్ట్ర రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆహ్వానపత్రిక అందజేశారు. కరీంనగర్‌లో శనివారం బండి సంజయ్‌ని కలిసి ఆహ్వానించారు. అనంతరం మంత్రి పొన్నం ప్రభాకర్ మీడియాతో మాట్లాడుతూ రైజింగ్ 2040 విజన్‌తో భారతదేశంలో తెలంగాణను అగ్రగామిగా నిలుపుతామని తెలిపారు. పెట్టుబడులు, పారిశ్రామిక అభివృద్ధి సమ్మిట్ ద్వారా సాధిస్తామని చెప్పారు. గత పదేళ్లలో తెలంగాణ ఆర్థికంగా వెనుకబడిందని, అభివృద్ధి విషయంలో కేంద్రం సహకరించాలని కోరారు. పక్క రాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌కు ఎక్కువ నిధులు ఇస్తోందని, కేంద్రం అన్ని రాష్ట్రాలను సమానంగా చూడాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, మానకొండూరు ఎంఎల్‌ఎ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, కరీంనగర్ నగర కాంగ్రెస్ అధ్యక్షులు వైద్యుల అంజన్ కుమార్ పాల్గొన్నారు.

## కార్పొరేట్ విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలి

డిహెచ్‌పిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనిల్ కుమార్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కార్పొరేట్ విధానాలకు వ్యతిరేకంగా నిరంతరం సామాజిక ఉద్యమ శక్తులు పోరాటాలకు సిద్ధం కావాలని డిహెచ్ పిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్ కుమార్ పిలుపునిచ్చారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ 69 వర్ధంతి సందర్భంగా హిమాయత్‌నగర్‌లో వై జంక్షన్‌లోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా డిహెచ్‌పిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్ కుమార్, హైదరాబాద్ జిల్లా కార్యదర్శి జైరుపోతుల కుమార్, కె.మారుతితో కలిసి నివాళ్లు అర్పించారు. అనంతరం మారూపాక అనిల్ కుమార్ మాట్లాడుతూ అంబేద్కర్ ఆశించిన కులరహిత సమాజాన్ని సాధించడానికి నేటితరం సమరానికి సిద్ధం కావాలని, అదే అంబేద్కర్‌కు కల్పించే నిజమైన నివాళి అని అన్నారు. మోదీ ప్రభుత్వం రాజ్యాంగ మౌలిక పునాదులపై దాడి చేస్తూ రాజ్యాంగ నిర్మితమైన స్వతంత్ర సంస్థలను తమ జేబు సంస్థలుగా మార్చుకుంటుందని విమర్శించారు. దేశభక్తి ముసుగులో ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటు కార్పోరేట్ శక్తులకు ధారాదత్తం చేస్తూ అడవులన్నింటినీ అదానీకి అప్పగించడానికి ప్రయత్నం చేస్తుందన్నారు.

## అంబేద్కర్ కలలను ధ్వంసం చేస్తున్న మోదీ ప్రభుత్వం

ఈటి నరసింహ



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం బి.ఆర్.అంబేద్కర్ కన్న కలలను ధ్వంసం చేస్తోందని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈటి నరసింహ అన్నారు. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ 69వ వర్ధంతి సందర్భంగా హైదరాబాద్‌లోని లోయర్ ట్యాంక్‌బండ్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహానికి సిపిఐ హైదరాబాద్ కౌన్సిల్ ఆధ్వర్యంలో సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈటి నరసింహ, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు ఛాయాదేవి సిపిఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి స్టాలిన్ జిల్లా కార్యవర్గ సభ్యులు నెర్లకంటి శ్రీకాంత్, కౌన్సిల్ సభ్యులు నరేష్ గ్యార, అనిల్ కుమార్, నాయకులు ఉప్పల ఉదయ్ కుమార్, రాజు ,అరవింద్, పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా ఈటి నరసింహ మాట్లాడుతూ రంగాల్లో విస్తృతంగా కృషి చేసిన అపర మేధావి బాబాసాహెబ్ అంబేద్కర్ అని, ఆయనను కేవలం రాజ్యాంగ రచనకే పరిమితం చేయటం సముచితం కాదని అన్నారు. నేడు అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం 44 కార్మిక చట్టాలను రద్దుచేసి వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకువచ్చి కార్మిక హక్కులను కాల రాయడమే కాకుండా కాలం చెల్లిన 12 గంటల విధానాన్ని తిరిగి తీసుకువస్తూ కార్మికులను యాజమాన్యాలు మరింత దోపిడీ చేసుకోవడానికి బిజెపి ప్రభుత్వం ప్రయత్నం చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మికులు సమ్మెలు చేయటానికి వీలు లేకుండా, సంఘాలు పెట్టడానికి అవకాశం లేకుండా కేంద్ర ప్రభుత్వం చట్టాలు తీసువచ్చిన ఈ చట్టాలకు వ్యతిరేకంగా ఉద్యమాలు కొనసాగించాలని ఆయన పిలుపునిచ్చారు.

## ఘనంగా గుమ్మడి నర్సయ్య బయోపిక్ సినిమా ప్రారంభం

హాజరైన మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని



**ప్రజాపక్షం/పాల్వంచ :** పాల్వంచ వాసి నల్లా సురేష్ నిర్మాతగా ప్రవల్లిక ఆర్ట్ క్రియేషన్ ఆధ్వర్యంలో కన్నడ సూపర్ స్టార్ శివరాజ్ కుమార్ కథానాయకుడిగా, దర్శకుడు పరమేశ్వర్ సారథ్యంలో పానిండియా స్థాయిలో నిర్మిస్తున్న ఇల్లందు నియోజకవర్గం నుండి ఐదుసార్లు ఎన్నికైన మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య బయోపిక్ సినిమా షూటింగ్ పాల్వంచలో శనివారం మొదలైనది. పాల్వంచకు చేరుకున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, కథానాయకుడు శివరాజ్‌కుమార్, గుమ్మడి నర్సయ్యలు పెద్దమ్మతల్లి ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం హెచ్ కన్వెన్షన్ హాల్‌కు చేరుకొని సినిమా పూజా కార్యక్రమాలను నిర్వహించి క్లాప్ కొట్టి షూటింగ్‌ను లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం జరిగిన సభలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ కమ్యూనిస్టు పార్టీ నుండి ఐదుసార్లు ఎమ్మెల్యేగా గెలిచి సాధారణ జీవితం గడుపుతున్న గుమ్మడి నర్సయ్య జీవిత చరిత్ర ఆధారంగా నిర్మిస్తున్న గుమ్మడి నర్సయ్య సినిమా విజయవంతం కావాలని ఆకాంక్షించారు. దేశంలో ఒక్కసారి ప్రజా ప్రతినిధిగా ఎన్నికైన వారు కోట్లకు పడగలెత్తుతున్నారని, కానీ గుమ్మడి నర్సయ్య ఎపుడూ ప్రజల మనిషిగానే ఉన్నారని, పేద ప్రజల సమస్యల పరిష్కారానికి నిస్వార్థంగా అనునిత్యం పాటుపడుతుంటారని అన్నారు. అవినీతికి, ఆడంబరాలకు, ఆర్భాటాలకు దూరంగా సాదాసీదాగా ఉంటున్నారని అన్నారు. నాడు, నేడు ఆయన వాహనం సైకిల్ మాత్రమేనన్నారు. వారసత్వంగా వచ్చిన భూమిని సాగు చేసుకొని జీవనం సాగిస్తున్న గుమ్మడి నర్సయ్య ఆదర్శ నాయకుడన్నారు. అందుకే ఆయన ప్రజల మనిషిగా నిలబడ్డారని కొనియాడారు. వారి జీవిత చరిత్ర ఆధారంగా తెరకెక్కుతున్న సినిమా నేటితరం నాయకుల్లో మార్పు తెస్తుందని ఆకాంక్షించారు.

**సాధారణ జీవితం కమ్యూనిస్టుకే సాధ్యం :** అపుడు, ఇప్పుడూ, ఎల్లప్పుడూ కమ్యూనిస్టు నాయకులకు మాత్రమే సాధారణ జీవితం సాధ్యమని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. కమ్యూనిస్టులు ఉన్నత విలువలు పాటిస్తారని అన్నారు. మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నరసయ్య జీవిత చరిత్ర ఆధారంగా తెరకెక్కిస్తున్న సినిమా నిర్మాత పాల్వంచకు చెందిన నల్లా సురేష్‌రెడ్డికి ధన్యవాదములు తెలిపారు. ఐదుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికైన గుమ్మడి నరసయ్య సామాన్యుల్లో సామాన్యుడిగా తన జీవితాన్ని గడుపుతున్నారని అన్నారు. అదేవిధంగా ఆయన కమ్యూనిస్టు పార్టీకి చెందిన వాడు కాబట్టి ఉన్నత విలువలను కలిగి ఉన్నారన్నారు. కమ్యూనిజం ఎపుడూ మనుషులను మహోన్నతులుగా తయారుచేసే సిద్ధాంతమన్నారు. ఏ కమ్యూనిస్టు నాయకుడిని తీసుకొన్నా సరే వారి జీవితాలు సాధారణంగా, ఆదర్శంగా ఉన్నాయని తెలిపారు. ప్రజా పోరాటంలో మరణించిన హిడ్మా తంబాల కేశవరావు, సుధాకర్‌రెడ్డి సీతారాం ఏచూరిలు ఇలా చాలా మంది నాయకులు వేల లక్షల ప్రజల అభిమానం చూరగొన్న వారు కేవలం కమ్యూనిస్టులేనన్నారు. కమ్యూనిజం ఎక్కడుందని అడిగితే గుమ్మడి నరసయ్య నిదర్శనమన్నారు. కమ్యూనిస్టు కాబట్టే అందరికి ఆదర్శంగా ఉండగలుగుతున్నాడని పేర్కొన్నారు. తమిళనాడులో అగ్ర కథానాయకుడు గుమ్మడి నరసయ్య జీవిత చరిత్ర సినిమాలో నటించడం శుభ పరిణామమన్నారు. ఈ సినిమా రానున్న తరాలకు, నాయకులకు స్ఫూర్తిదాయకంగా ఉండాలని ఆకాంక్షించారు. అశ్వారావుపేట, ఇల్లందు, పినపాక ఎమ్మెల్యేలు జారె ఆదినారాయణ, కోరం కనకయ్య, పాయం వెంకటేశ్వర్లు, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే.సాబీర్ పాషా, జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత, మల్లు నందిని, టిపిసిసి జనరల్ సెక్రటరి నాగా సీతారాములు, కోనేరు చిన్ని తదితరులు పాల్గొన్నారు.


**గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్**
సూపరింటెండింగ్ ఇంజనీర్ కార్యాలయం, శేరిలింగంపల్లి జోన్ : జిహెచ్‌ఎంసి.
మెయిల్: sew.ghmc@gmail.com సెల్ నెం. 7331186858, 9154172331
'ఇ' ప్రొక్యూర్‌మెంట్ ప్రకటన
NIT No.39/SE/SLPZ/GHMC/2025-26 తేది: 06.12.2025
**పని పేరు:** (02 ఐటమ్స్) జిహెచ్‌ఎంసి, ఎస్‌ఎల్‌పిజెడ్, సర్కిల్-21 & సర్కిల్-22లో కమ్యూనిటీ హాల్ నిర్మాణం & సిసి, బిటి రోడ్లు వేయడం. **అంచనా వ్యయం / ఇసివి:** రూ.335.00 లక్షలు, **బిడ్స్ స్వీకరణకు ప్రారంభ తేది / ఆఖరి తేది & సమయం:** 08.12.2025న మ.1.00గం.ల నుండి 15.12.2025న మ.1.30గం.ల వరకు & 08.12.2025న మ.1.00గం.ల నుండి 22.12.2025న మ.1.30గం.ల వరకు. **అధికారి పేరు & చిరునామా:** ఎస్‌ఇ, ఎస్‌ఎల్‌పిజెడ్, జిహెచ్‌ఎంసి. సెల్ నెం. 7331186858.
సం/- సూపరింటెండింగ్ ఇంజనీర్, శేరిలింగంపల్లి జోన్ : జిహెచ్‌ఎంసి.
DIPR R.O. No. : 11785-PP/CL/ADVT/1/2025-26, Date: 06-12-2025



**గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ :: సర్కిల్-2, ఉప్పల్.**
టెండర్ ప్రకటన
NIT No.23/EEC-2/UPL/GHMC/2025-26 తేది: 06.12.2025
**పని పేరు:** 4 పనుల కోసం "జిహెచ్‌ఎంసి, ఉప్పల్ సర్కిల్-2, చిల్కానగర్, వార్డ్ నెం.7 లోని వివిధ ప్రదేశాలలో క్యాచ్‌పిట్ మరమ్మతులు, పోహోల్స్ మరియు ప్యాచ్‌లతో సహా అత్యవసర మరమ్మతు పనులకు హాజరు కావడం................ జిహెచ్‌ఎంసి, ఉప్పల్ సర్కిల్-2, ఉప్పల్, వార్డ్ నెం.10 లోని వివిధ ప్రదేశాలలో క్యాచ్‌పిట్ మరమ్మతులు, పోహోల్స్ మరియు ప్యాచ్‌లతో సహా అత్యవసర మరమ్మతు పనులకు హాజరు కావడం." **అంచనా వ్యయం :** రూ. 22.40 లక్షలు, **బిడ్స్ స్వీకరణకు ఆఖరి తేది & సమయం:** 15.12.2025న మ.3.00గం.ల వరకు. **అధికారి పేరు & చిరునామా:** శ్రీ వి.హరిలాల్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, ఉప్పల్ డివిజన్ నెం.2, జిహెచ్‌ఎంసి. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ అనగా http://www.Tender.telangana.gov.inలో చూడవచ్చు.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సర్కిల్-2, ఉప్పల్, జిహెచ్‌ఎంసి.
DIPR R.O. No. : 11775-PP/CL/ADVT/1/2025-26; Date: 06-12-2025



# జనరల్
STATE & REGIONAL NEWS

## ఇండిగో విమానాల రద్దుతో రైల్వేశాఖ కీలక నిర్ణయం



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఇండిగో విమానాల రద్దుతో దక్షిణ మధ్య రైల్వే పలు కీలక నిర్ణయాలు తీసుకున్నట్లు చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ ఎ.శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. 37 ప్రీమియం రైళ్లలో 116 కోచ్‌లు పెంచినట్లు ఆయన వెల్లడించారు. 18 రైళ్లలో ప్రయాణికుల సామర్థ్యాన్ని పెంచామని తెలిపారు. 3 కీలక రైళ్లలో స్లీపర్ క్లాస్ కోచ్‌లను తూర్పు రైల్వే కూడా పెంచిందన్నారు. 8 రైళ్లలో థర్డ్ ఎసి, చైర్‌కార్ కోచ్‌లను కూడా నార్తర్న్ రైల్వే పెంచాల్సి వచ్చిందన్నారు. థర్డ్ ఎసి, సెకండ్ ఎసి కోచ్‌లను పెంచిన పశ్చిమ రైల్వే, సెకండ్ ఎసి కోచ్‌లను అదనంగా ఈస్ట్ సెంట్రల్ రైల్వే సమకూర్చిందన్నారు. 10 రూట్లలో శనివారం నుంచి 10వ తేదీ వరకు ప్రీమియం రైళ్లలో అదనపు కోచ్‌లు ఏర్పాటు చేసినట్లు శ్రీధర్ తెలిపారు.

## గ్లోబల్ సమ్మిట్ ప్రాంగణంలో
# తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటు : సిఎం



భారత్ ఫీచర్ సిటీ గ్లోబల్ సమ్మిట్‌కు సర్వం సన్నద్ధం



**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ రైజింగ్‌లో తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటు చేయాలని సిఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. డిసెంబర్ 6న సాయంత్రం ఏరియల్ వ్యూ ద్వారా తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లను పరిశీలించారు. రేవంత్ వెంట మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి కూడా ఉన్నారు. రంగారెడ్డి జిల్లా కందుకూర్ మండలం ఫ్యూచర్ సిటీలో డిసెంబర్ 8,9 వ తేదీల్లో రైజింగ్ గ్లోబల్ సమిట్ జరగనుంది. తెలంగాణను ప్రపంచ పెట్టుబడులకు గమ్యస్థానంగా మార్చడంతో పాటు రాష్ట్ర బ్రాండ్ ఇమేజ్‌ను అంతర్జాతీయ స్థాయిలో పెంచడమే లక్ష్యంగా ఈ సదస్సును ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోంది తెలంగాణ ప్రభుత్వం. డిసెంబర్ 8 మధ్యాహ్నం ఒంటి గంటకు గ్లోబల్ సమ్మిట్‌ను గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ ప్రారంభించనున్నారు. తొలి రోజు ముఖ్యమంత్రి, మంత్రుల ప్రసంగాలు ఉంటాయి. మొత్తం 27 సెషన్లు ఉంటాయి. డిసెంబర్ 8న మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 3 గంటల వరకు ప్రసంగాలు ఉంటాయి. మధ్యాహ్నం 2.30గంటలకు రేవంత్ ప్రసంగించనున్నారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి పలు రంగాలపై చర్చ జరుగుతుంది. 3 గంటల నుంచి 4 గంటల వరకు విద్యుత్ రంగంపై చర్చ ఉంటుంది. సెమీ కండక్టర్లు, గ్రీన్ ఎర్జీ , ఎరోస్పేస్ ఎడ్యుకేషన్ పై చర్చ జరుగుతుంది. సాయంత్రం 6గంటలకు సమ్మిట్ ముగుస్తుంది. డిసెంబర్ 9వ తేదీ ఉదయం 10 గంటలకు సమ్మిట్ ప్రారంభం అవుతుంది. సాయంత్రం 6 గంటలకు ముగుస్తుంది. గ్లోబల్ సమ్మిటి ప్రాంతానికి సాయంత్రం 4.30 గంటలకు హెలిక్యాప్టర్‌లో సిఎం రేవంత్‌రెడ్డి సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. సమ్మిటి జరిగే అన్ని హాల్స్‌ను సిఎం స్వయంగా తిరిగి అధికారులతో ఏర్పాట్లపై చర్చించారు.ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూడాలని అన్ని విభాగాల అధికారులను సిఎం కోరారు.ప్రతిష్టాత్మక భారత్ ఫీచర్ సిటీ గ్లోబల్ సమ్మిట్ కోసం అన్నీ ఏర్పాట్లు పూర్తయ్యాయి. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ప్రముఖ పారిశ్రామికవేత్తలు, టెక్ దిగ్గజాలు, ఇన్నోవేషన్ కంపెనీల ప్రతినిధులు పాల్గొనే ఈ సమ్మిట్ హైదరాబాద్‌లో జవజవలాడేలా భద్రత నుంచి సౌకర్యాల వరకు ప్రభుత్వ యంత్రాంగం పకడ్బందీ ఏర్పాట్లు పూర్తి చేసిందని ఫ్యూచర్ సిటీ డౌలప్‌మెంట్ అథారిటి కమిషనర్ శశాంక మీడియా సమావేశంలో తెలిపారు.. సమ్మిట్ వేదికను ఆధునికీకరించి హైటెక్ ఎగ్జిబిషన్ స్టాల్స్, బిజినెస్ మీటింగ్స్, స్టార్టప్ షోకేస్‌ల కోసం ప్రత్యేక మండపాలు ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా భారత్ ఫీచర్ సిటీ ప్రాజెక్ట్ పురోగతి, భవిష్యత్ దిశ, అంతర్జాతీయ భాగస్వామ్యాలపై ప్రత్యేక సెషన్లు నిర్వహించబడనున్నాయి. వివిఐపిల రాకను దృష్టిలో ఉంచుకొని ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్, భద్రతా చర్యలు కట్టుదిట్టం చేశారు. విదేశీ ప్రతినిధుల కోసం ప్రత్యేక రిసెప్షన్ కౌంటర్లు, హెల్ప్‌డెస్క్‌లు, అనువాద సదుపాయాలు కూడా సిద్ధంగా ఉంచినట్లు అధికారులు తెలిపారు. పరిశ్రమలు, ఐటి, ఇన్నోవేషన్ రం గాల్లో తెలంగాణ సామర్థ్యాన్ని ప్రపంచానికి చూపించడానికి ఈ సమ్మిట్ కీలకంగా ఉండబోతోందని నిర్వాహకులు ఆశాభావం వ్యక్తం చేశారు. జనరల్ సెషన్లతో పాటు పలు దేశాలతో ద్వైపాక్షిక చర్చలు కూడా జరిగే అవకాశం ఉంది. సమ్మిట్ విజయవంతం కావడానికి అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేస్తున్నాయని వెల్లడించింది.

### బాంబ్‌స్క్వాడ్ తనిఖీలు..

సమ్మిట్ జరిగే ప్రదేశంలో అణులణువున బాంబ్‌స్క్వాడ్ బృందాలు విస్తృతంగా తనిఖీ నిర్వహించాయి. సమ్మిట్ ప్రధాన మందిరం, డెలిగేట్స్, స్టాల్స్, భోజన శాల, విశ్రాంతి గదులు, కాన్ఫరెన్స్ హాల్, పార్కింగ్ ప్రాంతాల్లో బాంబ్‌స్క్వాడ్ స్నిఫర్‌డాగ్స్‌తో తనిఖీ చేశాయి. సమ్మిట్‌కు వచ్చేప్రతిఒక్కరు మెటల్ డిటెక్టర్ ద్వారాల గుండానే ప్రవేశంఉండేటట్లుపోలీసులుపకడ్బంది ఏర్పాటు చేశారు.

### సమ్మిట్‌కు ప్రముఖులు..

నోబెల్ బహుమతి గ్రహీత, ప్రముఖ ఆర్థికవేత్త అభిజిత్ బెనర్జీ, వరల్డ్ ఎకనామిక్ సమ్మిట్ సీఈవో జెరెమీ జుర్గెన్స్, నోబెల్ శాంతి బహుమతి గ్రహీత కైలాష్ సత్యార్థి, ట్రంప్ మీడియాటెక్నాలజీ గ్రూప్ సీఈఓ ఎరిక్ స్వ్రడర్, బయోకాన్ లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ చైర్‌పర్సన్ కిరణ్ మజుందార్ షా రానున్నారు.

## బిసిల ప్రాణాలంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు లెక్క లేదు

### బిసి జెఏసి చైర్మన్ జాజుల శ్రీనివాస్‌గౌడ్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** బిసిల ప్రాణాలంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు లెక్క లేదంటూ బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, బిసి జెఏసి చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. బిసి రిజర్వేషన్ల సాధన కోసం తన విలువైన ప్రాణాలను త్యజించిన సాయిఈశ్వరచారి మరణం పట్ల రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కేంద్రమంత్రి కిషన్ రెడ్డిలు కనీసం సానుభూతి వ్యక్తం చేయలేదని, కనీసం ఫోన్‌లోనైనా ఆ కుటుంబాన్ని పరామర్శించలేదని కాంగ్రెస్ బిజెపి నేతలపై మండిపడ్డారు. బిసి రిజర్వేషన్ల కోసం ఆత్మ బలిదానం గావించిన సాయి ఈశ్వర చారి అంతిమయాత్ర సందర్భంగా జాజుల శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో వందలాదిమంది బిసి సంఘాల శ్రేణులు శనివారం హైదరాబాద్‌లోని జగద్గిరిగుట్టలో పాల్గొన్నారు. అంతిమయాత్ర సందర్భంగా దారి పొడవునా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ, బిసిల కోసం బలిదానం చేసిన సాయి ఈశ్వర చారి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని నినదించడంతో పాటు రాష్ట్ర ప్రభుత్వం దిగివచ్చి చర్చలు జరపాలని కోరుతూ కొద్దిసేపు రోడ్డుపై బైఠాయించారు. 48 గంటల్లో సాయి ఈశ్వర్ కుటుంబాన్ని ఆదుకుంటామని రాష్ట్ర ప్రభుత్వం నుండి ప్రకటన రాకపోతే డిసెంబర్ రెండో వారంలో వేలాది మందితో ఢిల్లీలోని రాహుల్ గాంధీ ఇంటిని ముట్టడిస్తామని జాజుల హెచ్చరించారు. బిసి జెఏసి వర్కింగ్ చైర్మన్ గుజ్జ కృష్ణ, బిసి కుల సంఘాల జెఎసి చైర్మన్ కుందారం గణేష్ చారి, విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షులు తాటికొండ విక్రమ్ గౌడ్, మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు భీమని మంజరి, భూదాని సదానందం, కవుల జగన్నాథ, ఈడిగ శ్రీనివాస్ గౌడ్, దరువు అంజన, బూడిద మల్లికార్జున యాదవ్, తారకేశ్వరి, సంధ్యరాణి గూడూరు భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## సామాజిక న్యాయం కాంగ్రెస్ పార్టీ ప్రధాన భూమిక

### టిపిసిసి అధ్యక్షులు మహేష్‌కుమార్ గౌడ్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** సామాజిక న్యాయం ప్రధాన భూమికగా కాంగ్రెస్ పార్టీ పని చేస్తుందని టిపిసిసి అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్ అన్నారు. 42 శాతం బిసి రిజర్వేషన్లు అమలయ్యేంత వరకు పోరాటం చేయడంతో పాటు ప్రయత్నాలు చేస్తూనే ఉంటామని తెలిపారు. బిసి యువకులు ఎవ్వరు తొందరపడవద్దని, బిసి రిజర్వేషన్లు ఎలాగైనా సాదించుకుందామన్నారు. అంబర్‌పేట చౌరస్తాలోని డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా, ఆ మహనీయుని విగ్రహానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ పిసిసి అధ్యక్షులు వి.హనుమంతరావు, డిసిసి మోత రోహిత్,



టిపిసిసి వైస్ ప్రెసిడెంట్ సంగిశెట్టి జగదీష్ తదితర నాయకులు పా ల్గొని అంబేడ్కర్ సేవలను స్మరించారు. అంబేద్కర్ చూపించిన సమానత్వం, న్యాయం, సామాజిక హక్కుల మార్గంలో నడవాలని పిలుపునిచ్చారు. టిపిసిసి అధ్యక్షులు మహేష్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంఖాయమని, రాహుల్‌గాంధీ ప్రధాన మంత్రి అవడం ఖాయమని అన్నారు. ప్రభుత్వం తరపున ఈశ్వరచారి కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని హామి ఇచ్చారు.

## ఈశ్వరాచారి ఆత్మహత్య చేసుకోవడం దురదృష్టకరం

**ప్రజాపక్షం/భువనగిరి రూరల్ :** బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలని కోరుతూ సాయి ఈశ్వరాచారి ఆత్మహత్య చేసుకోవడం దురదృష్టకరమనీ, కాంగ్రెస్ పార్టీ బీసీలకు న్యాయం చేస్తుందని అందులో ఎటువంటి అనుమాన పడాల్సిన అవసరం లేదని టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. శనివారం కుటుంబ సమేతంగా యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహస్వామిని దర్శించుకుని తిరిగి హైదరాబాదుకు బయలుదేరుతూ ఓ హోటల్లో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.యాదాద్రి భువనగిరి జిల్లా స్వర్ణకార సంఘం, జిల్లా విశ్వ బ్రాహ్మణ సంఘం సభ్యులు భువనగిరిలో ఈశ్వరాచారి మరణం పట్ల శ్రద్ధాంజలి ఘటిస్తూ ర్యాలీ నిర్వహించి ఆ కుటుంబంలో ఒకరికి ఉద్యోగాన్ని కల్పిస్తూ కోటి రూపాయల సాయం అందజేయాలని పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ వినతి పత్రాన్ని అందజేశారు.పిసిసి అధ్యక్షులు మాట్లాడుతూ చారి కుటుంబానికి ప్రభుత్వం న్యాయం చేస్తుందని తొందరపడి యువకులు రిజర్వేషన్ల విషయంలో ఇటువంటి అఘాయిత్యాల చర్యలకు పాల్పడవద్దని విజ్ఞప్తి చేశారు. పిసిసి అధ్యక్షులకు జిల్లా స్వర్ణకార సంఘం, విశ్వకర్మ ఐక్య సంఘం ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో జిల్లా స్వర్ణకార సంఘ అధ్యక్షులు కొండపర్తి బాలాచారి, ఉపాధ్యక్షులు సొల్లేటి గోవర్ధనాచారి,జిల్లా ఐక్య సంఘం అధ్యక్షులు దేవర కొండ నరసింహాచారి, భువనగిరి పట్టణ స్వర్ణకార సంఘం అధ్యక్షులు ఇటికాల దేవేంద్రాచారి, ప్రధాన కార్యదర్శి తంగేళ్లపల్లి శ్రీనివాసాచారి, కోశాధికారిమునిగంటిసాయికాంత్,ఆల్‌ఇండియాసీసీ నెంబర్ కీసర శ్రీకాంత్, జిల్లా స్వర్ణకార సంఘగౌరవ సలహాదారులు చిట్లోజు వెంకట్ నారాయణఉన్నారు.

## అథ్లెటిక్ స్టేడియంలో.. సిఎం రేవంత్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఇండియన్ సూపర్ క్రాస్ రేసింగ్ లీగ్ సీజన్ 2 పోటీలకు ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గచ్చిబౌలి జిఎంసి బాలయోగి అథ్లెటిక్ స్టేడియంలో ప్రారంభమైన లీగ్ కార్యక్రమానికి సిఎంతో పాటు మంత్రి శ్రీధర్ బాబు, బాలీవుడ్ హీరో సల్మాన్ ఖాన్‌లు హాజరయ్యారు.

## కుల,మతాల పేరిట బిజెపి మోసం

### జనతా కాంగ్రెస్ పార్టీ జాతీయ ఉపాధ్యక్షులు దీపక్ శర్మ

**ప్రజాపక్షం/ఖైరతాబాద్ :** బిజెపి కుల, మతాల పేరిట ప్రజలను మభ్యపెడుతూ అన్ని విధాలుగా మోసం చేస్తుందని జనతా కాంగ్రెస్ పార్టీ జాతీయ ఉపాధ్యక్షుడు దీపక్ శర్మ ఆరోపించారు. ఈ మేరకు శనివారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో తెలంగాణ జనతా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బి. సురేందర్, కన్వీనర్ రవీందర్ నాయక్, ప్రధాన కార్యదర్శి అశోక్ కుమార్లతో కలిసి ఆయన మాట్లాడుతూ ఈ నెల 11న న్యూ బోయినపల్లి లో జనతా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యాలయాన్ని పార్టీ జాతీయ అధ్యక్షుడు మహతా రాయ్ ప్రారంభిస్తారని, జనతా కాంగ్రెస్ పార్టీ ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళి పరిష్కారించే విధంగా పోరాటాలు చేస్తుందని ఆయన తెలిపారు. రాబోయే అన్ని ఎన్నికల్లో తమ పార్టీ పోటీ చేస్తుందన్నారు. కేంద్ర ం రాజ్యాంగాన్ని తుంగలో తొక్కిందని, ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిందని విమర్శించారు. డీలిమిటేషన్ చేస్తే దక్షిణాది రాష్ట్రాలకు తీవ్రంగా అన్యాయం జరగబోతుందని, ఇందులో కుట్ర దాగి ఉన్నదని పేర్కొన్నారు. సమావేశంలో పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు ఏబెల్, కార్యదర్శి శ్రీనివాస్, హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు తన్వీర్ తదితరులు పాల్గొన్నారు.

## కెసిఆర్ వ్యాఖ్యలకు అద్దంకి దయాకర్ కౌంటర్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రేవంత్ రెడ్డిని ఢీ కొనే నాయకత్వం బిజెపి, బిఆరెస్‌లో లేదని ఎంఎల్‌సి దయాకర్ అన్నారు. గాంధీభవన్‌లో శనివారం విలేకరులతో మాట్లాడుతూ.. పది సంవత్సరాలు నేనే ముఖ్యమంత్రి అని రేవంత్ రెడ్డి మాటలకు అదే అసలు కారణం అని అన్నారు. ప్రజా ఆమోదం తో రేవంత్ రెడ్డి బలమైన శక్తిగా ఎదిగిండు అధికారం విషయంలో కెసిఆర్ స్టేట్మెంట్ బి ఆర్ఎస్ నాయకుల కన్ఫ్యూజన్ కనిపస్తుందన్నారు. కెసిఆర్ బయటకురానంత కాలం ఆ పార్టీకి మనగడే కష్టం అని స్పష్టం చేశారు. ఉద్యమకారుడుగా గత ముఖ్యమంత్రిగా బయటకు వచ్చి కొట్లాడితే ఆ పార్టీకి మనగడ కానీ అధికారం అనేది కల కెసిఆర్ బయటకు రాక పోతే బిఆర్ఎస్‌ను బిజెపి కి లేదా ఎదో ఒక పార్టీకి ధారాదత్తం చేయాల్సిందే కేటీఆర్ కు పగ్గాలు ఇచ్చి టెస్ట్ చేస్తుండు అని అన్నారు. హరీష్ రావు అనుమానాస్పదంగా ఉండు కవిత బయటికి వెళ్ళిపోయిందన్నారు.

## ఉదయనాథ్ కోట్లాకు పురస్కారం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** 63వ సివిల్ డిఫెన్స్ రైజింగ్ డే సందర్భంగా దక్షిణ మధ్య రైల్వే సివిల్ డిఫెన్స్ కంట్రోలర్, డిజిఎం ఉదయనాథ్ కోట్లాకు ప్రతిష్టాత్మక డైరెక్టర్ జనరల్ డిస్క్ పురస్కారం లభించింది. డిఫెన్స్ కంట్రోల, డిప్యూటీ జనరల్ మేనేజర్ అయిన ఉదయనాథ్ కోట్లా 63వ సివిల్ డిఫెన్స్ రైజింగ్ డే సందర్భంగా గృహ మంత్రిత్వ శాఖ ఈ పురస్కారాన్ని ప్రదానం చేసింది.జోన్ వ్యాప్తంగా సివిల్ డిఫెన్స్ సిద్ధత, సమన్వయం, మరియు విపత్తు నిర్వహణలో ఆయన చూపిన అసాధారణ నాయకత్వం, అంకిత భావంకారణంగా అవార్డు లభించింది.

## ప్రధానమంత్రితో తొమ్మిదోవిడత 'పరీక్షా పే చర్చ'

### జనవరి 11 వరకూ ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్

**న్యూఢిల్లీ:** తొమ్మిదో విడత 'పరీక్షా పే చర్చ–2026' కోసం రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. ఈ చర్చల్లో పాల్గొనే అర్హత సంపాదించే పోటీ పరీక్షకోసం జనవరి 11 వరకూ పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చునని కేంద్ర విద్యామంత్రిత్వశాఖ శనివారం ప్రకటించింది. 2018 నుండి ప్రతి సంవత్సరం ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈ 'పరీక్షా పే చర్చ' నిర్వహిస్తున్నారు. ఎలాంటి మానసిక ఒత్తిడీ లేకుండా విద్యార్థులు స్వేచ్ఛగా పరీక్షలు రాయడానికి, ఉపాధ్యాయులు బోర్డు పరీక్షలు నిర్వహించడానికిఅవసరమైన ఉపాయాలను దీనికి ఎంపికైన వారు ప్రధానమంత్రి మోదీతో చర్చిస్తారు. ప్రధానమంత్రి వారికి తగిన సలహాలు, సూచనలు చేస్తారు. పరీక్షలను ఒక ఉత్సవంగా చేసుకోవాలనేది ప్రధానమంత్రి నరేంద్రమోదీ లక్ష్యం.ఈలక్ష్యం దిశగా విద్యార్థులను, ఉపాధ్యాయులను, తల్లిదండ్రులను నిర్వాహకులనుమానసికంగా సన్నద్ధం చేసేందుకు ఏటే టా ఈ చర్చా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ప్రధానమంత్రితో చర్చల్లో పాల్గొనేందుకు ఎంపిక కావాలంటే ఆన్‌లైన్ పోటీ పరీక్షలో ముందుగా భాగస్వాములు కావాలి. అనేక రకాల ప్రశ్నలకు సమాధానాలు రాసి విజేతలు కావాలి. మై గవర్నమెంట్ పోర్టల్ ద్వారా డిసెంబరు ఒకటో తేదీ నుండి జనవరి 11వ తేదీ వరకూ పేర్లు రిజిస్ట్రేషన్లు చేసుకోవచ్చు. ఆరో తరగతి నుండి 12వ తరగతి వరకూ చదువుకునే విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లి దండ్రులు ఇందులో పాల్గొనేందుకు అర్హులు. ఇంతకుముందు అంటే గత ఏడాది జనవరిలో జరిగిన ఎనిమిదో విడత పరీక్షా పే చర్చా కార్యక్రమం 2026 ఫిబ్రవరి 10వ తేదీన ప్రసార మాధ్యమాలలో వస్తుంది. దేశరాజధానిలోని సుందర్ నర్సరీలో చాలా నవీన పద్ధతులలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. దేశవ్యాప్తంగా ఉన్న రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతలకు చెందిన ప్రభుత్వ పాఠశాలలు, కేంద్రీయ విద్యాలయాలు, నవోదయ విద్యాలయాలు, సైనిక్ స్కూ ళ్ళు, ఏకలవ్య మోడల్ రెసిడెన్సియల్ స్కూల్సు, సిబిఎస్ఇ స్కూళ్ళకు చెందిన విద్యార్థుల నుండి ఎంపిక చేసిన 36 మంది ఈ చర్చలో పాల్గొన్నారు. మొత్తం ఏడు వేరువేరు భాగాలు ప్రసారం అవుతుంది. ఈ ఏడు భాగాలలోనూ క్రీడలు, క్రమశిక్షణ, మానసిక ఆరోగ్యం, పోషకాహారం, సాంకేతికత, ఆర్థికం, సృజనాత్మకత, సానుకూల దృక్పథం వంటి విభిన్న అంశాలపై ప్రధానమంత్రితో విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల చర్చలు ఉంటాయి. 2025లో పరీక్షా పే చర్చా కార్యక్రమం గిన్నీస్ వరల్డ్ రికార్డు సాధించింది. 245 కంటే ఎక్కువ దేశాల నుండి విద్యార్థులు, 153 దేశాల నుండి ఉపాధ్యాయులు, 149 దేశాల నుండి తల్లి దండ్రులు భాగస్వాములయ్యారు. 2018లో మొదటిసారి ఈ చర్చవకోసం ప్రవేశ పరీక్షలో పాల్గొనేందుకు 22,000 మంది రిజిస్ట్రేషన్‌లు చేసుకోగా,ఈసంఖ్య 2025 నాటికి 3.56 కోట్లకు చేరుకుంది. మొత్తం ఎనిమిది ఎపిసోడ్‌లకుగాను ప్రతి విభాగంలోనూ పాల్గొనేందుకు 3.56 కోట్ల మంది రిజిస్ట్రేషన్లు చేసుకున్నారు. దీంతోపాటు 2025 పరీక్షా పే చర్చకు సంబంధించిన జన్ ఆందోళన్ కార్యక్రమాలలో దేశవ్యాప్తంగా /1.55 కోట్లమంది పాల్గొన్నారు. దీంతో మొత్తం భాగస్వాములసంఖ్య ఐదు కోట్లకు చేరుకుంది.

# నేర రహిత నగరంగా హైదరాబాద్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** హైదరాబాద్ నగరాన్ని నేర రహితంగా తీర్చిదిద్దడం, ప్రజల్లో భద్రతా భావాన్ని మరింత పెంపొందించడం కోసమే 'ఆపరేషన్ కవచ్' పేరుతో మెగా డ్రైవ్‌ను చేపట్టామని హైదరాబాద్ సిపి విసి.సజ్జనార్ వెల్లడించారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడేవారు, సరైన పత్రాలు లేకుండా తిరిగే వారు ఇకపై కఠిన చర్యలు ఎదుర్కోక తప్పదని, శాంతి భద్రతల విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. నగరంలో శాంతి భద్రతలే లక్ష్యంగా నగర పోలీసులు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నాకాబందీ 'ఆపరేషన్ కవచ్' విజయవంతంగా ముగిసిందని, 5 వేల మంది పోలీసులతో శుక్రవారం రాత్రి 10:30 గంటల నుంచి ఒంటి గంట వరకు 150 ప్రాంతాల్లో ఏకకాలంలో ఆపరేషన్ కవచ్ కొనసాగిందని తెలిపారు. సిపి విసి.సజ్జనర్ స్వయంగా రంగంలోకి దిగి సౌత్ వెస్ట్ జోన్‌లోని టోలీచౌకి, పాతబస్తీ గుల్జార్‌హౌస్ తదితర సమస్యాత్మక, కీలక ప్రాంతాల్లో పర్యటించి తనిఖీలను ప్రత్యక్షంగా పర్యవేక్షించి, సిబ్బందికి తగు సూచనలు చేశామన్నారు. అనంతరం బంజారా హిల్స్‌లోని 'తెలంగాణ ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్' (టిజిఐసిసిసి)కు చేరుకుని, అక్కడి నుంచి నగరవ్యాప్తంగా జరుగుతున్న తనిఖీలను సిసి కెమెరాల ద్వారా పరిశీలించారు. జాయింట్ సిపి(లా అండ్ ఆర్డర్) తఫ్సీర్ ఇక్బాల్, ఇతర ఎస్‌హెచ్‌ఒలతో మాట్లాడి ఆపరేషన్ తీరుతెన్నులను అడిగి తెలుసుకున్నారు. లా అండ్ ఆర్డర్ పోలీసులతో పాటు టాస్క్‌ఫోర్స్, ట్రాఫిక్, ఆర్మ్‌డ్ రిజర్వ్ బలగాల సమన్వయంతో ఈ స్పెషల్ డ్రైవ్ కొనసాగిందన్నారు. ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేసి, అనుమానితులను అదుపులోకి తీసుకోవడంతో పాటు సరైన పత్రాలు లేని వాహనాలను సీజ్ చేయడం జరిగిందన్నారు. దాదాపు 15 వేల వాహనాలను తనిఖీ చేసి వాటిలో 1600 వెహికిల్స్ ని సీజ్ చేసి, ఎనిమిది మందిని అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. ఈ తనిఖీల్లో భాగంగా తుకారం గేట్ పరిధిలో అర కిలో గంజాయిని స్వాధీనం చేసుకున్నామని, మొత్తంగా 105 పెట్టి కేసులను నమోదు చేశామని వెల్లడించారు. ఈ ఆపరేషన్‌లో సిబ్బంది కనబరిచిన వృత్తి నిబద్ధతను సిపి సజ్జనర్ అభినందించారు. ఈ ఆపరేషన్ ఒక్క రోజుతో ఆగిపోదని భవిష్యత్తులోనూ ఆకస్మిక తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని తెలిపారు.

## బతికి ఉండి పోరాడాలి.. ఆత్మహత్య చేసుకోవద్దు

### రాష్ట్ర బిసి కమిషన్ చైర్మన్ జి.నిరంజన్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** బిసిల రిజర్వేషన్ల సాధనకు బ్రతికి ఉండి పోరాడాలి, కాని ఆత్మహత్య చేసుకోవద్దని బిసి కమిషన్ చైర్మన్ జి. నిరంజన్ విజ్ఞప్తి చేశారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ 69వ వర్ధంతి పురస్కరించుకొని శనివారం తెలంగాణ బిసి కమిషన్ కార్యాలయంలో అంబేద్కర్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి, ఘనంగా నివాళులర్పించారు.ఆయనమాట్లాడుతూ రాజ్యాంగంలో ఎస్సి, ఎస్టిలకు రిజర్వేషన్లు కల్పించినందున వారికి వారి జనాభా ప్రకారం విద్య, ఉద్యోగ, రాజకీయ రిజర్వేషన్లు లభ్యం అవుతున్నాయని, బిసిలకు రిజర్వేషన్ల రక్షణ రాజ్యాంగంలో లేనందున తెలంగాణ రాష్ట్రంలో సర్వే ప్రక్రియ జరిగి 42 శాతం రిజర్వేషన్లకు బిల్లు ఆమోదించిన అమలు చేయనటువంటి పరిస్థితి ఏర్పడిందన్నారు. రాజ్యాంగంలో సవరణ చేసి, బిసిలకు తెలంగాణ రాష్ట్రంలో 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చేవిధంగా చూడాలని అభిప్రాయపడ్డారు. బిసిలకు అన్యాయం జరుగుతుందని, శుక్రవారం గాంధీ ఆసుపత్రిలో చనిపోయిన సాయిఈశ్వరాచారి మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు. బిసి కమిషన్ సభ్యులు రాపోలు జయప్రకాష్, తిరుమలగిరి సురేందర్, బాలలక్ష్మి రంగు,అసిస్టెంట్ సెక్రటరి కె. మనోహర్ రావు, డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాస రావు, స్పెషల్ ఆఫీసర్ సునీత, సెక్షన్ ఆఫీసర్ సతీష్ కుమార్‌తో పాటు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## మైనార్టీల హక్కులకు అంబేద్కర్ పోరాటం

### 40వ అంబేద్కర్ స్మారక ఉపనాస్యంలో రామచంద్రమూర్తి




**ప్రజాపక్షం/ఖైరతాబాద్ :** మెజార్టీల ఆధిపత్యాన్ని ఎదుర్కొనేందుకు మైనార్టీలకు రక్షణ, హక్కులు ఉండాలని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ పోరాడారని ప్రముఖ సంపాదకులు డా.కె.రామచంద్రమూర్తి అన్నారు. అంబేద్కర్, గాంధీ, నెహ్రూ, పటేల్ ఈ దేశానికి మహోన్నత వ్యక్తులు అని, వారు లేకపోతే దేశం ఈ పరిస్థితిలో ఉండేది కాదన్నారు. శనివారం హైదరాబాద్ బషీరాబాగ్ ప్రెస్ క్లబ్‌లో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ స్మారక ట్రస్టు ఆధ్వర్యంలో 'మెజార్టీ నిరంకుశత్వం మైనార్టీ హక్కులు ' అనే అంశంపై 40 వ డాక్టర్ అంబేద్కర్ స్మారక ఉపన్యాసం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రముఖ సంపాదకులు డా. కె. రామచంద్ర మూర్తి మాట్లాడుతూ రాజ్యాంగం రచించండంలో అంబేద్కర్ గొప్ప పాత్ర పోషించారన్నారు. రాజ్యాంగాన్ని దుర్మార్గులు, స్వార్థపరులు అమలు చేస్తే ప్రజలకు చెడు జరుగుతుందని, అదే రాజ్యాంగాన్ని స్వార్థంలేనివారు, మంచివారు అమలుచేస్తే ప్రజలకు మంచి జరుగుతుందని అంబేద్కర్ అనాడే చెప్పారని గుర్తుచేశారు. గాంధీ విషయంలో పలు అంశాలపై అంబేద్కర్ రాజీ పడ్డారు కానీ, మైనార్టీల హక్కులపై ఏనాడూ రాజీ పడలేదన్నారు. అంబేద్కర్ ఆకాంక్షించినట్టూ కుల నిర్మూలన జరగడం చాలా అవసరమన్నారు. అప్పుడే సమాజంలో అంటరానితనం, హెచ్చుతగ్గులుండవని, అందరికీ సమాన అవకాశాలు లభిస్తాయని తెలిపారు. ముందుగా, రామచంద్రమూర్తితో పాటు మాజీ సిఎస్ కాకిమాధవరావు చేతుల మీదుగా 'అద్వితీయుడు' పుస్తకాన్ని ఆవిష్కరించారు. ట్రస్ట్ చైర్మన్ డా. కె. లింగయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి గనుముల జ్ఞానేశ్వర్, ఉపాధ్యక్షులు డా.వినోద్‌కుమార్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఒడిశా టూ హైదరాబాద్ గంజాయి రవాణా

### పట్టుబడిన 11 కేజీల గంజాయి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఒడిశా రాయగడ్ నుంచి హైదరాబాద్‌కు గంజాయిని తరలిస్తున్నాడనే సమాచారం మేరకు రంగారెడ్డి ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎఇఎస్ జీవన్ కిరణ్ టీమ్ శనివారం ఉదయం చర్లపల్లి రైల్వే స్టేషన్ ప్రాంతంలో తనిఖీలు చేపట్టి 11 కేజీల గంజాయిని పట్టుకున్నారు. హైదరాబాద్ మల్లాపూర్ ప్రాంతానికి చెందిన పుష్పాల వరుణ్ అనే వ్యక్తి ఒరిస్సా రాయగడ్ ప్రాంతానికి వెళ్లి అక్కడి నుంచి 11 కేజీల గంజాయిని కొనుగోలు చేసుకొని హైదరాబాద్‌కు తీసుక వచ్చాడు. రైల్లోంచి దిగి మల్లాపూర్ ప్రాంతానికి వెళ్లాడానికి ప్రయత్నం రంగారెడ్డి ఎన్‌ఫోర్స్‌మెంట్ టీమ్ పట్టుకున్నారు. పట్టుకున్న 11 కేజీల గంజాయి విలువ రూ. 5.50 లక్షలుగా ఉంటుందని అంచనా వేశారు. నిందితుడని గంజాయిని ఘట్కేసర్ ఎక్సైజ్ స్టేషన్‌లో అప్పగించినట్లు ఏఈఎస్ జీవన్ కిరణ్ తెలిపారు. గంజాయిని పట్టుకున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ సిఐ సుబాష్ చందర్,ఎస్ఐ అఖిల్ సిబ్బంది ఉన్నారు.

## కెటిఆర్ ట్రాప్‌లో బిసి సంఘాలు పడొద్దు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** బిసి సంఘాలు కెటిఆర్ ట్రాప్‌లో పడొద్దని టిపిసిసి జనరల్ సెక్రటరీ చనగాని దయాకర్ అన్నారు. బిసి రిజర్వేషన్ల అంశంపై మనస్థాపం చెంది ఈశ్వరచారి ఆత్మహత్య చేసుకోవడం బాధకరమని, ఆయన కుటుంబాన్ని ప్రభుత్వం తరపున ఆదుకుంటామని హామీ ఇచ్చారు. బిసి రిజర్వేషన్ల కోసం కాంగ్రెస్ పార్టీ చివరి వరకు పోరాడిందని, బిజెపి, బిఆర్ఎస్ పార్టీలు బిసి ద్రోహులని మండిపడ్డారు. కెటిఆర్ శవాల దగ్గర పేలాల కోసం ఎదురుచూస్తున్నారని, బిసి సంఘాలు నిర్వహించిన ఏ కార్యక్రమంలోనూ కేటిఆర్, బిజెపి నేతలు ఎందుకు పాల్గొనలేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ సామాజిక న్యాయం ఎజెండా గానే పని చేస్తుందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బిసిలకు అవకాశాలు కల్పించేందుకు ఆలోచన చేశారని తెలిపారు.



# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## కశ్మీర్‌లో పడిపోయిన రాత్రి ఉష్ణోగ్రతలు

**శ్రీనగర్ :** కశ్మీర్‌లో రాత్రి ఉష్ణోగ్రతలు ఘనీభవన స్థానం కంటే అనేక డిగ్రీలు తక్కువగా పడిపోయాయి, లోయలోని కొన్ని ప్రాంతాలను దట్టమైన పొగమంచు కప్పివేసినప్పటికీ, శ్రీనగర్‌లో కనిష్ఠంగా మైనస్ 4.1 డిగ్రీల సెల్సియస్ నమోదైందని అధికారులు శనివారం తెలిపారు. జమ్మూ కశ్మీర్‌లో షోపియన్ అత్యంత శీతల ప్రదేశంగా నమోదైందని, అక్కడ పాదరసం కనిష్ఠంగా మైనస్ 6.4 డిగ్రీల సెల్సియస్ వద్ద స్థిరపడిందని వారు తెలిపారు. గురువారం రాత్రి లోయలోని చాలా చోట్ల పాదరసం ఘనీభవన స్థానం కంటే ఎక్కువగా స్థిరపడింది, ఇది నివాసితులకు తీవ్రమైన చలి పరిస్థితుల నుండి భారీ ఉపశమనం కలిగించింది.అయితే, శుక్రవారం రాత్రి కశ్మీర్ అంతటా ఉష్ణోగ్రతలు పడిపోయాయి, ఘనీభవన చలిని తిరిగి తీసుకువచ్చిందని అధికారులు తెలిపారు. శుక్రవారం రాత్రి, జమ్మూ కశ్మీర్ వేసవి రాజధాని శ్రీనగర్‌లో కనిష్ఠ ఉష్ణోగ్రత మైనస్ 4.1 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైందని అధికారులు తెలిపారు, ఇది అంతకుముందు రాత్రి 0.4 డిగ్రీల సెల్సియస్ నుండి గణనీయంగా తగ్గిందని అధికారులు తెలిపారు.

## రాజ్యాంగం ప్రమాదంలో...

### రక్షించే బాధ్యతను అంతా తీసుకోవాలి: రాహుల్ గాంధీ



**న్యూఢిల్లీ :** భారత రాజ్యాంగ శిల్పి డాక్టర్ బిఆర్ అంబేద్కర్ 70వ మహా పరినిర్వాణ దినోత్సవాన్ని పురస్కరించుకుని, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ పార్లమెంట్ ప్రాంగణంలో నివాళులు అర్పించారు. అనంతరం మీడియాతో మాట్లాడిన ఆయన, అంబేద్కర్ ఆలోచనలు, సిద్ధాంతాలు దేశానికి ఇప్పటికీ మార్గదర్శకాలుగా నిలుస్తున్నాయని తెలిపారు. 'అంబేద్కర్ జీ ఒక మహానుభావుడు. ఆయన చూపించిన మార్గమే ఈ దేశాన్ని ముందుకు నడిపిస్తోంది. మనకు రాజ్యాంగం ఇచ్చిన గొప్ప నేత. అందుకే ఆయనను స్మరించుకోవడం మాత్రమే కాదు. ఆయన సిద్ధాంతాలు, రాజ్యాంగాన్ని కాపాడుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత' అని రాహుల్ గాంధీ తెలిపారు. దేశంలో రాజ్యాంగం నిరంతరం ప్రమాదంలోనే ఉంటుందని ఆయన వ్యాఖ్యానించారు. 'రాజ్యాంగం ప్రమాదంలో ఉంది. దాన్ని మనమందరం కాపాడాలి. పౌరులు కూడా తమ హక్కులను రక్షించే బాధ్యత తీసుకోవాలి' అని స్పష్టం చేశారు. ఆ తర్వాత ఎక్స్‌లో కూడా అదే సందేశాన్ని పునరుద్ఘాటించారు. 'బాబాసాహెబ్ అంబేద్కర్‌కు వినమ్ర నివాళులు. సమానత్వం, న్యాయం, మానవ గౌరవం అనే ఆయన శాశ్వత విలువలు. రాజ్యాంగ రక్షణలో నా సంకల్పాన్ని మరింత బలపరుస్తున్నాయి. మరింత సమానమైన, కరుణతో కూడిన భారతదేశం కోసం ఆయనే ప్రేరణ' అని ఆయన పేర్కొన్నారు.

**పార్లమెంట్ ప్రాంగణంలో!**

ప్రతి సంవత్సరం మాదిరిగానే, ఈసారి కూడా సోషల్ జస్టిస్ అండ్ ఎంపవర్‌మెంట్ మంత్రిత్వ శాఖ తరపున డాక్టర్ అంబేద్కర్ ఫౌండేషన్ (డిఎఎఫ్) డిసెంబర్ 6న పార్లమెంట్ హౌస్ క్యాంపస్‌లోని ప్రేరణ స్థలంలో మహాపరినిర్వాణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించింది. ప్రారంభంలో పరిమితులకు లోబడి జరిగే ఆ కార్యక్రమాన్ని, కాలక్రమేణా ప్రజలకు కూడా తెరవటం ద్వారా బాబా సాహెబ్ విగ్రహం వద్దకు వచ్చి పౌరులు స్వేచ్ఛగా నివాళులు అర్పిస్తున్నారు. మొత్తం కార్యక్రమం జరుగుతున్నంతసేపు శాంతియుత, ఆధ్యాత్మిక వాతావరణాన్ని నెలకొల్పేందుకు 25 మంది బౌద్ధ భిక్షువుల బౌద్ధ గీతాలాపన విశేష ఆకర్షణగా నిలిచింది. ఇదిలా ఉండగా, బాబాసాహెబ్ మహాపరినిర్వాణ దినోత్సవాన్ని పురస్కరించుకుని దేశవ్యాప్తంగా రాజకీయ పార్టీలు, సామాజిక సంస్థలు, సాధారణ పౌరులు నివాళులు అర్పించారు. ప్రత్యేకంగా మహారాష్ట్రలోని దాదర్ చైత్యభూమిలో లక్షలాది ప్రజలు తరలివచ్చి నివాళులు అర్పించడంతో ఆ ప్రాంతంలో ప్రతి ఏడాదిలాగే రద్దీ కనిపించింది.

## మరో 400 ఇండిగో విమానాలు రద్దు

**న్యూఢిల్లీ :** దేశ విమానయాన సంస్థ ఇండిగో సర్వీసుల్లో అంతరాయంతో దేశ వ్యాప్తంగా ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని రోజులుగా కొనసాగుతున్న సంక్షోభం ఇప్పట్లో కొలక్కి వచ్చేలా కనిపించడం లేదు. కోర్టు ఆదేశించిన కొత్త విమాన విధి, కాక్‌పిట్ సిబ్బందికి విశ్రాంతి కాల నిబంధనల రెండవ దశలో తాత్కాలికంగా ప్రధాన సడలింపులను శుక్రవారం ఇచ్చింది. అయినా శనివారం నాడు దేశీయ విమానయాన సంస్థ ఇండిగో నాలుగు ప్రధాన విమానాశ్రయాల నుండి 400కి పైగా విమానాలను రద్దు చేసిందని వర్గాలు తెలిపాయి. వీటిలో, బెంగళూరు విమానాశ్రయంలో 124 విమానాలు (63 నిష్క్రమణలు, 61 రాకపోకలు), ముంబయి విమానాశ్రయంలో 109 విమానాలు ( 51 నిష్క్రమణలు, 58 రాకపోకలు) రద్దు అయ్యాయని తెలిపారు. ఢిల్లీ విమానాశ్రయంలో 54 నిష్క్రమణలు, 52 రాకపోకలతో సహా 106 విమానాలను రద్దు చేసినట్లు వర్గాలు తెలిపాయి. హైదరాబాద్ విమానాశ్రయంలో ఇండిగో 66 విమానాలను రద్దు చేసిందని వర్గాలు తెలిపాయి. శుక్రవారం పలు విమానాశ్రయాల్లో 1,000కి పైగా ఇండిగో విమానాలను రద్దు కాగా, మూడు రోజుల పాటు తీవ్ర సంక్షోభం గురించి మౌనం వహించిన తర్వాత అంతరాయాల కారణంగా ప్రయాణికులకు కలిగిన ప్రధాన అసౌకర్యానికి వీడియో సందేశంలో ఇండిగో సిఇఒ పీటర్ ఎల్బర్స్ క్షమాపణలు చెప్పారు. వన్‌వే వీడియో కమ్యూనికేషన్‌లో ఎల్బర్స్ మాట్లాడారు. శుక్రవారం, రాహుల్ భాటియా పాక్షికంగా యాజమాన్యంలోని ఇండిగోకు డిజిసివి తాత్కాలిక ఉపశమనం కల్పించిందని, నైట్ డ్యూటీ నిర్వచనాన్ని ఉదయం 12 నుండి ఉదయం 6 గంటల వరకు, ఉదయం 12 నుండి ఉదయం 5 గంటల వరకు తగ్గించిందని, దాని పైలట్‌లు రెండు రాత్రి ల్యాండింగ్‌లను ముందుగా చేయడానికి అనుమతించిందని, ఇతర సడలింపులతో పాటు మరిన్ని సడలింపులను కూడా అందించిందని పేర్కొన్నారు. కాగా, పైలట్ల సంఘం, ఎయిర్‌లైన్స్ పైలట్స్ అసోసియేషన్ (ఎలిపిఎ) ఇండియా, డిజిసిఎ ఇండిగోకు ఇచ్చిన ఎంపిక, అసురక్షిత ఉపశమనంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ సడలింపులు నియంత్రణ సమానత్వాన్ని నాశనం చేయడమే కాకుండా లక్షలాది మంది ప్రయాణికులను తీవ్ర ప్రమాదంలో ఉంచాయని పేర్కొంది.



## డిప్‌ఫేక్‌లు నియంత్రించేలా లోక్‌సభలో ప్రైవేట్ బిల్లు




**న్యూఢిల్లీ :** ప్రస్తుత ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఎఐ) యుగంలో అనేకమంది ఎదుర్కొంటున్న సమస్య డిప్‌క్. దీని నియంత్రణకు స్పష్టమైన చట్టపరమైన ఫ్రేమ్‌వర్క్‌ను రూపొందించేలా లోక్‌సభలో ఒక ప్రైవేట్ మెంబర్ బిల్లు ప్రవేశపెట్టారు. శివసేన నాయకుడు శ్రీకాంత్ షిండే శుక్రవారం సభలో ప్రవేశపెట్టిన డిప్‌ఫేక్ నియంత్రణ బిల్లు, డిప్‌ఫేక్ కంటెంట్‌లో చిత్రీకరించబడిన వ్యక్తుల నుండి ముందస్తు అనుమతిని తప్పనిసరి చేయడం ద్వారా పౌరులను రక్షించడం లక్ష్యంగా పెట్టుకుంది. 'వేధింపులు, మోసం, తప్పుడు సమాచారం కోసం డీప్‌ఫేక్‌ల దుర్వినియోగం పెరిగింది. నియంత్రణా రక్షణల కోసం తక్షణ అవసరం ఏర్పడింది' అని షిండే అన్నారు. దురుద్దేశంతో డీప్‌ఫేక్ కంటెంట్‌ను సృష్టించే లేదా వ్యాప్తి చేసే నేరస్థులకు శిక్షలను కూడా బిల్లులో పేర్కొన్నారు. 'డీప్‌ఫేక్ టెక్నాలజీ మీడియా మానిప్యులేషన్‌కు ముఖ్యమైన సాధనంగా ఉద్భవించింది. విద్య, వినోదం, సృజనాత్మక రంగాలలో ఈ సాంకేతికతకు సంభావ్య అనువర్తనాలు ఉన్నప్పటికీ, దుర్వినియోగం చేసినప్పుడు అది తీవ్రమైన ప్రమాదాలను కూడా కలిగిస్తుంది. వ్యక్తిగత గోప్యత, జాతీయ భద్రత, ప్రజల నమ్మకాన్ని వమ్ముచేస్తుంది' అని షిండే పేర్కొన్నారు. ప్రతిపాదిత బిల్లు భారతదేశంలో డీప్‌ఫేక్‌ల సృష్టి, పంపిణీ, అనువర్తనాన్ని నియంత్రించడానికి స్పష్టమైన చట్టపరమైన ఫ్రేమ్‌వర్క్ ఏర్పాటు చేయడానికి ప్రయత్నిస్తుందని షిండే అన్నారు. మానిప్యులేట్ చేయబడిన కంటెంట్‌ను గుర్తించే సాంకేతికతలను అభివృద్ధి చేయడానికి, తద్వారా డిజిటల్ మీడియాలో విశ్వసనీయతను ప్రోత్సహించడానికి టాస్క్ ఫోర్స్ విద్య, ప్రైవేట్ రంగ సంస్థలతో సహకరిస్తుంది. అధునాతన ఇమేజ్ మానిప్యులేషన్‌ను గుర్తించడం, నిరోధించడంలో ప్రభుత్వ, ప్రైవేట్ రంగ చొరవలకు మద్దతు ఇవ్వడానికి ఒక నిధిని ఏర్పాటు చేయాలని కూడా బిల్లు ప్రతిపాదిస్తుంది. ప్రైవేట్ మెంబర్ బిల్లు అనేది పార్లమెంట్ ప్రక్రియ.

## విమాన ప్రయాణానికి మంగళం

### సులభతరం చేస్తామన్న మోదీ... ఇప్పడేం చేస్తారు? : కాంగ్రెస్

**న్యూఢిల్లీ :** ఇండిగో విమానాల అంతరాయంతో ప్రయాణికులు గందరగోళానికి గురవుతున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వంపై కాంగ్రెస్ విమర్శలు గుప్పించింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విమాన ప్రయాణాన్ని సులభతరం చేస్తామని హామీ ఇచ్చారని, కానీ విమాన ప్రయాణాన్ని నిలిపివేశారని ఎద్దేవా చేసింది. కేంద్ర పౌర విమానయాన మంత్రి కె. రామ్మోహన్ నాయుడు ఈ అపూర్వమైన సంక్షోభానికి బాధ్యత వహిస్తారా అని ప్రశ్నించింది. ఇండిగోలో కొనసాగుతున్న గందరగోళం ప్రమాదం కాదని, బిజెపి ప్రభుత్వం ఈ రంగంలో ద్వంద్వ విధానాన్ని అవలంబించేందుకు నిరంతరాయంగా చేస్తున్న ప్రయత్న ప్రత్యక్ష ఫలితం అని ప్రతిపక్ష పార్టీ పేర్కొంది. ఇండిగో విమానాల అంతరాయాలు వేలాది మంది ప్రయాణికులను ప్రభావితం చేస్తున్నందున, శనివారం రద్దు చేయబడిన విమానాల టికెట్ వాపసు ప్రక్రియను ఆదివారం సాయంత్రం నాటికి పూర్తి చేయాలని, అలాగే ప్రయాణికుల నుండి వేరు చేయబడిన సామాను రానున్న రెండు రోజుల్లో డెలివరీ అయ్యేలా చూసుకోవాలని పౌర విమానయాన మంత్రిత్వ శాఖ విమానయాన సంస్థను ఆదేశించింది. దేశంలోని అతిపెద్ద విమానయాన సంస్థ ఇండిగో 1,000కి పైగా విమానాలను రద్దు చేయగా, ఐదవ రోజు శనివారం కూడా అంతరాయాలు ఏర్పడ్డాయి. శనివారం ఢిల్లీలో జరిగిన విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ నాయకుడు శశికాంత్ సెంథిల్ మాట్లాడుతూ, ఇండిగో విమానాల రద్దు దేశ విమాన ప్రయాణాన్ని దెబ్బతీసిందన్నారు. 'ఈ సంక్షోభం సహజ సంక్షోభం కాదు; పోటీని అణిచివేయడం, ఇష్టమైన వాటికి బహుమతులు ఇవ్వడం, కార్పొరేట్ మిత్రపక్షాలకు అనుగుణంగా మొత్తం జాతీయ పరిశ్రమను పునర్నిర్మించడంపై బిజెపి ప్రభుత్వం తీవ్రంగా దృష్టి సారించిన ఊహించదగిన పతనం ఇది' అని సెంథిల్ అన్నారు. 'విమానయాన భద్రతను బిజెపి ప్రభుత్వం నిర్లక్ష్యంగా నిర్వహించడం దాని నిర్లక్ష్యాన్ని పూర్తిగా బహిర్గతం చేస్తుంది. జనవరి 8, 2024న విమాన విధి సమయ పరిమితి (ఎఫ్‌డిటిఎల్) నియమాలను విడుదల చేసిన తర్వాత, జూలై 1, 2025న వాటిని పాక్షికంగా అమలు చేసిన తర్వాత, బిజెపి ప్రభుత్వం ఇప్పుడు సిగ్గులేకుండా ఈ కీలకమైన భద్రతా రక్షణలను సెక్టార్ వ్యాప్తంగా సంక్షోభం మధ్యలో ఉపసంహరించుకుంది' అని తిరువళ్లూరు ఎంపి అన్నారు.



'ఇది బాధ్యతారహితం మాత్రమే కాదు; ఇది దారుణం. పైలట్ అలసటను నివారించడానికి ప్రత్యేకంగా రూపొందించిన నియమాలను రద్దు చేయడం ద్వారా, బిజెపి ప్రభుత్వం ప్రయాణికుల భద్రతను ప్రమాదంలో పడేసి కాక్‌పిట్ సిబ్బంది శ్రేయస్సును అనిశ్చితిలోకి నెట్టిందని ఆరోపించారు' అని ఆయన అన్నారు. పరిస్థితిని స్థిరీకరించడానికి బదులుగా, వారు దానిని మరింత తీవ్రతరం చేశారని, వారు ఇష్టపడే సంస్థల సౌలభ్యంతో పోల్చినప్పుడు భద్రత, జవాబుదారీతనం ఈ పరిపాలనకు ఏమీ అర్థం కాదని మరోసారి నిరూపించారని సెంథిల్ అన్నారు. ప్రభుత్వానికి సెంథిల్ ప్రశ్నలు సంధిస్తూ... గత 11 సంవత్సరాలలో, విమానయానం పోటీతత్వ, వైవిధ్యభరితమైన రంగాన్ని నిర్మించడానికి బదులుగా గుత్తాధిపత్యం, ద్వంద్వ రాజ్యంగా కుంచించుకుపోవడానికి ఎందుకు అనుమతించిందని నిలదీశారు.

## బెంగాల్‌లో బాబ్రీమసీదు

### శంకుస్థాపన చేసిన టిఎంసి సస్పెన్షన్ ఎమ్మెల్యే కబీర్



**ముర్షీదాబాద్:** తృణమూల్ కాంగ్రెస్ ఎమ్మెల్యే హుమయున్ కబీర్.. శనివారం బాబ్రీ మసీదు నిర్మాణం కోసం శంకుస్థాపన చేశారు. అయోధ్యలో గతంలో ఉన్న బాబ్రీ మసీదు తరహాలో పశ్చిమ బెంగాల్‌లోని ముర్షీదాబాద్‌లోనూ మసీదును నిర్మించనున్నారు. భారీ భద్రత మధ్య రెజినగర్‌లో ఆ కార్యక్రమాన్ని నిర్వహించారు. వేల సంఖ్యలో జనం ఆ కార్యక్రమానికి హాజరయ్యారు. చాలా మంది మసీదు నిర్మాణం కోసం స్వచ్ఛందంగా ఇటుకలు మోశారు. మసీదు నిర్మాణం శుంకుస్థాపన సందర్భంగా ఎమ్మెల్యే కబీర్ తన అనుచరులతో కలిసి రిబ్బన్ కట్ చేశారు. నారా ఈతక్‌బీర్, అల్లాహూ అక్బర్ అని నినదించారు. మతఘర్షణలకు దారి తీసే రీతిలో ప్రవర్తిస్తున్న ఎమ్మెల్యే కబీర్‌ను ఇటీవల తృణమూల్ కాంగ్రెస్ పార్టీ సస్పెండ్ చేసింది.

## రాజ్యాంగ ప్రవేశికలో... 'సెక్యులర్', 'సోషలిస్ట్' పదాలను తొలగించాలి

### బిజెపి ఎంపి భీమ్‌సింగ్




**న్యూఢిల్లీ :** రాజ్యాంగ ప్రవేశికలో 'లౌకిక', 'సామ్యవాద' అనే పదాలు అవసరం లేదని, అత్యవసర పరిస్థితి సమయంలో 'అప్రజాస్వామిక పద్ధతి'లో అవి చేర్చబడ్డాయని, ఈ పదాలను తొలగించాల్సిన ఆవశ్యకత ఉందని ఎగువ సభలో బిజెపి రాజ్యసభ సభ్యుడు భీమ్ సింగ్ అన్నారు. ఆయన శుక్రవారం రాజ్యసభలో రాజ్యాంగ (సవరణ)బిల్లు 2025(ప్రియాంబుల్ సవరణ)ను ప్రవేశపెట్టారు. ఆ రెండు పదాలు 'గందరగోళాన్ని' సృష్టిస్తాయని, అసలు ఆ పదాలు రాజ్యాంగంలో భాగం కాదని చెప్పారు. 'రాజ్యాంగ ప్రవేశికను సవరించడానికి, 'సెక్యులర్', 'సోషలిస్ట్' అనే పదాలను తొలగించడానికి నేను ఒక ప్రైవేట్ సభ్యుల బిల్లును ప్రవేశపెట్టాను. 1949లో ఆమోదించబడిన ఒరిజినల్ రాజ్యాంగం 1950 నాటి నుంచి అమలులోకి వచ్చింది. అయితే 'సెక్యులర్' , 'సోషలిస్ట్' పదాలు అప్పుడు లేవు. ఇందిరాగాంధీ 1976లో ఎమర్జెన్సీ సమయంలో ఈ రెండు పదాలను చేర్చారు. 42వ రాజ్యాంగ సవరణ కింద ఈ రెండు పదాలను రాజ్యాంగంలో చేర్చారు. పార్లమెంట్‌లో వాటిపై ఎలాంటి చర్చా జరుగలేదు' అని భీమ్‌సింగ్ 'పిటిఐ' కి చెప్పారు. 'అందరు ప్రతిపక్ష నాయకులు...అటల్ బిహారీ వాజ్‌పాయి, లాల్ కృష్ణ అద్వానీ, జార్జి ఫెర్నాండేజ్ జైలులో ఉన్నారు. ప్రజాస్వామ్యం హత్య చేయబడింది. ఆ పరిస్థితులలో ఇందిరాగాంధీ ఈ రెండు పదాలను చేర్చారు. తర్వాత జోడించబడిన ఈ పదాలు తర్వాత రాజ్యాంగం ఒరిజినల్ రూపంలోనే ఉండాలి అని బిజెపి ఎంపి భీమ్‌సింగ్ వివరించారు. ఈ అంశం రాజ్యాంగ సభలో కూడా చర్చనీయాంశం అయ్యిందని అన్నారు. 'ముసాయిదా కమిటీ చైర్మన్ డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ ఒక సమాధానం ఇచ్చారు. భారత రాజ్యాంగ నిర్మాణం దేశాన్ని లౌకిక దేశంగా మారుస్తుందని ఆయన అన్నారు. అది (పదాన్ని చేర్చడం) అవసరం లేదని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ చెప్పారు' అని భీమ్‌సింగ్ తెలిపారు. 'సోషలిస్ట్' అనే పదంపై కూడా చర్చ జరిగిందని, రాజ్యాంగ కమిటీ భవిష్యత్ తరాన్ని ఒకే రాజకీయ, ఆర్థిక విధానాన్ని అనుసరించమని బలవంతం చేయలేదని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ బదులు ఇచ్చారని, ఒకవేళ రేపు మరొకరు ఆర్థిక విధానాన్ని మార్చాలని కోరుకుంటే పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. సోషలిజం విషయానికి వస్తే అది ప్రజల సంక్షేమానికి సంబంధించినదని భీమ్‌సింగ్ తెలిపారు. ప్రజల సంక్షేమాన్ని ఎలా నిర్ధారించాలి? పేదరికాన్ని ఎలా తగ్గించాలి? సంపదను ఎలా పంపిణీ చేయాలి? అనే అంశాలన్నీ రాజ్యాంగంలో భాగం అయ్యాయని ఆయన చెప్పారు. 'సెక్యులర్', 'సోషలిస్ట్' అనే ఈ రెండు పదాలను బుజ్జగింపు రాజకీయాల కోసం చేర్చారని బిజెపి ఎంపి భీమ్‌సింగ్ ఆరోపించారు. అప్పటి యూనియన్ ఆఫ్ సోవియట్ సోషలిస్ట్ రిపబ్లిక్ (యుఎస్ఎస్ఆర్)ను సంతోషపెట్టడానికి 'సోషలిస్ట్' అనే పదాన్ని, ముస్లిములను బుజ్జగించడానికి 'సెక్యులర్' అనే పదాలను చేర్చారని, అవి అనవసరమైనవని, వాటి అవసరం లేదని, అది కేవలం గందరగోళాన్ని సృష్టిస్తుందని ఆయన బిజెపి రాజ్యసభ్యుడు భీమ్‌సింగ్ వాదించారు. ప్రైవేట్ మెంబర్ బిల్లు అంటే మంత్రికాని సభ్యుడు పార్లమెంట్‌లో ప్రవేశపెట్టే శాసనపరమైన ప్రతిపాదన కాగా భారత పార్లమెంట్ చరిత్రలో ఇప్పటి వరకూ కేవలం 14 ప్రైవేట్ సభ్యుల బిల్లులను మాత్రమే చట్టంగా ఆమోదించబడ్డాయి. 1970నుండి ఉభయ సభలు ఏవీ ఆమోదించలేదు.

## లైఫ్ సపోర్ట్‌పై 'ఇండియా' కూటమి

### హిందూస్తాన్ టైమ్స్ లీడర్‌షిప్ సమ్మిట్‌లో జమ్ముకశ్మీర్ సిఎం అబ్దుల్లా

**న్యూఢిల్లీ :** ప్రతిపక్ష ఇండియా కూటమి ప్రస్తుతం 'లైఫ్ సపోర్ట్' పై ఉందని జమ్ము కశ్మీర్ ముఖ్యమంత్రి, నేషనల్ కాన్ఫరెన్స్ నాయకుడు ఒమర్ అబ్దుల్లా పేర్కొన్నారు. అంతర్గత కలహాలు, బిజెపి నిరంతరం ఎన్నికల యంత్రంతో సరిపోలడంలో వైఫల్యం కారణంగా ఐసియులోకి వెళ్లే ప్రమాదం ఉందని అన్నారు. శనివారం హిందూస్తాన్ టైమ్స్ లీడర్‌షిప్ సమ్మిట్‌లో అబ్దుల్లా మాట్లాడుతూ ప్రతిపక్ష కూటమి 'సంస్థాగత, వ్యూహాత్మక వైఫల్యాలను వివరించారు. ఇటీవలి బిహార్ ఎన్నికల తర్వాత ఇండియా కూటమి ప్రస్తుత పరిస్థితి గురించి మాట్లాడుతూ... 'మేము లైఫ్ సపోర్ట్‌పై ఉన్నాము, కానీ అప్పుడప్పుడు, ఎవరో ఒకరు తమను తట్టి బయటకు తెచ్చి షాక్ ఇస్తారు. మేము మళ్ళీ లేస్తాము. కానీ, దురదృష్టవశాత్తు, బిహార్ వంటి ఫలితాలు వస్తాయి. మేము మళ్ళీ పడిపోతాము. ఆపై ఎవరో మమ్మల్ని ఐసియులోకి నెడుతారు' అని అన్నారు. అయితే నితీష్ కుమార్ బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎలోకి తిరిగి రావడానికి ఇండియా కూటమిపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో పార్టీ ఉనికిలో ఉన్నప్పటికీ, బిహార్ సీట్ల పంపకాల ఒప్పందం నుండి జార్ఖండ్ ముక్తి మోర్చా (జెఎంఎం)ను ఉద్దేశపూర్వకంగా మినహాయించాలనే నిర్ణయాన్ని ఉటంకిస్తూ, కూటమి ఒక సంఘటిత దృక్పథాన్ని తీసుకోవడంలో విఫలమైందని కూడా ఆయన ఎత్తి చూపారు. ఇండియా కూటమి ఎన్నికల ప్రచారాన్ని బిజెపితో పోల్చిన అబ్దుల్లా, ప్రతిపక్ష కూటమి నిర్మాణాత్మకంగా పాలక పార్టీ క్రమశిక్షణా విధానంతో పోటీ పడలేకపోతోందని అన్నారు. వారికి అసమానమైన ఎన్నికల యంత్రం ఉందని ఆయన అన్నారు. వారు ఎన్నికలను ఎలా ఎదుర్కొనే విషయంలో కూడా వారికి అద్భుతమైన పని నీతి ఉంది... వారి జీవితాలు దానిపై ఆధారపడి ఉన్నట్లుగా వారు ప్రతి ఎన్నికలలో పోరాడుతారన్నారు. కొన్నిసార్లు తాము పట్టించుకోనట్లు ఎన్నికలలో పోరాడుతామని చెప్పుకొచ్చారు. భవిష్యత్ గురించి ఆలోచిస్తూ, ప్రతిపక్షాలు (బిజెపికి) తీవ్రమైన సవాలును ఎదుర్కోవడానికి ఏకైక మార్గం అతిపెద్ద భాగస్వామి అయిన కాంగ్రెస్ చుట్టూ చేరడమేనని అబ్దుల్లా అన్నారు. ముస్లిం ఓటర్ల గురించి అబ్దుల్లా మాట్లాడుతూ, ముస్లిం ఓటును సాంప్రదాయకంగా పొందేవారు సమాజాన్ని తేలికగా తీసుకొని, ఎన్నికలకు ముందు వారితో మాత్రమే పాల్గొనడం ద్వారా తప్పు చేశారని, ఇది ఐదేళ్ల మొత్తం కాలానికి మన లక్ష్యాన్ని సమర్థించడానికి సిద్ధంగా ఉన్న ఎంఐఎం వంటి పార్టీలకు ప్రయోజనం చేకూర్చే గందరగోళానికి దారితీసిందని సూచించారు. 2024 ఎన్నికల



తర్వాత కేంద్రం తన విధానాన్ని మార్చుకుందని, కూటమి రూపంలో కూడా పనిచేయగలదని చూపించిందని కూడా ఆయన అన్నారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు (ఇవిఎంలు) రిగ్గింగ్ చేయబడ్డాయనే విస్తృత రాజకీయ ఆరోపణ నుండి ఎల్లప్పుడూ దూరంగా ఉండే అబ్దుల్లా, 'యంత్రాలు రిగ్గింగ్ చేయబడ్డాయని చెప్పేవారికి నేను ఎప్పుడూ మద్దతుదారుడిని కాదు' అని అన్నారు. జమ్ముకశ్మీర్‌లో ఇటీవల జరిగిన డీలిమిటేషన్ కసరత్తును అబ్దుల్లా ఎత్తి చూపారు. ఓటర్ల జాబితాలను తిరిగి మార్చడం ద్వారా, నిర్దిష్ట వర్గాల ఓటర్లను మినహాయించడం ద్వారా ఒక పార్టీ, దాని ఒక మిత్రపక్షానికి ప్రయోజనం చేకూర్చేలా రూపొందించబడిన కొత్త నియోజకవర్గాలను సృష్టించిన ఈ కసరత్తు ఎన్నికలను మార్చడంతో సమానమని వాదించారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) వంటి ఓటరు జాబితాను మార్చే ఏదైనా ప్రక్రియ పక్షపా తం గురించి ప్రశ్నలను నివారించడానికి పారదర్శకంగా, న్యాయంగా జరగాలని ఆయన ముగించారు.

## ఢిల్లీ పోలీసు నోటీసులు.. వేధింపులే!

### నేషనల్ హెరాల్డ్ కేసులో సమన్లు రావడంపై డికె శివకుమార్



**బెంగళూరు :** నేషనల్ హెరాల్డ్ కేసులో నోటీసులు రావడాన్ని వేధింపులుగా కర్నాటక ఉప ముఖ్యమంత్రి డికె శివకుమార్ అభివర్ణించారు. కేసు దర్యాప్తులో భాగంగా ఆర్థిక, లావాదేవీల వివరాలను కోరుతూ ఢిల్లీ పోలీసులు డికెకు నోటీసులు ఇచ్చారు. అయితే దానిపై చట్టపరంగా పోరాడతానని శివకుమార్ స్పష్టం చేశారు. ఈ చర్యను ఖండిస్తూ కేసుకు సంబంధించి ఇడి ఇప్పటికే ఛార్జిషీట్ దాఖలు చేసిందని, అయితే ఇప్పుడు ప్రత్యేక పోలీసు దర్యాప్తు అవసరం ఏమిటని ప్రశ్నించారు. ఆర్థిక నేరాల విభాగం (ఇఒడబ్ల్యూ) జారీ చేసిన నోటీసులో కాంగ్రెస్ నాయకులు సోనియా గాంధీ, రాహుల్ గాంధీలపై ఈ ఏడాది అక్టోబర్ 3న నమోదైన నేషనల్ హెరాల్డ్ కేసుకు సంబంధించి శివకుమార్ వద్ద కీలకమైన సమాచారం ఉండవచ్చని భావిస్తున్నట్లు పేర్కొంది. 'ఇది నాకు చాలా షాకింగ్ గా ఉంది. నేను ఇడికి అన్ని వివరాలు అందించాను. ఇడి నన్ను, నా సోదరుడిని (మాజీ ఎంపి డికె సురేష్) కూడా పిలిపించింది. ఇందులో తప్పు ఏమీ లేదు, ఇది మా (పార్టీ) సంస్థ (నేషనల్ హెరాల్డ్ యంగ్ ఇండియా), మేము కాంగ్రెస్ సభ్యులం, మేము సంస్థకు మద్దతు ఇచ్చాము, దాగుడుమూతలు లేవు, ప్రతిదీ నలుపు, తెలుపు రంగులో ఉంది' అని శివకుమార్ అన్నారు. శనివారం డికె మీడియాతో మాట్లాడుతూ ఇడి ఛార్జ్ షీట్ దాఖలు చేసిన తర్వాత పోలీసులు (ఢిల్లీ పోలీసులు) కేసు నమోదు చేయవలసిన అవసరం లేదన్నారు. తాము కేసును ఎదుర్కొంటామని, దానిపై న్యాయస్థానంలో పోరాడుతామన్నారు. నవంబర్ 29 నాటి నోటీసులో శివకుమార్ తమ ముందు హాజరు కావాలని లేదా ఈనెల 19 లోపు అభ్యర్థించిన సమాచారాన్ని అందించాలని ఇఒడబ్ల్యు సమన్లు జారీ చేసింది. ఈ చర్యను ఆయన వేధింపుగా అభివర్ణించారు. ఇప్పటికే మనీలాండరింగ్ నిరోధక చట్టం (పిఎంఎల్ఎ)19న హాజరు అవుతారా అని మీడియా ప్రశ్నించగా, చట్టపరమైన చిక్కులను పరిశీలిస్తానని శివకుమార్ బదులిచ్చారు.

## ద్వేషాన్ని వ్యాప్తి చేసే మతతత్వ శక్తులపై నిరంతర పోరాటం

### పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ

**కోల్‌కతా :** ద్వేషాన్ని వ్యాప్తి చేసే మతతత్వ శక్తులపై పోరాటం కొనసాగుతుం దని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ పేర్కొన్నారు. దేశ రాజ్యాంగంలోని ఆదర్శాలు, సూత్రాలను రక్షించడానికి, బలోపేతం చేయడానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ముర్షిదాబాద్ జిల్లా బెల్డంగాలో అయోధ్యలోని బాబ్రీ మసీదు తరహాలో మసీదు నిర్మాణానికి సస్పెన్షన్‌కు గురైన టిఎంసి ఎమ్మెల్యే హుమాయున్ కబీర్ శంకుస్థాపన సందర్భంగా మమతా పై విధంగా వ్యాఖ్యానించారు. ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్యలో బాబ్రీ మసీదు కూల్చివేత వార్షికోత్సవం అయిన డిసెంబర్ 6న ప్రతిపాదిత మసీదుకు శంకుస్థాపన కార్యక్రమాన్ని కబీర్ ప్రకటించారు. సామరస్యం, శాంతి, విభజన శక్తులకు వ్యతిరేకంగా పోరాటం కోసం పిలుపునిస్తూ టిఎంసి ఇదే రోజున 'సంహతి దివస్' (ఐక్యత దినోత్సవం)గా పాటించాలని ప్రణాళిక వేసింది. ఎక్స్ వేదికగా బెనర్జీ స్పందిస్తూ 'బెంగాల్ నేల ఐక్యతకు నిలయం. ఇది రవీంద్రనాథ్ (టాగోర్) భూమి, నజ్రుల్ (ఇస్లాం) భూమి, రామకృష్ణవివేకానంద భూమి. ఈ భూమి ఏ విభజన చర్యకు ఎప్పుడూ తల వంచలేదు. రానున్న రోజుల్లో కూడా అలా చేయదు' అని అన్నారు. 'హిందువులు, ముస్లింలు, సిక్కులు, క్రైస్తవులు, జైనులు, బౌద్ధులు బెంగాల్‌లో ఉన్నారు. మేము భుజం భుజం కలిపి ఎలా నడవాలో తెలుసు. మేము ఒకరితో ఒకరం ఆనందాలను పంచుకుంటాం. ఎందుకంటే మత విశ్వాసాల ప్రకారం స్వంత విశ్వాసాన్ని ఆచరించడం ప్రతి ఒక్కరికీ చెందుతుంది.

## 10 నుండి భారత్–అమెరికా కీలక వాణిజ్య చర్చలు షురూ


### సుంకాల తగ్గింపు,ఎగుమతుల పెంపే లక్ష్యం

**న్యూఢిల్లీ:** భారత్–అమెరికా మధ్య ప్రతిపాదిత ద్వైపాక్షిక వాణిజ్యం తొలిదశ ఒప్పందంపై డిసెంబరు 10వ తేదీ నుండి చర్చలు ప్రారంభమవుతాయి. మొదటిదశ ద్వైపాక్షిక ఒప్పందాన్ని ఖరారు చేయడానికి ఉద్దేశించిన ఎంతో కీలకమైన ఈ చర్చలు మూడురోజులపాటు జరుగుతాయని సంబంధితవర్గాలు శనివారం ప్రకటించాయి. అమెరికా వాణిజ్యమంత్రిత్వశాఖ ప్రతినిధి బృందం భారత్‌లో పర్యటించనున్నది. ట్రంప్ సుంకాల భారాలు పెంచిన తర్వాత వరుసగా సెప్టెంబరు, అక్టోబరునెలల్లో భారత్ నుండి అమెరికాకు ఎగుమతులు 8.58 శాతం మేరకు తగ్గిపోయాయి. దీనివల్ల 6.3 బిలియన్ డాలర్లు విలువైన విదేశీ మారకద్రవ్యాన్ని దేశం కోల్పోయింది. అందువల్ల అమెరికా ప్రతినిధి బృందం పర్యటన, ఈ ఒప్పందం ఖరారు కావడం భాదరత్‌కు ఎంతో ముఖ్యమైనది కావడంతో కేంద్ర వాణిజ్యమంత్రిత్వశాఖ ఆచితూచి వ్యవహరించనున్నది. ఈ చర్చల్లో అమెరికా వాణిజ్య బృందానికి ప్రజాప్రతినిధి రిక్ స్విట్జర్ నాయకత్వం వహిస్తారు. భారత్‌పై భారీస్థాయిలో 50 శాతం సుంకాలు ట్రంప్ యంత్రాంగం విధించిన తర్వాత ఈ ప్రతినిధిబృందం చర్చల నిమిత్తం మనదేశానికి రావడం ఇది రెండోసారి. భారత్ నుండి వసూలు చేసే సుంకాలు చాలా చాలా తక్కువగా ఉన్నాయంటూ ట్రంప్ 25 శాతం మేరకు భారాలు వేశారు. రష్యా నుండి ముడి చమురు దిగుమతి చేసి, శుద్ధిచేసి ఇతర దేశాలకు విక్రయించడంద్వారా ఉక్రేన్‌లో రష్యా యుద్ధం చేయడాన్ని ఉసిగొల్పుతున్నారని ఆరోపిస్తూ మరో 25 శాతం సుంకాలను భారత్‌పై జరిమానాగా విధించారు. ఈ సుంకాలను తగ్గించుకునేందుకు, రాబోయే ఐదేళ్ళల్లో అమెరికాకు వాణిజ్య ఎగుమతుల లక్ష్యాన్ని పెంచుకునేందుకు ఈ సమస్యను చాలా సున్నితంగా పరిష్కరించాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తుండగా, మన వ్యవసాయ మార్కెట్‌ను చేజిక్కించుకోవాలనుకుంటున్న అమెరికా వాణిజ్య ప్రతినిధి బృందం, ఈ ఒప్పందం ద్వారా భారత్‌ను ఇరకాటంలో పడేసేందుకు ప్రయత్నిస్తున్నది. ఈ పరిణామాల మధ్య ఒప్పందంలో జాప్యం జరుగుతున్నది. ఈ ఏడాది సెప్టెంబరు 16వ తేదీన అమెరికా వాణిజ్యమంత్రిత్వశాఖ ప్రతినిధి బృందం మనదేశంలో పర్యటించింది. తర్వాత ఐదు రోజులకు వాణిజ్య,పరిశ్రమలశాఖా మంత్రి పీయూశ్ గోయల్ బృందం కూడా అధికారికంగా సెప్టెంబరు 22న చర్చల నిమిత్తం అమెరికా వెళ్ళింది. అంతకుముందు మే నెలలో కూడా గోయల్ వాషింగ్టన్‌లో పర్యటించారు. దక్షిణ,మధ్య ఆసియాలో అమెరికా వాణిజ్య ప్రతినిధి బ్రెండన్ లించ్ ఈ ఒప్పంద చర్చల్లో ప్రధాన సంప్రదింపులకర్తగా వ్యవహరిస్తుండగా, కేంద్ర వాణిజ్యశాఖా సంయుక్త కార్యదర్శి దర్పణ్ జైన్ భారత్ తరపున వాణిజ్య చర్చలకు నాయకత్వం వహిస్తున్నారు. రెండు దేశాలమధ్య వాణిజ్య ఈ ఏడాదిలోనే ఒప్పందం కుదురుతుందని వాణిజ్యశాఖ కార్యదర్శి రాజేశ్ అగర్వాల్ ఇటీవల ఆశాభావం వ్యక్తం చేశారు. సుంకాల సమస్య పరిష్కారమైతే మన ఎగుమతిదారులకు ప్రయోజనం కలుగుతుందని అన్నారు. ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం (బిటిఎ) కుదరడానికి చాలా సమయం పడుతుందని అగర్వాల్ చెబుతూ, సుంకాల సమస్యను పరిష్కరించడానికి ఉద్దేశించిన వాణిజ్య నిబంధనల చట్రంకోసం ఒక చర్చలు కాగా, సమగ్ర వాణిజ్య ఒప్పందం కోసం మరో చర్చలు రెండు రకాలుగా జరుగుతున్నాయన్నారు. ఈ ఏడాది ప్రారంభం ఫిబ్రవరినెలలో రెండు దేశాల నాయకులూ ఈ ఒప్పందంపై సంప్రదింపులు జరపాల్సిందిగా సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. ఈ ఏడాది ముగిసేనాటికి మొదటిదశ ఒప్పందం పూర్తి కావాలని లక్ష్యంగా నిర్దేశించారు. ఇప్పటివరకూ రెండు దేశాల ప్రతినిధులమధ్యా ఆరు విడతలుగా చర్చలు జరిగాయి. ప్రస్తుతం ఉన్న 191 బిలియన్ డాలర్ల ప్రస్తుత ద్వైపాక్షిక వాణిజ్యాన్ని 2030వ సంవత్సరం నాటికి రెట్టింపు పైగా అంటే 500 బిలియన్ డాలర్లు స్థాయికి తీసుకువెళ్ళాలనే లక్ష్యంతో ఒప్పందానికి భారత్ కృషి చేస్తోంది. 2024–25 ఆర్థిక సంవత్సరంలో అమెరికా వరుసగా నాలుగో ఏడాది కూడా భారత్‌కు అతిపెద్ద వాణిజ్య భాగస్వామిగా కొనసాగింది. గత ఆర్థిక సంవత్సరంలో 131.84 బిలియన్ డాలర్లు విలువైన ద్వైపాక్షిక వాణిజ్యం అంటే 86.5 బిలియన్ల ఎగుమతులను భారత్ చేసింది.






## మెదళ్లలోనే నేరుగా నైపుణ్యాలు!



ఏ రంగంలోనైనా నైపుణ్యాలు పెంచుకోవాలంటే శ్రమించాలి. కృషి, పట్టుదలతో నేర్చుకోవాలి. నిరంతర సాధన చేస్తూ, నైపుణ్యానికి మెరుగులు దిద్దుకోవాలి. ఇలాంటి సమస్యలేవీ లేకుండా, నేరుగా మెదళ్లలోకే నైపుణ్యాలను జొప్పిస్తే ఎలా ఉంటుంది? ఇది ఒక విచిత్రమైన ఆలోచన. హెచ్‌ఆర్‌ఎల్ లేబొరేటరీస్ అనే సంస్థ 'ట్రాన్స్‌క్రానియల్ డైరెక్ట్ కరెంట్ స్టిమ్యులేషన్' (టిడిసిఎస్) అనే పద్ధతిలో ఇలాంటి ప్రయోగాన్ని నిర్వహిస్తున్నది. అయితే, ఒక చిన్న వాస్తవానికి అతి పెద్ద స్థాయిలో అభూత కల్పనలు జోడించి, మెదళ్లలోకి నైపుణ్యాలను జొప్పించే ప్రక్రియ మొదలైనట్టు వార్తలు, ఫొటోలు సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతున్నాయి. ఇందులో నిజానిజాలను పరిశీలిస్తే, హెచ్‌ఆర్‌ఎల్ సంస్థ 2016లో 32 మందిపై టిడిసిఎస్ విధానంలో ప్రయోగం చేసింది. మెదడుకు చేసిన ఇఇజితో పాటు, రక్తంలో ఆక్సిజన్ మార్పులను ట్రాక్ చేసే ఎఫ్ఎన్ఐఆర్ఎస్ పరీక్షలు నిర్వహించి, మెదడు పనితీరు, మార్పులను అధ్యయనం చేశారు. టిడిసిఎస్ ద్వారా మెదడుకు అతి తక్కువ స్థాయిలో స్టిమ్యులేట్స్‌ను పంపినవారు, మిగతా వారితో పోలిస్తే నైపుణ్యాలను 33 శాతం వేగంగా నేర్చుకున్నట్టు గుర్తించారు. అయితే, ప్రయోగం ఇంకా ప్రారంభ దశలోనే ఉంది. క్లినికల్ ట్రయల్స్ కూడా మొదలు కాలేదు. అప్పుడే 'మ్యాట్రిక్స్ స్టయిల్ స్కిల్ అప్‌లోడింగ్' అంటూ హడావుడి చేయడంలో అర్థం లేదు. ఒక చిన్న ప్రయోగాన్ని ఇంతలా పెద్దదిచేసి చూపించడం సోషల్ మీడియా వికృత పోకడలకు నిదర్శనం. మెదళ్లలోకి నేరుగా నైపుణ్యాలను జొప్పించగలిగితే, ప్రపంచంలో అందరూ ఐన్‌స్టీన్లు.. థామస్ అల్వా ఎడిసన్లే ఉంటారు.

## ఎఐ అజేయశక్తి కాదు!



కృత్రిమ మేధస్సు (ఎఐ)ని సర్వజ్ఞానిలా భావిస్తూ, అజేయ శక్తిగా ఆరాధిస్తున్న వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతున్నది. కానీ, మనిషి మేధస్సు ఎఐ కంటే గొప్పదని నిరూపించిన ఘటనలు లేకపోలేదు. ఈ ఏడాది జులైలో జరిగిన ఓ ఆన్‌లైన్ చెస్ మ్యాచ్‌లో చాట్‌జిపిటిని ప్రపంచ మాజీ చాంపియన్ మాగ్నస్ కార్ల్‌సెన్ ఓడించి, సంచలనం సృష్టించాడు. 53 ఎత్తుల వరకూ సాగిన ఈ గేమ్‌లో కార్ల్‌సన్ ఒక్క పావును కూడా కోల్పోలేదు. ప్రపంచ చెస్ సమాఖ్య అతనికి 2900 రేటింగ్ ఇస్తే, చాట్‌జిపిటి 1800 నుంచి 2000 వరకూ ఉండవచ్చని నిర్ధారించింది. తక్కువ అంచనా వేసినందుకు మూల్యాన్ని చెల్లించుకుంది. ఇది కార్ల్‌సన్ వ్యక్తిగత విజయం మాత్రమేకాదు.. ప్రపంచాన్ని శాసిస్తున్న ఎఐని కట్టడి చేసిన అసాధారణ గెలుపు. ఎఐని సర్వజ్ఞాని అనుకోవడం తప్పు. అది కేవలం మనుషులు అందించిన సమాచారాన్ని క్రోడీకరించి, తిరిగి ఇస్తుందే తప్ప, సొంతంగా ఆలోచించదు. స్పందించదు. నిర్ణయాలు తీసుకోదు. ఏదిఏమైనా మనిషి మనిషే.. యంత్రం యంత్రమే!

## ఏ తరం ఎవరిది?



నేపాల్ రాజకీయాల్లో సునామీ సృష్టించిన ఉద్యమ సమయంలో 'జెన్ జెడ్' ('జెన్ జీ'గా కూడా పిలుస్తారు) పదం విస్తృతంగా ప్రచారంలోకి వచ్చింది. ఖచ్చితమైన శాస్త్రీయ వర్గీకరణ కాకపోయినప్పటికీ, ఒక్కో తరంలో పుట్టిన వారిని ఒక్కో రకంగా పిలవడం సామాన్యమైంది. తరాల మధ్య అంతరాన్ని హాస్యంగా లేదా వ్యంగ్యంగా చూపడాని కి కూడా వర్గీకరణలు ఉపయోగపడుతున్నాయి. కాగా, వివిధ తరాలను విభజించినప్పటికీ, ఇది కేవలం ఒక రకమైన స్థూల అవగాహన కోసం మాత్రమేనని గుర్తుంచుకోవాలి. ఎందుకంటే, ఒక తరానికి చెందిన వారినందరినీ ఒకే గాడికి కట్టడానికి వీల్లేదు. నిజ జీవితంలో ప్రతి తరంలోనూ అన్ని రకాల వ్యక్తులు ఉంటారు. పరిస్థితులు, దేశం, వర్గం, వ్యక్తిగత అనుభవాలు కలిసి మన స్వభావాన్ని నిర్ణయిస్తాయి, కేవలం పుట్టిన సంవత్సరం కాదు.

ఒక్కో తరానికి మధ్య తేడా 15 నుంచి 20 సంవత్సరాలుగా తీసుకుంటే, వివిధ తరాల విభజన ఇలా కొనసాగుతుంది.

1946కు ముందున్న తరాన్ని 'సైలెంట్ జనరేషన్' అంటారు. వీరు నియమాలు పాటించే వారు..గొడవపడకుండా నిశ్శబ్దంగా పని చేసినవారు.. నిజానికి వీళ్లపై పరిశోధనలు కూడా క్రమశిక్షణ, విధేయత ఎక్కువ.



బేబీ బూమర్స్ (1946–1964): యుద్ధాల అనంతరం జనాభా ఒక్కసారిగా పెరిగిన కాలం. లైఫ్‌ని ఫుల్‌గా ఎంజాయ్ చేసి, ఇప్పుడు రిసోర్సులు, అవకాశాలు తక్కువగా ఇస్తారని అంటారు గానీ, వాస్తవంగా వీరిని ఉద్యోగానికి నిబద్ధత ఎక్కువగా ఉన్న వారిగా, కానీ మార్పుల పట్ల కొంచెం ప్రతిఘటన చూపేవారిగా చూడాలి.


జనరేషన్ 'ఎక్స్' (1965–1980): టివి, కంప్యూటర్ మొదలైనవి మొదటిసారి జీవితంలోకి వచ్చిన తరం. ఈ తరానికి చెందిన వారు ఎవరినీ పూర్తిగా నమ్మరు, కానీ నిశ్శబ్దంగా పెద్ద బాధ్యతలు తీసుకుంటారు అనే ఎక్స్‌ప్రెషన్ ఉంది. వీరిని 'లాచ్‌కీ జెనరేషన్' అని, స్వతంత్రత, ప్రాక్టికల్ మైండ్ ఎక్కువగా ఉన్నవారని అంటారు.

మిలినియల్స్ లేదా జెన్ 'వై' (1981–1996): ఇంటర్నెట్, మొబైల్, గ్లోబలైజేషన్ మధ్య పెద్దయ్యారు. అర్థం, పర్పస్ కోసం పరుగెత్తి, ఇప్పుడు బర్నౌట్‌తో ఉంటూ కూడా బాగున్నట్లు నటిస్తున్నారనే అపవాదు ఉంది. డేటాలో వీరు ఉద్యోగ–ప్రెజర్, స్టూడెంట్ లోన్, గిగ్ ఎకానమీ వల్ల మెంటల్ స్ట్రెస్ ఎక్కువగా ఫేస్ చేస్తున్న తరం అని వస్తుంది.

జెన్ 'జెడ్' లేదా జెన్ జీ (1997–2012): స్మార్ట్‌ఫోన్స్, సోషల్ మీడియా పూర్తిగా సాధారణమైన కాలంలో పుట్టినవారు. అన్నింటినీ ప్రశ్నించే, ఎవరినీ నమ్మలేని, కానీ భావోద్వేగంగా చాలా సెన్సిటివ్ తరం. అనేక సర్వేల్లో వీరి గురించి డిజిటల్ నేటివ్స్, సోషల్ జస్టిస్‌కి తగినంత శబ్దం చేసే, మెంటల్ హెల్త్‌పై ఓపెన్‌గా మాట్లాడే తరం అని పాయింట్లు కనిపిస్తాయి

జెన్ 'అల్ఫా' (2010– 2020): స్క్రీన్‌లు, టచ్ డివైసులు పుట్టుకతోనే చేతిలో ఉన్న తరం. ఐపాడ్‌లు, యూట్యూబ్‌తో పెరిగే పిల్లలు. వీరి భవిష్యత్తు ఎలా ఉంటుందనేది చూడాలి. వీరు పూర్తిగా 21వ శతాబ్దంలో, కృత్రిమ మేధస్సు (ఎఐ), పర్యావరణ మార్పులు, హైపర్ కనెక్టెడ్ ప్రపంచంలో పెరిగే మొదటి తరం కాబట్టే, వీరి విలువలు ఇంకా రూపొందుతున్నాయని అంటున్నారు.

## ఉపరితలాన్ని మార్చేస్తున్నాం!



పర్యావరణ సమస్యలు ఎన్ని ఎదురవుతున్నప్పటికీ, మనిషి తనతోపాటు, యావత్ జీవజాలాన్నీ ప్రమాదంలో పడేస్తునే ఉన్నాడు. గనులకోసం కొండలను తవ్వడం, నదుల దారులు మళ్లించడం, లోయలంతా ఆనకట్టలతో నింపడం వంటి చర్యలతో, ఏకంగా భూమి ఉపరితలాన్ని మార్చేస్తున్నాడు. ఈ చేష్టలు తీవ్ర పరిణామాలకు కారణమవుతున్నాయని శాస్త్రవేత్తలు స్పష్టం చేస్తున్నారు. తాజా జియోఫిజికల్ రీసెర్చ్ అధ్యయనాలను అనుసరించి, మనిషి ఏకంగా భూభ్రమణ కక్ష్యాన్ని కదిలించేస్తున్నాడు. 19వ శతాబ్దం నుండి ప్రపంచవ్యాప్తంగా నిర్మించిన ఆనకట్టల ప్రభావంతో 1835 నుండి 2011 మధ్య భూమి భౌగోళిక ధృవాలు సుమారు 1.1 మీటర్లు (3.7 అడుగులు) మారిపోయాయి. స్పష్టంగా చెప్పాలంటే, కాంక్రీట్ గోడల వెనకాల ట్రిలియన్ల టన్నుల నీటిని నిల్వచేయడం ద్వారా, మనం గ్రహం తిరిగే విధానాన్ని స్వల్పంగా మార్చేశాం. భారీ జలాశయా లు నీటితో నిండినప్పుడు, అవి భూమి ద్రవ్యరాశిని పునర్విభజిస్తాయి. భూమిని ఒక తిరిగే భ్రమరంతో పోలిస్తే, ఒక వైపు అదనపు బరువు పెడితే దాని సమతుల్యం మారుతుంది. హూవర్ డ్యాం నుండి త్రీ గోర్జెస్ వరకు ప్రతి కొత్త ఆనకట్ట ఈ విధమైన ఒక్కో చిన్న మార్పు చేసింది. ఫలితంగా, గణనీయమైన మార్పును కలిగించాయి. శాస్త్రవేత్తల అంచనా ప్రకారం, కృత్రిమ జలాశయాలు గ్రౌండ్ కాన్యాన్‌ను రెండుసార్లు నింపగలిగేంత నీటిని నిల్వ చేశాయి. ఈ నీటి నిల్వ భూమి సహజ సమతుల్య స్థితి నుండి ద్రవ్యరాశిని కొంత మేర లాగేసింది. ట్రూ పోలార్ వాండర్ అని పిలువబడే ఈ ప్రక్రియ సాధారణంగా భూగర్భ శిలా చలనాలు లేదా హిమానీనదాల మార్పుల వల్ల జరుగుతుంది. సాధారణంగా సముద్రంలో చేరే నీరు ఇప్పుడు భూభాగంలోనే నిలిచిపోవడమే ఇందుకు కారణం.

**— బిఎస్ఎస్ మైత్రేయి**

# రూపాయి మారక విలువ పతనం

ఏ దేశంలోనైనా దాని కరెన్సీ విలువ బలం ఆ దేశ ఆర్థిక వ్యవస్థ పటుత్వానికి అద్దం పడుతుంది. అంతర్గత పనితీరుకు సంబంధించి గణాంకాలు ఉట్టంకిస్తూ గొప్పలకు పోవచ్చు. కాని కరెన్సీ మారక విలువ క్షీణింపు ప్రజల జీవితాలపై ప్రతికూల ప్రభావం చూపుతూనే ఉంటుంది. మన రూపాయి నిరంతరాయంగా విలువ కోల్పోతూ ప్రస్తుతం 90 రూపాయలకు పైగా వెచ్చిస్తేగాని ఒక డాలరు దక్కని స్థితికి చేరాం. ఇది చారిత్రికంగా అత్యధిక రేటు. ఇది ఎక్కడ ఆగుతుంది లేదా ఎంత క్షీణింపువరకు వెళుతుంది అనే తర్కం అంతర్జాతీయ మార్కెట్‌లో అనేక సానుకూల, ప్రతికూల అంశాలపై ఆధారపడి ఉంటుంది. రూపాయి విలువ పతనం కొనసాగుతుందని ట్రేడర్లు, ద్రవ్య మార్కెట్ ఆపరేటర్ల లో కొందరు అభిప్రాయపడుతున్నారు. 1992 లో తొలిసారి రూపాయిని ఫ్లోటింగ్ కరెన్సీల బాస్కెట్‌లో (కరెన్సీ విలువను మార్కెట్ నిర్ణయించే పద్ధతి) చేర్చటం జరిగింది. అది ఆశ్చర్యకరంగా రూపాయి బలాన్ని పెంచింది, తర్వాత గణనీయంగా క్షీణించింది. తర్వాత చాలాకాలం నిలకడగా ఉండింది. 1993 మార్చిలో రూపాయి మార్పిడిని పూర్తిగా మార్కెట్‌లో పెట్టినపుడు దాని విలువ డాలరుకు రూ.31.52. ఒక దశాబ్దం తర్వాత దాని విలువ రూ.48.39 పైసలకు తగ్గింది, 2007–08లో రూ.40.28 పైసలకు భారీగా పుంజుకుంది. అమెరికాలో సబ్‌ప్రైమ్ సంక్షోభంతో వ్యాప్తిచెందిన ప్రపంచ ఆర్థిక మాంద్యం నుంచి కోలుకున్నాక, 2009లో రూపాయి విలువ మళ్లీ రూ.47.44 కు దిగజారింది. ఆ తర్వాత 'ట్యాపర్ తంత్రాలు' గా పిలవబడిన సంవత్సరాల్లో రూపాయి విలువ ఒక డాలరుకు రూ.50 నుంచి రూ.60కి క్షీణించింది. అమెరికా ఫెడరల్ రిజర్వు తమ డాలర్‌ను పటిష్టవంతం చేయటానికి తమ మానిటరీ విధానంలో మార్పులు చేయటం, పెద్ద ఎత్తున డాలర్లను మార్కెట్‌కు విడుదల చేయటాన్ని కోతపెట్టిన తంత్రాల కాలమది. ఇప్పుడు, అమెరికాకు భారతదేశ ఎగుమతులపై ట్రంప్ భారీగా సుంకాలు పెంచినందుకు దేశ ఆర్థికవ్యవస్థ అస్థిమితను ఎదుర్కొంటుండగా రూపాయి విలువ భారీగా క్షీణిస్తున్నది. ప్రస్తుతం అమెరికా పెట్టుబడిదారులు మన స్టాక్, రుణమార్కెట్ల నుంచి ఒక బిలియన్ డాలర్లుపైగా ఉపసంహరించుకుని మరింత ఆదాయం వచ్చే దేశాలకు తరలించారు. అమెరికాకు మన ఎగుమతులు తగ్గిపోయి డాలర్ల ఆర్జన తగ్గిపోయింది.

ఎందుకిలా జరుగుతున్నది? అని ఆలోచిస్తే రెండు, మూడు ప్రధాన కారణాలు కనిపిస్తాయి. ఒకటి, ప్రపంచ మార్కెట్లు, ఆర్థిక వ్యవస్థల్లో కల్లోలం, అస్థిరత. రెండు, భారతదేశం, దాని వాణిజ్య భాగస్వామ్య దేశాల్లో ద్రవ్యోల్బణం మధ్య వ్యత్యాసం. మూ డు, వాస్తవిక ఆర్థిక వ్యవస్థలోని లోపాలు ద్రవ్య మార్కెట్‌లోకి ప్రవేశించి కరెన్సీ మారక మార్కెట్ పై ప్రభావం చూపుతున్నాయి. పైన చెప్పినట్లు విదేశీ పెట్టుబడిదార్లు పెద్దఎత్తున తమ మదుపు ఉపసంహరించుకోవటం అతి పెద్ద తక్షణ కారణం. డాలర్ అతిముఖ్యమైన ఏకైక కరెన్సీగా ఉన్నందున వారు తమ డబ్బును డాలర్ మార్కెట్‌కు తీసుకెళుతుంటారు. భారత దేశ ద్రవ్యోల్బణం రేట్లు 5శాతం పైగా ఉండగా, ప్రధాన ఆర్థిక వ్యవస్థల్లో 2 శాతంలోపు ఉంది.

ప్రజాపక్షం 07-12-2025, ఆదివారం

అయితే చైనా కరెన్సీ రెన్‌మిన్‌బి విలువ డాలర్‌తో దృఢంగా ఉంది. భారత్, చైనా ఆర్థిక వ్యవస్థల మూలాధారాల్లో తీవ్రమైన తేడాలే ఇందుకు కారణం. చైనా తమ వస్తూత్పత్తి పరిశ్రమను గత నాలుగు దశాబ్దాల్లో భారీగా అభివృద్ధి చేసుకుని పోటీగా నిలబడటమే ముఖ్యాంశం.

ఇదే సమయంలో భారత రిజర్వుబ్యాంక్ తమ రెపో రేటును (బ్యాంకులకు ఆర్‌బిఐ సమకూర్చే ధనానికి వసూలు చేసే వడ్డీరేటు) డిసెంబర్ 5న మరో 0.5 శాతం తగ్గించింది. ఇది డాలర్‌తో రూపాయి విలువ పతనాన్ని అడ్డుకునేందుకు కాదని, దేశీయ మార్కెట్‌కు ప్రోత్సాహకంగా ధన లభ్యతను పెంచటానికి, వడ్డీరేట్లు తగ్గింపు ద్వారా ఉపశమనం కలిగించేందుకు ఉద్దేశించిందని ఆర్‌బిఐ గవర్నర్ సంజయ్ మల్‌హోత్రా స్పష్టం చేశారు. రూపాయి తన విలువను ద్రవ్య మార్కెట్‌లో అదే స్థిరపరుచుకుంటుందన్నారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థల్లో అస్థిమిత వాతావరణం, విదేశీ వడగాడ్పులు (వాణిజ్య ఉద్రిక్తతలు, పెట్టుబడి ఉపసంహరణ), ఆర్‌బిఐ వడ్డీరేట్ల తగ్గింపు ప్రభావాలు సానుకూలంగా మారాలంటే పెట్టుబడులు తరలిపోవటం ఆగాలి, ఎగుమతులు పెరగాలి, అంతర్జాతీయ మార్కెట్ పరిస్థితుల్లో మార్పు రావాలి. లేనట్లయితే 2026 లో రూపాయి విలువ మరింత క్షీణిస్తుంది. దీనివల్ల దిగుమతి చేసుకునే వస్తువుల ఖరీదు పెరిగి ఆ వస్తువుల ధరాభారం వినియోగదారులపైకి వస్తుంది. ద్రవ్యోల్బణం పెరుగుతుంది. మన ఎగుమతులు చౌక అయి డాలర్ల ఆర్జన తగ్గుతుంది. ఇదొక విషవలయం.

# సాంప్రదాయక, ఆధునిక జ్ఞానాలు వేరుదారులా?



డాక్టర్ రాం పునియానీ

ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఇటీవల రాంనాధ్ గోయెంకా స్మారకోపన్యాసం చేస్తూ, మన వలసవాద పాలన కాలపు మనస్తత్వాన్ని పదేళ్లలో తొలగిస్తామని ప్రతిన తీసుకోవాలని అన్నారు. లార్డ్ మెకాలే ఇంగ్లీషులో వారి తరహా విద్యను ప్రవేశపెట్టి పదేళ్లలో 200 సంవత్సరాలు అవుతుంది. మోదీ ఏమన్నారంటే, ''దేశీయ జ్ఞాన వ్యవస్థలను కూల్చివేసి, వలసవాద విద్యను ప్రవేశపెట్టటం ద్వారా భారతీయ ఆలోచనను కొత్తదారిలో పెట్టటం మెకాలే ప్రాజెక్టు ఉద్దేశం'' అన్నారు. 'ఆకారంలో భారతీయులుగా ఉన్నవారిని ఆలోచనలో బ్రిటిషువారిగా' మార్చటం మెకాలే నేరం అని కూడా ప్రధాని అన్నారు. ఈ వ్యవస్థ భారతదేశ ఆత్మవిశ్వాసాన్ని ముక్కలు చేసి ఆత్మన్యూనత భావాన్ని ప్రవేశపెట్టిందన్నారు. (ఇండియన్ ఎక్స్‌ప్రెస్, నవంబర్ 18,2025).

మోదీ ఆర్‌ఎస్‌ఎస్, హిందూత్వ జాతీయతత్వం ప్రచారకుడు. ఈ భావజాలం ఇంతవరకు 'దుష్ట ముస్లిం రాజుల'పైన, వారు హిందూ దేవాలయాలు బద్దలుకొట్టటం, హిందువులపై ఇస్లాంను విధించటం వంటి చర్యలతో హిందువులకు వ్యతిరేకంగా సాగించిన అత్యాచారాలపై ఎక్కువగా దృష్టి సారించింది. ఈ కథనం ప్రకారం, భారతదేశానికి గతంలో స్వర్ణయుగం ఉండింది, ముస్లిం దండయాత్రికులు రావటం దుష్ట అలవాట్లను ఇక్కడికి తెచ్చింది. ఇప్పుడు హిందూ జాతీయవాద తాత్వికులు బ్రిటిషు పాలన ప్రవేశపెట్టిన 'వలసవాద ఆలోచన'ను దాని దుష్టత్వంగా కొంతకాలంగా దానిపై దృష్టి పెడుతున్నారు. అది సాంప్రదాయక జ్ఞానాన్ని, చింతనా వ్యవస్థలను అణచివేసిందంటున్నారు.

మహాత్మాగాంధి నాయకత్వం కింద భారత ప్రజాబాహుళ్యం వలసవాద పాలనకు వ్యతిరేకంగా అన్ని స్థాయిల్లో పోరాటం చేస్తుండగా తమ కేమీ పట్టనట్లు దూరంగా ఉన్న భావజాలం అనుచరుల నుంచి ఈ ఆలోచనలు వస్తున్నాయి.

మోదీ భావిజాలికులు మన జాఢ్యాలకు మెకాలేను నిందిస్తుండగా, చంద్రభాన్ ప్రసాద్ వంటి దళిత తాత్వికులు మెకాలే చేసిన దోహదాన్ని హర్షిస్తున్నారు. ఆయన దోహదం కాలక్రమంలో దళితులు, ఇతర అణగారిన తరగతులు ఆత్మగౌరవం, హక్కులకోసం పోరాడేటట్లు చేసిందనేది వారి భావన.

మెకాలే/బ్రిటీష్‌వారు ప్రవేశపెట్టిన సంస్కృతి సరళరేఖగా ప్రయాణించిందని మోదీ ఆయనలాంటి ఆలోచనాపరులు భావిస్తున్నారు. అయితే వారు భాష, మతం ప్రాతిపదికగా ఐరోపా తరహా జాతీయతత్వంకోసం నిలబడటం ఆసక్తిదాయకం. భారతదేశంలో అభివృద్ధిచెందినట్టిది అంతకన్నా ఎన్నోరెట్లు సంక్లిష్టమైంది. ఇంగ్లీషు విద్య ప్రవేశపెట్టటం ఆధునిక ఉదారవాద భావాలు ప్రవేశించేందుకు దోహదకారి అయింది, విద్య నిరాకరించబడిన దళితులు, మహిళలు వంటి సామాజిక విభాగాలకు జ్ఞాన సముపార్జన ద్వారాలు తెరవటానికి దారితీసింది. అప్పటికి గురుకులాలు కేవలం అగ్రవర్ణాల పురుషులకే పరిమితం.

భారతదేశంలో సుశ్రుత, ఆర్యభట్ట, బ్రహ్మగుప్త, లోకాయత, భాస్కర్ వంటివారు దోహదం చేసిన సాంప్రదాయక జ్ఞానం సమాజాన్ని చైతన్యం దిశలో నడిపించేందుకు గొప్ప ప్రభావం చూపాయి. ఆ జ్ఞానం సాంప్రదాయక ఉన్నత తరగతుల నియంత్రణలో ఉండి, కొద్ది మందికే పరిమితం చేయబడింది. జ్ఞానం, తద్వారా అధికారం, సంపద కొద్దిమంది ఉన్నతులకే చెందింది.

బ్రిటిష్ సామ్రాజ్యానికి సేవలందించే గుమాస్తాలు, తదితర ఉద్యోగ విభాగాలను ఉత్పత్తి చేయటంలో మెకాలేకు స్వార్థ ప్రయోజనం ఉంది. ఆధునిక విద్య గర్భం నుంచి బ్రిటిష్ వలసపాలకులపై పోరాడిన గొప్ప జాతీయవాదులు కూడా ఉద్భవించారు. గాంధి, పటేల్, సుభాష్ చంద్రబోస్, నెహ్రూ వంటివారు ఈ వ్యవస్థలో ఇంగ్లాండ్‌లో చదువుకున్నవారే. వలసవాద పాలనను అంతంచేసి, మన అభివృద్ధికి నూతన పంథాను మనకు ఇచ్చేందుకు వారు చేసిన దోహదాలు నెహ్రూ ప్రసిద్ధ ప్రసంగం 'గమ్యంతో సమాగమమం'లో సూక్ష్మ ంగా ఉంది.

ఇంగ్లీషు ప్రాంతీయ భాషలను అణచివేసిందా? వాస్తవం చెప్పుకోవాలంటే, స్థూలంగా ఇంగ్లీషు విద్య ప్రాంతీయ భాషల అభివృద్ధికి కూడా దోహదం చేసింది. తిలక్(మరాఠా), గాంధీ (నవజీవన్) తమ పత్రికలను ప్రాంతీయ భాషల్లోనే ప్రారంభించారు. ప్రాంతీయ భాషల్లో కూడా ఈ కాలంలోనే గొప్ప రచయితలు రచనలు చేశారు. ఉదాః రవీంద్రనాధ్ టాగూర్, మున్నీ ప్రేంచంద్ వగైరాలు.

మన వారసత్వ సంపద అయిన బ్రహ్మి లిపి, అజంతా – ఎల్లోరా వంటి నిర్మాణాలు మనం తిరిగి పొందటానికి అనేకమంది బ్రిటీష్ పరిశోధకులు దోహదం చేశారు. అలెగ్జాండర్ కన్నింగ్‌హాం సారథ్యంలో 'ఆర్కియలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా' (భారత పురావస్తు సర్వేక్షణ సంస్థ)ను బ్రిటీష్‌వారు ఏర్పాటు చేసినట్లు స్వామినాథన్ అయ్యర్ (టైమ్స్ ఆఫ్ ఇండియా, నవంబర్ 2025) పేర్కొన్నారు. భారతదేశ నలుదిశలా మట్టిదిబ్బలు త్రవ్వుతూ తక్షశిల నుంచి నలంద వరకూ డజన్ల కొద్ది అద్భుతమైన ప్రదేశాలను వెలుగులోకి తెచ్చారు. వలసపాలన నుంచి భారత్‌కు వనగూరిన ఫలితాలకు ఇదొక ఉదాహరణ. ఇది వారి ధ్యేయం కాదు, కాని పర్యవసానం మాత్ర మే.

బ్రిటీష్‌వారు ప్రోత్సహించిన ఆలోచనను భారతదేశం అ నుంచి క్ష వరకు ఆమోదించలేదు. దాదాభాయి నౌరోజి, ఎం.జె.రణడే, జి.కె. గోఖలే, ఆర్.సి.దత్తా బ్రిటీష్‌వారి విధానాలను గట్టిగా వ్యతిరేకించారు. బ్రిటీష్‌వారు ప్రోత్సహించిన ఆలోచనా ధారకు స్వాతంత్ర్యోద్యమం పెద్ద ప్రతిపక్షం, సవాలు కూడా. ఇంగ్లీషు ఒక పరికరం మాత్రమే. కాలక్రమంలో ఇంగ్లీషు భారతీయకరణ పొందింది. అనేకమంది అద్భుతమైన రచయితలు భారతీయ ఆలోచనా ధారను ప్రతిబింబిస్తూ ఇంగ్లీషులో రచనలు చేశారు. ఉదాహరణకు అమితవ్‌దాస్, అరుంధతిరాయ్, కిరణ్‌దేశాయ్.

సాంప్రదాయక జ్ఞానవ్యవస్థలు ఇతర ఆలోచనా వ్యవస్థలతో అంతర్ సంబంధం కలిగి ఉన్నపుడే సంపద్వంత మవుతాయి. భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుతో ప్రాంతీయ భాషలు, సాంప్రదాయక జ్ఞానవ్యవస్థలు –రెండింటికీ కావలసినంత ఆవరణ ఉంది. ఏకైక షరతు ఏమంటే, పశ్చిమంతోనేగాక ప్రపంచంతో ఆదాన ప్రదానం కలిగి ఉండటం. అది మన సమాజంలో లోతుగా వేళ్లానుకుని ఉన్న సాంప్రదాయక కుల, లింగ వ్యత్యాసాలను ఎదుర్కొనేందుకు సాధనమవుతుంది. ఆధునిక విద్య – దానిలో ఎన్ని లోపాలున్నప్పటికీ, సమాజంలోని ఈ అట్టడుగు తరగతులకు సమానత్వం, న్యాయం దిశగా ద్వారం తెరిచింది.

భారతదేశంలో వలసవాద పాలన పాత్ర గూర్చి ఒక ఆసక్తిదాయకమైన వృత్తాంతం ఉంది. శశిథరూర్ తన ప్రసిద్ధ ఆక్స్‌ఫర్డ్ డిబేట్‌లో బ్రిటీష్‌వారు భారతదేశాన్ని దోచుకున్న తీరును (అది 'డార్క్ ఈరా ఆఫ్ బ్రిటీష్ ఎంపైర్' పేరుతో పుస్తకంగా వచ్చింది) విపులంగా వివరించారు. కొన్ని మాసాల తర్వాత డాక్టర్ మన్మోహన్‌సింగ్ ఇంగ్లండ్‌లో ఉన్నారు. ఆధునిక పరిపాలన, విద్య ఆరంభించటంలో బ్రిటీష్‌వారి ప్రాతను కొనియాడారు.

ప్రధానాంశం ఏమంటే, అదీ భారతదేశంలో ఉదార విలువల పునాదులను పటిష్టం చేసిన, ఆధునిక పరిపాలన ఆరంభమైన మార్గం. ఉదార విలువలు స్వాతంత్ర్య ఉద్యమానికి బాటవేశాయి. బ్రిటీష్ పాలనను కూలద్రోయటానికి ప్రజలు తమ మతంతో నిమిత్తం లేకుండా పాల్గొన్నారు. మనుస్మృతి పాలన సాగిన ప్రాచీనకాలపు వైభవాన్ని పునరుద్ధాటించటం తమ లక్ష్యమని ప్రస్తుత హిందూత్వ జాతీయవాదుల పూర్వతరం వారు స్పష్టంగా చెప్పారు. గోల్వాల్కర్ ప్రకటనను షంఘల్ ఇస్లాం ప్రముఖంగా ప్రస్తావించారు. అదేమంటే, ''హిందువులారా, బ్రిటీష్‌వారితో పోట్లాడుతూ మీ శక్తి వృథా చేసుకోకండి. మన అంతర్గత శత్రువులైన ముస్లింలు, క్రైస్తవులు, కమ్యూనిస్టులతో పోరాడేందుకు మీ శక్తిని నిలుపుకోండి''. వలస పాలనపై పోరాటం కన్నా మతతత్వ సమస్యలపై ఎందుకు దృష్టిపెట్టారో ఈ కోణం సూచిస్తున్నది.

హిందూత్వ భారతీయవాదులు ఇప్పుడు తమ శక్తిసామర్థ్యాలను వలసవాద మనస్తత్వంపై పోరాడేందుకు, సాంప్రదాయక జ్ఞానవ్యవస్థలను పునరుద్ధరించటంపై ఎందుకు కేంద్రీకరిస్తున్నారు? ఇది 'నూతన విద్యావిధానంలో' కూడా ప్రతిబింబించింది. మన స్వాతంత్ర్య పోరాటం, మన రాజ్యాంగం స్వల్పంగా కుదిపిన సాంప్రదాయక కుల, లింగ అణచివేతతో కూడిన నిచ్చెనమెట్ల వ్యవస్థను హిందూత్వ జాతీయవాదం బలపరుస్తున్నది. 'సాంప్రదాయక' సాంఘిక నిమ్నోన్నతాలను పునరుద్ధరించేందుకు మెకాలేని, పశ్చిమ జ్ఞాన వ్యవస్థను వ్యతిరేకించే ఈ మార్గాన్ని ప్రముఖంగా ముందుకు తెస్తున్నారు. నాగరికతలు సరళరేఖల్లో ప్రయాణించవు. ''నాగరికతల కలయికలు'' నిరంతరం జరుగుతుంటాయి. అవే మనల్ని న్యాయం, సమానత్వంవైపు తీసుకెళతాయి.

# రెండేళ్ల కాంగ్రెస్ ప్రభుత్వం..



సరిగ్గా రెండు సంవత్సరాల క్రితం ఇదే రోజున తెలంగాణ రాష్ట్రంలో తొలి కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైంది. పిసిసి అధ్యక్షుడిగా ఎన్నికల్లో పార్టీకి నేతృత్వం వహించి విజయతీరానికి చేర్చిన ఎ.రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యారు. ఆయన నేతృత్వంలోని ప్రభుత్వం ఎల్.బి. స్టేడియంలో ప్రమాణ స్వీకారం చేసింది. తెలంగాణ ఏర్పడిన తరువాత పదేళ్ళు, అంతుకు ముందు ఐదేళ్ళు ప్రభుత్వం ఉన్నప్పటికీ తెలంగాణ ఉద్యమ అనిశ్చితి కారణంగా దాదాపు 15 ఏళ్ళ పాటు కింది స్థాయిలో కాంగ్రెస్ కార్యకర్తలు అధికార ఫలాలు అందుకోలేదనే చెప్పాలి. టి/బిఆర్‌ఎస్ అధినేత కె.చంద్రశేఖర్‌రావు అధికారం చేపట్టిన రెండు దఫాల్లో కాంగ్రెస్ పార్టీని చావు దెబ్బ తీశారనే చెప్పొచ్చు. పైన గెలిచిన ఎంఎల్‌ఏలు, ఎంపిలు మొదలు, కింది స్థాయి నాయకులు, శ్రేణుల వరకు అందరినీ తన పార్టీలో కలిపేసుకున్నారు. వరుస రెండు ఎన్నికల్లో దెబ్బమీద దెబ్బ తరువాత ప్రధానంగా మిగిలి ఉన్న కార్యకర్తల బలం, అలాగే కాంగ్రెస్ పెద్ద నాయకుల స్థానబలం, వీటికి తోడు రేవంత్‌రెడ్డి దూకుడు శైలిలో అందించిన నాయకత్వం కాంగ్రెస్ పార్టీని రెండేళ్ళ క్రితం అధికారంలోకి తీసుకువచ్చింది. 2023 డిసెంబర్ 3నే ఎన్నికల ఫలితాలు వచ్చినప్పటికీ, యుపిఏ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుపై అధికారిక ప్రకటన చేసిన డిసెంబర్ 9వ తేదీన, అది కూడా తెలంగాణ ప్రజల అభిమాన పాత్రురాలైన సోనియాగాంధీ జన్మదినం రోజున కాంగ్రెస్ ప్రభుత్వం ప్రమాణ స్వీకారం చేయాలని భావించింది. అనివార్య కారణాల వల్ల డిసెంబర్ 7వ తేదీనే ఎల్.బి.స్టేడియంలో రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా, అంతకుముందు వరకు సిఎల్‌పి నేతగా ఉన్న మల్లు భట్టి విక్రమార్క డిప్యూటీ సిఎంగా, పిసిసి మాజీ అధ్యక్షుడు ఉత్తమ్ కుమార్‌రెడ్డి తదితరులు మంత్రులుగా సోనియాగాంధీ సమక్షంలో ప్రమాణ స్వీకారం చేశారు.

ప్రభుత్వం రెండేళ్ళు పూర్తి చేసుకున్నప్పటికీ, వెన్వెంటనే వచ్చిన పార్లమెంటు సాధారణ ఎన్నికల కారణంగా ఎన్నికల కోడ్ కారణంగా సాంకేతికంగా తొలి ఆరు నెలలు ఏమీ చేయలేని పరిస్థితి. అంటే ఏడాదిన్నరే పనిచేసినట్లు లెక్క. గత ప్రభుత్వ హయాంలో చేసిన అప్పుల కారణంగా కాంగ్రెస్ పార్టీ చేసిన ఎన్నికల వాగ్దానాలను పూర్తిస్థాయిలో అమలు చేయలేనప్పటికీ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.500లకు గ్యాస్, 200 యూనిట్ల వరకు ఉచిత గృహ విద్యుత్ వంటి పథకాలు అమలుతో కుటుంబ ఆదాయంలో మిగులు కనిపించింది. ఈ చర్య తెలంగాణలో ద్రవ్యోల్బణం ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు కూడా ఉపకరించినట్లు కేంద్ర ప్రభుత్వ సర్వేలు వెల్లడించాయి. అలాగే రైతులకు సంబంధించి రూ.2 లక్షల వరకు రుణమాఫీ జరగడంతో పాటు, సన్న వడ్లకు రూ.500 బోనస్‌లు కర్షకులకు ఆదాయాన్ని సమకూర్చింది. రేషన్ షాపుల ద్వారా ఉచిత సన్న బియ్యం పథకం కాంగ్రెస్ ప్రభుత్వ మార్క్ పథకం,పేదలతో పాటు పట్టణ మధ్య తరగతి కుటుంబాలు కూడా ఆదరించాయి. ప్రభుత్వానికి మంచి మార్కులే లభించాయి.అలాగే ఇందిరమ్మ ఇళ్ళ పథకం కూడా పట్టాలెక్కింది. అనేక ఆటంకాలను అధిగమించి 61వేల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేయడం ఒక రికార్డే. ముఖ్యంగా కోర్టుల అవాంతరాలను తొలగించుకుంటూ తెలంగాణ ఏర్పడిన తరువాత తొలిసారిగావిజయవంతంగా గ్రూప్ 1 ఉద్యోగాలను భర్తీ చేయడం ఈ ప్రభుత్వానికి గొప్ప ఘనత.

సంక్షేమం విషయంలో ఇలా ఉండే సామాజిక అంశాలలో సుదీర్ఘ కాలం పెండింగ్‌లో ఉన్న ఎస్‌సి వర్గీకరణకు చిక్కు ముడులను విప్పుకుంటూ పోయి, వర్గీకరణ చట్టం చేయడం రేవంత్ సర్కార్‌కు మైలేజీనిచ్చింది. అలాగే బిసిలకు 42 శాతం రిజర్వేషన్‌ల పెంపు విషయంలో పెద్ద ముందడుకు వేసినప్పటికీ, ఫలాలు త్రిశంకు స్వర్గంలో ఉన్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వ హాయంలో శాస్త్రీయ పద్ధతిలో కులగణను పూర్తి చేసి, డెడికేటెడ్ కమిషన్ వేసి, చట్టం కూడా చేసారు. అయితే, దానిని అమలు కాకుండా గవర్నర్, కేంద్ర ప్రభుత్వం తొక్కిపెట్టారు. అయినప్పటికీ, ప్రభుత్వం నుంచి ఇంకొంచెం ప్రయత్నం చేయాల్సిందనే అభిప్రాయం నెలకొంది. కోర్టు కేసుల సమయంలో ప్రభుత్వం వైపు సరిచూసుకోవాల్సిన అంశాలు బైటికివచ్చాయి. అయితే, ప్రధాన, ఏకైక బాధ్యత మాత్రం కేంద్రంలోని బిజెపి ప్రభుత్వంపైనే ఉంది. మంత్రివర్గంలో ఎస్‌సిలకు సముచిత స్థానం కల్పించినప్పటికీ, ఎస్‌టి, బిసి వర్గాలు మరింత ప్రాధాన్యతను ఆశిస్తున్నారు. మంత్రివర్గంలో చోటు లభించని ముస్లిం మైనారిటీ విషయంలో అనేక ఊగిసలాటలు సాగి, చివరకు జూబ్లీహిల్స్ ఉపఎన్నిక సమయంలో ఆ వర్గానికి ప్రాతినిధ్యం లభించింది.

## రాజధాని సందడి

**– బొమ్మగాని కిరణ్‌కుమార్**

ఆర్థికరంగం విషయంలో ప్రభుత్వానికి ఆరంభంలో అనేక సవాళ్ళు ఎదురయ్యాయి. అప్పుల ఖజానా ఒకవైపు, హామీల భారం మరోవైపు తీవ్ర ఇబ్బంది కలిగించినప్పటికీ, కత్తిమీద సాములా ప్రభుత్వం జాగ్రత్తగా ముందుకు సాగుతుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోనే ప్రభుత్వానికి ఆర్థిక వెసులుబాటు లభిస్తున్నట్లు కనిపిస్తోంది. మొదట్లో భూముల వేలం ద్వారా ఆదాయాన్ని సమకూర్చుకునే యత్నాలకు ప్రధాన ప్రతిపక్షం బిఆర్‌ఎస్ గండి కొట్టినా, ఇప్పుడిప్పుడే కొలిక్కి వచ్చి, కోకాపేట్ వంటి ప్రాంతాలలో ప్రభుత్వ వేలంపాటకు మంచి స్పందన లభించి, ఆదాయం సమకూరుతోంది. అలాగే, దావోస్‌లో జరిగిన ప్రపంచ ఆర్థిక వేదిక సమావేశాలలో తెలంగాణకు రూ.3లక్షల పెట్టుబడులకు హామీలు లభించాయి. అవి నెమ్మదిగా ఇప్పుడిప్పుడే ఆచరణ దిశలో ఉన్నాయి. ముఖ్యంగా డిసెంబర్ 9న విడుదల చేయబోతున్న 'తెలంగాణ రైజింగ్' పేరుతో విజన్ డాక్యుమెంట్ –2047', ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కలల నగరి 'భారత్ ఫ్యూచర్ సిటీ' పైనే ప్రభుత్వం ఎక్కువ ఆశలు పెట్టుకుంది. దాని ద్వారానే ఖజానాకు, పథకాలకు అవసరమైన ఆదాయాన్ని సమకూర్చుకోవాలనే దాని ఆలోచన. పరిపాలన విషయంలో దాదాపు ఏడాదికిపైగా పాత వాసనలు ఉన్న అధికారులతో రేవంత్ రెడ్డి ఇబ్బందులు పడింది. కొద్ది నెలలుగా ప్రభుత్వంపై పట్టు చిక్కినట్లు కనపడుతోంది.

ఇక ప్రభుత్వంపై ప్రజల్లో నెలకొన్న అభిప్రాయానికి గీటురాయిగా నిలిచే ఎన్నికల్లో రెండేళ్ళుగా కాంగ్రెస్ చెప్పకోదగ్గ విజయాలనే సాధిస్తూ వస్తోంది. లోకసభ ఎన్నికల్లో సగం స్థానాలు, తరువాత ఒక పట్టభద్రుల ఎంఎల్‌సి స్థానం, కంటోన్మెంట్ ఉప ఎన్నికలో విజయం భరోసానిచ్చాయి. అన్నిటికి మించి రెండేళ్లు నిండడానికి ముందు జరిగిన జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ ఘనవిజయం ద్వారా ప్రజల్లో ప్రభుత్వంపై విశ్వాసం కనబడుతోంది.

అనేక హామీలు అమలు చేస్తున్నప్పటికీ, వృద్ధాప్య పెన్షన్‌ల పెంపు, కొత్త పెన్షన్‌లు, పదవీ విరమణ పొందిన ఉద్యోగుల బకాయిలు, ప్రభుత్వ ఉద్యోగుల పిఆర్‌సి, హెల్త్ కార్డులు, జర్నలిస్టుల సమస్యలు, ఆటో డ్రైవర్ల పథకం, ఆరు గ్యారెంటీలలో పలు హామీలు పెండింగ్‌లోనే ఉన్నాయి. ముఖ్యంగా దశాబ్దానికిపైగా కష్టాలను ఎదుర్కొని పార్టీనే పట్టుకొని నిలబడ్డ కార్యకర్తలు తమ ప్రభుత్వ కాలం సగం తీరిపోయినప్పటికీ ఇంకా నామినేటెడ్ పదవుల రావడం లేదని బాధపడుతున్నారు. తమను సమన్వయం చేసుకోవడం లేదనే అభిప్రాయం వారిలో నాటుకొని ఉంది. అది దూరం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే. ఇంకా నెరవేర్చాల్సిన హామీలు, వాగ్దానాల అమలు కోసం ప్రజలు ఎదురు చూస్తున్నారు. ఇప్పటి వరకు ఆర్థిక వెసులుబాటు లేకపోవడం, గత ప్రభుత్వంపై ఉన్న కోపంతో ఓపికపట్టారు. రెండేళ్ళు పూర్తవడంతో కాంగ్రెస్ ప్రభుత్వం తనను తాను నిరూపించుకోవాల్సిన సమయం వచ్చింది.

## హోంగార్డ్స్ దినోత్సవ వేడుకలు

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్:** 63వ హోంగార్డ్స్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మహబూబ్‌నగర్ జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయం కవాతు మైదానంలో హోంగార్డ్స్ కవాతు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా ఎస్పీ డి.జానకి ముఖ్య అతిథిగా హాజరై అందరి కవాతును పరిశీలించారు. అనంతరం హోంగార్డ్స్ సంస్థ స్థాపన లక్ష్యాలు, వారి బాధ్యతలు, సమాజ శాంతి అభివృద్ధికి హోంగార్డ్స్ చేస్తున్న సేవలపై స్పష్టమైన, ప్రేరణాత్మక సందేశాన్ని అందించారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ హోంగార్డ్స్ వ్యవస్థ ప్రజల రక్షణ, భద్రత, అత్యవసర పరిస్థితుల్లో స్పందన, ట్రాఫిక్ నియంత్రణ, విపత్తుల సమయంలో సహాయక చర్యలు వంటి అనేక కీలక రంగాల్లో అమూల్యమైన సేవలు అందిస్తున్నదని పేర్కొన్నారు. మహబూబ్‌నగర్ జిల్లాలో 208 మంది హోంగార్డ్స్ ప్రజల భద్రత కోసం అంకితభావంతో పని చేయడం గర్వకారణమని తెలిపారు. సిబ్బంది మాట్లాడుతూ తమ సేవలను మొదటిసారిగా ఇంత పెద్ద స్థాయిలో గుర్తించి, సన్మానించినందుకు ఆనందం వ్యక్తం చేసి, ఎస్పీకి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎన్.బి రత్నం, డీఎస్పీలు వెంకటేశ్వర్లు, రమణా రెడ్డి, ఆర్‌ఐలు కృష్ణయ్య, నగేష్, ఆర్ఎస్ఐ, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## పారదర్శకంగా పోలింగ్



**ప్రజాపక్షం/వంగూర్:** ఈనెల 11 నిర్వహించనున్న గ్రామపంచాయతీ ఎన్నికల పోలింగ్ పారదర్శకంగా నిర్వహించాలని ఎంపిడిఓ బ్రహ్మచారి అన్నారు. శనివారం ఎంపిడిఓ కార్యాలయంలో ఎన్నికల సిబ్బందికి శిక్షణ శిబిరాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 10వతేదీ ఉదయం 9గంటలకు మండల కేంద్రంలోని జడ్పిహెచ్ఎస్ పాఠశాలకు సిబ్బంది చేరుకొని పోలింగ్ సామాగ్రిని ఆయా గ్రామ పంచాయతీ రూట్లద్వారా చేరుకోవాలని ఆయన ఎన్నికల సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో పోలింగ్ పిఓలు, సిబ్బంది పాల్గొన్నారు.

## బిజెపిని బొంద పెడితేనే బిసి రిజర్వేషన్లు



### వామపక్షాలు కార్మిక, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఈశ్వర చారి సంతాప సభ

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ :** మహబూబ్‌నగర్ పట్టణంలోని టిఎఫ్‌టియు జిల్లా కార్యాలయంలో బీసీ రిజర్వేషన్లకై ప్రాణ బలిదానం చేసిన సాయి ఈశ్వరాచారి సంతాప సభ వామపక్షాలు, కార్మిక, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో జరిగింది. ఈ సభకు టిఎఫ్‌టియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్‌ఎం ఖలీల్ అధ్యక్షత వహించారు. ప్రముఖ తెలంగాణ ఉద్యమకారులు, సామాజికవేత్త హనీఫ్ అహ్మద్ మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీ పార్లమెంటులో 9వ షెడ్యూల్డ్ పెట్టి రిజర్వేషన్ అమలు చేస్తామని హామీ ఇచ్చి ఉంటే ఈశ్వర చారి ప్రానాలు దక్కేవని తెలిపారు. సిపిఐ జిల్లా కార్యదర్శి బాలకృష్ణ మాట్లాడుతూ రాష్ట్రంలో బీసీ నాయకత్వం ఐక్యతను ప్రదర్శించాలని కోరారు. బీసీలకు శత్రువు ఎవరో గ్రహించాలని కోరారు. బీసీలకు అన్యాయం చేస్తున్న కేంద్ర ప్రభుత్వ పసంచన చేరి బీసీలకు న్యాయం జరగడం లేదు అనడం విడ్డూరమని విమర్శించారు. సిపిఎం పార్టీ జిల్లా నాయకులు ఎన్. కురుమూర్తి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమం గురించి మాట్లాడడం లేదని విమర్శించారు. టిఎఫ్‌టియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్‌ఎం ఖలీల్ మాట్లాడుతూ అసంఘటిత రంగ కార్మికుల్లో 80 % బీసీ సామాజిక వర్గానికి చెందిన వారే ఉన్నారని వీరికి రిజర్వేషన్లు లేక పోవడం వల్ల వీరి పిల్లలు చదువుల్లోనూ, ఉద్యోగాలు పొందడంలోనూ వివక్షతకు గురి చేయబడుతున్నారని విమర్శించారు. ఇతర వక్తలు మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీని బొంద పెట్టడం ద్వారా మాత్రమే బీసీలకు రిజర్వేషన్లు అమలు అవుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఈసుబ్ బిన్ వాసర్, బీసీ హక్కుల సాధన కమిటీ నాయకులు ప్రకాష్ చారి, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి లక్ష్మణ్, నాయకులు సి. రాజు, ఏఐవైఎఫ్ జిల్లా కో కన్వీనర్ మహేష్, ప్రముఖ మైనార్టీ నాయకులు హసన్ బిల్ అఖ్లీ, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు భారత్, స్వీపర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షులు జి. గట్టన్న, ఎంఏ రహీం, అబ్దుల్ అజీజ్, డాక్టర్ బాబర్ శైక్, జలాల్ భాషా, ఖాజా నిజాముద్దీన్, టి అమ్మవ నాయకులు మమ్మద్ ముక్తార్ అహ్మద్ పాల్గొన్నారు.

## ట్రైబల్ వెల్ఫేర్ గురుకుల ఆర్‌సిఓను సస్పెండ్ చేయాలి: ఏఐఎస్ఎఫ్




**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్:** ట్రైబల్ వెల్ఫేర్ గురుకుల ఆర్‌సిఓను సస్పెండ్ చేయాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి సి.రాజు డిమాండ్ చేశారు. క్షేత్రస్థాయిలో ఆర్‌సిఓ పర్యవేక్షణ లేనందు వల్లనే జడ్చర్ల మండలంలోని కోడుగల్ ట్రైబల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాలలో పదవ తరగతి విద్యార్థినిపై ఒక సంవత్సరం నుంచి మహిళా వైస్ ప్రిన్సిపాల్ లైంగిక వేధింపులకు గురిచేసిన ఆర్‌సిఓ గుర్తించకపోవడం ఏమిటని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి రాజు ప్రశ్నించారు. దీనికి బాధ్యత వహిస్తూ ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్‌తో సహా ట్రైబల్ వెల్ఫేర్ ఆర్సివోని కూడా వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. పేద విద్యార్థుల కోసం ఇంటిగ్రేట్ గురుకులాలు ఏర్పాటు చేస్తున్నామని ఒకపక్క ముఖ్యమంత్రి చెబుతున్నా, క్షేత్రస్థాయిలో అధికారుల పర్యవేక్షణ లేక చాలా గురుకులలో ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపల్‌లు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. విద్యార్థి సంఘాల నాయకులు ఆర్సిఓలకు ఫోన్లు చేసినా చాలా వరకు ఎత్తడం లేదు, నాయకులు ప్రశ్నిస్తే స్టేట్ ఆఫీస్‌కి వచ్చాము, మీటింగ్‌లో ఉన్నాము అని సమాధానం చెబుతున్నారు. పేద విద్యార్థుల కోసం గురుకులాలు ఏర్పాటు చేశారు. ఇకనైనా జిల్లా కలెక్టర్ స్పందించి ఆర్‌సిఓలు, జిల్లా అధికారులు ప్రతిరోజు ఒక గురుకుల పాఠశాల, కళాశాలలను సందర్శించి అక్కడ ఉన్న సమస్యలను ఎప్పటికప్పుడే తెలుసుకొని వెంటనే పరిష్కరించి విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నాం లేనిపక్షంలో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. జిల్లా కార్యదర్శి లక్ష్మణ్, నాయకులు మహేష్, శేఖర్ మన్సూర్ పాల్గొన్నారు.

## వాహనాల తనిఖీలు

**ప్రజాపక్షం/వీపనగండ్ల:** స్థానిక సంస్థల ఎన్నికల సమయం దగ్గరపడుతున్న నేపథ్యంలో పోలీసులు వాహనాల తనిఖీలను ముమ్మరం చేశారు. మండల పరిధిలోని గోవర్ధనగిరి సమీపంలో స్థానిక ఎస్సై కే.రాణి సిబ్బందితో కలిసి వాహనాలను ఆపివేసి పర్యవేక్షణ నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఎస్సై కే.రాణి మాట్లాడుతూ ఎన్నికల ప్రభావం చూపేలా భారీగా నగదు, మద్యం, బహుమతి పదార్థాలు తరలించే ప్రయత్నాలను అరికట్టడమే తమ లక్ష్యమని తెలిపారు. రూ.50 వేలకు మించిన మొత్తం తీసుకెళ్లే, దాని మూలం స్పష్టంగా ఉండేలా చెక్‌లు, బ్యాంక్ స్టేట్‌మెంట్, బిల్లులు లేదా సంబంధిత పత్రాలు తప్పనిసరిగా వెంట ఉంచాలని సూచించారు. లేకపోతే ఆ మొత్తాన్ని స్వాధీనం చేసుకుని, సంబంధిత వ్యక్తులను విచారణకు పంపించే అవకాశం ఉందన్నారు. ప్రజలు, వ్యాపారులు అసౌకర్యానికి గురికాకుండా అవసరమైన పత్రాలు వెంట తీసుకెళ్లాలని, అలాగే అనవసరమైన అపోహలకు తావులేకుండా సహకరించాలని కోరారు. ఎన్నికల సమయంలో శాంతి భద్రతలు కాపాడటం, అక్రమంగా డబ్బు ప్రభావం చూపే పరిస్థితులను నిలువరించడం పోలీసుల ప్రధాన బాధ్యత అన్నారు.

## చెక్‌పోస్ట్, పోలింగ్ కేంద్రాల పరిశీలన

**ప్రజాపక్షం/కృష్ణ:** గ్రామపంచాయితీ ఎన్నికల దృష్ట్యా భద్రతా చర్యలను మరింత బలోపేతం చేయడానికి సీఐ రామ్‌లాల్, కృష్ణ ఎస్సై నవీద్ ఎస్ఎస్టీ బృందంతో కలిసి కృష్ణ బ్రిడ్జి చెక్‌పోస్టు వద్ద విస్తృతంగా వాహనాలు తనిఖీలు నిర్వహించారు. చెక్‌పోస్టు వద్ద అప్రమత్తంగా ఉండాలని, వాహనాలలో తీసుకెళుతున్న అనుమానాస్పద వస్తువులు, నగదు, మద్యం, ఆయుధాలను, పూర్తిగా పరిశీలిస్తూ ఎన్నికలు ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా జరిగేలా చూడాలని తెలిపారు. అంతేకాకుండా, అధికారులు గుడేబల్లూర్ గ్రామంలోని పోలింగ్ కేంద్రాలను ప్రత్యక్షంగా సందర్శించి పరిశీలించారు. ఈ గ్రామంలో మొత్తం 14 పోలింగ్ బూత్‌లు ఉండగా, వాటిలో పలు కేంద్రాలు సమస్యాత్మకంగా గుర్తించబడిన నేపథ్యంలో ప్రత్యేకంగా తనిఖీలు చేయడం, భద్రతా చర్యలను పటిష్ట పరచడం జరిగిందని తెలిపారు. ముందస్తు పోలింగ్ కేంద్రాల వద్ద సీసీ కెమెరాలు, లైటింగ్, బ్యారికేడింగ్, పోలీసులు బందోబస్తు వంటి అంశాలను పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని సిఐ తెలిపారు. శాంతి భద్రతలను కాపాడడమే పోలీసుల ప్రథమ కర్తవ్యమని, ఎలాంటి ఉల్లంఘనలను సహించబోమని స్పష్టం చేశారు.

# విద్యకే తొలి ప్రాధాన్యత

### ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ :** విద్య రంగానికే తాను అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నానని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. మహబూబ్ నగర్ పట్టణంలోని టిడి గుట్ట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు తన స్వంత నిధులతో ప్రత్యేకంగా తయారు చేయించిన క్యూఆర్ కోడ్ డిజిటల్ కంటెంట్ స్టడీ మెటీరియల్స్ ను ఆయన విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ''ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు కూడా కార్పొరేట్ స్థాయి విద్యను పొందాలనే లక్ష్యంతోనే ఈ డిజిటల్ స్టడీ మెటీరియల్స్ ను ఏర్పాటు చేశామని, భవిష్యత్తు కోసం విద్యార్థులు బలమైన పునాదులు నిర్మించుకోవాలని, అందుకోసం మా వంతు సహకారం ఎల్లప్పుడూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఉంటుంది'' అని ఆయన స్పష్టం చేశారు. ప్రముఖ గ్రామీణ వైద్యులు పాఠశాల పూర్వపు విద్యార్థి సురేందర్ లక్ష రూపాయల విరాళాన్ని విద్యా నిధికి ఇచ్చి, తాను చదివిన పాఠశాల అభివృద్ధి కోసం ఖర్చు చేయాలని ఆయన కోరినట్లు ఎమ్మెల్యే తెలిపారు. సురేందర్ కోరిక మేరకు ఆయన ఇచ్చిన విరాళంతో పాటు అవసరమైతే మరింత నిధులు కేటాయించి టిడి గుట్ట పాఠశాలను అన్ని విధాలా అభివృద్ధి చేస్తామని, మౌలిక వసతులు, గదుల సదుపాయాలు, స్మార్ట్ లెర్నింగ్ పరికరాలు, అన్ని కల్పిస్తాం'' అని ఆయన స్పష్టం చేశారు. గతంలో ఈ పాఠశాలకు డిజిటల్ బోర్డులను అందించాలమని, '' ఆ డిజిటల్ బోర్డుల్లో విద్యార్థులకు పాఠ్యాంశాలు సులభంగా అర్థమయ్యే విధంగా కంటెంట్ నింపించామని, కొత్త పద్ధతుల్లో పాఠ్యాంశాలు అందుబాటులో ఉండటం వల్ల విద్యార్థులు మంచి స్థాయిలో నేర్చుకుంటున్నారు'' అని ఆయన అన్నారు. విద్యార్థుల భవిష్యత్తుకై ఎమ్మెల్యే చూపిస్తున్న చొరవ పట్ల ఉపాధ్యాయులు



ఎమ్మెల్యే కి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే పాఠశాల పరిసరాలను పరిశీలించారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, జిల్లా ఎస్సీ సెల్ చైర్మన్ సాయిబాబా, మహబూబ్‌నగర్ ఫస్ట్ పర్యవేక్షకులు గుండా మనోహర్, నాయకులు మేనీర్, చిన్న, ఫఖ్రు, చంద్రమోహన్, గ్రామీణ వైద్యులు సురేందర్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మణిరాం రాథోడ్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# రాజీమార్గం ద్వారా కేసుల పరిష్కారం

**ప్రజాపక్షం/నారాయణపేట :** రాజీమార్గం ద్వారా కేసులు పరిష్కరణ సీనియర్ సివిల్ జడ్జి వింధ్య నాయక్, నారాయణపేట జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ప్రధాన న్యాయమూర్తి బోయ శ్రీనివాసులు ఆదేశాల మేరకు జరిగిన పోలీస్ అఫీషియల్స్ మీటింగులో జరగబోయే జాతీయ లోక్ అదాలత్ ను ఉద్దేశించి, సీనియర్ సివిల్ జడ్జి మరియు లీగల్ సర్వీసెస్ కార్యదర్శి వింధ్య నాయక్ మాట్లాడుతూ రాజీమార్గం ద్వారా కేసులు పరిష్కరించడానికి లోక్ అదాలత్ ఎంతో ఉపయోగపడుతుందని న్యాయమూర్తి తెలిపారు. డిసెంబర్ 13న జరగాల్సిన జాతీయ లోక్ అదాలత్ 21న జరగనుంది అన్నారు. తదుపరి నారాయణపేట జిల్లాలోని మొత్తం 14 పోలీస్ స్టేషన్ పరిధిలో పెండింగులో ఉన్న కేసులను అడిగి తెలుసుకున్నారు. జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్లు నారాయణపేట టౌన్ మరియు రూరల్, మాగనూరు, మద్దూరు, దామరగిద్ద, ఉట్కూర్, కోస్గి, ధన్వాడ, మక్తల్, కృష్ణ, నర్వ, మరికల్, ఎక్సైజ్ ఇతర స్టేషన్‌లలో ఈ పెట్టి, డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు పెండింగులో ఉన్నాయని టార్గెట్‌గా ఉన్నాయని తెలిపారు. ఎక్సైజ్ శాఖలో పెండింగు కేసులు ఉన్నాయా క్లియర్ చేయాలన్నారు. ఇది వరకు ఇచ్చిన అన్ని కలిపి 5000 కేసులను టార్గెట్‌ను ఆరా తీశారు. వాటిని ఈ లోక్ అదాలత్‌లో త్వరగా క్లియర్ చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో విజయవంతం చేయడానికి అన్ని టీములు సిద్ధంగా ఉండాలని ఈ లోక్ అదాలత్ ను కక్షిదారులు ఉపయోగించుకునేలా తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఏజెండాలలోని అంశాలను సైబర్ క్రైమ్స్, నాన్ బైలాల్ వారెంట్ కేసులను, చార్జిషీట్, యన్ఐ ఆక్ట్ పెండింగులో ఉన్నాయా చర్చించారు. ముందుగా గౌరవనీయులైన హైకోర్టు జడ్జే ఆదేశానుసారం ముందుగా పెండింగు కేసులను పరిష్కారం చేయాలని పోలీసు అధికారులకు తెలిపారు. ఈ సమావేశంలో సీనియర్ సివిల్ జడ్జి మరియు సెక్రెటరీ డిఎల్ఎస్ఎ వింధ్య నాయక్, బి.మనోజ్, ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి, జూనియర్ సివిల్ జడ్జి అవినాష్, పబ్లిక్ ప్రాసిక్యూటర్స్ సురేష్ కుమార్, పోలీసు అధికారులు పాల్గొన్నారు.



# ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యేంత వరకు కోడ్



### ఏకగ్రీవం జరిగిన గ్రామాల్లోనూ : కలెక్టర్ సిక్తా పట్నాయక్

**ప్రజాపక్షం/నారాయణపేట :** నారాయణపేట జిల్లాలో గ్రామపంచాయితీ ఎన్నికల మూడు దశల్లో నిర్వహించనున్న నేపథ్యంలో ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యేంత వరకు 18 వరకు జిల్లా అంతటా ఎన్నికల ప్రవర్తన నియమావళి యంసిసి అమలులో ఉంటుందని జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ సిక్తా పట్నాయక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి దశ పోలింగ్‌తో పాటు రెండవ దశ పోలింగ్ పూర్తయిన తరువాత కూడా సంబంధిత గ్రామాలు, మండలాల్లో ఎన్నికల కోడ్ అమల్లోనే ఉంటుందని, మూడవ దశ ఎన్నికల ప్రక్రియ పూర్తయిన తర్వాత మాత్రమే ఎన్నికల ప్రవర్తనా నియమావళి తొలగిపోతుందని తెలిపారు. అందువల్ల మొదటి, రెండవ దశలో ఎన్నికైన అభ్యర్థులు, ఇతరులు ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించరాదని ఆమె సూచించారు. ఏకగ్రీవమైన గ్రామపంచాయితీలలో సైతం ఎన్నికల కోడ్ అమలులోనే ఉంటుందని పేర్కొన్నారు. రాష్ట్ర ఎన్నికల సంఘం గ్రామ పంచాయితీ ఎన్నికల షెడ్యూల్ విడుదల చేయడంతో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిందని, చివరి దశ ఫలితాలు వెలువడే వరకు ఎన్నికల కోడ్‌ను పక్కాగా అమలు చేయాలని తెలిపారు. ఈనెల 11,14,17 తేదీల్లో జిల్లాలోని గ్రామపంచాయితీలకు సర్పంచు, వార్డు స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయని అన్నారు. ఈ నేపథ్యంలో రాజకీయ పార్టీలు, అభ్యర్థులు, నాయకులు, అలాగే ప్రజలు ఎంసీసీ నిబంధనలు పూర్తిగా పాటించి సహకరించాలని కలెక్టర్ కోరారు.

**కలెక్టర్ సమక్షంలో జీ.పీ ఎన్నికల పోలింగ్ సిబ్బంది ర్యాండమైజేషన్**

గ్రామ పంచాయితీ ఎనికల నిర్వహణ ఏర్పాట్లలో భాగంగా రెండో విడత ఎన్నికల పోలింగ్ సిబ్బంది రెండవ విడత ర్యాండమైజేషన్ ప్రక్రియను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సిక్తా పట్నాయక్, ఎన్నికల సాధారణ పరిశీలకురాలు సీతాలక్ష్మీ సమక్షంలో శనివారం నిర్వహించారు. నారాయణపేట్ జిల్లా కలెక్టర్ ఛాంబర్‌లో ఎన్నికల సంఘం నిబంధనలను అనుసరిస్తూ ర్యాండమైజేషన్ జరిపించారు. ఈ ప్రక్రియను కలెక్టర్ నిశితంగా పరిశీలించారు. జిల్లాలోని ఒక్కో మండలం వారీగా ఆయా గ్రామ పంచాయితీల సర్పంచు, వార్డు స్థానాలకు ఎన్నికల పోలింగ్ విధులు నిర్వర్తించే ప్రిసైడింగ్ అధికారులు, ఓపిఓలను ర్యాండమైజేషన్ ద్వారా కేటాయించారు. జిల్లాలోని 95 గ్రామ పంచాయితీల సర్పంచు, 900 వార్డుల స్థానాలకు 904 పోలింగ్ స్టేషన్‌లలో ఎన్నికల నిర్వహణ కోసం 20 శాతం రిజర్వ్ స్టాఫ్ కలుపుకుని ప్రిసైడింగ్ అధికారులతో పాటు, ఓపిఓల ర్యాండమైజేషన్ జరిపారు. ర్యాండమైజేషన్ ప్రక్రియలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్, డీపీఓ సుధాకర్‌రెడ్డి, డీఈఓ గోవిందరాజులు, డీపీఆర్ఓ రషీద్ పాల్గొన్నారు.

## ఆదరించండి.. అభివృద్ధి పథంలో నడిపిస్తా



**ప్రజాపక్షం/కల్వకుర్తి :** యంగంపల్లి గ్రామ పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్‌గా తనను ఆదరించి గెలిపిస్తే గ్రామాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి పథంలో నడిపిస్తానని కాంగ్రెస్‌పార్టీ బలపర్చిన యంగంపల్లి సర్పంచ్ అభ్యర్థి కుడుముల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గత రెండు సంవత్సరాల నుండి గ్రామాభివృద్ధికి రూ.లక్షా 50వేల సొంత ఖర్చులతో గ్రామంలో 12 సిసి కెమెరాలు ఏర్పాటు చేసినట్లయితే తెలిపారు. అదేవిధంగా ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో గ్రామంలో రూ.30లక్షలతో సిసిరోడ్ల నిర్మాణం చేపట్టడం జరిగిందన్నారు. పార్టీలకు అతీతతంగా ప్రజలకు రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇండ్ల మంజూరుకు తనవంతు కృషి చేయడం జరిగిందని అన్నారు. సర్పంచ్‌గా గెలిపిస్తే అభివృద్ధికి పెద్దపీట వేస్తానని అన్నారు. ఆయనవెంట కాంగ్రెస్‌పార్టీ నాయకులు, గ్రామప్రజలు ఉన్నారు.

## ఎన్నికల్లో మైక్రో అబ్జర్వర్లు కీలకం

### కలెక్టర్ బదావత్ సంతోష్

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ :** జిల్లాలో పంచాయతీ ఎన్నికలు స్వేచ్ఛాయుత వాతావరణంలో నిర్వహించడంలో మైక్రో అబ్జర్వర్ల పాత్ర అత్యంత కీలకమని జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. శనివారం కలెక్టరేట్‌లోని ప్రజావాణి సమావేశమందిరంలో 55మంది మైక్రో అబ్జర్వర్లకు నిర్వహించిన శిక్షణకు నాగర్‌కర్నూల్ జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకురాలు రాజ్యలక్ష్మి, అదనపు కలెక్టర్ దేవసహాయంలతో కలిసి జిల్లా కలెక్టర్ బదావత్‌సంతోష్ హాజరయ్యారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మైక్రో అబ్జర్వర్లు పోలింగ్ ప్రక్రియను పరిశీలన చేయడమే అత్యంత కీలకమని, పివోలు, ఎపిఓల విధుల్లో జోక్యం చేసుకోవద్దని, పోలింగ్ ప్రక్రియను జాగ్రత్తగా గమనించాలన్నారు. జిల్లా పంచాయతీ ఎన్నికల సాధారణ పరిశీలకురాలు రాజ్యలక్ష్మి మాట్లాడుతూ పోలింగ్ ప్రక్రియ నిర్వహణలో మైక్రో అబ్జర్వర్లు ఎన్నికల కమీషన్ తరపున కళ్లు, చెవుల లాగా పనిచేయాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ దేవసహాయం, జిల్లాపరిషత్ అదనపు సిఇవో గోపాల్‌నాయక్, డిపిఓ శ్రీరాములు, లీడ్‌డిస్ట్రిక్ మేనేజర్ చంద్రశేఖర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

**అత్యంత పారదర్శకంగా నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ**

నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండల పరిధిలోని పాలెం క్లస్టర్‌లో వచ్చే రెండోవిడత గ్రామపంచాయతీ ఎన్నికలకు సంబంధించిన ఉపసంహరణ ప్రక్రియను శనివారం జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్, వెంకటాపూర్, పాలెం, ఖానాపూర్ గ్రామ పంచాయతీలలో నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియను ప్రత్యక్షంగా పరిశీలించి సంబంధిత అధికారులతో మాట్లాడారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ మాట్లాడుతూ సర్పంచ్, వార్డుస్థానానికి ఉపసంహరణకు అభ్యర్థుల నుంచి డిక్లరేషన్ తీసుకోవాలి, ఎలాంటి బెదిరింపులు, ఒత్తిళ్లు, ప్రలోభాలకు గురికాకుండా స్వచ్ఛందంగా నామినేషన్ ఉపసంహరించుకుంటున్నట్లు అభ్యర్థులతో ధృవీకరణపత్రం తీసుకోవాలన్నారు.

# అంబేద్కర్ ఇచ్చిన రాజ్యాంగంతో ప్రజాస్వామ్యానికి బలమైన పునాదులు



### ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్:** భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ 69వ వర్ధంతి సందర్భంగా మహబూబ్ నగర్ అంబేద్కర్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అంబేద్కర్ విగ్రహానికి పుష్పమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. డిసిసి అధ్యక్షులు ఎం. సంజీవ్ ముదిరాజ్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఓబేదుల్లా కొత్వాల్, ఉపాధ్యక్షులు సత్తూరు చంద్రకుమార్ గౌడ్, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షులు ఎన్.పి. వెంకటేష్, జిల్లా మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ బెక్కరి అనిత మధుసూదన్ రెడ్డి, జిల్లా మత్స్య సహకార సంఘం ఇన్‌చార్జ్ గోనెల శ్రీనివాసులు, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు అవేజ్, మీడియా ఇన్‌చార్జ్ సిజే బెనహార్, ఎస్సీ సెల్ చైర్మన్ సాయి బాబా, ఐఎన్టీయూసీ రాములు యాదవ్, శాంతన్న యాదవ్, గోపాల్ యాదవ్, నవనీత, ఏర్పుల నాగరాజు, అజ్మత్ అలి, ఫయాజ్, జహీర్, ప్రవీణ్ కుమార్, ముహమ్మద్ రియాజుద్దీన్, అబ్దుల్ హక్, ఫైసల్, చంద్రమోహన్, మోయిజ్, చర్ల శ్రీనివాసులు, పులిజాల రవికిరణ్, వేణుగోపాల్ ,వెంకటలక్ష్మి , అలీం తదితరులు పాల్గొన్నారు.

**ఏఐటియూసి నేతల ఘన నివాళులు**

కేంద్రంలోని ప్రధాని నరేంద్ర మోడీ ప్రభుత్వం దేశంలో రాజ్యాంగ సృష్టికర్త డాక్టర్ బి. ఆర్ అంబేద్కర్ ఆనవాళ్లు లేకుండా చేసేందుకు కుట్రలు పన్నుతున్నదని ఏఐటియూసి జిల్లా కార్యదర్శి పి. సురేష్ మండిపడ్డారు. డాక్టర్.బి.ఆర్ అంబేద్కర్ 69వ వర్ధంతి సందర్భంగా ఏఐటియుసి ఆధ్వర్యంలో మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలోని న్యూ బస్టాండ్ సమీపంలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కాంట్రాక్టు ఉద్యోగుల సంఘం ఏఐటియుసి నేత గోపాల్ నాయక్, ఏఐటియూసీ నాయకులు బి.చెన్నయ్య, గోపాల్ నాయక్, ఖాదర్, యాదయ్య, భీమయ్య, చెన్నయ్య, గోపి, రంగయ్య, మేస్త్రి రామకృష్ణ పాల్గొన్నారు.






**ప్రజాపక్షం/ఉట్కూర్:** భారత రాజ్యాంగ శిల్పి, సామాజిక సమానత్వ పోరాట యోధుడు, ప్రపంచ మేధావి డా.బి.ఆర్.అంబేద్కర్ 69వ వర్ధంతి వేడుకలను చిన్నపొర్ల గ్రామంలో అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఉదయ్ కుమార్ ప్యాట వేణు, చంద్రకాంత్, ధర్మ సమాజ్ పార్టీ నాయకులు గ్రామ మైనార్టీ నాయకుడు, గ్రామ యువకులు పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/వనపర్తి టౌన్:** రాజ్యాంగంలో డా.బాబా సాహెబ్ అంబేద్కర్ ఇచ్చిన హక్కులు అవకాశాల వల్లే దేశంలోని పేద ప్రజల జీవితాల్లో మౌలిక మార్పులు వస్తున్నాయని సిపిఐ వనపర్తి నియోజకవర్గ కార్యదర్శి రమేష్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు శ్రీరామ్ అన్నారు. వనపర్తి పట్టణం అంబేద్కర్ చౌక్‌లో అంబేద్కర్ 69వ వర్ధంతిని సిపిఐ ఆధ్వర్యంలో నిర్వహించారు. విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సిపిఐ



జిల్లా కార్యవర్గ సభ్యులు, కళావతమ్మ, శ్రీరామ్, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు చిన్న కురుమన్న, సిపిఐ పట్టణ సహాయ కార్యదర్శి గోపాలకృష్ణ, సురేష్, భారత జాతీయ మహిళా సమాఖ్య వనపర్తి పట్టణ కన్వీనర్ జయమ్మ , కో కన్వీనర్ శిరీష, శ్రీదేవి, జ్యోతి, సుప్రియ, కాంతమ్మ, పానుగల్ మండల కార్యదర్శి డంగు కురుమయ్య, మాజీ సహాయ కార్యదర్శి శివ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



**ప్రజాపక్షం/జడ్చర్ల:** జడ్చర్ల పాతబజార్‌లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో డా.బి.ఆర్.అంబేద్కర్ 69వ వర్ధంతి ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పార్టీ సభ్యులు మాట్లాడుతూ స్వేచ్ఛ, సామాజిక న్యాయం, సమానత్వం సాధనకు మార్గదర్శిగా భారత దేశానికి గొప్ప రాజ్యాంగాన్ని అందించిన మహనీయుడు అని అన్నారు. డా.బి.ఆర్.అంబేద్కర్ 69వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు అర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మండల అధ్యక్షుడు, మున్సిపల్ చైర్మన్ కౌన్సిలర్స్ యూత్ కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు చుట్టుపక్కల ప్రాంతాల వారు వివిధ కుల సంఘాల నేతలు తదితరులు పాల్గొన్నారు.



**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ :** దేశంలో రాజ్యాంగం ద్వారా అవకాశాలు కల్పించిన గొప్ప మహనీయుడు అంబేద్కర్ అని డిహెచ్‌పిఎస్ జిల్లా అధ్యక్షులు కొమ్ము భరత్ అన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లాతాడూరు మండలం అంతారం గ్రామంలో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ 69వ వర్ధంతిని దళితహక్కుల పోరాటసమితి ఆధ్వర్యంలో అంబేద్కర్‌కు పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీవార్డు సభ్యులు కొమ్ము లక్ష్మయ్య, నాగయ్య, కృష్ణయ్య, వెంకటయ్య, సునీత, వెంకటయ్య, లక్ష్మమ్మ, పెద్దయ్య, రేణుక, పరమేష్ పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/నారాయణపేట:** అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఏబీవీపీ నారాయణపేట శాఖ ఆధ్వర్యంలో నారాయణపేట జిల్లా కేంద్రంలోని ద్వారక హైస్కూల్‌లో డా.బి.ఆర్.అంబేద్కర్ వర్ధంతి పురస్కరించుకుని ఏబీవీపీ ఆధ్వర్యంలో సామాజిక సమరసత దివాస్ సెమినార్ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి అయిన నరసింహా, అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ జిల్లా కన్వీనర్ నరేష్, నగర కార్యదర్శి సతీష్, ఇంతియాజ్, చరణ్ రెడ్డి, ఓంకార్ కళాశాల అధ్యక్షులు, తరుణ్, అరుణ్, సంతోష్, ఆదర్శ్, ఏబీవీపీ కార్యకర్తలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



## అంబేద్కర్‌కు ఘన నివాళులు



ప్రజాపక్షం/చింతలపాలెం : మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద మహానాయకుడు, భారత రాజ్యాంగ శిల్పి డాక్టర్ బిఆర్ అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా స్థానిక నాయకులు, ప్రజలు కలిసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా నాయకులు ఉస్తేల నారాయణరెడ్డి మాట్లాడుతూ అసమానతల నిర్మూలన, సమాన హక్కులు, విద్య వెలుగు, సామాజిక న్యాయం కోసం మహత్తర పోరాటాలు చేసిన నాయకుడన్నారు. పేదలు, వెనుకబడిన వర్గాల అభివృద్ధికి అంబేద్కర్ చూపిన మార్గంలోనే ముందుకు సాగాలని కోరారు. ఈ కార్యక్రమంలో మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు సృజన, సిపిఐ మండల కార్యదర్శి రవి, మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మోర్తాల సీతారెడ్డి, శివాలయం చైర్మన్ రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

## 75 మంది బైండోవర్



ప్రజాపక్షం/మునగాల: మండలంలోని మాధవరం, రేపాల, సీతానగరం, గణపవరం, కలకోవ, జగన్నాధపురం, నర్సింహులగూడెం గ్రామాలకు చెందిన వివిధ పార్టీల సర్పంచుల అభ్యర్థులు, వార్డు మెంబర్‌కు పోటీ చేసే అభ్యర్థులు, పలు పార్టీల ముఖ్య నాయకులు దాదాపు 75 మందిని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు మునగాల ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. రాబోయే గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ఎలాంటి గొడవలు, అల్లర్లు చేయకుండా శాంతిభద్రతలకు విఘాతం కలిగించకుండా శాంతియుతంగా ఎన్నికలను నిర్వహించుకునేలా తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు తెలిపారు. ఏదైనా గొడవలు జరిగి కేసుకు వెళితే ఒక్కొక్కరికి ఐదు లక్షల రూపాయలు ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉంటుందని అన్నారు.




## మూడో విడతకు ముందస్తు ఏర్పాట్లు

### సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ : మూడో విడత గ్రామ పంచాయతీ ఎన్నికల పోలింగ్‌కు అన్ని రకాల ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ తెలిపారు. శనివారం జిల్లా కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ లో జిల్లాలోని ఆర్‌డిఓలు, తహశీల్దార్లు, ఎంపిడిఓలు, ఎలక్షన్ స్పెషల్ ఆఫీసర్లతో కలెక్టర్ వెబ్‌ఎక్స్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చివరి విడత గ్రామ పంచాయితీ ఎన్నికల పోలింగ్ సందర్భంగా ఎలక్షన్ విధులు కేటాయించిన సిబ్బంది సర్పంచ్ వార్డు సభ్యుల స్క్రూటినీ, ఉపసంహరణ అనంతరం పోలింగ్‌కు సక్రమమైన ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. పోలింగ్ స్టేషన్‌లలో మౌళిక సదుపాయాలు చూసుకోవాలని అలాగే ఫెసిలిటేషన్ సెంటర్లు, డిస్ట్రిబ్యూషన్ సెంటర్లు, మెటీరియల్ పంపిణీ, వాహనాల ఏర్పాట్లు చేసుకోవాలని పోస్టల్ బ్యాలెట్‌కు సంబంధించి స్టేజి 1, ఆర్‌ఓలు 37 ఏ రిజిస్టర్‌లో సర్వీస్ ఓటర్ల వివరాలు నమోదు చేయాలన్నారు. స్టేజి 2 ఆర్‌ఓలు 37 సి రిజిస్టర్‌లో ఎన్నికల్లో విధులు నిర్వహించే వారి వివరాలు తప్పనిసరిగా నమోదు చేయాలన్నారు. రిటర్నింగ్ అధికారులు సంబంధిత గ్రామ పంచాయితీలోని పోలింగ్ కేంద్రాలను సందర్శించి అన్ని మౌళిక వసతులు ఉన్నాయో లేవో పరిశీలించాలని అలాగే పోలింగ్ తరువాత ఓట్లను కౌంటింగ్ చేయుటకు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కె సీతారామారావు, డిపిఓ యాదగిరి, డిఆర్‌డిఏ పిడి అప్పారావు, డివిజనల్ పిఓ నారాయణరెడ్డి పాల్గొన్నారు.

## మాలిలో బండసోమారం యువకుడి కిడ్నాప్

### ఆందోళనలో కుటుంబ సభ్యులు



ప్రజాపక్షం/భువనగిరి రూరల్ : ఉపాధి కోసం ఆఫ్రికా ఖండానికి వెళ్లిన భువనగిరి మండలానికి చెందిన యువకుడు కిడ్నాప్‌కు గురయ్యాడు. బండ సోమారం గ్రామానికి చెందిన నల్లమాస జంగయ్య, మహేశ్వరీల చిన్న కుమా రుడు ప్రవీణ్ ఏడాది క్రితం హైదరాబాద్లోని బోర్ వెల్ కంపెనీలో పనిలో చేరాడు. అక్కడి నుంచి కంపెనీ ద్వారా ఆఫ్రికా ఖండంలోని మాలి దేశానికి వెళ్లాడు. అక్కడే కోబ్రి సమీపంలో బోర్వెల్‌కు సంబంధించిన డ్రిల్లర్ గా పనిచేస్తున్నాడు. గత నెల 23న పని ముగించుకుని వస్తుండగా జమాత్ నుస్రత్ అల్ ఇస్లామ్ వల్‌ము స్లిమీన్ సంస్థకు చెందిన తీవ్రవాదులు అతడిని కిడ్నాప్ చేశారు. కుటుంబ సభ్యులకు సమాచారం ఆలస్యంగా తెలియడంతో ఆందోళన చెంది భారత రాయబార అధికారులతో సంప్రదింపులు చేస్తున్న ట్లు సమాచారం. నిందితుల నుంచి తమ కుమారుడిని విడిపించి, ఇండి యాకు తీసుకురావాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

## 21న జాతీయ లోక్ అదాలత్




ప్రజాపక్షం/వలిగొండ : 21న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకునేలా, పరిష్కార మార్గం చూపాలని రామన్నపేట సర్కిల్ పరిధిలోని పోలీసు అధికారులతో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ కోర్టు జడ్జి ఎస్.శిరీష సమక్షంలో సెకెండ్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు జడ్జి దంతూరి సత్తయ్యతో కలిసి సమన్వయ సమావేశం నిరహించారు. ఈ సమావేశంలో జడ్జి మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న కేసులు వేగవంతంగా పరిష్కారం అయ్యేలా అన్ని విభాగాల అధికారులు, న్యాయవాదులు, సంబంధిత సిబ్బంది సమన్వయంతో పని చేయాలని సూచించారు. లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కరించుకోవడానికి కక్షిదారులకి అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎన్.వేంకటేశ్వర్లు, రామన్నపేట, వలిగొండ, ఎస్ఐలు డి.నాగరాజు, యుగేందర్ గౌడ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## హత్యాయత్నం కేసులో ముగ్గురు నిందితులు అరెస్టు : రిమాండ్

ప్రజాపక్షం/మునగాల: హత్యయత్నం కేసులో ముగ్గురు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు మునగాల సిఐ రామకృష్ణారెడ్డి తెలిపారు. శనివారం కేసు వివరాలను పత్రిక ప్రకటనలో వెల్లడించారు. తాడ్వాయి గ్రామానికి చెందిన లొండగి వెంకయ్య అనే వ్యక్తి మునగాల గ్రా మానికి చెందిన కుప్పిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సుమారు 8 సంవత్సరాల క్రితం మూడు లక్షల రూపాయలు అప్పుగా ప్రామిసర్ నోట్ రా యించి తీసుకున్నాడు. ఆ నగదును ప్రభాకర్‌రెడ్డి తిరిగి ఇవ్వకపోవడంతో లోడంగి వెంకయ్య సివిల్ కోర్టులో అతడి ఆస్తుల అటాచ్‌మెంట్ కోసం కేసు వేశాడు. ఆ తర్వాత ప్రభాకర్‌రెడ్డి చనిపోవడంతో అతని కుమారుడు కుప్పిరెడ్డి నవీన్‌రెడ్డికి సంబంధించిన ఆస్తులు అమ్ముకోవడానికి, లోన్ తీసుకోవడానికి వీలు లేకుండా పోయింది. దీంతో కుప్పిరెడ్డి నవీన్‌రెడ్డి లోడంగి వెంకయ్యను హతమార్చాలని ప్లాన్ వేసుకున్నాడు. అందుకు అతడి స్నేహితులు తాడ్వాయి గ్రామానికి చెందిన కోట అంజి, మునగాల గ్రామానికి చెందిన చెల్లోజు గోపి ల సహకారంతో ఈనెల 2వ తేదీ సాయంత్రం మునగాలలో ఎన్నికల నామినేషన్ సెంటర్ దగ్గర ఉన్నవెంకయ్య ఉన్నాడని సమాచారం తెలుసుకుని కోట అంజి ద్వారా వెంకయ్యను పిలిపించి ఆ తరవాత అతడిని బలవంతంగా కారులో ఎక్కించుకుని ముకుందాపురం గ్రామం దాటుతుండగా వెంకయ్యపై నవీన్‌రెడ్డి తనతో తెచ్చుకున్న కత్తిని అతడి చాతి మీద, కుడిచేతి మీద పోడిచి హత్య ప్రయత్నం చేశాడు. దాంతో వెంకయ్యకు తీవ్ర గాయాలు కాగా, రక్తంతో తడిసిన వెంకయ్య శరీరంపై ఉన్న బట్టలు మార్చి, ఆత ర్వాత వెంకయ్యను ప్రథమ చికిత్స చేయించి సూర్యాపేట ప్రభుత్వాసుపత్రి ముందు వెంకయ్యను వదిలేసి వెళ్లిపోయారు. తరవాత బట్టలు మునగాల పెద్ద కాలువలో పడవేశారు. వెంకయ్య చికిత్స అనంతరం తన బంధువుల ద్వారా స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేయగా నిందితులపై కిడ్నాప్ హత్యప్రయత్నం కేసు నమోదు చేసినట్లు తెలిపారు. శనివారం ఉదయం నిందితులు కుప్పిరెడ్డి నవీన్‌రెడ్డి, కోట అంజి, చెల్లోజు గోపి లను మునగాల సిఐ రామకృష్ణారెడ్డి, ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ లు సిబ్బందితో కలిసి నవీన్‌రెడ్డి ఇంటిలో ఉన్న ముగ్గురుని అదుపులోకి తీసుకుని వారి నేరానికి వాడిన కారు, కత్తిని స్వాధీనం చేసుకుని నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

# ఎన్నికల్లో మైక్రో అబ్జర్వర్స్ పాత్ర కీలకం

### ఎన్నికల జిల్లా సాధారణ పరిశీలకులు రవి నాయక్



ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ : గ్రామ పంచాయితీ ఎన్నికల్లో మైక్రో అబ్జర్వర్స్ పాత్ర చాలా కీలకమైనదని జిల్లా సాధారణ ఎన్నికల పరిశీలకులు జి రవి నాయక్ అన్నారు. శనివారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన సూక్ష్మ పరిశీలకులు, జోనల్ ఆఫీసర్ శిక్షణ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో 3 విడతలలో జరుగనున్న గ్రామ పంచాయితీ ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయడం జరిగిందన్నారు. ఎన్నికల్లో సూక్ష్మ పరిశీలకుల పాత్ర కీలకమన్నారు. ఒకరోజు ముందుగానే సూక్ష్మ పరిశీలకులు పోలింగ్ స్టేషన్‌కు చేరుకొని పోలింగ్ కేంద్రాన్ని సూక్ష్మంగా పరిశీలించి ఎన్నికలు సజావుగా సాగే విధముగా చూసే బాధ్యత ఉంటుందన్నారు. వారి నివేదికలు కచ్చితంగా ఎన్నికల నిబంధనలకు లోబడి సమర్పించాలని చెప్పారు. జోనల్ అధికారులు 7, 8 గ్రామ పంచాయితీలకు ఒక రూట్ మ్యాప్ ఏర్పాటు చేసుకొని ఎలక్షన్ సిబ్బందిని, పోలీస్ సిబ్బందిని, పోలింగ్ సామాగ్రిని ఆయా పోలింగ్ కేంద్రాలకు చేర్చే విధంగా బాధ్యత తీసుకోవాలన్నారు. పోలింగ్ రోజు పోలింగ్ కేంద్రాలలో అత్యవసరంగా ఏమైనా పోలింగ్ మెటీరియల్ కావాలన్నా, సిబ్బందికి భోజనాలు చూసే బాధ్యత జోనల్ అధికారికి ఉంటుందని తెలిపారు. ఎన్నికల నిబంధనలు పాటిస్తూ విధులు నిర్వహించాలని తెలిపారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మైక్రోఅబ్జర్వర్స్ బాధ్యతగా పనిచేయాలని, జోనల్ అధికారులకు 7, 8 పోలింగ్ స్టేషన్స్ మీ పరిధిలో ఉంటాయన్నారు. ప్రతి పోలింగ్ స్టేషన్స్‌ను పరిశీలించాలని, ఆ పోలింగ్ స్టేషన్ నివేదిక సంబంధిత అధికారుల వద్ద ఉంటుందని అట్టి నివేదిక ప్రకారంగా నడుచుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కె సీతారామారావు, డిపిఓ యాదగిరి, డిఆర్‌డిఏ పిడి అప్పారావు, ట్రైనర్ రమేష్ పాల్గొన్నారు.

**ఫిర్యాదులను నేరుగా తెలుపవచ్చు**

గ్రామ పంచాయితీ ఎన్నికల సందర్భంగా ఏమైనా సమస్యలు, సమాచారాన్ని తెలియజేసేందుకు నేరుగా తన ఫోన్ నంబర్ 967684 5846కు తెలుపవచ్చని గ్రామ పంచాయితీ ఎన్నికల జిల్లా సాధారణ పరిశీలకులు రవి నాయక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో గ్రామ పంచాయతీ ఎన్నికలు ప్రశాంతంగా, శాంతియుత వాతావరణంలో సజావుగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాల్సిన అవసరం ఉందన్నారు. అదే సమయంలో ఎన్నికల ప్రవర్తన నియమావళిని తూచా తప్పకుండా పాటించాలని కోరారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘన, అలాగే ఎన్నికలకు సంబంధించి ఏమైనా సమస్యలను, ఫిర్యాదులను నేరుగా తన ఫోన్ నంబర్‌కు తెలియజేయాలని కోరారు.

# ప్రతీ విద్యార్థి నూరుశాతం ఉత్తీర్ణత లక్ష్యం

### యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు



ప్రజాపక్షం/యాదాద్రి : వార్షిక పరీక్షలకు ప్రతి విద్యార్థి కష్టపడి చదివి నూరు శాతం ఉత్తీర్ణత ఫలితాలు సాధించాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు అన్నారు. శనివారం రాజాపేట మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో మధ్యాహ్న భోజనం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మధ్యాహ్న భోజన పథకం కింద విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్నం భోజనం ఎలా ఉంది, రోజు మెనూ ప్రకారం రుచికరమైన ఆహారం పెడుతున్నారా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. సమయానికి మంచిగా తిని జ్ఞాపకశక్తి పెంచుకోవాలన్నారు. సబ్జెక్టుల సిలబస్ ఎంతవరకు పూర్తయిందని అడిగి తెలుసుకున్నారు. రోజు సాయంత్రం స్పెషల్ క్లాసులు ఉపాధ్యాయులు నిర్వహిస్తున్నారా అని అడిగి సబ్జెక్టులలో ఏమైనా సందేహాలు ఉంటే ఉపాధ్యాయులని అడిగి తెలుసుకోవాలన్నారు. వార్షిక పరీక్షలకు ఇంకా రెండు నెలల సమయం మాత్రమే ఉన్నది కాబట్టే ఇప్పటి నుండి రోజు బాగా కష్టపడి చదవాలని విద్యార్థులకి సూచించారు. కష్టపడి చదివితే భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదుగుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

**అధికారులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కు వినియోగించుకోవాలి**

మొదటి విడత ఎన్నికల విధులు నిర్వహిస్తున్న అధికారులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామపంచాయతి ఎన్నికల్లో మెదటి విడత పోలింగ్ జరిగే ఆలేరు, బొమ్మలరామారం, యాదగిరిగుట్ట, రాజాపేట, తుర్కపల్లి, ఆత్మకూరు మండలాల్లో పోలింగ్‌లో పాల్గొనే ఆర్వోలు, ఏఆర్వోలు, పిఓలు, ఓపిఓలు, జోనల్ అధికారులు, పోలీస్ సిబ్బంది , ఇతర ఎలక్షన్ విధులు కేటాయించిన సిబ్బంది తమ ఓటు హక్కును పోస్టల్ బ్యాలెట్ ద్వారా సిబ్బంది ఆదివారం తమ ఓటు ఉన్న గ్రామ పంచాయతీకి సంబంధించిన మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఫారం14 ( పోస్టల్ బ్యాలెట్ దరఖాస్తు ) నింపి ఓటు హక్కును వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. దీనికి సంబందించి మొదటి విడతలో ఎన్నికలు జరిగే 6 మండలాల ఎంపీడీవోలు నమూనా పోలింగ్ కేంద్రాన్ని తయారు చేసుకొని సిద్ధంగా ఉండాలని ఆదేశించారు.

# 'తెలంగాణ వైభవం రేవంతన్న' పాటల సిడి ఆవిష్కరించిన సిఎం




ప్రజాపక్షం/దేవరకొండ: తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక సలహా మండలి సభ్యులు, ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లె నర్సింహా పాడిన తెలంగాణ వైభవం రేవంత్ అన్న పాటల సిడిని శనివారం దేవరకొండలో జరిగిన ప్రజా పాలన ప్రజా విజయోత్సవాల బహిరంగ సభలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈసందర్భంగా సిఎం రేవంత్‌రెడ్డి పల్లె నర్సింహాను అభినందించారు. ఈకార్యక్రమంలో ఎంఎల్‌ఏ బాలునాయక్, సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి, సిపిఐ ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహారెడ్డి, అంజయ్యానాయక్, జిల్లా కార్యవర్గ సభ్యులు బుచ్చిరెడ్డి పాల్గొన్నారు.



## మంత్రి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిక

ప్రజాపక్షం/గరిడేపల్లి: మండల పరిధిలోని పొనుగోడు గ్రామ సీనియర్ నాయకుడు గరిడేపల్లి బిఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షులు జోగు అరవింద్‌రెడ్డి తో పాటు తన ఆధ్వర్యంలో 50 మంది కార్యకర్తలతో కలిసి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సమక్షంలో శనివారం కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. మండలంలో బిఆర్‌ఎస్‌పార్టీ అభివృద్ధికి ఎంతో కృషి చేశానని, పొనుగోడు గ్రామాన్ని సర్పంచ్‌గా మా అమ్మగారు ఎంతో అభివృద్ధి చేశామని, నియోజకవర్గ స్థాయి నాయకులు తనకు ఎటువంటి గుర్తింపు ఇవ్వలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధికి ఆకర్షితులై కాంగ్రెస్ పార్టీలో చేరానని అన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి జోగు అరవింద్‌రెడ్డి అతని అనుచరులకు పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఏడిపాల నర్సిరెడ్డి, కుర్రి వెంకన్న, నందిపాటి సామ్రాట్, షేక్ జాన్‌షరిఫ్, పాల జాని, మిడిసినమెట్ల రాంబాబు, పకీర్, శ్రీనివాసగౌడ్, అశోక్, మల్లికంటి ఉపేందర్, షేక్ నాగులు, జూలకంటి నరేష్, అప్పికట్ల కిరణ్, అవిరెల్లి వాసు, పృధ్వీ చేరిన వారిలో ఉన్నారు.

## హోంగార్డులు ప్రజలకు ఉత్తమ సేవలందించాలి : ఎస్‌పి




ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ : హోంగార్డులు ప్రజలకు ఉత్తమమైన, పారదర్శకమైన సేవలందించాలని జిల్లా ఎస్‌పి కె నరసింహ అన్నారు. శనివారం హోంగార్డు 63వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా హోంగార్డ్స్ నిర్వహించిన పరేడ్‌లో ఆయన ముఖ్య అతిధిగా పాల్గొని గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్వచ్ఛంద సేవతో ప్రారంభమైన హోంగార్డుల వ్యవస్థ నేడు పోలీసు సిబ్బందితో సమానంగా కొన్ని సందర్భాల్లో వారికంటే ఎక్కువగా హోంగార్డులు విధులు నిర్వహిస్తున్నారని అభినందించారు. సాంకేతిక విధులు, సిసిటిఎన్‌ఎస్ విధులు, రైటర్స్‌గా విధులు నిర్వర్తించడంలో ముందున్నారని అన్నారు. ప్రజల ధన, మాన, ప్రాణ రక్షణలో నిరంతరం పని చేస్తున్నారని తెలిపారు. హోంగార్డులు జిల్లా పోలీస్ కార్యాలయంను తమ కార్యాలయంగా గర్వంగా చెప్పుకోవాలని సూచించారు. ఇంటర్‌లో మొదటి బహుమతిగా రూ.18వేలు, ద్వితీయ బహుమతిగా 15వేలు, తృతీయ బహుమతిగా 12వేలు ఇవ్వనున్నారు. అదేవిధంగా పదో తరగతిలో రూ.15వేలు, రూ.10వేలు, రూ.8వేల చొప్పున ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను అందిస్తామని చెప్పారు. విధులలో ఉత్తమ ప్రతిభ చూపిన హోంగార్డులకు ప్రశంసా పత్రాలు అందజేసి అభినందించారు. అనంతరం వారితో కలిసి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమం లో ఆర్మ్‌డ్ అదనపు ఎస్‌పి జనార్ధన్ రెడ్డి, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ రామారావు, సూర్యాపేట పట్టణ ఇన్‌స్పెక్టర్ వెంకటయ్య, ట్రాఫిక్ ఎస్ఐ సాయిరాం, హోంగార్డు ఇంచార్జి ఆర్ఎస్ఐ అశోక్, ఇతర ఆర్‌ఎస్ఐలు సురేష్, సా యిరాం, రాజశేఖర్, ఏఆర్‌ఎస్ఐ వెంకన్న, హోంగార్డు సిబ్బంది పాల్గొన్నారు.

## సొంతింటి కల నెరవేర్చిన కాంగ్రెస్



ప్రజాపక్షం/నార్కట్ పల్లి : కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. శనివారం గ్రామ పంచాయతీ ఎన్నికల్లో భాగంగా మండలంలో గడప గడప ప్రచారం నిర్వహించారు. శాపల్లి గ్రామ కాంగ్రెస్ సర్పంచ్ అభ్యర్థి ఏరపుల మంజుల స్వామి, నక్కలపల్లి, బెండల్ పహాడ్ గ్రామాలలో వార్డు సభ్యులకు మద్దతుగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బత్తుల ఉషయ్య సీనియర్ నాయకులు బెంజి కొండయ్య చింపాంజీఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బత్తుల ఉష య్య, సీనియర్ నాయకులు బింగి కొండయ్య, సిద్ధ గొని స్వామి, నిమ్మనగోటి వెంకన్న,నిమ్మనగోటి లింగయ్య, సట్టు సత్తయ్య ఉన్నారు.

# 'ఆదర్శ మున్సిపాలిటీ'లో ఆగని అక్రమ కట్టడాలు

### ప్రభుత్వ ఆదాయానికి భారీ గండి
### ఇదేమిటని ప్రశ్నిస్తే రాజకీయఒత్తిడితోనే...
### ఏమి చేయలేకపోతున్నామని నిస్సిగ్గుగా చెబుతున్న వైనం
### నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకుంటున్న అధికారులు



ప్రజాపక్షం/సూర్యాపేట : సూర్యాపేట పట్టణంలో అక్రమ కట్టడాలు ఏ మాత్రం ఆగడంలేదు. మున్సిపాలిటికి పాలకవర్గం లేకపోవడంతో సంబంధిత అధికారులు రాజకీయ నాయకుల పేర్లు చెబుతూ తమ బాధ్యతలను విస్మరిస్తున్నారు. ఇందులో ఎంతవరకు వాస్తవం ఉందో కూడా అర్థంకాని పరిస్థితి. అధికారులు మామ్మూళ్ళ మత్తులో రాజకీయ నాయకుల పేర్లు వాడుకొని జేబులు నింపుకుంటున్నారనే విమర్శ కూడా లేకపోలేదు. సామాన్యులు తల దాచుకునేందుకు ఒక గది నిర్మాణం చేపట్టినా అనుమతి లేదంటూ జేసిబిలతో క్షణాల్లో దానిని నేలమట్టం చేసే అధికారులు ఆర్థికంగా, రాజకీయంగా ఉన్నవారికి మాత్రం నిబంధనలు సడలిస్తున్నారు. మున్సిపల్ టౌన్ ప్లానింగ్ విభాగంలో ఒక టౌన్ ప్లానింగ్ అధికారి తోపాటు మరొక బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్, నలుగురు చైన్‌మెన్లు మాత్రమే విధులు నిర్వహించేవారు. కాని కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత వివిధ పోటీ పరీక్షల్లో ఉత్తీర్ణులైన వారికి ప్రభుత్వం పోస్టులు ఇవ్వడంతో ఓ టౌన్ ప్లానింగ్ అధికారితో పాటు నలుగురు బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్లు, నలుగురు చైన్‌మెన్‌లు విధులు నిర్వహిస్తున్నారు. నూతన భవనాల నిర్మాణాలకు అనుమతులు ఇవ్వడంతోపాటు అక్రమ కట్టడాలను అడ్డుకోవల్సిన బాధ్యత వీరిపై ఉంది. కాని వారు ఏ మాత్రం పట్టించుకోకపోవడంతో వందల సంఖ్యల్లో పట్టణంలో అక్రమ కట్టడాలు జరుగుతున్నాయి. ఏ వీధిలో చూసినా అనుమతులు లేని భవనాలు, అనుమతి కొంత ఉంటే దానికి రెట్టింపుగా యజమానులు నిర్మాణాలు చేస్తున్నారు. భవన నిర్మాణాలు కాకుండా కొంత మంది వ్యాపారులు గోదాంల కోసం భారీ రేకుల షెడ్లు ఏర్పాటు చేసి చుట్టూ గోడలు నిర్మిస్తున్నారు. ఖమ్మం రోడ్డు, ఎస్‌వి ఇంజనీరింగ్ కళాశాల, న్యూకలెక్టరేట్ రోడ్డు, 65వ జాతీయ రహదారి వ్యవసాయ మార్కెట్ సమీపంలో ఇటీవల కాలంలో దాదాపు 50కు పైగా నిర్మాణాలు జరిగాయి. తాజాగా 60 ఫీట్స్ రోడ్డులోని ఎల్‌ఐసి ఆఫీసు ఎదురుగా ఓ కాంట్రాక్టర్ తన బంధువులతో కలిసి మార్బుల్ షాప్ ఏర్పాటు కోసం భారీగా రేకుల షెడ్ నిర్మాణం చేశారు. ఆ నిర్మాణం చివరి దశకు చేరుకుంది. అధికారులు మాత్రం అటువైపు కన్నెత్తి చూడలేదు. నిర్మాణం పూర్తి అయిన తర్వాత అతనికి నోటీసులు చేతులు దులుపుకున్నారు. అక్రమ కట్టడాలతో ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండిపడుతుంది. భవన నిర్మాణాలు చేసే వారు మున్సిపల్ అధికారులకు ముందుగా అనుమతి కోసం దరఖాస్తు చేసుకొని ప్రభుత్వ నిబంధనల ప్రకారం నిర్మాణానికి తగ్గ ఫీజును చెల్లించిన తర్వాత నిర్మాణాలు చేసుకోవల్సి ఉంది. కానీ అలాంటివేమి లేకుండానే నిర్మాణాలు పట్టణంలో పెద్దఎత్తున చేస్తున్నారు.

అక్రమ నిర్మాణాలను అడ్డుకోవాల్సిన అధికారులు ఆ పని చేయకపోవడంతో ఇదేమని అధికారులను ప్రశ్నిస్తే రాజకీయ ఒత్తిడితో తాను ఏమి చేయలేకపోతున్నామని నిసిగ్గుగా చెబుతున్న పరిస్థితి. రాజకీయ నాయకుల పేర్లు చెప్పి అక్రమ నిర్మాణదారుల నుండి లక్షల్లో డబ్బులు పొందుతూ అధికారులు జేబులు నింపుకుంటున్నారని ఆరోపణలు లేకపోలేదు. ఈ అక్రమాలను ఎత్తిచూపుతూ మీడియాలో వార్తలు ప్రచురితమౌవుతాయనే భయంతో ముందస్తుగా అక్రమ నిర్మాణాలు చేపట్టే వారికి నోటీసులు ఇచ్చి చేతులు దలుపుకుంటున్నారు.

**అక్రమ కట్టడాలను అరికట్టేందుకు చర్యలు**

**బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ శివాజీ**

ప్రభుత్వ అనుమతి లేకుండా అక్రమ నిర్మాణాలను అరికట్టేందుకు చర్యలు తీసుకుంటామని 60 ఫీట్ రోడ్డు ఏరియా బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ శివాజీ తెలిపారు. అక్రమ కట్టడాలపై ఆయనను వివరణ కోరగా తమ ప్రాంతంలో ఇప్పటికే అక్రమ నిర్మాణాలు చేపట్టిన వారికి నోటీసులు ఇచ్చినట్లు చెప్పారు. అక్రమ భవన నిర్మాణదారులు రాజకీయ నాయకులతో ఫోన్లు చేయించి తమ పనికి అడ్డుతగులుతున్నారని స్పష్టం చేశారు. 60 ఫీట్ల రోడ్డులో భారీగా నిర్మిస్తున్న షెడ్ యజమానికి ప్రభుత్వ నిబంధనల ప్రకారం తాము నోటీసులు జారీ చేశామని చెప్పారు. మరో రెండు రోజుల్లో మరో నోటీసును కూడా జారీ చేస్తామని తెలిపారు.

## మా ఓటు గ్రామాభివృద్ధికి... నాయకులు ఇచ్చే డబ్బుకు కాదు

ప్రజాపక్షం/యాదాద్రి : యాదాద్రి భువనగిరి జిల్లాలో ఓటు హక్కు అవగాహన కార్యక్రమాలు చేపట్టిన జిల్లా ఎన్నికల అధికారి , కలెక్టర్ హనుమంత రావు పిలుపు మేరకు ఓటర్లలో మంచి స్పందన వచ్చింది. మొదటి విడత గ్రామ పంచాయతీ ఎన్నికలు జరిగే 6 మండలాల్లో శుక్రవారం ఉదయం ఓటు హక్కు పై అవగాహన కార్యక్రమాలు చేపట్టిన నేపథ్యంలో బొమ్మలరామారం మండల కేంద్రంలో జిల్లా కలెక్టర్ ఓటు హక్కు పై మహిళలకు విస్తృత స్థాయి అవగాహన కల్పించారు. మహిళా ఓటరుల అందరితో ఓటుని గ్రామాభివృద్ధికి వినియోగించుకోవాలని మద్యానికి కానీ డబ్బుకు కానీ మా ఓటుని అమ్ముకోమని మా ఓటుని గ్రామాభివృద్ధి చేసే నాయకులను ఎన్నుకోవడం కోసం ఉపయోగించుకుంటాం అని ప్రతిజ్ఞ చేయించారు. అవగాహన పొందిన మహిళలు శనివారం బొమ్మలరామారం మండలంలోని జలాలపూర్ గ్రామనికి చెందిన కొందరు ఓటర్లు తమ ఇండ్ల ముందు స్వచ్ఛందంగా మాకు డబ్బులు, గిఫ్ట్‌లకు మా ఓటుని అమ్ముకోమని, నీతి నిజాయితీతో స్వచ్ఛందంగా మా ఓటు వేస్తాం అని బోర్డులు ఏర్పాటు చేశారు.




# క్రీడ

## చిక్కుల్లో.. సీమా పూనియా

డోప్ టెస్టులో విఫలమైన ఆసియా క్రీడల విజేత..

16 నెలల నిషేధం విధింపు!

భారత స్టార్ డిస్కస్ త్రోయర్ సీమా పూనియా చిక్కుల్లో పడింది. ఆసియా క్రీడల్లో పసిడి పతకంతో దేశం గర్వపడేలా చేసిన పూనియా ఇటీవల డోప్ టెస్టులో విఫలమైంది. ఫలితంగా డోపింగ్ నిరోధక క్రమశిక్షణ కమిటీ ఆమెపై 16 నెలల నిషేధం విధించింది. ఈ ఏడాది నవంబర్ 10 నుంచి ఈ డిస్కస్ త్రోయర్‌పై నిషేధం అమలులోకి రానుంది. అయితే.. పూనియా ఉపయోగించిన నిషేధిత డ్రగ్ వివరాలను మాత్రం నాడా వెల్లడించలేదు. పూనియా చివరిసారిగా 2023 అక్టోబర్‌లో చైనాలోని హంగ్జౌలో జరిగిన ఆసియా క్రీడల్లో పోటీ పడి కాంస్యం గెలుచుకుంది. ఆ తర్వాత ఏ టోర్నీలోనూ పూనియా పాల్గొనలేదు. పారిస్ ఒలింపిక్స్ తర్వాత వీడ్కోలు పలకాలనుకున్న తను ఆ టోర్నీకి అర్హత సాధించలేదు. తన సుదీర్ఘ కెరీర్‌లో పూనియా నాలుగు విశ్వ క్రీడ (2004, 2012, 2016, 2020)ల్లో పోటీ పడింది. కామన్‌వెల్త్ గేమ్స్‌లో నాలుగుసార్లు విజేతగా నిలిచిన పూనియా.. అంతర్జాతీయ డిస్కస్ త్రో పోటీల్లోనూ మూడు వెండి పతకాలు కొల్లగొట్టింది. హర్యానాకు చెందిన పూనియా భారత డిస్కస్ త్రోలో సంచలనం. 2014 ఇంచియాన్ ఆసియా క్రీడల్లో తొలిసారి స్వర్ణం గెలుపొందింది. అనంతరం 2018 ఎడిషన్లో ఈ స్టార్ అథ్లెట్ కాంస్యంతో మెరిసింది. డిస్కస్ త్రోలో పూనియా అత్యుత్తమ వ్యక్తిగత ప్రదర్శన 64.84 మీటర్లను 2004లో నమోదు చేసింది. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రికార్డులు బ్రేక్ చేసిన పూనియా.. పారా జావెలిన్ త్రోయర్ సందీప్ చౌదరీకి కోచ్‌గా వ్యవహరించింది. ఆమె శిక్షణలో రాటుదేలిన సందీప్ వరల్డ్ పారా అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్స్‌లో రజతం సాధించాడు.






## సిరీస్ టీమిండియాదే!

### సఫారీలను చిత్తుగా ఓడించిన భారత్

టెస్టు సిరీస్‌లో వైట్‌వాష్‌కు భారత జట్టు ప్రతీకారం తీర్చుకుంది. మూడో వన్డేలో దక్షిణాఫ్రికాను చిత్తుగా ఓడించి 2–1తో సిరీస్ కైవసం చేసుకుంది. వైజాగ్ గడ్డపై ఓపెనర్ యశస్వీ జైస్వాల్ (116 నాటౌట్) అజేయ శతకంతో కదంతొక్కగా.. రోహిత్ శర్మ(75), విరాట్ కోహ్లీ(65 నాటౌట్) మరో క్లాస్ ఇన్నింగ్స్‌తో చెలరేగారు. ప్రత్యర్థి నిర్దేశించిన 271 పరుగుల ఛేదనలో టాపార్డర్ దంచేయడంతో టీమిండియా 9 వికెట్లతో సఫారీలను మట్టికరిపించింది. ఛాంపియన్స్ ట్రోఫీ విజేత టీమిండియా స్వదేశంలో తొలి వన్డే సిరీస్ పట్టేసింది. టెస్ట్ సిరీస్‌లో దక్షిణాఫ్రికా చేతిలో క్లీన్‌స్వీప్ అయిన భారత జట్టు వన్డే సిరీస్‌లో తడాఖా చూపించింది. సిరీస్ ఫలితాన్ని నిర్ణయించే వైజాగ్ వన్డేలో అత్యుత్తమ ఆటతో సఫారీలకు చెక్ పెట్టింది రాహుల్ సేన. ఈ ఫార్మాట్లో శతకంతో మెరిసిన యశస్వీ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా ఎంపికవ్వగా.. రెండు సెంచరీలు, ఒక ఫిఫ్టీ బాదిన కోహ్లీ 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్' అవార్డు అందుకున్నాడు. రెండేళ్ల క్రితం వన్డే ప్రపంచకప్ సెమీఫైనల్ తర్వాత తొలిసారి టాస్ గెలిచిన భారత్.. బౌలింగ్ ఎంచుకుని ప్రత్యర్థిని 270కే కట్టడి చేసింది. అనంతరం ఛేదనలో ఓపెనర్లు యశస్వీ జైస్వాల్(116 నాటౌట్), రోహిత్ శర్మ(75) పవర్ ప్లేలో వికెట్ పడకుండా ఆడారు. యశస్వీ కాస్త ఆచితూచి ఆడగా.. రోహిత్ తనదైన పుల్ షాట్లతో రెచ్చిపోయాడు. ఈ ద్వయం.. తొలి వికెట్‌కు శతక భాగస్వామ్యంతో టీమిండియాను గెలుపు దిశగా నడిపించింది. అయితే.. 61వ హాఫ్ సెంచరీ తర్వాత శతకానికి చేరువైన హిట్ మ్యాన్‌ను మహరాజ్ వెనక్కి పంపాడు. దాంతో.. తొలి వికెట్ పార్ట్‌నర్‌షిప్ 155 పరుగులకు తెరపడింది.

**కోహ్లీ విధ్వంసం..**

పవర్ ప్లే తర్వాత దంచేసిన రోహిత్ ఔటయ్యేసరికి భారత్ స్కోర్.. 155. అప్పటికి మ్యాచ్ టీమిండియా చేతుల్లోనే ఉంది. అనంతరం క్రీజులోకి వచ్చిన శతకాల వీరుడు విరాట్ కోహ్లీ(65 నాటౌట్) తనదైన స్టయిల్లో చెలరేగాడు. యాన్సెన్ ఓవర్లో బౌండరీతో తన విధ్వంసానికి తెరతీసిన విరాట్.. బాష్‌కు చుక్కలు చూపిస్తూ 34 ఓవర్లో 4, 6 బాదాడు. కాసేపటికే సింగిల్‌తో యశస్వీ వన్డేల్లో తొలి సెంచరీ సంబురాలు చేసుకున్నాడు. ఆ తర్వాత గేర్ మార్చిన కోహ్లీ ఫోర్లతో హోరెత్తించాడు. పవర్ ప్లేలో కట్టుదిట్టంగా బౌలింగ్ చేసిన బార్ట్‌మన్‌ను టార్గెట్ చేసిన రన్ మెషీన్ అతడి ఓవర్లో బౌండరీతో 76వ అర్ధ శతకం సాధించాడు. ఆ తర్వాత బంతిని సిక్సర్‌గా మలిచిన అతడు.. ఎంగిడి వేసిన 40 వ ఓవర్లో మూడు ఫోర్లతో మ్యాచ్‌ను ముగించాడు. విరాట్, యశస్వీ అజేయంగా నిలవగా 9 వికెట్లతో సఫారీలను ఓడించిన టీమిండియా.. 21తో సిరీస్‌ను సొంతం చేసుకుంది.

**ప్రసిధ్, కుల్దీప్ షో**

రాయ్‌పూర్ వన్డేలో తేలిపోయిన భారత బౌలర్లు వైజాగ్‌లో చెలరేగారు. సిరీస్ విజేతను నిర్ణయించే ఈ మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా హిట్టర్ల జోరుకు కళ్లెం వేశారు. ప్రసిధ్ కృష్ణ(4–66) టాపార్డర్‌ను దెబ్బకొట్టగా.. స్పిన్నర్ కుల్దీప్ యాదవ్(4–41) మిడిలార్డర్‌ను పడగొట్టి సఫారీలకు షాకిచ్చాడు. ఒకే ఓవర్‌లో డేంజరస్ డెవాల్డ్ బ్రెవిస్(29), మార్కో యాన్సెన్(17)లను ఔట్ చేసి భారీ స్కోర్ ఆశలపై నీళ్లు చల్లాడు కుల్దీప్. ఓపెనర్ క్వింటన్ డికాక్(106) సెంచరీతో కదంతొక్కగా.. కెప్టెన్ తెంబా బవుమా(48) రాణించగా ప్రొటీస్ టీమ్ 270కి ఆలౌటయ్యింది.

# బిజినెస్





### ఈ వారం స్టాక్ మార్కెట్లు

బాంబే స్టాక్ ఎక్స్‌చేంజ్ (బిఎస్ఇ/ క్లోజింగ్): సెన్సెక్స్ 85,712.37 పాయింట్లు (ఈ వారం ప్రారంభంలో 85,706.67 పాయింట్లు. లాభం 5.7 పాయింట్లు).
**జాతీయ స్టాక్ ఎక్స్‌చేంజ్ (ఎన్ఎస్ఇ/ క్లోజింగ్):** నిఫ్టీ 26,186.45 పాయింట్లు (ఈ వారం ప్రారంభంలో 26,202.95 పాయింట్లు. నష్టం 16.5 పాయింట్లు)

### బులియన్ మార్కెట్లు

బంగారం నుంచి మదుపరుల దృష్టి క్రమంగా ఇతరత్రా పెట్టుబడులపైకి మారుతున్న నేపథ్యంలో, ఈ వారం బులియన్ మార్కెట్లు అటు భారీ లాభాలనుగానీ, ఇటు భారీ నష్టాలనుగానీ చవిచూడకుండా దాదాపుగా స్థిరంగా ఉన్నాయి. శనివారం నాటికి గ్రాము బంగారం 24 క్యారెట్లు రూ.12,982 నుంచి రూ.13,009కు, అదే విధంగా 22 క్యారెట్లు రూ.11,900 నుంచి 11,926కు, 18 క్యారెట్లు రూ.9,737 నుంచి రూ.9.809లకు చేరింది. ఇటీవలి కాలంలో బులియన్ మార్కెట్లు మొదటిసారి ఒక వారం దాదాపు స్థిరంగా కొనసాగడం ఇదే మొదటిసారి.

## రుణాలపై వడ్డీలు తగ్గే అవకాశం




రెపో రేటు 25 బేసిస్ పాయింట్లు తగ్గించి, 5.25 శాతానికి తేవాలన్న రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) తీసుకున్న కీలక నిర్ణయంతో రుణాలపై వడ్డీ రేట్లు తగ్గే సూచనలు కనిపిస్తున్నాయి. ఇది ఈ ఏడాది జరిగిన ముఖ్యమైన వడ్డీ రేటు తగ్గింపుల్లో ఒకటిగా పేర్కొనాల్సిన ఈ నిర్ణయం వల్ల హోమ్ లోన్‌పై ఇఎంఐలు తగ్గవచ్చు. అదే విధంగా ఒకటి. కార్ లోన్, పర్సనల్ లోన్ వంటి రుణాలు కూడా చౌక అవుతాయి. కొత్తగా రుణాలు తీసుకోవాలని అనుకునేవారికి ఇది అనుకూల సమయం. రుణగ్రహీతలకు మద్దతునిచ్చే వడ్డీ రేటు తగ్గింపు, రుణదాతలను నిరుత్సాహ పరిచే అవకాశాలు ఉన్నాయి. కాగా, పెట్టుబడిదారులకు ప్రస్తుతం మార్కెట్లో కొన్ని ప్రతికూల సంకేతాలు కనిపిస్తున్నాయి. విదేశీ మదుపరులు భారీగా పెట్టుబడులు పెట్టవచ్చు. రూపాయి మారకం విలువ బలహీనంగా ఉండడం కూడా ఈ మార్పుకు ఒక కారణం. అంతేగాక, అంతర్జాతీయ షేర్ మార్కెట్లు డోలాయన పరిస్థితులు ఎదుర్కొంటున్నాయి. కాబట్టి, పెట్టుబడిదారులు జాగ్రతగా ఆలోచించి, నిర్ణయాలు తీసుకోవడం మంచిది.

## రూపాయి భారీ పతనం



గతంలో ఎన్నడూ లేనంతగా, డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ భారీగా పతనమైంది. ఈవారం డాలర్ మారకపు విలువ రికార్డు స్థాయిలో 90 రూపాయలు దాటింది. శనివారం నాటికి ఫోరెక్స్ మార్కెట్‌లో డాలర్ 89.8960 రూపాయలుగా ఉంది. ఈ పరిణామం వివిధ రంగాలపై తీవ్ర ప్రభావం చూపే ప్రమాదం ఉంది. విదేశాల నుండి తెచ్చే చమురు, బంగారం, ఎలక్ట్రానిక్స్ వంటి వస్తువుల ధరలు పెరుగుతాయి. ఫలితంగా ద్రవ్యోల్బణం పెరుగుతుంది. ఇంధన ధరలు, రవాణా ఖర్చులు, రోజువారీ వస్తువుల ధరలు పెరగడం వల్ల ప్రజల ఖర్చులు పెరుగుతాయి. కొనుగోలు శక్తి దారుణంగా తగ్గుతుంది. దిగుమతులపై ఆధారపడే కంపెనీల తయారీ ఖర్చులు పెరుగుతాయి. ఎగుమతి కంపెనీలకు మాత్రమే రూపాయి బలహీనత కొంతమేర లాభం ఇవ్వొచ్చు. స్థూలంగా చూస్తే, ద్రవ్యోల్బణం పెరగడం, పెట్టుబడిదారుల్లో అనిశ్చితి రావడం వల్ల దేశ ఆర్థిక స్థిరత్వంపై ప్రభావం పడే ప్రమాదం కనిపిస్తున్నది. రూపాయి పతనాన్ని నిలువరించడానికి కేంద్రం, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) తక్షణ చర్యలు చేపట్టాలి. లేకపోతే, పరిస్థితి ప్రమాదకరంగా మారుతుంది.

## ఇండిగో సంక్షోభం

ప్రముఖ విమానయాన సంస్థ ఇండిగో సంక్షేమం అటు ప్రయాణికులను, ఇటు వివిధ సంస్థలను ఇబ్బందులకు గురి చేస్తున్నది. సకాలంలో గమ్యాలకు చేరుకోలేక, ఉద్యోగాలు ఉంటాయో, ఊడుతాయో తెలియని పరిస్థితిలో చాలా మంది కన్నీళ్లు పెట్టుకుంటున్న వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ప్రయాణికులకు టికెట్ సొమ్మును తిరిగి ఇవ్వాలని, ప్రత్యేక సహాయక కౌంటర్లు ఏర్పాటు చేయాలని ఇండిగో సంస్థకు కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడం ఒకింత ఊరట మాత్రమే. కాగా, గత ఐదు రోజుల్లో 1,500 కంటే ఎక్కువ ఇండిగో విమానాలు రద్దయ్యాయి. చాలా సర్వీసులు ఆలస్యంగా నడుస్తున్నాయి. భారత పౌర విమానయాన సంస్థ ప్రవేశపెట్టిన కొత్త నిబంధనలు (ఫ్లైట్ డ్యూటీ టైమ్ లిమిటెడ్/ ఎఫ్‌డిటిఎల్) అమల్లోకి రావడమే ఈ సమస్యకు ప్రధాన కారణంగా చెప్తున్నారు. పైలట్లకు విశ్రాంతి సమయం పెరగడంతో సిబ్బంది కొరత ఏర్పడి, పెద్ద సంఖ్యలో విమాన సేవలు నిలిచిపోయాయి. ఆపరేషనల్ సిస్టమ్ ఒక్కసారిగా దెబ్బతినడంతో దేశవ్యాప్తంగా ఇండిగో సేవలు స్తంభించిపోయాయి. ఈ పరిణామాల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకుని, పైలట్లకు వారపు విశ్రాంతి సంబంధించిన కొత్త విధానాన్ని తాత్కాలికంగా వెనక్కి తీసుకుంది. విమాన భద్రతపై రాజీ పడకుండా, ప్రయాణికుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని కొత్త నిబంధనలు అమలు చేస్తున్నట్టు కేంద్రం ప్రకటించింది. భారతదేశంలో అతిపెద్ద, అత్యంత రద్దీగా ఉన్న విమానయాన సంస్థగా ఉన్న ఇండిగో, ఇలాంటి సంక్షోభాన్ని ఎదుర్కోవడం అరుదు. ఒకటి రెండు రోజుల్లో పరిస్థితి చక్కబడుతుందని ఇండిగో సంస్థ ప్రకటిస్తున్నప్పటికీ, సిబ్బంది కొరతను ఇంత హఠాత్తుగా ఎలా పరిష్కరిస్తారన్న ప్రశ్న తలెత్తుతున్నది.




## గ్రామాల అభివృద్ధికి సేవకులుగా పని చేస్తాం


### సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి బి.అజయ్ సారధి రెడ్డి



**ప్రజాపక్షం/మహబూబాబాద్:** మహబూబాద్ మండలంలోని ముడుపుగల్, దామ్య తండా గ్రామపంచాయతీ సిపిఐ అభ్యర్థులు తండా సందీప్ బానోత్ లింగ్య నాయక్‌ల గెలుపు కోరుతూ శనివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి బి.అజయ్ సారధి రెడ్డి మాట్లాడుతూ సిపిఐ అభ్యర్థులను గెలిపించాలని సేవకులుగా పనిచేస్తామని హామీ ఇచ్చారు. గ్రామాల అభివృద్ధికై సిపిఐ అభ్యర్థులకే ఓటు వేయాలని, గ్రామాలలో రైతాంగ సమస్యలు, ఎరువుల సమస్యలు, యూరియా సమస్యలకు విత్తనాల సమస్యలు, స్థానిక సైడ్ కాలువలు, సిసి డ్రైనేజీలు అభివృద్ధి కై సిపిఐ అభ్యర్థులకు ఓటు వేయాలని ఆయన కోరారు. మహబూబాబాద్ మండలంలో సిపిఐ అనేక పోరాటాలు నిర్వహించిందని ఈ ప్రాంతంలో దొరలకు ఎదురొడ్డి రైతుల కోసం ప్రజల కోసం పోరాటం చేసిన చరిత్ర సిపిఐకి ఉందన్నారు. గ్రామాల సమస్యల పరిష్కారం కోసం సిపిఐ అభ్యర్థులను గెలిపించాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో వార్డు అభ్యర్థులు పొలగాని అరుణ్ కుమార్, వినయ్ కుమార్, తం డా శ్రీనాథ్, సుమన్, పెరుగు కుమార్, రేసపల్లి నవీన్, చింతకుంట్ల వెంకన్న, మామిండ్ల సాంబలక్ష్మి , వీరవెల్లి రవి, వెలుగు శ్రావణ్, కేదాసు రమేష్, వంకాయలపాటి చిరంజీవి, జలగం ప్ర వీణ్, ఆబోతు అశోక్, వంకాయలపాటి చిరంజీవి, తోట రాజకుమారి, మంద శం కర్, ఎర్రో జు పద్మ, తండ శ్రీనాథ్, మంద శ్రీను, కవిత, పద్మ, ఎండి రఫీ తదితరులు పాల్గొన్నారు.

**బలపాల గ్రామంలో సిపిఐలో చేరిక**

బూర్జువా పార్టీల విధానాలు నచ్చక సిపిఐ విధానాలకు ఆకర్షితులై బలపాల గ్రామంలో వివిధ పార్టీల నుండి పెద్ద ఎత్తున సిపిఐలో చేరారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి బి.విజయ సారథి మాట్లాడుతూ పాలక పార్టీలు ప్రజలను ఎప్పటికప్పుడు మభ్యపెడుతూ తమ అవకాశవా ద రాజకీయాలకు వాడుకుంటుందని అలాంటి పార్టీలకు ఎన్నికల సమయంలో తగిన బుద్ధి చెప్పాలని, ప్రజల హక్కుల కోసం, సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటాలు నిర్వహించే సిపిఐ పార్టీ పట్ల అకర్షితులై వివిధ పార్టీల నుండి వచ్చిన రునావత్ రమేష్ సూరి , రొయ్యల రమేష్ బాల్ని వెంకన్న తదితరులకు, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్ రెడ్డితో కలసి పార్టీ కండువాలు కప్పి సిపిఐ పార్టీ లోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు నెల్లూరు నాగేశ్వరరా వు, తురక రమేష్, రామగొని రవి, వెంకటేశ్వ ర్లు, వెంకటనారాయణ, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.



## రెండు విడతల్లో నాలుగు పంచాయతీలు

# సిపిఐ కైవసం

### ఐదు ఉప సర్పంచ్‌లు, 30 వార్డుల్లో సిపిఐ సభ్యుల ఏకగ్రీవ ఎన్నిక









**ప్రజాపక్షం/ ఖమ్మం :** గ్రామ పంచాయతీ ఎన్నికల్లో సిపిఐ శుభారంభం చేసింది. మొదటి, రెండవ విడత పంచాయతీ ఎన్నికల నామినేషన్ల ఉపసంహరణ ఘట్టం తర్వాత నాలుగు పంచాయతీలలో సిపిఐ అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సిపిఐ సర్పంచ్‌లు ఎన్నికైన చోట వార్డులు కూడా ఏకగ్రీవంగా ఎన్నిక కావడం గమనార్హం. తొలి విడత పంచాయతీ ఎన్నికలకు సంబంధించి చింతకాని మండలం రాఘవాపురం గ్రామ పంచాయతీ సర్పంచ్‌గా కాంపల్లి కోటమ్మ ఏకగ్రీవంగా ఎన్నిక కాగా సిపిఐకి చెందిన అబ్బూరి మహేష్ ఉప సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కామేపల్లి మండలం ఊటుకూరు గ్రామ పంచాయతీని సిపిఐ కైవసం చేసుకుంది. రెండవ విడత నామినేషన్ల సందర్భంగా సిపిఐకి చెందిన ఈసం హన్మంతరావు ఒక్కరే సర్పంచ్‌గా నామినేషన్ వేయడంతో గ్రామ పంచాయతీలోని 10 వార్డులు కూడా ఏకగ్రీవమయ్యాయి. రెండవ దశ నామినేషన్ల ఉపసంహరణ ఘట్టం శనివారంతో ముగియగా ఖమ్మం రూరల్ మండలంలోని రెండు గ్రామ పంచాయతీలను సిపిఐ అభ్యరులు ఏకగ్రీవంగా గెలుచుకున్నారు. ఖమ్మం రూరల్ మండలం పల్లె గూడెంలో సిపిఐకి చెందిన చుండూరి సృజన సర్పంచ్ అభ్యర్థిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. దారెడు గ్రామ పంచాయతీని వరుసగా సిపిఐ ఐదవ సారి కైవసం చేసుకుంది. గతంలో వరుసగా నాలుగు సార్లు సిపిఐ అభ్యర్థులు విజయం సాధించగా ఈ దఫా ఎన్నికల్లో సిపిఐకి చెందిన బత్తుల వెంకటేశ్వర్లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇక్కడ వార్డులు కూడా ఏకగ్రీవమయ్యాయి. కూసుమంచి మండలంలోని లాల్‌సింగ్ తండాలో సిపిఐ అభ్యర్థి ఉప సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. తిరుమలాయపాలెం మండలం ఎర్రగడ్డలో సిపిఐకి చెందిన అభ్యర్థి ఉప సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. ఏకగ్రీవంగా ఎన్నికైన పంచాయతీలను నాలుగు గ్రామ పంచాయతీ సర్పంచ్‌లు, ఐదు ఉప సర్పంచ్‌లను సిపిఐ ఏకగ్రీవంగా గెలుచుకోగా ఇప్పటికే 30 వార్డుల్లో సిపిఐకి చెందిన వారు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వివిధ వార్డుల్లో ఒక్కొక్కరు నామినేషన్ వేయడంతో అభ్యర్థుల ఎన్నిక ఏకగ్రీవమైంది. సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ మహ్మద్ మౌలానా, జిల్లా కార్యదర్శి దండి సురేష్, సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, రాష్ట్ర సమితి సభ్యులు కొండపర్తి గోవిందరావు, ఏపూరి లతాదేవి, జిల్లా కార్యవర్గ సభ్యులు పుచ్చకాయల కమలాకర్ తదితరులు ఎన్నికైన వారిని అభినందించారు. ఈ సందర్భంగా బాగం హేమంతరావు మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి కోసం నిజాయితీతో కూడిన పరిపాలన కోసం సిపిఐ అభ్యర్థులను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ప్రస్తుత ఎన్నికల్లో బరిలో ఉన్న సిపిఐ అభ్యర్థులకు ఆయా గ్రామ పంచాయతీల ప్రజలు తోడ్పాటునందించాలని ఆయన కోరారు.గ్రామ పంచాయతీ ఎన్నికల్లో విచ్చలవిడిగా ఖర్చు చేస్తున్నప్పటికి ప్రజలు సిపిఐ అభ్యర్థులకు అపూర్వ మద్దతునిస్తున్నారన్నా రు. సిపిఐ అభ్యర్థులకు మద్దతునిస్తున్న ప్రతి ఒక్కరికి కృ తజ్ఞతలు తెలుపుతున్నట్లు హేమంతరావు తెలిపారు. సిపిఐ, సిపిఐ బలపర్చిన అభ్యర్థులను గెలిపించాలని కోరారు.

## ఓటు అనే వజ్రాయుధాన్ని రాజ్యాంగం ద్వారా ప్రజలకు అందించిన మహనీయుడు అంబేద్కర్

### సిపిఐ వరంగల్ జిల్లా కార్యదర్శి షేక్ బాష్ మియా

**ప్రజాపక్షం/ వరంగల్ :** ఓటు అనే వజ్రాయుధాన్ని రాజ్యాంగం ద్వారా ప్రజలకు అందించిన మహనీయుడు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అని సిపిఐ వరంగల్ జిల్లా కార్యదర్శి షేక్ బాష్ మియా అన్నారు. అంబేద్కర్ 69వ వర్ధంతి సందర్భంగా సిపిఐ కార్యాలయం శివనగర్ తమ్మెర భవన్‌లో శనివారం అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యాయవాదిగా, ఆర్థికవేత్తగా, రాజకీయవేత్తగా, సామాజిక సంస్కర్తగా రాజ్యాంగ నిర్మాతగా భారతీయుల గుండెల్లో ఎప్పటికీ నిలిచిపోయే మహనీయుడు డాక్టర్ భీమ్‌రావ్ అంబేద్కర్ అన్నారు. అంటరానితనాన్ని వ్యతిరేకిస్తూ దళితులు, మహిళలు, కార్మికుల హక్కుల కోసం అలుపెరుగని పోరాటం చేసిన యోధుడు అంబేద్కర్ అని కొనియాడారు. దేశంలో అన్ని మతాలు, తెగలు, దళితులు, గిరిజనులు, వెనుకబడిన కులాలు, తదితర వర్గాలకు సమన్యాయం జరిగేలా వారి హక్కులకు భంగం వాటిల్లకుండా ఉండేందుకు సర్వసత్తాక సార్వభౌమాధికారాన్ని దక్కించుకొనేందుకు వీలుగా రాజ్యాంగాన్ని రూపొందించిన రూపశిల్పి అన్నారు. అంబేద్కర్ భారత రాజ్యాంగం ద్వారా ప్రతి పౌరునికి సమాన హ క్కులు అవకాశాలు, ఓటు హక్కుకల్పించి, సా మాజిక అసమానతలకై రిజర్వేషన్లు కల్పించి, అంటరాని సమాజాన్ని రూపుమాపాలని కుల నిర్మూలనకై పరితపించిన యోధుడు అంబేద్కర్ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి దండు లక్ష్మ ణ్, జిల్లా కార్యవర్గ సభ్యులు గుండె బద్రి, గన్నారపు రమేష్ ,జిల్లా కౌన్సిల్ సభ్యులు ల్యాదల్ల శరత్, బెజ్జంకి యాకాంబ్ర చారి, జాన్ పాల్, యాకుబ్, యాదగిరి, జన్ను రవి తదితరులు పాల్గొన్నారు




## సిపిఐ అభివృద్ధే ఎజెండాగా ముందుకు

### సర్పంచ్ అభ్యర్థి మెస్సు మమత ప్రచారం

**ప్రజాపక్షం/ఆళ్లపల్లి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సిపిఐ కార్యవర్గ సభ్యులు, ఆళ్లపల్లి మండల మాజీ వైస్ ఎంపిపి రేసు ఎల్లయ్య ఆధ్వర్యంలో ఆల్లపల్లి గ్రామ పంచాయతీ సిపిఐ సర్పంచ్ అభ్యర్థి మెస్సు మమత విజయమే లక్ష్యంగా మైలారం గ్రామంలో శనివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా రేసు ఎల్లయ్య మాట్లాడుతూ 100 సంవత్సరాలుగా ప్రజలను కాపాడుతు న్న పార్టీ సిపిఐ అని అన్నారు. ప్రచారంలో ప్రజల నుండి వస్తున్న స్పందన గాను సిపిఐ యువజన విభాగం తరపున కృతజ్ఞతలు తెలిపారు. మూడో సారి సర్పంచ్ పదవిని కైవసం చేసుకునే విధంగా కార్యకర్తల వ్యూహరచరణ, అదే విధంగా గత పది సంవత్సరాలుగా ఆళ్లపల్లి మండల కేంద్రంలో సిపిఐ చేసిన అభివృద్ధే ఎజెండాగా ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో ఆళ్లపల్లి మండల మాజీ ఉపసర్పంచ్ గుంతోజు సదానంద చారి, మద్దెల వెంకటేశ్వర్లు, కుంట సహదేవ్, పరమ ఇమ్మానేయులు, శ్రీరామ్ హరీష్, నరెడ్ల బిక్షం, నరెడ్ల శివ, తదితరులు పాల్గొన్నారు.



# మహానగరి
గ్రేటర్ హైదరాబాద్ GREATER HYDERABAD

## అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి చేద్దాం



**ప్రజాపక్షం/వికారాబాద్ :**డా. బిఆర్ అంబేద్కర్ ఆశయసాధనకై కృషి చేద్దాం అని వికారాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ ముదిరాజ్ అన్నారు. శనివారం వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో బాబాసాహెబ్ అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. వికారాబాద్ వ్యవసాయ మార్కెట్ చైర్మన్ మాట్లాడుతూ భారతరత్న డా. అంబేద్కర్ చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. బడుగు బలహీన వర్గాల ఆరాధ్య దైవమని, అంబేద్కర్ చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ మల్లేశం, డైరక్టర్లు సురేష్, రాజునాయక్, వట్టం నర్సింలు, తదితరులు పాల్గొన్నారు.



## సాయి ఈశ్వరాచారికి సిపిఐ నాయకుల నివాళులు

**ప్రజాపక్షం/కుత్బుల్లాపూర్:** బిసి రిజర్వేషన్ కోరుతూ ఆత్మహత్యకు పాల్పడి మరణించిన సాయి ఈశ్వర్ చారికి శనివారం సిపిఐ ఆధ్వర్యంలో వారి భౌతిక దేహానికి పూలమాలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆత్మహత్యలతో ఏమి సాధించలేమని పోరాడితేనే హక్కులు సాధించగలుగుతామని అన్నారు. ఎవరూ ఆత్మహత్యలకు పాల్పవడవద్దని సూచించారు. సాయి ఈశ్వర్ చారీ కుటుంబానికి సిపిఐ అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్, ప్రజానాట్య మండలి జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్, సిపిఐ మండల సహాయ కార్యదర్శి హరినాథ్, సిపిఐ నాయకులు నరసింహారెడ్డి, కె.వెంకటేష్, భీమేష్, శ్రీనివాస్‌చారి, జర్నలిస్ట్ నాయకులు తొండ వెంకట్, తదితరులు పాల్గొన్నారు.

**మల్కాజిగిరిలో:** బిసి రిజర్వేషన్ల కోసం ప్రాణత్యాగం చేసుకొన్న సాయి ఈశ్వరాచారికి బహుజన కులాల చైతన్య వేదిక శనివారం ఆనంద్‌బాగ్ చౌరాస్తాలో నిర్వహించిన కార్యక్రమంలో ఘనంగా నివాళులర్పించారు. సాయి



ఆత్మశాంతికి గాను ప్రభుత్వం ఇకనైనా బిసి రిజర్వేషన్లను వెంటనే అమలు చేయాలని చైతన్య వేదిక వ్యవస్థాపకులు చంద్రశేఖర్ డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో బహుజన నాయకులు పూలపల్లి సుందర్‌యాదవ్, కరణం గోపి, జిడి నవీన్ గౌడ్, ఉడుత నవీన్, తదితరులు పాల్గొన్నారు.



## ప్రజల్లో ధైర్యం నింపడానికే ఫ్లాగ్ మార్చ్ : ఎస్‌పి. స్నేహ మోహ్రా

**ప్రజాపక్షం/తాండూరు:**ఎన్నికల నేపథ్యంలో ప్రజలలో ధైర్యం నింపడమే ఫ్లాగ్ మార్చ్ ముఖ్యఉద్దేశ్యమని వికారాబాద్ జిల్లా ఎస్పి స్నేహ మోహ్రా అన్నారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు కొడంగల్ మండలంలోని క్రిటికల్ గ్రామాలుగా గుర్తించబడిన ప్రాంతాలలో కొడంగల్ సిఐ శ్రీధర్ రెడ్డి ఆధ్వర్యాన పోలీసులు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. కొడంగల్ పోలీసు స్టేషన్ పరిధిలో రావులపల్లి, అంగడి రాయిచూర్, రావులప్లి గ్రామాలలో పోలీసు సిబ్బందితో పాటు రాష్ట్ర స్పెషల్ పోలీసు, ఆర్మ్‌డ్ రిజర్వుడ్ సిబ్బందితో కలిసి ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ఎన్నికల నేపథ్యంలో ప్రజలు ఎటువంటి భయాందోళనకు గురికావద్దని, శాంతియుతంగా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ముఖ్యంగా క్రిటికల్ గ్రామాలలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా, అనుమానాస్పద వ్యక్తులు సంచరించినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. శాంతి భద్రతలను కాపాడటంలో ప్రజల సహకారం ముఖ్యమని స్పష్టం చేశారు. పోలీసు యంత్రాంగం ఎల్లప్పుడు ప్రజలకు అందుబాటులో ఉండి అండగా ఉంటుందని, ఈ ఫ్లాగ్ మార్చ్ ప్రజలలో ధైర్యాన్ని పెంచుతుందని అన్నారు. చట్టాన్ని ఉల్లంఘించాలని చూచేవారికి బలమైన హెచ్చరిక పంపడమే తమ లక్ష్యమన్నారు. ఫ్లాగ్ మార్చ్‌లో కొడంగల్ సిఐ శ్రీధర్‌రెడ్డి, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## రిటర్నింగ్ అధికారుల పాత్ర కీలకం

### అదనపు కలెక్టర్ సుధీర్

**ప్రజాపక్షం/తాండూరు:**గ్రామ పంచాయతీ సర్పంచ్ వార్డుల సభ్యుల ఎన్నికల నిర్వహణ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించేందుకు అన్ని విధాలుగా సన్నద్ధం కావాలని జిల్లా అదనపు కలెక్టర్ సుధీర్ సూచించారు. తొలివిడత గోడంగల్, బషీరాబాద్, బొంబ్రాస్ పేట్, దౌల్తాబాద్, దుద్యాల్, పెద్దేముల్, తాండూరు, యాలాల్ మండలలో ఈ నెల 11న ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఆ డివిజన్‌కు చెందిన ఆర్‌ఒలు, ఎఆర్‌ఒలకు తాండూరు పట్టణంలోని ఎంపిడిఒ కార్యాలయంలో శనివారం శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీల ఎన్నికల నిర్వహణ కోసం ముందస్తుగానే అన్ని ఏర్పాట్లను పూర్తి చేసుకోవాలని సూచించారు.

గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణలో రిటర్నింగ్ అధికారులు క్రియాశీలక పాత్ర పోషించాల్సి ఉంటుందన్నారు. రాష్ట్ర ఎన్నిక ల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా సమయ పాలనను పాటిస్తూ అప్రమత్తతతో ఎన్నికలు నిర్వహిస్తే ఇబ్బందులు తలెత్తేందుకు ఆస్కారం ఉండదని సూచించారు. పోలింగ్, కౌటింగ్ ప్రక్రియలు సజావుగా జరిగేలా ప్రణాళికబద్ధంగా వ్యవహరించాలని, పోలింగ్ సామాగ్రిని జాగ్రత్తగా ఒకటికి రెండు సార్లు సరిచూసుకోవాలని సూచించారు. ముఖ్యంగా బ్యాలెట్ పేపర్ల విషయంలో ప్రత్యేక జాగ్రత్తతో వ్యవహరించాలని అన్నారు. ఎన్నికల విధుల పట్ల ఆర్‌ఒలు తమ బృందంలో ఎన్నికల సిబ్బంది అందరికి నియమనిబంధనల పట్ల పూర్తిఅవగాహన కల్పించాలని సూచించారు. ఉపసర్పంచ్ ఎన్నిక సందర్భంగా తగినంత కోరం ఉందా లేదన్న విషయం పరిశీలించుకోవాలని సూచించారు. పోలింగ్ కేంద్రాలకు సకాలంలో చేరుకుని సదుపాయాలను పరిశీలించుకోవాలని, ఓటింగ్ కంపార్ట్ మెంట్ సిట్టింగ్ ఏర్పాట్లు తదితర వాటిని నిబంధనలుక అనుగుణంగా ఉండేలా చూసుకోవాలని అన్నారు. శిక్షణ తరగతులలో సూచించింన అంశాలను ఆవగాహన చేసుకోవాలని విధిగా పాటించాలని సూచించారు. ఎలాంటి సందేహాలు ఉన్న అధికారులను అడిగి నివృత్తి చేసుకోవాలని అన్నారు. బ్యాలెట్ పత్రాన్ని జాగ్రతగా పరిశీలించాలని తెలిపారు. పోటిలో ఉన్న అభ్యర్థుల పేర్లు వారికి కెటాయించిన గుర్తులతో పాటు నోటా సింబల్‌ను కూడా తప్పని సరిగా సరిచూసుకోవాలని తెలిపారు. ఏలాంటి గందరగోళానికి తావులేకుండా సజావుగా ఎన్నికల నిర్వహణ బాధ్యతలను నిర్వర్థించాలని సూచించారు. శిక్షణ తరగతులలో తాండూరు సబ్‌కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్,ఆర్‌ఒలు, ఎఆర్‌ఒలు, సిబ్బంది పాల్గోన్నారు.

# త్వరలో టికెఆర్ ఫ్లైఓవర్ పనులు

## టెండర్లు ఆహ్వానించిన జిహెచ్ఎంసి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** నగరంలో ట్రాఫిక్ సమస్యలను తగ్గించేందుకు మహానగర పాలక సంస్థ(జిహెచ్ఎంసి) ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఫ్లైఓవర్ నిర్మాణ పనుల్లో వేగం పెంచింది. హైదరాబాద్ సిటీ ఇన్నోవేటివ్ అండ్ ట్రాన్స్‌ఫర్మేటివ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ (హెచ్‌సిటి) ప్రాజెక్ట్ ద్వారా పలు ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌ల నిర్మాణానికి ప్రణాళికలు రూపొందించారు. టికెఆర్, గాయత్రినగర్, మంద మల్లమ్మ జంక్షన్‌ల మీదుగా ఫ్లై ఓవర్ నిర్మాణానికి టెండర్లు జిహెచ్ఎంసి ఇంజినీరింగ్(ప్రాజెక్ట్స్) విభాగం ఆహ్వానించింది.

* అంచనా వ్యయం : ఈ ప్రాజెక్టుకు అంచనా వ్యయం రూ. 416 కోట్లు.
* టెండర్ల గడువు : టెండర్ల దాఖలుకు చివరి తేదీ డిసెంబర్ 20.
* నిర్మాణ కాలం : టెండరు నిబంధనల మేరకు పనులు రెండు సంవత్సరాల్లో పూర్తికావాలి.
* నిర్మాణ బాధ్యత : ఇన్వెస్టిగేషన్, సర్వే, డిజైన్‌ల నుంచి నిర్మాణం పూర్తయ్యే వరకు పనులన్ని కాంట్రాక్టు పొందిన ఏజెన్సీయే చేపట్టాల్సి ఉంటుంది.
* డిఫెక్ట్ లయబిలిటీ : పనులు పూర్తయిన తర్వాత మరో రెండు సంవత్సరాల వరకు 'డిఫెక్ట్ లయబిలిటీ' కింద ఏవైనా లోపాలు తలెత్తినా, తిరిగి మరమ్మత్తు పనులను కాంట్రాక్టు ఏజెన్సీయే చేయాల్సి ఉంటుంది.
* ఫ్లై ఓవర్ స్వరూపం : దీనిని ఆరు లేన్లుగా నిర్మిస్తారు. ఈ ఫ్లై ఓవర్ రెండువైపులా ప్రయాణం చేయవచ్చు.

**సాఫీ ప్రయాణం కోసం విస్తృత ప్రణాళికలు..**

తెలంగాణ కోర్ అర్బన్ రీజియన్ (టికుర్) వరకు విస్తరించిన జిహెచ్ఎంసి పరిధి ఢిల్లీ, కోల్‌కత్తా, బెంగళూర్, చెన్నైల కంటే కూడా పెద్దదిగా ఉండటంతో, అంత దూరం వరకు నగరంలో ట్రాఫిక్ చిక్కులు లేకుండా చేసేందుకు ఈ ఫ్లైఓవర్ల ప్రణాళికలు రూపొందించారు.

**నిర్మాణంలో ఉన్న మరో మూడు ఫ్లైఓవర్లు..**

* టికెఆర్ ఫ్లైఓవర్‌తో పాటు, జిహెచ్ఎంసి మరో మూడు ఫ్లైఓవర్లను కూడా నిర్మించనుంది



* హఫీజ్‌బాబా నగర్ జంక్షన్, బాలాపూర్, చర్చిరోడ్ జంక్షన్ (ఒమర్ హోటల్ నుంచి మెట్రో ఫంక్షన్ హాల్ మీదుగా షాయిన్ హోటల్) వరకు ఒక ఫ్లై ఓవర్.
* బండ్లగూడ, ఎర్రకుంట జంక్షన్ వరకు ఒక ఫ్లైఓవర్.
* మైలార్‌దేవపల్లి, శంషాబాద్ రోడ్ కాటేదాన్ జంక్షన్ వద్ద ఇంకో ఫ్లైఓవర్.

**ఎయిర్‌పోర్ట్‌కు మార్గాలు సుగమం..**

ఆరాంఘర్ జంక్షన్ వద్ద ఇప్పటికే ఉన్న రైల్వే అండర్ బ్రిడ్జ్ (ఆర్‌యుబి)కి రెండు వైపులా మరో రెండు కొత్త ఆర్‌యుబిలు కూడా నిర్మించనున్నారు. ఈ నిర్మాణాలు పూర్తయితే సికింద్రాబాద్, ఉప్పల్ సహా వివిధ మార్గాల నుంచి రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయానికి (ఎయిర్‌పోర్టుకు) రాకపోకలు సాగించే వారికి సాఫీ ప్రయాణం సాధ్యం అవుతుంది.

## సాంకేతిక విద్యా నైపుణాల అభివృద్ధికి కేంద్రప్రభుత్వం ఎంతగానో కృషి

### కళాశాల ప్రిన్సిపాల్ ఎన్.సుధాకర్‌రెడ్డి

**ప్రజాపక్షం/ఘట్‌కేసర్ :** సాంకేతిక విద్యా నైపుణాలను పెంపొందించడానికి కేంద్రప్రభుత్వం ఎంతోగానో కృషి చేస్తుందని ఏసీఈ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్ సుధాకర్‌రెడ్డి తెలిపారు. ఘట్‌కేసర్ అంకుషాపూర్‌లోని ఏసీఈ ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం ఆయన స్మార్ట్ ఇండియా హ్యాకథాన్‌లో పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్మార్ ఇండియా హ్యాకథాన్‌లో భాగంగా ఎసిఇ కళాశాలకు టీంలో 6 మంది విద్యార్థుల చొప్పున 20 టీంలు ఈనెల 8న నిర్వహించే 36 గంటలకు పూర్తి అవుతుందన్నారు. కేంద్రప్రభుత్వరంగ సంస్థల నుంచి సమస్యలు తీసుకొని స్మార్ట్ ఇండియా హ్యాకథాన్‌లో పరిష్కారం చూపుతారని తెలిపారు. విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికి తీయడానికి జాతీయస్థాయి. హ్యాకథాన్‌లు ఎంతగానో దోహదపడుతాయన్నారు. తెలంగాణ రాష్ట్రంలో 5 ఇంజనీరింగ్ కళాశాలలకు హ్యాకథాన్ ఆతిథ్యం ఇస్తుందని అందులో ఎసిఇ




కళాశాల ఒకటిని గుర్తుచేశారు. పవర్‌గ్రిడ్ మ్యాథ్ వర్క్ సంస్థలు ఇచ్చేటటువంటి సాంకేతిక సమస్యలకు విద్యార్థులు పరిష్కారాలు కనుగొంటారని తెలిపారు. ఈ హ్యాకథాన్‌లో ప్రతిభను చాటిన విద్యార్థులకు మూడు టీంలకు 45లక్షల నగదు బహుమతి ఉంటుందన్నారు. అంతేకాకుండా విద్యార్థుల స్వయం ఉపాధి కొత్త స్టార్టప్‌లకు కేంద్రప్రభుత్వంతో పాటు ప్రైవేటు సంస్థలు సహకారం అందిస్తున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమలో డైరెక్టర్ మమత రావు, సిఎస్ఒ హెచ్ఒడి సారథి, అధ్యాపకులు కొండల్‌రావు, ఎఒ విజయ్‌కుమార్‌లు పాల్గొన్నారు.

## నేడు చర్లపల్లిలో వెల్‌నెస్ మారథాన్

**ప్రజాపక్షం/చర్లపల్లి:** చర్లపల్లి పారిశ్రామివాడలో ఆదివారం సిన్మియాస్, సిఐఎ ఆధ్వర్యంలో హెల్త్, వెల్‌నెస్ మారథాన్‌ను ఉదయం 6 గంటల నుండి 8 గంటల వరకు నిర్వహించనున్నామని ఐలా చైర్మన్ గోవింద్‌రెడ్డి తెలిపారు. ఉదయం ఆరు గంటల నుండి చర్లపల్లి ప్రొఫెసర్ జయశంకర్ పార్కు నుండి ఇసీఐఎల్ చౌరస్తా వరకు, ఇసిఐఎల్ చౌరస్తా నుండి జయశంకర్ పార్కుకు 8 గంటల వరకు చేరుకుంటుందని ఇందులో 100 మంది వాకర్స్ పాల్గొంటారని అన్నారు. పారిశ్రామికవేత్తలు, వాకర్స్ మారథాన్‌లో పాల్గొని విజయవంతం చేయాలని అన్నారు.

## గ్రామాలు విలీనంతో అభివృద్ధికి దూరం

### మున్సిపల్ మాజీ చైర్మన్ చంద్రారెడ్డి

**ప్రజాపక్షం/నాగారం:** మున్సిపాలిటీలు, కార్పొరేషన్లను జిహెచ్ఎంసిలో విలీనం చేయడంతో పేద ప్రజలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు. జిహెచ్ఎంసిలో 20 మున్సిపాలిటీలను విలీనం చేయడంతో 1300 కోట్లు, 7 కార్పొరేషన్లను విలీనం చేయడంతో 1100వందల కోట్లు నిధుల కోసమే ప్రభుత్వం జిహెచ్ఎంసిలో కలుపుతూ పాతబస్తీ అభివృద్ధి చేస్తుందన్నారు. జిహెచ్ఎంసితో మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు అభివృద్ధి చెందవని అన్నారు. ప్రస్తుతం విలీనం చేసిన అంకిరెడ్డి పల్లి, యాద్గార్‌పల్లి, నర్సంపల్లి, తిమ్మాయిపల్లి, భోగారం, కీసరదాయార లాంటి గ్రామాలు అభివృద్ధి చెందకపోవడంతో పేద ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురువుతారని ఆవేదన వ్యక్తం చేశారు.

## ఎన్నికలు నిర్వహణపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలి

### కలెక్టర్ ప్రతీక్‌జైన్




**ప్రజాపక్షం/పరిగి :** మూడవ విడుత గ్రామ పంచాయతీ ఎన్నికలు సజావుగా జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ అధికారులను ఆదేశించారు. పరిగి మండల పరిధిలోని నామినేషన్‌కు సంబంధించిన రంగంపల్లి క్లస్టర్‌ను పరిశీలించారు. రంగంపల్లి సాలెపూలబాట తండ, సందేహపూర్ తాండాల గ్రామ పంచాయతీలకు సంబంధించిన నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీల ఎన్నికలు సజావుగా నిర్వహించే క్రమంలో నామినేషన్ల ప్రక్రియలో ఎలాంటి తప్పులు పొరపాట్లు లేకుండా చూడాలన్నారు. అవసరానికి అనుగుణంగా సిబ్బందిని పెంచుకోవాలని కలెక్టర్ సూచించారు. నామినేషన్లు దాఖలుచేసే క్రమంలో కావలసిన ధృవ పత్రాలను సమర్పించడం లాంటి విషయాలను అభ్యర్థులకు తెలియచేయాలని తెలిపారు. నామినేషన్ల ఫారాల ను స్పష్టంగా చూసి వాటిల్లో ఏవైన తప్పులు వుంటే సరిచేసుకునే విధంగా అభ్యర్థులకు సహకరించాలని కలెక్టర్ సూచించారు.

**కలెక్టర్, అబ్జర్వర్ ఆధ్వర్యంలో పోలింగ్ సిబ్బంది ర్యాండమైజేషన్**

కలెక్టర్ అబ్జర్వర్ ఆధ్వర్యంలో పోలింగ్ సిబ్బందికి ర్యాండమైజేషన్ గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లలో భాగంగా పోలింగ్ సిబ్బంది మూడవ విడుత రెండవ ర్యాండమైజేషన్ ప్రక్రియను జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ ప్రతీక్‌జైన్, జనరల్ అబ్జర్వర్ షేక్ యాస్మన్ భాష సమక్షంలో నిర్వహించారు, ఈ ప్రక్రియను కలెక్టర్, అబ్జర్వర్ నిశితంగా పరిశీంచారు. మూడవ విడత 56మండలాలకు సంబంధించిన 157 గ్రామా పంచాయతీలకు మండలం వారీగా ఆయా గ్రామ పంచాయతీల సర్పంచు వార్డు స్థానాలకు ఎన్నికల పోలింగ్ విధుల నిర్వర్తించే ప్రిసైడింగ్ అధికారులు, 1608, ఒపిఒ 1874ల ర్యాండమైజేషన్ ద్వారా కేటాయించారు. ర్యాండమైజేషన్ ద్వారా స్థానికేతర సిబ్బందిని పోలింగ్ విధులకోసం ఎంపిక చేశారు. మూడవ విడుత పోలింగ్ కోసం మైక్రో అబ్జర్వర్లను ర్యాండమైజేషన్ ప్రక్రియలో ట్రైనింగ్ కలెక్టర్ హర్స్ చౌదరి, డిఆర్డిఒ శ్రీనివాస్, నోడల్ అధికారి మాధవరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

**విధులు నిర్వహించడంలో అధికారి నిర్లక్ష్యం.. సస్పెన్షన్ :** ఎన్నికల విధుల నిర్వహించడంలో నిర్లక్ష్యం వహించినందుకు కెవి కృష్ణారెడ్డి డిప్యూటి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, ఇరిగేషన్ అధికారి సబ్‌డివిజన్ పరిగి విధులకు అనధికారికంగా గైర్హాజరు కావడం, ఎలక్షన్ విధులు నిర్వహించడంలో నిర్లక్ష్యం వహించినందుకు విధుల నుండి సస్పెన్షన్ చేయడం జరిగింది అని జిల్లా కలెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో విధులు నిర్వహిస్తున్న రిటర్నింగ్ అధికారులు ఎలక్షన్ విధులు సక్రమంగా నిర్వర్తించాలని ఆదేశించారు.

## రాజీవ్ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం : ఒకరు మృతి



**ప్రజాపక్షం/శామీర్‌పేట :** ట్రాక్టర్‌ను లారీ ఢీ కొట్టిన ఘటనలో ఓ వ్యక్తి దుర్మరణం చెందగా మరొక వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన శామీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం సాయంత్రం చోటుచేసుకుంది. శామీర్‌పేట ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్ తెలిపిన వివరాల ప్రకారం.. శామీర్‌పేట రాజీవ్ రహదారి అలియాబాద్ చౌరస్తా సమీపంలో కరీంనగర్ హైద్రాబాద్ రోడ్డు మార్గంలో కరీంనగర్ వైపు వెళ్తున్న ఓ లారీ డ్రైవర్ లారీని అతి వేగంగా, నిర్లక్ష్యంగా నడుపుతు ముందు వెళ్తున్న ట్రాక్టర్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ట్రాక్టర్ రెండు ముక్కలై ట్రాక్టర్ ఇంజన్ రోడ్డు పై పడిపోగా ట్రాలీ చెట్ల పొదల్లోకి దూసుకెళ్లింది. ట్రాక్టర్ నడుపుతున్న మహారాష్ట్రకు చెందిన ఆకాష్ ఉత్తమ్ సోన్ కాంబ్లే (31) రోడ్డుపై పడిపోవడంతో తలకు తీవ్ర రక్త గాయాలై అక్కడిక్కడే మృతి చెందాడు. ట్రాక్టర్‌పై ఉన్న మరొక వ్యక్తి జగదేవ్‌కు తీవ్ర గాయాలు అయ్యాయి. గాయాలైన వ్యక్తిని ఆర్‌విఎం ఆస్పత్రికి తరలించామని మృతుడి తమ్ముడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.ట్రాక్టర్ ఇంజన్ రోడ్డుపై పడిపోవడంతో రాజీవ్ రహదారిపై కిలోమీటర్లు మేర ట్రాఫిక్ జామైంది. పోలీసులు క్రేన్ సహాయంతో ట్రాక్టర్‌ను పక్కకు తొలగించారు. ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్ తమ సిబ్బందితో కలిసి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.

## భారత రాజ్యాంగం పట్ల అవగాహన పెంపొందించుకోవాలి

### బిఆర్ అంబేద్కర్ వర్థంతి సభలో సిపిఐ రాష్ట కార్యదర్శివర్గ సభ్యుడు వివిఎస్ బోస్

**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** భారత రాజ్యాంగం పట్ల పౌరులు అవగాహన పెంపొందించుకోవాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వివిఎస్ బోస్ అన్నారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ 69వ వర్థంతి సందర్భంగా ఇసిఐఎల్ చౌరాస్తాలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగంలో పొందుపరచిన ప్రాదేశిక అంశాలను మార్చేందుకు కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి పార్టీ విశ్వ ప్రయత్నాలు చేస్తోందని, కాగా ఈ యత్నాలు మాత్రం ఆ పార్టీలకు సాధ్యం కాదన్నారు. 140 కోట్ల దేశ ప్రజలు ఆరాధించే గ్రంథం భారత రాజ్యాంగం అని దాన్ని మార్చే యత్నాలు చేసే బిజెపి పార్టీ కాలగర్భంలో కల్సి పోవటం తథ్యం అన్నారు. భారత రాజ్యాంగం కల్పించిన హక్కులన్నీ ప్రజలకు అందించాలని డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో ఎఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కె.ధర్మేంద్ర, జిల్లా కార్యదర్శి టి.సత్యప్రసాద్, ఉప్పల్ నియోజకవర్గ కార్యవర్గ సభ్యులు లక్ష్మి నారాయణ, మిరియాల సాయిలు, ఎఐవైఎఫ్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు. మరో కార్యక్రమంలో మల్లాపూర్‌లోని అంబేద్కర్ విగ్రహానికి స్థానిక కార్పొరేటర్ పన్నాల దేవేందర్, అంబేద్కర్ యువజన సంఘు సభ్యులు కర్రి శంకర్, మెండ రఘువరన్, తదితరులు పూలమాలలు వేసి నివా



ళులర్పించారు. మీర్‌పేట్ హెచ్‌బి కాలనీ ఇందిరానగర్ చౌరాస్తాలో అంబేద్కర్ విగ్రహానికి స్థానిక కార్పొరేటర్ ప్రభుదాస్ పూలమాలలు వేసి అంబేద్కర్ కల్పించిన రాజ్యాంగ హక్కులు ప్రతి ఒక్కరికి దక్కాల్సిందేనన్నారు.



ఈ కార్యక్రమంలో పాకాల ఎల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.


**శామీర్‌పేటలో:** శామీర్‌పేట మండల రెవెన్యూ కార్యాలయం ఆవరణలో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి అలియాబాద్ మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు తుంకి రమేష్ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. తూంకుంట మున్సిపల్‌లోని తూంకుంట, దేవరయాంజాల్, పోతాయిపల్లిలో జిల్లా ఆర్‌టిఎ మెంబర్ బీమిడి జైపాల్‌రెడ్డి అంబేద్కర్ వర్దంతిలో బాగంగా అంబే





ద్కర్ విగ్రహాలకు పూలమాల వేసి నాయకులతో కలిసి ఘనంగా నివాళ్లర్పించారు. మూడుచింతలపల్లిలో మాజి సర్పంచ్ జాం రవి అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళ్లర్పించారు.

**మల్కాజిగిరిలో:** అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా శనివారం జరిగిన వేర్వేరు కార్యక్రమాల్లో అంబేద్కర్ విగ్రహాలు, పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. నేరేడ్‌మెట్ డివిజన్ కాంగ్రెస్ నేతలు జెజె నగర్, ఆర్కెపురం ప్రాంతాల్లో మాజీ కౌన్సిలర్ ఎస్సార్ ప్రసాద్, ఇందిరా చంద్రశేఖర్, పి, చంద్రశేఖర్, రాఘవన్, కుట్టి శ్రీనివాస్, చిర్రా రాజలింగం, తదితరులు నివాళులర్పించారు. మాజీ ఎమ్మెల్యే ఆకుల రాజేందర్, కార్పొరేటర్



ప్రేమ్ కుమార్‌లు ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు సత్యమూర్తి, బాబు, సత్యనారాయణ, సంపత్‌రావు, కిషోర్, జన్,బి.షకీల్ తదితరులు పాల్గొన్నారు. మరో కార్యక్రమంలో నేరేడ్‌మెట్ షెడ్యూల్ కులాల హక్కుల పరిరక్షణ సంఘం ఆధ్వర్యంలో అంబేద్కర్‌కు నివాళులు అర్పించిన కార్యక్రమంలో సంఘ అధ్యక్షులు పిఎస్ శ్రీనివాస్, గణేష్, రాజయ్య, రాజేష్, తదితరులు పాల్గొన్నారు.




**దుండిగల్‌లో :** ఎమ్మార్పీఎస్ మరియు దళిత సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 68వ వర్ధంతి సందర్భంగా అంబేద్కర్‌కు ఘనమైన నివాళులు అర్పించారు. ఎమ్మార్పీఎస్ నాయకులు మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి 78 సంవత్సరాలు గడుస్తున్నా దళితులపైన దాడులు, వివక్ష ఇంకా కొనసాగుతున్నాయనీ దళితుడు అనే వ్యక్తి ఎంతటి ఉన్నత స్థానంలో ఉన్న దాడులు ఆగటం లేదనీ ఈ దేశ అత్యున్నత న్యాయ స్థానం ప్రధాన న్యాయమూర్తి సిజె గవాయి పైన బూటు విసరడం రాజ్యాంగం విలువలను కాలరాస్తున్నారు. అదే విధంగా దళితులపైన పోలీస్ అధికారులు మొన్నటికి మొన్న కోదాడలో జరిగి న లాకప్ డెత్ కంజర్ల రాజేష్ మాదిగ యువకుని మృతి సజీవ సాక్ష్యంగా నిలుస్తుందనీ అన్నారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా ఎమ్మార్పీఎస్ ఎంఎస్‌పి పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

**గండి మైసమ్మ చౌరస్తాలో :** దుండిగల్ సర్కిల్ పరిధిలోని గండి మైసమ్మ చౌరస్తాలో ఇద్దరపు ఎల్లయ్య ఆధ్వర్యంలో అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

**నవాబుపేట్‌లో :** భారతదేశానికి దిశానిర్దేశం చేసిన మహోన్నత వ్యక్తి అంబేద్కర్ అని, ఆయన సేవలు విశ్వమానవాళికి మార్గదర్శకమని నవాబుపేట్ అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు ఆనందం అన్నారు. అంబేద్కర్ యువజన సంఘం సభ్యులు సీనియర్ జర్నలిస్ట్



 చంద్రశేఖర్, శివరాజ్, జాన్ ఆధ్వర్యంలో శనివారం జరిగాయి. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రత్నం దేవకుమార్ రాజు, నర్సింహులు, లక్ష్మణ్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.



# మహానగరి
గ్రేటర్ హైదరాబాద్ GREATER HYDERABAD

## డా.బి.ఆర్.అంబేద్కర్ బహుజనుల ఆరాధ్యుడు : ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి



**ప్రజాపక్షం/హయత్ నగర్ :** భారత రాజ్యాంగ పితామహుడు డా.బి.ఆర్.అంబేద్కర్ గారి 69 వ వర్ధంతి సందర్భంగా ఎల్.బి.నగర్ శాసనసభ్యులు సుధీర్ రెడ్డి శనివారం ఎల్.బి.నగర్ లోని కామినేని కూడలి వద్ద ఉన్న విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ అంబేద్కర్ బహుజనుల గుండెలలో చిరస్మరణీయుడు అని అన్నారు. ఈ కార్యక్రమంలో మాన్సూరాబాద్ డివిజన్ మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్ రెడ్డి,సీనియర్ నాయకులు ఓరుగంటి వెంకటేష్,డివిజన్ భారస పార్టీ అధ్యక్షులు జక్కిడి మల్లారెడ్డి,నర్సింహారావు, రుద్ర యాదగిరి,నర్సింహా గౌడ్,చంద్రమౌళి,సల్వాచారి తదితరులు పాల్గొన్నారు.

## దేశానికి రాజ్యాంగం రూపుదిద్దిన మహనీయుడు అంబేద్కర్



**ప్రజాపక్షం/ సరూర్‌నగర్ :** డాక్టర్ బిఆర్ అంబేద్కర్ మన దేశానికి రాజ్యాంగం రూపుదిద్ది న మహానీయుడు అని సిపిఐ బా లా పూర్ మండల కార్యదర్శి ముకుం దంగారి చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. శనివారం మీర్‌పేట్ చౌరస్తాలో డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా సిపిఐ నాయకులు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్‌రెడ్డితో కలిసి అర్బన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ చల్లా నర్సింహారెడ్డి పాల్గొని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి ని వాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మనకు రాజ్యాంగాన్ని రూపుదిద్ది పేదల పెన్నిదిగా నిలిచారని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో మండల మహిళా కార్యధర్శి యాద మ్మ యాదవ్, బాలాపూర్ మండల కౌన్సిల్ సభ్యులు శ్రీనునాయక్, రైతు సం ఘం కార్యదర్శి అంజయ్య, గిరిజన సమాఖ్య ప్రధాన కార్యదర్శి శత్రునాయక్ తదితరులు పాల్గొన్నారు.



**గడ్డిఅన్నారంలో :** భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబెద్కర్ అందరివాడు అని గడ్డిఅన్నారం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బద్దుల వేణుగోపాల్‌యాదవ్ అన్నారు. శనివారం అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా ఎల్‌బినగర్ నియోజకవర్గంలో పలు చోట్ల ఆ మహనీయుడి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఫ్లోర్ లీడర్ బద్దుల వెంకటేష్‌యాదవ్, సునీల్‌బాబుచ విజయ్, ఏకెయాదవ్, సురేష్, బబ్లూ, శ్యామ్, శ్రీనివాస్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కరించేందుకు కృషి చేయండి



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** పెండింగ్‌లో ఉన్న కేసులను పరిష్కరించేందుకే జాతీయ లోక్ ఆదాలత్ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని 16వ జిల్లా అదనపు జిల్లా న్యాయమూర్తి, మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్ పర్సన్ ఎస్.స్వాతిరెడ్డి వివరించారు. శనివారం షాద్‌నగర్ కోర్టు సముదాయంలో పోలీస్ అధికారులు, బ్యాంక్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి స్వాతిరెడ్డి జాతీయ లోక్ ఆదాలత్‌లో సాధ్యమైనంత వరకు కేసులను పరిష్కరించేందుకు కృషి చేయాలని సూచించారు. కక్షదారులను రాజీ పడే విధంగా కేసులను రాజీ చేసుకోవాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. ఏళ్ల తరబడి కోర్టుల చుట్టు తిరిగే దానికంటే జతీయ లోక్ ఆదాలత్‌లో పెండింగ్‌లను పరిష్కరించుకునే విధంగా కక్షదారులు కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని పేర్కొన్నారు. డిసెంబర్21వ తేదిన నిర్వహించే జాతీయ లోక్ ఆదాలత్‌ను ప్రజలందరు సద్వినియోగం చేసుకొని పెండింగ్ కేసులను పరిష్కరించుకునేందుకు కృషి చేయాలని సూచించారు. తమపై ఉన్న కేసులను రాజీమార్గం ద్వారా పరిష్కరించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కొత్త రవి, షాద్‌నగర్ పట్టణ సిఐ విజయ్‌కుమార్, రూరల్ ఎస్‌ఐ శ్రీనివాస్, కేశంపేట ఏఎస్‌ఐ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## స్మశాన వాటిక కబ్జా



**ప్రజాపక్షం/మియాపూర్:** మియాపూర్ మదినగూడ విలేజ్‌లోని కురుమ సంఘం స్మశాన వాటికలో భారీ షెడ్లు వేసి అద్దెలకిచ్చే నేపథ్యంలో అక్రమాలకు తెర లేపారు, చర్యలు తీసుకోవాల్సిన మున్సిపల్ అధికారులు కానీ రెవిన్యూ అధికారులు కానీ ఇటువైపు కన్నెత్తి చూసిన పాపను పోలేదు వారికింత వీరికింత అన్న చందాన అధికారులు వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఆ ప్రాంతంలో టీ రోడ్డు ఉండడంవల్ల భవిష్యత్తులో ట్రాఫిక్ జామ్ ఏర్పడే అవకాశం లేకపోలేదు అక్రమంగా నిర్మిస్తున్న షెడ్లని తొలగించాలని ఎన్ని ఫిర్యాదులు చేసిన అధికారులు పట్టించుకోవటం లేదని స్థానికులు తెలిపారు. మనిషి మరణాంతరం ప్రశాంతంగా దహన సంస్కారాలు చేయాల్సిన ప్రదేశంలో కూడా కమర్షియల్ షెడ్లేసి అక్రమ సంపాదనకు తెర లేపుతున్న వీరిపై కట్టిన చర్యలు తీసుకోవాలని మండల రెవెన్యూ అధికారికి అలాగే మున్సిపల్ అధికారులకు, హైడ్రాధికారులకు స్థానికులు ఫిర్యాదు చేశారు. ఎట్టి పరిస్థితిలో ఈ షెడ్లను తొలగించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. మన వేదాలు పురాణాలు స్మశాన వాటికలో వచ్చే డబ్బులను దేవాలయాలకు వాడద్దు అని చెబుతున్న పెడచెవిన వేసి దేవుడి పేరు చెప్పి, సంఘం పేరు చెప్పి సొంత ఖర్చులకు వాడుకుంటున్నారని ఆరోపణలు వస్తున్నాయి.

## డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్‌కు నివాళి



**ప్రజాపక్షం/హయత్ నగర్ :** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 69 వ వర్ధంతిని భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) హయత్ నగర్ మండల సమితి ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు.కార్యక్రమంలో సిపిఐ జిల్లా నాయకులు సామిడి శేఖర్ రెడ్డి, మండలకార్యదర్శి ఎస్ శ్రీదేవి,మండల సహాయ కార్యదర్శులు ఎం శోభన్,కె సుజాత,ఏఐఎస్ఎఫ్ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి సామిడి వంశి వర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### షాబాద్, హైతాబాద్, నాగర్‌గూడ చౌరస్తాలో

అంబేద్కర్ ఆశయాలను సాధించినప్పుడే పేదలకు న్యాయం జరుగుతుందని గుడి మాల్కాపూర్ మార్కెట్ వైజ్ చైర్మన్ చంద్రశేఖర్ అన్నారు. శనివారం షాబాద్, హైతాబాద్, నాగర్‌గూడ చౌరస్తాలోని అం బేద్కర్ వర్ధంతి సందర్భంగా వివిధ పార్టీల నాయకులు అంబేద్కర్ విగ్రహాని కి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల సభ్యులు వివిధ పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# రెట్టింపు కానున్న జిహెచ్ఎంసి ఆదాయం

● గత సంవత్సర ఆదాయం రూ.3300 కోట్లు ● శివారు ప్రాంతాల విలీనంతో రూ.5500 కోట్ల నుంచి రూ.6000 కోట్లకు పెరిగే అవకాశం ● గత సంవత్సరం టౌన్‌ప్లానింగ్ ద్వారా రూ.1138.44 కోట్లు ● ఆస్తిపన్ను ద్వారా రూ. 2,038 కోట్లు ● విలీన ప్రాంతాలతో భారీగా పెరగనున్న టౌన్‌ప్లానింగ్ అదాయం ● విలీన సంస్థల నుంచి ఆస్తిపన్ను అంచనా రూ.500 కోట్లు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** శివారు మున్సిపల్ సంస్థలు విలీనం కావడంతో జిహెచ్ఎంసికి అదాయం సమకురే అవకాశం ఉంది. పెరిగే అదాయం కంటే మౌలిక సౌకర్యాల కల్పనతో పాటు పౌర సేవలకు పెద్ద మొత్తంలో వ్యయం చేయాల్సిన పరిస్థితులు కూడా 'మహా' బల్దియాకు సవాళ్లుగా మారనున్నాయి. తెలంగాణ కోర్ అర్బన్ రీజియన్‌లోని 27 పట్టణ స్థానిక సంస్థలు, మహానగర పాలక సంస్థ(జిహెచ్ఎంసి) విలీనమైన విషయం తెల్సిందే. జిహెచ్ఎంసికి ప్రధానంగా అదాయం ఆస్తిపన్ను, భవన నిర్మాణ అనుమతుల జారీ ద్వారా సమకురుతోంది. వీటితో పాటు ట్రేడ్ లైసెన్స్, అడ్వాటైజ్ మెంట్ బోర్డుల ఫీజుల అదాయం వస్తుంది. అయితే ప్రధాన అదాయ వనరు మాత్రం ఆస్తిపన్ను, భవన నిర్మాణ అనుమతుల ద్వారానే వస్తుంది. గత ఆర్థిక సంవత్సరం 2024–25లో ఆస్తిపన్ను ద్వారా జిహెచ్ఎంసికి రూ. 2,038 కోట్లు వసూలైంది. ఇక భవన నిర్మాణ అనుమతుల మంజూరు ద్వారా రూ.1138.44 కోట్లు సమకురింది. విలీనమైన ప్రాంతాల్లో జిహెచ్ఎంసి భవన నిర్మాణ అనుమతుల మంజూరు




ప్రారంభిస్తే అదాయం రెట్టింపు అయ్యే అవకాశం ఉందని అధికారులు చెప్పుతున్నారు. అప్పుడు టౌన్‌ప్లానింగ్ ద్వారానే సుమారు రూ.2500 కోట్ల వరకు ఆదాయం వచ్చే అవకాశాలు ఉన్నాయని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం జిహెచ్ఎంసి అదాయం ఆస్తిపన్ను, భవన నిర్మాణ అనుమతుల ద్వారా రూ.3,300 వేల కోట్ల పైచిలుకు మాత్రమే ఉంది. కోర్ ఆర్బన్ రీజియన్ విలీనంతో రూ.5500 కోట్ల నుంచి రూ.6000 వేల కోట్ల వరకు అదాయం పెరిగే అవకాశాలు ఉన్నాయి. అయితే శివారు ప్రాంతాల్లో అంతే స్థాయిలో మౌళిక సౌకర్యాల కల్పనకు భారీ స్థాయిలోనే వ్యయం చేయాల్సి ఉంటుంది. జిహెచ్ఎంసికి సర్కార్ సహకారం అందిస్తే తప్పా హెచ్ సిటీ లాంటి ప్రాజెక్టులు ముందుకు సాగని పరిస్థితి నెలకొంది. ఇప్పటి వరకు అయితే ప్రభుత్వం నుంచి ఆశజనకంగానే జిహెచ్ఎంసికి నిధులు అందుతున్నాయని అధికారులు అంటున్నారు. విలీనమైన ప్రాంతాలలో మౌలిక సౌకర్యాల కల్పనకు ప్రత్యేకంగా నిధులు విడుదల చేస్తే పనులు వేగంగా చేపట్టేందుకు వీలవుతుందంటున్నారు.

### ఆస్తిపన్నుపై ఆశలు..

ఆస్తిపన్నుపై జిహెచ్ఎంసి అధికారులు ఆశలు పెట్టుకున్నారు. గత సంవత్సరం కంటే ఈ సంవత్సరం మరింత మెరుగ్గా వసూలు చేయాలని లక్ష్యంగా నిర్ధేశించుకున్నారు. అందుకుగాను ఇప్పటికే అదనపు కమిషనర్ అనురాగ్ జయంతి అధికారులకు లక్ష్యాలు నిర్ధేశించారు. అయితే 2025–26 ఆర్థిక సంవత్సరానికిగాను రూ. రూ. 2,200 కోట్ల లక్ష్యాన్ని అధికారులు నిర్ధేశించుకున్నారు. ఇప్పటివరకు రూ. 1,449 కోట్లు వసూలైంది. ఇక 27 పట్టణ స్థానిక సంస్థల విలీనం వల్ల జిహెచ్ఎంసి పరిధి, విస్తీర్ణం పెరగడంతో పాటు ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 202526లో ఆస్తిపన్ను వసూళ్ల గణనీయంగా పెరగవచ్చని అధికారులు అంచనగా ఉంది. గత ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర వ్యాప్తంగా స్థానిక సంస్థలలో రూ.1,100 కోట్ల ఆస్తిపన్ను వసూలైంది. ఈ 27 విలీన సంస్థల వాటా సుమారు రూ. 500 కోట్ల నుంచి రూ. 600 కోట్ల వరకు ఉంటుంది. అయితే జిహెచ్ఎంసి ఆస్తిపన్ను పెంచకుండా వసూళ్లను పెంచుకునేందుకు అనేక చర్యలు చేపట్టింది. సుమారు 73,000 కమర్షియల్ భవనాలు రెసిడెన్షియల్‌గా చూపించి, ఆస్తిపన్ను చెల్లిస్తున్నట్లు గుర్తించారు. వీటిని కమర్షియల్ ట్యాక్స్ పరిధిలోకి తీసుకురావడం ద్వారా అదనంగా రూ. 400 కోట్ల వరకు పన్ను వసూలు అయ్యే అవకాశం ఉందంటున్నారు. ఈ చర్యలతో పాటు విలీన సంస్థల నుంచి వచ్చే కలెక్షన్ సుమారు రూ. 400500 కోట్లతో కలిపి, ఈసారి జిహెచ్ఎంసి ట్యాక్స్ కలెక్షన్ సుమారు రూ.3 వేల కోట్లను దాటే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు.

## శాంతిభద్రతల పరిరక్షణలో హోంగార్డులది కీలకపాత్ర

### హోంగార్డుల రైజింగ్ డే వేడుకల్లో హైదరాబాద్ సిపి విసి. సజ్జనార్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** నగరంలో శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులతో సమానంగా విధులు నిర్వర్తిస్తూ హోంగార్డులు కీలకపాత్ర పోషిస్తున్నారని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ విసి.సజ్జనార్ అన్నారు. వారి సంక్షేమం కోసం త్వరలోనే సిటీ పోలీస్ విభాగంలో ప్రత్యేకంగా 'హోంగార్డ్ కోఆపరేటివ్ సొసైటీ'ని ఏర్పాటు చేయనున్నట్లు ఆయన ప్రకటించారు. పేట్లబురుజులోని సిఎఆర్ హెడ్‌క్వార్టర్స్‌లో సిటీ పోలీస్ ఆధ్వర్యంలో శనివారం హోంగార్డ్స్ రైజింగ్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సిపి సజ్జనార్ పరేడ్‌ను పరిశీలించి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నగరంలో సుమారు 5 వేల మంది హోంగార్డులు అంకితభావంతో పనిచేస్తున్నారని కొనియాడారు. హోంగార్డుల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేయనున్న కోఆపరేటివ్ సొసైటీలో ఇప్పటికే 2 వేల మంది చేరారని, మిగిలిన వారు కూడా సభ్యత్వం తీసుకోవాలని సూచించారు. అర్హులైన హోంగార్డులకు డబుల్ బెడ్రూం ఇళ్లు మంజూరు చేసే అంశం ప్రభుత్వం పరిశీలనలో ఉందని గుర్తు చేశారు. ప్రతి ఒక్క హోంగార్డు డ్రైవింగ్ లైసెన్స్‌ను విధిగా రెన్యూవల్ చేసుకోవాలని, లైసెన్స్ రెన్యూవల్ చేసుకోని పక్షంలో రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు బీమా మంజూరులో ఇబ్బందులు తలెత్తుతాయని చెప్పారు. విధి నిర్వహణలో అలసత్వం వహించినా, అవినీతి, అక్రమాలకు పాల్పడినా చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. క్రమశిక్షణతో మెలిగి పోలీస్ శాఖకు మంచిపేరు తేవాలని అన్నారు. పరేడ్‌లో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన వారితో పాటు, విధి నిర్వహణలో ప్రతిభ చూపిన 25 మందికి ప్రశంసా పత్రాలను అందజేశారు. విధి నిర్వహణలోనూ, ఇతర కారణాలతోనూ మృతిచెందిన 18 మంది హోంగార్డుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డిసిపి(సిఎఆర్) రక్షిత కృష్ణమూర్తి, హోంగార్డు కమాండెంట్ కిషన్ రావు ఇతర పోలీసు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## బ్యాంక్ డైరెక్టర్ల ఎన్నికలకు సర్వం సిద్ధం

### హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ మను చౌదరి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఏపి మహేష్ కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ల ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఇన్‌చార్జ్ కలెక్టర్ మను చౌదరి తెలిపారు. ఎన్నికలను సజావుగా, ప్రశాంత వాతావరణంలో, సమర్థవంతంగా నిర్వహించాలని అధికారులకు, సిబ్బందికి ఆయన సూచించారు. నాంపల్లిలోని కమలా నెహ్రూ పాలిటెక్నిక్, సరోజినీ నాయుడు వనిత మహా విద్యాలయంలలో చేపట్టిన ఏర్పాట్లను, పోలింగ్ బూత్‌లను, పోలింగ్ బ్యాక్సులను, పోలింగ్ సామాగ్రి పంపిణీ ప్రక్రియను, బ్యాలెట్ పత్రాలను జిల్లా రెవెన్యూ అధికారి (డిఆర్ఒ) ఈ.వెంకటాచారి, పోలీసు అధికారులతో కలిసి శనివారం కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలించారు. హైదరాబాద్‌లోని నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్, కమలా నెహ్రూ పాలిటెక్నిక్, సరోజినీ నాయుడు వనిత మహా విద్యాలయంలలో 68 పోలింగ్ కేంద్రాలు. మహారాష్ట్ర, రాజస్థాన్, ఆంధ్రప్రదేశ్‌తో పాటు తెలంగాణలోని మూడు జిల్లాలలో కలిపి 10 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ కలెక్టర్ మను చౌదరి మాట్లాడుతూ పోలింగ్ సామాగ్రి పంపిణీ పూర్తయిందని, ఎన్నికల నియమ నిబంధనలు తప్పక పాటించాలని సిబ్బందిని ఆదేశించారు. ఓటింగ్ సమయంలో నిబంధనలు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో సికింద్రాబాద్ ఆర్‌డిఓ సాయిరాం, సెంట్రల్ జోన్ అడిషనల్ డిసిపి ఆనంద్, ఎసిపి ప్రవీణ్ కుమార్, లా ఆఫీసర్ శ్రీధర్, స్పెషల్ ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ జ్యోతి, డిస్ట్రిక్ట్ కోఆపరేటివ్ ఆఫీసర్ ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

నేడు పోలింగ్

- **పోలింగ్ సమయం :** ఉదయం 9:00 గంటల నుండి సాయంత్రం 5:00 గంటల వరకు.
- **ఓటర్లు :** సుమారు 37,142 మంది తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు.
- **పోలింగ్ కేంద్రాలు :** మొత్తం 78 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు.

## గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి కృషి చేస్తా







### డాక్టర్ బి.ఆర్‌ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్

**ప్రజాపక్షం/కొత్తూరు/షాద్‌నగర్ :** గ్రామీణ ప్రాంతాలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసే బాధ్యత నాదేనని, కాంగ్రెస్ ప్రభుత్వం తరుపున నిలబెట్టిన అభ్యర్థులను గెలిపించేందుకు ప్రజలందరు కృషి చేయాలని తెలంగాణ ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ సూచించారు. శనివారం నందిగా మ మండల పరిధిలోని ఈదుల పల్లి, మొత్కులగూడ, ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని రాసుమల్లగూడ గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులకు మద్దతుగా ఇంటింటి ప్రచారం చేశా రు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలు అన్ని రంగా ల్లో అభివృద్ధి సాధించాలంటే ప్రతి ఒక్కరు కాంగ్రె స్ అభ్యర్థులను గెలిపించేందుకు కృషి చేయాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం తోనే గ్రామీణ ప్రాం తాలు అభివృద్ధి సాధిస్తాయని గుర్తు చేశారు. రాసుమల్లగూడ గ్రామానికి చెందిన సర్పంచ్ అభ్యర్థి శివరాములు, మొత్కుల గూడ గ్రామానికి చెందిన జటా శైలజను, ఈదుల పల్లి గ్రామానికి చెందిన కమ్మరి భూలోకను సర్పంచులుగా గెలిపించేందుకు ప్రజలందరు కృషి చేయాలని కోరా రు. అధికార కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని, దాంతో ప్ర భుత్వ సహాయ సహకారాలు అంధించడం జరుగుతుందని వివరించారు. తెలంగాణ ముఖ్యమం త్రి రేవంత్‌రెడ్డి సారథ్యంలోనే పల్లెసీమలు ప్రగతి సీమలుగా అభివృద్ధి సాధించేందుకు అవకాశం ఉంటుందన్నారు. గ్రామాలలో కాంగ్రెస్ నేతలు పెద్ద ఎత్తున ర్యాలీలు నిర్వహించడంతో పాటు ప్రచార పర్వం జోరుగా నిర్వహించారు.

### బాబా సాహెబ్ రాజ్యాంగమే దేశానికి మహోన్నత గ్రంథం : వీర్లపల్లి

సామాజిక, ఆర్థిక, రాజకీయాలకు సమానత్వం కల్పించిన ఘనత డాక్టర్ బిఆర్ఎస్ అంబేద్కర్‌దేనన్న విషయాన్ని ప్రజలందరు గమనించాలని షాద్‌నగర్ శాసన సభ్యులు వీర్లపల్లి శంకర్ అన్నారు. శనివారం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ 68వ వర్ధంతి సందర్భంగా ముఖ్యకూడలిలో ఉన్న విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్ళు అర్పించారు. దళిత సంఘాలతో పాటు కాంగ్రెస్ శ్రేణులు, బీసి జనసేన నేతలు పెద్ద ఎత్తున ముఖ్యకూడలి వద్దకు చేరుకొని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్ళు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ సామాజిక, ఆర్థిక, రాజకీయాలకు సమానత్వం కల్పించిన ఘనత డాక్టర్ బిఆర్ అంబేద్కర్‌కు దక్కుతుందని, బాబా సాహెబ్ రాజ్యాంగమే దేశానికి మహోన్నత గ్రంథమనే విషయాన్ని ప్రజలందరు గుర్తు పెట్టుకోవాలని సూచించారు. అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని సవరించేందుకు గతంలో కేంద్ర ప్రభుత్వం కుట్రలు చేసిందని, అలాంటి కుట్రలను మేధావులు, విద్యావంతులు భగ్నం చేశారని వివరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ విశ్వం, పట్టణ అధ్యక్షుడు కొంకళ్ళ చెన్నయ్య, నేతలు దంగు శ్రీనివాస్ యాదవ్, చెంది తిరుపతిరెడ్డి, బస్వం, మహ్మద్ ఇబ్రహీం, మన్నె రవి తదితరులు పాల్గొన్నారు.

### బిసి జనసేన ఆధ్వర్యంలో..

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ 68వ వర్ధంతి వేడుకలు బీసి జనసేన ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. శనివారం పట్టణంలోని ముఖ్యకూడలిలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళ్ళు అర్పించారు. బిసి జనసేన జాతీయ అధ్యక్షుడు కత్తి చంద్రశేఖర్ అప్ప మాట్లాడుతూ దేశంలో పాలన వ్యవస్థ సరైన పద్ధతిలో నడవాలంటే పునాదులు లాంటి అంబేద్కర్ రాసిన భారత రాజ్యాంగాన్ని అనుసరించాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో బీసిజన సేన నేతలు జమాల్పూర్ చందులాల్, మేకల వెంకటేష్, తగిడిపల్లి శంకర్, జక్కుల జలజ, స్రవంతిరాజ్, భాగ్య లక్ష్మి , గడ్డమీది రమేష్‌లు పాల్గొన్నారు.

## కామినేని వైద్యులు అరుదైన చికిత్స



**ప్రజాపక్షం/ సరూర్‌నగర్ :** ప్రమాదవశాత్తు మెదుడు రక్తనాళం తెగిపోయి తీవ్ర ఇబ్బందులు గురై బాధపడుతున్న ఓ వ్యక్తికి మెరుగైన వైద్యసేవలు అందించినట్లు ఎల్‌బినగర్ కామినేని ఆసుపత్రి ప్రముఖ వైద్యనిపుణులు డాక్టర్ రిషిత్ బత్తిని తెలిపారు. శనివారం ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డాక్టర్ రిషిత్ మాట్లాడుతూ గుర్రంగూడ ప్రాంతానికి చెందిన కార్తీక్ అనే సాఫ్ట్‌వేర్ ఉద్యోగి సంక్రాంతి సమయంలో నాగోల్ ప్రాంతంలో తన భార్యతో కలిసి ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న క్రమంలో పతంగి మాంజా కోసుకోని తీవ్రగాయాలకు గురయ్యారు. వెంటనే కామినేనిలో చేర్పించారని అన్నారు. అత్యవసర చికిత్సలో భాగంగా మెదడు రక్తనాళాలు తిరిగి అతికించడం జరిగిందన్నారు. తలకు హెల్మెట్ ధరించిన ఇలాంటి ప్రమాదం చోటుచేసుకోవడం బాధకరం అన్నారు. గాలికి వేలాడుతున్న రోడ్డు మీద వెళ్ళే వాళ్ల ప్రాణాలు మీదకు తెస్తున్నాయి. గాజు పూసిన మాంజాలు ఎక్కువ ప్రమాదకరంగా ఉంటాయన్నారు. వీటి నియంత్రణలో అధికారులు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్‌లు సయ్యద్ మఝర్ అలీ, సురేష్‌కుమార్, రవళిసాదె, రిషిత్‌బత్తిని తదితరులు పాల్గొన్నారు.

## అసమానతలు లేని క్రీడా స్ఫూర్తిని భావితరాలకు అందించాలి

### టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు

**ప్రజాపక్షం/షాద్‌నగర్:** సమాజంలో అసమానతలు, లింగ వివక్ష లేని సంస్కృతితో క్రీడా స్ఫూర్తిని భావితరాలకు అందించేందుకు కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని టిడిపి పొలిట్ బ్యూరో సభ్యుడు, షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింలు అన్నారు. శనివారం షాద్‌నగర్‌లో స్వర్గీయ నందమూరి తారకరామారావు 103వ జయంతిని పురస్కరించుకొని మొట్ట మొదటి సారిగా ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి క్రికెట్, కబడ్డీ పోటీలకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింలు మాట్లాడుతూ మనిషిలో కృషి, పట్టుదల ఉంటే సాధించలేనిది ఏమి ఉండదనే విషయాన్ని ప్రతి ఒక్కరు గుర్తించుకోవాలని సూచించారు. యువత లక్ష్యాన్ని ఎంచుకొని ముందుకు వెళ్తె విజయాలు వెన్నంటే ఉంటాయని, గెలుపు, ఓటములను సమానంగా భావిస్తే భవిష్యత్ బంగారు మయంగా ఉంటుందన్నారు. క్రీడలతోపాటు జీవితంలో కృషి, పట్టుదల అనేది విధిగా ఉండాలని, అప్పుడే అనుకున్న లక్ష్యాలను సాధించేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. స్వర్గీయ ఎన్‌టిఆర్ పేరిట క్రీడలు నిర్వహించడం ఎంతో అభినందనీయమని పేర్కొన్నారు. క్రికెట్ పోటీల్లో మొదటి బహుమతి రూ.2లక్షలు, ద్వితీయ బహుమతి లక్ష, తృతీయ బహుమతి రూ.50వేలు అంధించడం ఎంతో అభినందనీయమని అన్నారు. డిసెంబర్31 నాటికి క్రీడాకారులు రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు చివరి తేది అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి చల్లా వెంకటేశ్వర్‌రెడ్డి, మాజీ ఎంపిటిసి భాస్కర్ గౌడ్, అనంతయ్య, భూపాల్‌లు పాల్గొన్నారు.



## ఎల్ఐసికి మాత్రమే ప్రభుత్వ గ్యారంటీ

**సిబిఐ మాజీ డైరెక్టర్ జెడి లక్ష్మి నారాయణ**

**ప్రజాపక్షం/రంగారెడ్డి:** ఎల్ఐసికి మాత్రమే ప్రభుత్వ గ్యారంటీ అని, ఏజెంట్లంతా ఫైనాన్సియల్ డాక్టర్లుగా రాణించాలని సిబిఐ మాజీ డైరెక్టర్ జెడి లక్ష్మి నారాయణ అన్నారు. శనివారం ఎల్‌బి నగర్ కెకె గార్డెన్‌లో ఎల్ఐసి హైదరాబాద్ డివిజన్ కౌన్సిల్ 19వ జనరల్ బాడీ సమావేశం జరిగింది. సమావేశంకి ఎల్ఐసి ఆల్ ఇండియా సెక్రటరి జనరల్ ఎస్ బి శ్రీనివాసచారితో కలిసి సిబిఐ మాజీ జాయింట్ డెరెక్టర్ లక్ష్మినారాయణ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో గల 15 లక్షల ఎల్ఐసి ఏజెంట్లు సేవాభావంతో పని చేస్తే మంచి ఫైనాన్సియల్ అడ్వైజర్లుగా రాణించే అవకాశాలున్నాయన్నారు. 46లక్షల కోట్ల ఆస్తులు ఉన్న ఎస్ఐసికి మాత్రమే ప్రభుత్వ గ్యారంటీ ఉందని,ఎల్ఐసి ఏజెంట్లు అంటే కేవలం లైఫ్ ఇన్సూరెన్స్ పాలసీలు అమ్ముకునే సేల్స్ మెన్లు కాదు.. ఆయా కుటుంబాల ఆర్థిక స్తితిగతులను గుర్తించి వారి స్తోమతకు దగ్గ జీవిత భీమా పాలసీలు అందించి, వారి భవిష్యత్తు కోసం నిధిని సమాకుర్చి రక్షణ కవచాలుగా సహాయపడుతున్నారని కొనియాడారు. ఒక సారి పరిచయం అయితే కుటుంబ సభ్యులు అవుతారని అన్నారు. ఎల్ఐసిని వ్యాపార సంస్థగా కాకుండా ఆర్థిక భరోసాను కల్పించే గొప్ప సేవాభావం గల సంస్థగా భావించాలాన్నారు. ఎల్ఐసి ఏజెంట్లు సంస్థకు ప్రాణం వంటి వారని, ఫైనాన్స్ డాక్టర్ అనుకోవాలన్నారు. నీతి నిజాయితి సానుభూతి క్రమశిక్షణతో పని చేసి బ్రాండ్ అంబాసిడర్లుగా పేరు గాంచేందుకు కృషి చే యాలని సూచించారు. ఏజెంట్లంతా పాలసీల పట్ల అవగాహన పెంచుకొని ప్రజలకు నమ్మకం కల్పించి భరోసా ఇస్తే అత్యధికంగా పాలసీలు చేయించవచ్చని చక్కటి ఉదాహారణలతో వివరించారు. ఎల్ఐసి ఏజెంట్లు వికసిత్ భారత్ 2047 లో భాగస్వాములు కావాలని పిలుపు నిచ్చారు. ఎల్ఐసిహైద్రాబాద్ డివిజన్ అధ్యక్షులు వెంకట్ రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో హైదరాబాద్ డివిజన్ కౌన్సిల్ ప్రతినిధులు,కె.సుదన్శనం, కౌన్సిల్ ప్రతినిధులు సుధాకర్ రెడ్డి, నవ్యశ్రీ,శ్రీవాత్సవ, శ్రీన య్య, పూరి వెంకటేశం,సింగారపు శ్రీనివాస్, బిఎన్ చారి,బి.శ్రీరాం,ఎస్ మూర్తి,అంజి రెడ్డి, దొడ్డి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



# రీల్



## 'ఇట్స్ ఓకే గురు' ప్రీరిలీజ్ వేడుక

సాయి చరణ్, ఉష్రశీ హీరో హీరోయిన్స్‌గా నటిస్తున్న చిత్రం 'ఇట్స్ ఓకే గురు'. మణికంఠ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని క్రాంతి ప్రసాద్ నిర్మిస్తున్నారు. ఈ సినిమా డిసెంబర్ 12 రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా మేకర్స్ ప్రీరిలీజ్ ఈవెంట్ హైదరాబాద్‌లో ఘనంగా నిర్వహించారు. డైరెక్టర్ మెహర్ రమేష్ మాట్లాడుతూ.. నేను ఇట్లు శ్రావణి సుబ్రమణ్యం సినిమాకి పూరి జగన్నాథ్ దగ్గర అసిస్టెంట్‌గా పని చేశాను. బద్రిలో సంబంధం లేకుండా సబ్జెక్ట్ నచ్చే చేసిన సినిమా అది. ఆ సినిమా తర్వాత చదివితే, పూరి జగన్నాథ్ మళ్లీ వెనక్కి తిరిగి చూసుకోలేదు. ఈ సినిమా చూస్తుంటే నాకు మంచి సబ్జెక్ట్ ఉన్నట్లు అనిపిస్తుంది. డైరెక్టర్ మణికంఠ, చిన్న సినిమాల్లో చాలా అద్భుతంగా ఆడుతున్నాయి. ఈ సినిమా కూడా చాలా పెద్ద విజయం సాధించాలని కోరుకుంటున్నాను. ఇందులో ఒక సాంగ్ నాకు చాలా నచ్చింది. మణికంఠ తీసిన కొత్తపెళ్లికూతురు షార్ట్ ఫిలిం నాకు చాలా ఇష్టం. ఈ సినిమాని కూడా చాలా కష్టపడి మంచి సబ్జెక్ట్ రాసుకొని తీశారు. మేము కలిసి త్వరలోనే ఒక వెబ్ సిరీస్ కూడా చేయాలని ఉంది. ఈ సినిమా హీరో చరణ్‌లో చాలా మంచి ఈజ్ ఉంది అని అన్నారు. ఈ కార్యక్రమంలో మ్యూజిక్ డైరెక్టర్ మోహిత్, డైరెక్టర్ మణికంఠ, ప్రొడ్యూసర్ క్రాంతి ప్రసాద్, హీరో సాయి చరణ్, హీరోయిన్ ఉష్రశీ, ఈస్ట్ వెస్ట్ సీఈవో రాజీవ్ తదితరులు పాల్గొన్నారు.



## ఈ సంక్రాంతికి నారి నారి నడుమ మురారి

శర్వా హీరోగా నటిస్తున్న ఫీల్‌గుడ్ ఫ్యామిలీ ఎంటర్టైనర్ 'నారి నారి నడుమ మురారి'. సామజవరగమనతో బ్లాక్‌బస్టర్ డెబ్యు చేసిన రామ్ అబ్బరాజు దర్శకత్వం వహిస్తున్నారు. ఎకె ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్‌పై రామ బ్రహ్మం సుంకర నిర్మించిన ఈ చిత్రంలో సంయుక్త, సాక్షి వైద్య, కథానాయికలుగా నటించారు. ఇప్పటివరకు విడుదలైన ప్రతి ప్రమోషనల్ మెటీరియల్ ప్రేక్షకులలో బజ్ క్రియేట్ చేసింది. 'నారి నారి నడుమ మురారి' 2026లో ప్రపంచ వ్యాప్తంగా సంక్రాంతికి థియేటర్లలోకి రానుంది. ఇది తెలుగు సినిమా రిలీజ్‌కి బిగ్గెస్ట్ సీజన్. ఈ సినిమా పూర్తి ఫ్యామిలీ ఎంటర్టైమెంట్ కావడంతో సంక్రాంతి విడుదలకు ప్లాన్ చేస్తున్నారు.

## 'పోలీస్ కంప్లెయింట్' షూటింగ్ పూర్తి



గ్లామర్ పాత్రలతో హీరోయిన్‌గా కెరీర్ స్టార్ట్ చేసిన వరలక్ష్మి శరత్ కుమార్.. లేడీ విలన్ పాత్రలకు కేరాఫ్ అడ్రస్‌గానూ పేరు తెచ్చుకుంది. వరలక్ష్మి శరత్ కుమార్ నవీన్ చంద్ర ప్రధాన పాత్రల్లో దర్శకుడు సంజీవ్ మేగోటి రూపొందిస్తున్న 'పోలీస్ కంప్లెయింట్' మూవీ షూటింగ్ పూర్తిచేసుకుంది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుపుకుంటోంది. ఈ సినిమాలో వరలక్ష్మి పవర్‌ఫుల్ పాత్రలో కనిపించనుందని, తొలిసారి పూర్తిగా వినోదాత్మకమైన రోల్‌లో నటించడం ప్రత్యేక ఆకర్షణ అని, సూపర్ స్టార్ కృష్ణపై చిత్రీకరించిన ప్రత్యేక గీతం సినిమాకే హైలైట్‌గా నిలుస్తుందని నిర్మాతలు తెలిపారు. ఎంఎస్‌కె ప్రమిద శ్రీ ఫిలిమ్స్ బ్యానర్‌పై రూపొందుతున్న ఈ చిత్రాన్ని బాల కృష్ణ మహరాణా నిర్మిస్తుండగా, అఘోర (తెలుగుతమిళం), ఆప్త, పౌరుషం, రాఘవ రెడ్డి, ఆదిపర్వం వంటి విభిన్న చిత్రాలను రూపొందించిన దర్శకుడు సంజీవ్ మేగోటి దర్శకత్వం వహిస్తున్నారు.

## 28న 'అమరకావ్యం' విడుదల




ధనుష్, కృతి సనన్ హీరో హీరోయిన్లుగా ఆనంద్ ఎల్.రాయ్ దర్శకత్వంలో భూషణ్ కుమార్ నిర్మించిన చిత్రం 'తేరే ఇష్క్ మె'. ఈ సినిమాను అమరకావ్యం పేరుతో తెలుగులో విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఈ సినిమాకు సంబంధించిన ట్రైలర్ థియేటర్లలో ప్రదర్శించబడుతోంది. హీరో హీరోయిన్ మధ్య ప్రేమ, కొన్ని పరిస్థితుల్లో హీరో ప్రేమను కోల్పోవటం, ఆ బాధ నుంచి బయటకు రావటం వంటి ఫీలింగ్స్‌ను ట్రైలర్‌లో చాలా చక్కగా చూపించారు. కథలోని డెప్త్, ప్రేమలోని తెలియని బాధలను కూడా ప్రేక్షకులు మెచ్చే రీతిలో తెరకెక్కించారు. కథను సినిమాగా తెరకెక్కించటంలో తన ప్రత్యేకతను చాటే దర్శకుడు ఆనంద్ ఎల్.రాయ్ శైలి ఇందులో స్పష్టంగా తెలుస్తోంది. సినిమాలోని ఎమోషనల్ డెప్త్ తన రైటింగ్ స్టైల్‌లో ఆయన ఆవిష్కరించారు. గుల్షన్ కుమార్, టి సిరీస్, కలర్ ఎల్లో ప్రొడక్షన్స్ సమర్పణలో రూపొందిన తేరే ఇష్క్ మె సినిమాను ఆనంద్ ఎల్.రాయ్, హిమాన్షు శర్మ, భూషణ్ కుమార్, కృష్ణ కుమార్ నిర్మించారు. హిమాన్షు శర్మ, నీరజ్ యాదవ్ సినిమా రైటర్స్, ఆస్కార్ విన్నర్ ఏ.ఆర్.రెహ్మాన్ సంగీతం సమకూర్చగా ఇర్షద్ కమిల్ సాహిత్యాన్ని అందించారు. నవంబర్ 28 నుంచి ఈ సినిమా హిందీ, తమిళ, తెలుగు భాషల్లో ప్రపంచ విడుదల కానుంది.

## స్పెషల్ సాంగ్‌లో..



విజనరీ సుబాస్కరన్ నేతృత్వంలోని లైకా ప్రొడక్షన్స్ బ్యానర్‌పై సన్ సంజయ్ దర్శకత్వంలో యాక్షన్ అడ్వెంచర్ సినిమాగా నిర్మిస్తున్నారు చిత్రం సిగ్మా. ఇందులో సందీప్ కిషన్ హీరోగా నటిస్తున్నారు. షూటింగ్ ముగింపు దశకు చేరుకుంది. ఫరియా అబ్దుల్లా, రాజు సుందరం, అన్బు థాసన్, యోగ్ జాపీ, సంపత్ రాజ్, కిరణ్ కొండా, మగలక్ష్మి సుదర్శనన్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రంలో హీరోయిన్ కేథరీన్ థ్రెసా, సందీప్ కిషన్‌తో కలిసి ఓ స్పెషల్ డ్యాన్స్ చేయనుంది. ఎస్.థమన్ పవర్‌ఫుల్ ట్రాక్‌ను కంపోజ్ చేశారు. ఇది సినిమాకి ఒక హైలైట్‌గా ఉంటుందని నిర్మాతలు భావిస్తున్నారు. దీనికోసం భారీ సెట్ వేసి ఈ పాటలో సందీప్ కిషన్, కేథరీన్ థ్రెసాపై చిత్రీకరిస్తున్నారు. సిగ్మాలో సందీప్ కిషన్న ఇంతకు ముందు ఎప్పుడూ చూడని యాక్షన్ పెర్సోనాలో కనిపించనున్నారు ఇటీవల విడుదలైన ఫస్ట్‌లుక్ పోస్టర్‌కు అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. తనదైన దారిలో నడిచే 'సిగ్మా' అనే మావెరిక్ హీరో చుట్టూ కథ తిరుగుతుంది. అతని పట్టుదల, సహనం, ఎవరూ ఊహించని పద్ధతుల్లో ఎదగడం థ్రిల్‌ను ఇస్తుంది. యంగ్ డైనమిక్ దర్శకుడు జేసన్ సంజయ్ సెన్సిబిలిటీలతో రూపొందుతున్న ఈ చిత్రం ప్రేక్షకులకు కొత్త అనుభూతిని అందించబోతోంది. ఈ చిత్రానికి సినిమాటోగ్రాఫర్ కృష్ణన్ వసంత్, ఎడిటర్ ప్రవీణ్ కె.ఎల్, ఆర్ట్ డైరెక్టర్ బెంజమిన్ ఎం. తమిళం, తెలుగులో ఏకకాలంలో చిత్రీకరించబడిన ఈ మల్టీ లింగ్వెల్ ప్రాజెక్ట్, చెన్నై, తలకోన అడవులు, థాయిలాండ్‌లోని అద్భుతమైన ప్రదేశాలలో షూటింగ్ జరుపుకుంది. పోస్ట్‌ప్రొడక్షన్ పనులు కూడా ఒకేసారి జరుగుతున్నాయి. ఈ చిత్రం 2026 వేసవిలో విడుదల కానుంది.

## ఆహా ఒటిటిలో 'ధూల్ పేట్ పోలీస్ స్టేషన్'



సరికొత్త కంటెంట్‌తో ఆడియెన్స్ థ్రిల్ చేస్తున్న ఆహా ఒటిటిలో మరో ఎగ్జైటింగ్ క్రైమ్ థ్రిల్లర్ వెబ్ సిరీస్ 'ధూల్ పేట్ పోలీస్ స్టేషన్'ను స్ట్రీమింగ్‌కు తీసుకొచ్చింది. ఈ సిరీస్‌లో మొత్తం 50 ఎపిసోడ్స్ ఉన్నాయి. ప్రతి శుక్రవారం రాత్రి 7 గంటలకు కొత్త ఎపిసోడ్ స్ట్రీమింగ్ కానుంది. తెలుగుతో పాటు తమిళ భాషల్లో 'ధూల్ పేట్ పోలీస్ స్టేషన్' సిరీస్ అందుబాటులో ఉంది. ఈ వెబ్ సిరీస్‌కు జెస్విని దర్శకత్వం వహించారు. అశ్విన్, శ్రీతు, పదిని కుమార్, గురు, ప్రీతి శర్మ తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ సిరీస్ కు అశ్వతన్ మ్యూజిక్ అందించారు. ధూల్ పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఒకే రాత్రి మూడు హత్యలు జరిగితే ఆ కేసును ఇద్దరు పవర్ ఫుల్ పోలీస్ ఆఫీసర్స్ ఎలా సాల్వ్ చేశారనేది ఈ సిరీస్‌లో ఆసక్తికరంగా తెరకెక్కించారు. నగరంలో ఒకే రాత్రి జరిగిన 3 హత్యల కేస్ సాల్వ్ చేసేందుకు రంగంలోకి దిగిన ఎసిపి అశ్విన్ నేరస్తులను పట్టుకున్నాడా లేదా? ఈ కేసుల విచారణ ఎలాంటి మలుపులు తిరిగింది అనేది 'ధూల్ పేట్ పోలీస్ స్టేషన్' సిరీస్‌లో చూడాలి.

## ప్యాషన్ ఉన్న దర్శకులంతా ఫేమ్ కాలేరు

### నిర్మాత కెవెల్ దామోదర ప్రసాద్



ప్రముఖ కథానాయిక జెనీలియా ప్రధాన పాత్రలో రూపొందిన 'కథ' చిత్రంతో విమర్శకుల ప్రశంసలు అందుకున్న దర్శకుడు శ్రీనివాస్ మన్నె, కొంత విరామం తరువాత ఆయన దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'ఈషా'. ఇటీవల రాజు వెడ్స్ రాంబాయి చిత్రంతో సూపర్హిట్ కొట్టిన అఖిల్రాజ్తో పాటు త్రిగుణ్ హీరోలుగా నటిస్తున్న ఈ చిత్రంలో హెబ్బాపటేల్ కథానాయిక. 12న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా 'ఈషా' చిత్ర నిర్మాత కేవెల్ దామోదర ప్రసాద్ మీడియాతో చిట్ చాట్ నిర్వహించారు. ప్రొడ్యూసర్‌గా నాకు కొంత గ్యాప్ వచ్చింది. నా గత సినిమా ఫాదర్ చిట్టి ఉమా కార్తీక్ ఆశించినంతగా ఆదరణ పొందలేదు. ఆ సినిమా మంచి కంటెంట్ తో చేసినా ప్రేక్షకులకు రీచ్ కాలేదు. కొందరు టైటిల్ బ్యాడ్ అని చెప్పారు. అయితే మంచి కథల కోసం ప్రయత్నిస్తూనే ఉన్నాం. ఆ టైమ్ లో డైరెక్టర్ శ్రీనివాస్ మన్నె నేను ఒక సబ్జెక్ట్ ఫైనలైజ్ చేసుకుని దాని మీద వర్కవుట్ చేశాం. ఒక మిడిల్ రేంజ్ హీరో కోసం ప్రయత్నించాం. ఆ ప్రాజెక్ట్ ముందుకు వెళ్లలేదు. అదే టైమ్ లో శ్రీనివాస్ మన్నె 'ఈషా' కథ గురించి చెప్పారు. ఈ కథ ఇంట్రెస్టింగ్‌గా అనిపించి ఈ ప్రాజెక్ట్ చేశాను. 'ఈషా' సినిమాకు ప్రతీది తనే దగ్గరుండి శ్రీనివాస్ మన్నె చూసుకున్నారు. ఆయన ప్రతిభపై నాకు నమ్మకం ఉంది. పైగా సినిమా అంటే ప్యాషన్ ఉన్న డైరెక్టర్. చాలా కష్టపడతాడు. ఆయనకు తగినంత పేరు రాలేదని నా నమ్మకం. ఇండస్ట్రీలో కష్టపడి, ప్యాషన్ ఉన్న దర్శకులంతా ఫేమ్ కాలేరు. 'ఈషా' సినిమాను శ్రీనివాస్ బాగా తెరకెక్కించాడు. నేను ఈ మూవీ పోస్ట్ ప్రొడక్షన్ టైమ్ లో రెండు మూడు సార్లు చూశాను. చాలా బాగుంది. ప్రేక్షకులకు తప్పకుండా కనెక్ట్ అవుతుందనే నమ్మకం కలిగింది అన్నారు.

## 'రిసోనెన్స్' విద్యాసంస్థపై చర్యలు తీసుకోవాలి

### అనధికార పరీక్షను నిర్వహిస్తే అడ్డుకుంటాం



**ప్రజాపక్షం/హైదరాబాద్:** విద్యాశాఖ నిబంధనలకు విరుద్ధంగా డిసెంబర్ 14న జరగనున్న మెగా రిసో ఫాస్ట్ (టాలెంట్ టెస్ట్)ను రద్దు చేయాలని, 'రిసోనెన్స్' విద్యాసంస్థపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత యువజన సమాఖ్య (ఎఐవైఎఫ్) హైదరాబాద్ జిల్లా సమితి ఆధ్వర్యంలో హైదరాబాద్ జిల్లా విద్యా శాఖాధికారి (డిఇఒ) రోహిణికు ఎఐవైఎఫ్ బృందం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎఐవైఎఫ్ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి నెర్లకంటి శ్రీకాంత్ మాట్లాడుతూ.. విద్యాహక్కు చట్టం ప్రకారం విద్యార్థులకు ఎటువంటి టాలెంట్, మెరిట్, స్కాలర్ షిప్ టెస్టులను విద్యా వ్యాపారంగా నిర్వహించొద్దని ఆదేశాలు ఉన్నా, కేవలం వ్యాపారమే ధ్యేయంగా కార్పొరేట్ విద్యాసంస్థలు వ్యవహరిస్తున్నాయని ధ్వజమెత్తారు. 5, 10వ తరగతి విద్యార్థులకు ఈ పరీక్షను నిర్వహిస్తున్నారని, అయితే ఈ పరీక్ష రాయడానికి 300 రూపాయలను ఎంట్రన్స్ ఫీజు రూపంలో వసూళ్లు చేయడాన్ని వారు వ్యతిరేకించారు. డిసెంబర్ 14వ తేదీన ఈ పరీక్షను రిసోనెన్స్ జూనియర్ కళాశాలల్లో, గుర్తింపు లేని 'రిసోనెన్స్' పాఠశాలల్లో నిర్వహించనున్నారని, ఈ పరీక్షను ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో అడ్డుకుంటామని వారు హెచ్చరించారు. అదేవిధంగా 'రిసోనెన్స్' విద్యాసంస్థకు నిజంగా విద్యార్థులు వారి తల్లిదండ్రుల పట్ల చిత్తశుద్ధి ఉంటే ఉచితంగా నిర్వహించొచ్చుకదా అని ప్రశ్నించారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఆలోచించాలని రిసోనెన్స్ లాంటి మోసపూరిత విద్యాసంస్థల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రిసోనెన్స్ టాలెంట్ టెస్ట్‌కు సిబిఐ మాజీ జాయింట్ డైరెక్టర్ జేడీ. లక్ష్మీ నారాయణ ప్రమోట్ చేయడం సిగ్గుచేటని, మరి ఈ విద్యాసంస్థల్లో పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులు ఉచితంగా అభ్యసించడానికి లక్ష్మీ నారాయణ హామీ ఇవ్వగలడా అని వారు డిమాండ్ చేశారు.

ఈ వినతి కార్యక్రమంలో ఎఐవైఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు టి.సత్య ప్రసాద్, నేతలు అనిల్ కుమార్, అరుణ్ పాల్గొన్నారు.

**డిఇఒ వివరణ..**

రీసోనెన్స్ విద్యాసంస్థ నిర్వహిస్తున్న టాలెంట్ టెస్‌కు ఎలాంటి అనుమతులు లేవని, తల్లిదండ్రులు మోసపోవద్దని వారు అన్నారు. విద్యాహక్కు చట్టం ప్రకారం ఎటువంటి టాలెంట్, మెరిట్, స్కాలర్ షిప్ టెస్టులు నిర్వహించొద్దని ఆదేశాలు ఉన్నాయని, వాటిని భేఖాతారు చేస్తే ఎటువంటి విద్యాసంస్థకైనా కఠిన చర్యలు ఉంటాయని అన్నారు. ఈ అనధికార పరీక్ష నిర్వహిస్తున్న రిసోనెన్స్ విద్యాసంస్థకు నోటీసులు జారీ చేస్తామని అన్నారు.

## ఒడిశా సిఎంతో మంత్రి వాకిటి భేటీ



**ప్రజాపక్షం/హైదరాబాద్:** హైదరాబాద్ భారత్ ఫ్యూచర్ సిటీలో ఈనెల 8,9 తేదీల్లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న తెలంగాణ రైజింగ్ 2047 గ్లోబల్ సమ్మిట్‌కు హాజరవ్వాలని.. ఒడిశా ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝ్జి ని క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి ప్రత్యేకంగా ఆహ్వానించారు. భువనేశ్వర్ లో ఈ రోజు సచివాలయం లో సిఎం మోహన్ చరణ్ మాఝ్జి ని మంత్రి శ్రీహరి కలిశారు. ఈ భేటీలో రాష్ట్ర ప్రభుత్వం.. ప్రత్యేకంగా ముద్రించిన గ్లోబల్ సమ్మిట్ ఆహ్వాన పత్రికను ఒడిశా ముఖ్యమంత్రికి అందజేశారు. 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వృద్ధ్యే లక్ష్యంగా తెలంగాణ భవిష్యత్తు సంకల్పంతో ముందుకు సాగుతుందని మంత్రి వాకిటి శ్రీహరి వివరించారు. దీనికి అనుగుణంగా అన్ని రంగాల వృద్ధి లక్ష్యాలు, భవిష్యత్తులో అనుసరించే ప్రణాళికలను విశ్లేషించేలా తెలంగాణ రైజింగ్2047 విజన్ డాక్యుమెంట్‌ను రూపొందించినట్లు మంత్రి వివరించారు. నీతి అయోగ్ సలహాలు సూచనలతో పాటు.. వివిధ రంగాల నిపుణుల ఆలోచనల మేరకు తయారు చేసిన ఈ విజన్ డాక్యుమెంట్‌ను గ్లోబల్ సమ్మిట్‌లో ఆవిష్కరించనున్నట్లు మంత్రి వాకిటి శ్రీహరి ఒడిశా సీఎం మోహన్ చరణ్ మాఝ్జి కి వివరించారు.

ఈ సందర్భంగా ఒడిశా ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝ్జి మాట్లాడుతూ .. తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌కి ఆహ్వానించినందుకు తెలంగాణ ముఖ్యమంత్రికి, స్వయంగా ఒడిశాకి వచ్చి తనకు ఆహ్వానపత్రాన్ని అందచేసిన మంత్రి శ్రీహరికి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ఒడిశా ముఖ్యమంత్రికి జ్ఞాపికను అందజేశారు మంత్రి వాకిటి శ్రీహరి.

## 5 నుంచి 14 వరకు యూరోపియన్ ఫిల్మ్ ఫెస్టివల్




**హైదరాబాద్:** ప్రపంచ ప్రఖ్యాత యూరోపియన్ యూనియన్ ఫిల్మ్ ఫెస్టివల్ (EUFF) 2025 హైదరాబాద్లో ప్రారంభమైంది. ప్రసాద్ ల్యాబ్స్ ప్రివ్యూ థియేటర్‌లో జరిగిన ఈ ప్రారంభోత్సవానికి సినీ ప్రముఖులు, సాంస్కృతికవేత్తలు, యూరోపియన్ యూనియన్ ప్రతినిధులు హాజరైయ్యారు యూరోపియన్ సినిమాను భారత ప్రేక్షకులకు పరిచయం చేస్తూ ఈ ఫెస్టివల్ 50 ఏళ్ల ప్రయాణం పూర్తి చేసుకుంది. హైదరాబాద్‌లో ఈ స్థాయి ఫెస్టివల్స్ను నిరంతరం నిర్వహించడంలో సారథి స్టూడియోస్ మద్దతు ఎంతో కీలకం అని నిర్వాహకులు వెల్లడించారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి సారథి స్టూడియోస్ ప్రైవేట్ లిమిటెడ్ చైర్మన్ ఎంఎస్ఆర్‌వి ప్రసాద్, ఈయు ప్రతినిధి బృందం, హైదరాబాద్ ఫిల్మ్ క్లబ్ అధ్యక్షుడు కేవీ రావు, ప్రముఖ దర్శకుడు ఇంద్రగంటి మోహనకృష్ణ, డైరెక్టర్ మౌద్ మీక్వావు, ఇండియన్ బ్యాంక్ జోనల్ మేనేజర్ కె.శ్రీనివాస్ తదితరులు హాజరయ్యారు. ఈ యు డెలిగేషన్ సెకండ్ సెక్రటరీలో రెంజో పర్రుల్లి మాట్లాడుతూ.. గత ఏడాది హైదరాబాద్లో ఫెస్టివల్కు వచ్చిన సానుకూల స్పందన మమ్మల్ని మరోసారి ఇక్కడికి వచ్చేలా చేసింది. ఈసారి 23 యూరోపియన్ సినిమాలను ప్రదర్శిస్తున్నాం. కథల పట్ల, చిత్రసృష్టి పట్ల హైదరాబాద్ నగరానికి ఉన్న ప్రేమ ప్రత్యేకం. ఇండో యూరోపియన్ సాంస్కృతిక సంభాషణను మరింతగా బలోపేతం చేయడం మా ముఖ్య లక్ష్యం, అని తెలిపారు. డిసెంబర్ 5 నుంచి 14 వరకు హైదరాబాద్‌లోని మూడు వేదికల్లో ప్రదర్శనలు జరుగనున్నాయి. ప్రసాద్ ల్యాబ్స్ ప్రివ్యూ థియేటర్, శ్రీ సారథి స్టూడియోస్, అలియెన్స్ ఫ్రాన్‌సైజ్‌లో ఈ యూరోపియన్ సినిమాలు ప్రదర్శిస్తున్నారు.

## ధరలపై పరిమితి

(మొదటి పేజీ తరువాయి)

సమీక్ష జరిపిన అనంతరం ఈ ప్రకటన వెలువడింది. ఎయిర్‌లైన్స్, ట్రావెల్ ప్లాట్ ఫామ్స్‌పై ప్రభుత్వం పూర్తి స్థాయిలో దృష్టిపెట్టడంతో ఎప్పటికప్పుడు ధరలపై పర్యవేక్షణ ఉంటుందని అధికారులు వెల్లడించారు. కరోనా సమయంలోనూ కేంద్రం ఇలా ధరల పరిమితిని విధించింది. మరోవైపు ఎలాంటి జాప్యం లేకుండా పెండింగ్‌లో ఉన్న రీఫండ్‌లను వెంటనే చెల్లించాలని మంత్రిత్వ శాఖ ఆదేశించింది. రద్దయిన, ఆలస్యమవుతోన్న విమాన సర్వీసులకు సంబంధించి రీఫండ ప్రక్రియను ఆదివారం రాత్రి 8 గంటల కల్లా పూర్తి చేయాలని స్పష్టం చేసింది. రద్దు కారణంగా ఇప్పటికే ప్రభావితమైన ప్రయాణికులపై రీ షెడ్యూలింగ్ ఛార్జీలు విధించకూడదని తన ఆదేశాల్లో పేర్కొంది. ప్రయాణికుల లగేజీలను 48 గంటల్లో ఎవరివి వారికి అప్పగించాలని వెల్లడించింది. ఈ రీఫండ ప్రక్రియలో జాప్యం చేసినా లేక ఆదేశాలను బేఖాతరు చేసినా చర్యలు తప్పవని హెచ్చరించింది.

## సామాన్యుల కోసమే

(మొదటి పేజీ తరువాయి)

అడగగా సూర్యకాంత్ మాట్లాడుతూ రాజ్యాంగబద్ధమైన అధికారాల విభజన తత్వాన్ని ప్రస్తావించారు. రాజ్యాంగం న్యాయవ్యవస్థ, శాసనసభ, కార్యనిర్వాహక వ్యవస్థ యొక్క సంబంధిత పాత్రలను అందంగా నిర్వచించిందని, అతి వ్యాప్తి లేదని నిర్ధారించుకుంటున్నదని చెప్పారు. 'నా మొదటి ప్రాధాన్యత అంచనా వేయదగిన కాలక్రమం, పెండింగ్‌లో ఉన్న కేసులన్నింటిపై జాతీయ న్యాయవిధానం ఆధారిత ముందస్తు నిర్ణయం. అది ఎప్పటికీ జరుగదు. వ్యాజ్యం నిరంతర ప్రక్రియ కాబట్టి అది జరుగదు. న్యాయవ్యవస్థపై ప్రజలు నమ్మకం, విశ్వాసాన్ని ఉండాలి' అని సిజెఐ పేర్కొన్నారు. కేసులు నమోదు చేయబడతాయని, మన పాత కేసులను పరిష్కరించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. దానికోసం శక్తివంతమైన గేమ్‌ఛేంజర్లలో ఒకటిగా మధ్యవర్తిత్వాన్ని అన్వేషించాల్సిన అవసరం ఉందని సూర్యకాంత్ చెప్పారు. కొన్ని వ్యాజ్యాల ప్రాధాన్యత సహా సుప్రీం కోర్టులో కొన్ని సంస్కరణలు రానున్నాయని సిజెఐ తెలిపారు. సుప్రీంకోర్టు సామాన్యుల కోసం ఉద్దేశించబడినదని నేను బలమైన సందేశాన్ని పంపించాలని అనుకుంటున్నానని సూర్యకాంత్ స్పష్టం చేశారు. సాధారణ లిటిగెంట్లు ఎవరైనప్పటికీ సుప్రీం కోర్టులో తగినంత ప్రాధాన్యత, సమయం కూడా ఉంటుందన్నారు. జాబితా చేయాల్సిన విషయాలకు తాను కొంత ప్రాధాన్యత ఇస్తున్నానని, అయితే తాను ఒక్కడినే దీన్ని అంతా చేయలేనని, సుప్రీంకోర్టుల జడ్జిలందరూ దీనికి సంబంధించి పూర్తి సహకారం అందించినప్పుడే ఇది సాధ్యమవుతుందని సూర్యకాంత్ స్పష్టం చేశారు. డిజిటల్ అరెస్ట్, సైబర్ నేరాలకు సంబంధించి న్యాయవ్యవస్థ సరికొత్త సవాళ్లను ఎదుర్కొంటోందని సిజెఐ సూర్యకాంత్ తెలిపారు. మానవ వనరుల గరిష్ఠ వినియోగం, న్యాయమైన మూల్యాంకనం గురించి మాట్లాడుతూ సంస్థలో యోగ్యతకు గుర్తింపు తప్పక ఉండాలని అభిప్రాయాన్ని వ్యక్తీకరించారు. న్యాయవ్యవస్థలో వైవిధ్యం గురించి అడిగినప్పుడు భారత న్యాయవ్యవస్థలో సమాజం అభివృద్ధి చెందిన విధానం, దేశం ముందుకు సాగిన విధానంలో అక్కడ ఒక నమూనా మార్పు ఉందన్నారు. కమ్యూనిటీ, ప్రాంతీయ ప్రాతినిధ్యాన్ని నిర్ధారించడానికి, వివిధ ప్రాంతాలలో న్యాయమూర్తులను తీసుకురావడానికి ఇప్పుడు ప్రయత్నం జరుగుతోందని సిజెఐ చెప్పారు. న్యాయ స్వాతంత్ర్యం గురించి మనం మాట్లాడేటప్పుడు రాజ్యాంగ బద్ధమైన అధికారాల విభజన అనే ప్రాథమిక సూత్రాన్ని గుర్తించుకోవాలని సూచించారు.

'ఇప్పుడు నేను న్యాయం పొందడం గురించి మాట్లాడేటప్పుడు వ్యాజ్యాల ఖర్చును ఎలా తగ్గించాలో, విషయాలను నిర్ణయించడానికి సమేతుకమైన కాలక్రమాన్ని ఎలా సూచించాలో నిర్ధారించడం నా మొదటి ప్రాధాన్యత' అని ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ వివరించారు. తాను చాలా ఆశావాద వ్యక్తినని, భారత ప్రజాస్వామ్యం, న్యాయం అందించే వ్యవస్థ రెండింటికీ చాలా ఉజ్వల భవిష్యత్తు ఉందని తాను విశ్వసిస్తున్నానన్నారు. అందుకు కారణాలు చాలా స్పష్టంగా ఉన్నాయన్నారు. 'మొదటిది భారత ప్రజలు రాజ్యాంగ సూత్రాల పట్ల సంపూర్ణ నిబద్ధతను కలిగి ఉన్నారు. రెండవది, భారత ప్రజలు చట్టపాలనకు కట్టుబడి ఉన్నారు. ఇక మూడవది భారత ప్రజలు ప్రజాస్వామ్యానికి కట్టుబడి ఉన్నారు' అని సిజెఐ విపులీకరించారు.

## 'శాంతి' భారం రష్యాదే

(మొదటి పేజీ తరువాయి)

కోరారు. ఫ్లోరిడాలో రెండు రోజుల చర్చలు నిర్మాణాత్మకంగా జరిగాయని చెప్పారు. ఉక్రేన్‌లో యుద్ధ ముగింపు చర్యలన్నీ రష్యా సంసిద్ధతమైనే ఆధారపడి ఉంటాయని, రష్యా నిర్ణయం ఆధారంగానే సైన్యాలను వెనక్కు మళ్ళించడం, సైనికుల మరణాలు ఆపడం ఆధారపడి ఉంటాయని పేర్కొన్నారు. ఈ చర్చల్లో శాంతి ఒప్పందంతోపాటు తదనంతర భద్రతా చట్రం గురించి కూడా ప్రతినిధులు ఒక అంగీకారానికి వచ్చారు. శాంతిని నిలబెట్టడానికి ఎదురయ్యే ఆటంకాలు అడ్డుకోవడానికి సమకూర్చుకోవాల్సిన సామర్థ్యం గురించి కూడా చర్చించారు. అసలు మాస్కో చర్చల్లో ఏం జరిగిందో తెలుసుకోవాలనుకుంటున్నానని, యుద్ధాన్ని కొనసాగించడానికి పుతిన్ ఇంకా ఎలాంటి ఎత్తులు వేస్తున్నారో తెలుసుకోవాల్సిన అవసరం ఉందని ఉక్రేన్ అధ్యక్షుడు జెలెన్స్కీ విమర్శించారు. ట్రంప్ ప్రణాళిక రష్యాకు అనుకూలంగా ఉందని ఉక్రేన్ వాదించడంతో జెనీవాలో కొన్ని మార్పులు చేర్పులు చేశారు. కానీ భూభాగాలను స్వాధీనం చేసే విషయంపై వివాదం మాత్రం పరిష్కారం కాలేదు. ఉక్రేన్‌లోని ఐదోవంతు భూభాగం ప్రస్తుతం రష్యా అధీనంలో ఉంది. అంటే డాన్‌బాస్, డోనెట్స్క్, లూహాన్స్క్ ప్రాంతాలలో భూభాగంలో రష్యా సేనలు ఉన్నాయి.

**ఉక్రేన్ వైదొలగకపోతే...**

ఉక్రేన్ సైన్యాలు గనుక ఈ వారంలో డాన్‌బాస్ ప్రాంతం నుండి వెనక్కు వెళ్ళకపోతే ఆ ప్రాంతాన్ని తామే బలప్రయోగంతో విముక్తి చేస్తామని రష్యా అధ్యక్షుడు పుతిన్ చెప్పారు. భారత్ పర్యటన సందర్భంగా 'ఇండియా టుడే'కు ఇచ్చిన ఇంటర్వ్యూలో గురువారం పుతిన్ మాట్లాడుతూ, ''ఉక్రేన్‌లో యుద్ధ పరిష్కారానికి అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రతిపాదిత ప్రణాళికపై ఏకాభిప్రాయం సాధించేందుకు చాలా హృదయపూర్వకంగా ప్రయత్నాలు చేస్తున్నారని, కానీ అందంత సులభమైన పని కాదని అన్నారు. ఈ విషయంలో ఏకాభిప్రాయం కుదరని అంశాలు కూడా ఉన్నాయని అన్నారు. కానీ మాస్కోలో చర్చలు ఎంతో ఉపయుక్తంగా జరిగాయన్నారు. ట్రంప్ ప్రతిపాదించిన ప్రణాళిక అలాస్కాలో ఇంతకుముందు తామిద్దరిమధ్యా జరిగిన చర్చలలో కుదిరిన ఒప్పందం ఆధారంగా రూపొందించారన్నారు. 28 అంశాల ట్రంప్ ప్రణాళికను నాలుగు ప్యాకేజీలుగా విభజించి క్షుణ్ణంగా చర్చించాలని తాము విట్‌కాఫ్‌కు ప్రతిపాదించామన్నారు.

''డాన్‌బాస్ నుండి దళాలను ఉపసంహరించాలని,దీనివల్ల ఘర్షణను నివారించవచ్చునని చెప్పాం,ఆ ప్రాంత ప్రజలు మీతో కలిసి జీవించడానికి ఇష్టపడరని కూడా చెప్పాం, వారు ప్రజాభిప్రాయ సేకరణ చేసి ఓటు వేశారు, రష్యాతో కలిసి ఉండటానికి నిర్ణయించుకున్నారు. కానీ ఉక్రేన్ ఘర్షణకే ఇష్టపడుతోంది, వారు ఆ ప్రాంతాలను ఖాళీచేసి వెళ్ళిపోతే ఘర్షణ ఉండదు, లేకపోతే స్వాత్స్ సహా డాన్‌బాస్, నోవోరోసియా ప్రాంతాలను సైనిక లేదా ఇతర మార్గాల ద్వారా విముక్తి చేస్తాం''అని పుతిన్ చెప్పారు.

**ఉక్రేన్‌లో 29 ప్రాంతాలపై దాడులు**

ఉక్రేన్‌లో సాయుధ దళాల దినోత్సవం సందర్భంగా శనివారం తెల్లారక ముందే రష్యా సైన్యాలు క్షిపణులు, డ్రోన్లతో దాడి చేశాయి. 653 డ్రోన్లు, 51 క్షిపణులతో మొత్తం 29 ప్రాంతాలపై రష్యా దాడిచేయడంతో దేశం అంతటా గగనతలాన్ని అప్రమత్తం చేశారు. ఐతే 585 డ్రోన్లను ఉక్రేన్ సైన్యాలు కూల్చివేయడమో, తటస్థీకరించడమో చేశాయి.ఈ దాడుల్లో ఎనిమిదిమంది గాయపడ్డారని ఉక్రేన్ హోంమంత్రి ఐహోర్ క్లైమెంకో చెప్పారు. కీవ్‌ప్రాంతంలో ముగ్గురు గాయపడ్డారు. తమ ఇంధన కేంద్రాలే ప్రధాన లక్ష్యంగా రష్యా దాడులు చేస్తోందని జెలెన్స్కీ విమర్శించారు. తమ గగనతల దళాలు 116 రష్యా డ్రోన్లను కూల్చివేశాయని ఉక్రేన్ రక్షణమంత్రిత్వశాఖ ప్రకటించింది. ఐతే తమదేశంపై కూడా ఉక్రేన్ దాడులు చేసిందని రష్యా టెలిగ్రామ్ న్యూస్ ఛానల్ ఆస్ట్రా పేర్కొంది. దీనిపై ఉక్రేన్ స్పందించలేదు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com